ఆంధ్రప్రదేశ్

దళిత ఉద్యమ చరిత్ర

యాగాటి చిన్నారావు

ఆంధ్ర ప్రదేశ్

దళిత ఉద్యమ చరిత్ర

(1900 - 1950)

యాగాటి చిన్నారావు

తెలుగు: ప్రభాకర్ మందార

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

మొదటి ముద్రణ : ఏప్రిల్, 2007

పునర్ముద్రణ : 2008, 2011

ఆంగ్లమూలం: Dalit's Struggle for Identity, Chinna Rao Yagati, Kanishka Publishers, New Delhi, 2003

ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,

ప్లాట్ నెం.85,

బాలాజీనగర్, గుడిమల్కాపూర్,

హైదరాబాద్ - 500 067

ఫోన్: 23521849

www.hyderabadbooktrust.blogspot.com

ముద్రణ: అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్-28

ఫోన్: 23391364, 23304194

అంకితం

మా తాతయ్య

యాగాటి లక్ష్మణుడుకు

మూడవ ముద్రణకు ముందుమాట

ఈ సిద్ధాంత గ్రంథ రచనా కాలం నాటికి "దళితుల చరిత్ర", "దళితులపై పరిశోధన" అనే అంశాలు ఫ్యాషన్ కాదు. అయినప్పటికీ ఎన్నో సమస్యల నెదుర్కొని, ఎంతో శ్రమకోర్చి, మరెంతో మందిని Interview ల కోసమని, Material కోసమని ఇబ్బందిపెట్టి తయారు చేసిన గ్రంథమిది. అయితే నా శ్రమ వృథా కాలేదని పదేళ్ళ తరువాత తెలిసింది.

ఈ దశాబ్ద కాలంలో, ముందుగా ఈ సిద్ధాంత గ్రంథాన్ని 2003లో ప్రచురించడం జరిగింది. తర్వాత కీ.శే. S. R. శంకరన్, IAS గారి సలహాతో గీతా రామస్వామి గారు (హైదరాబాద్ బుక్ ట్రస్ట్) 2005లో ఈ గ్రంథాన్ని అనువాదం కోసం ప్రభాకర్ మందార గారికి ఇచ్చారు. ఎన్నో కుటుంబ సమస్యలున్నప్పటికీ, అనువాద భారాన్ని 'బాధ్యత'గా స్వీకరించి ఆయన ఎంతో శ్రద్ధతో పూర్తి చేసారు. అలా తొలి తెలుగు ప్రచురణ 2007 ఏప్రిల్‌లో వెలుగులోకి వచ్చింది. ఏడాది తిరక్కముందే తెలుగు ప్రతులు దొరకని పరిస్థితి రావడంతో 2008 మార్చిలో రెండో ముద్రణ అవసరమైంది. మధ్యలో మరో విశేషం - 2009 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడెమీ (న్యూ ఢిల్లీ) వారు దీనికి అనువాద పురస్కారం ప్రకటించారు. ఇప్పుడిది మూడవ ముద్రణ.

ఈ దశాబ్ద కాలంలో వర్గీకరణ ఉద్యమాలతో, ఇటీవల జరుగుతున్న ప్రత్యేక తెలంగాణా ఉద్యమాలతో ఎంతో తలమునకలై ఉన్న తెలుగు పాఠక లోకం, ఈ ఉద్యమాల ప్రభావంతో మరెన్నో విలువైన గ్రంథాలు వస్తున్నప్పటికీ ఈ పుస్తకాన్ని ఆదరిస్తున్నందుకు మరొక్కసారి కృతజ్ఞతలు తెలుపుకొంటూ..

- డా. యాగాటి చిన్నారావు

నవంబర్ 2011

ముందుమాట

దక్షిణ భారత దళిత ఉద్యమాన్ని అర్థంచేసుకునేందుకు చేసిన ప్రయత్నం యిది. వలసవాదుల కాలం చివరి దశలో దళితుల చరిత్ర, వారి సామాజిక ఆర్థిక పరిస్థితి, రాజనీతి, సంస్కృతి, నిరసన సాహిత్యం వంటి అంశాలను ఈ అధ్యయనంలో లోతుగా పరిశీలించడం జరిగింది. అయితే ఇది ఆంధ్ర ప్రాంతానికి (మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడేవారి ప్రాంతాలకు), హైదరాబాద్ ప్రాంతానికి (అప్పటి నిజాం రాష్ట్రంలోని తెలుగు మాట్లాడేవారి ప్రాంతాలకు, అంటే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే పరిమితం.

దళితోద్యమం పందొమ్మిదో శతాబ్దపు చివర్లో ప్రారంభమయినట్టు కనిపిస్తోంది. అసలు అధికారం అంటే ఏమిటో ఆ కాలంలోనే కొందరు దళితులు చవి చూశారు. వారికి కొత్త ఆలోచనలు, కొత్త వనరులు అందుబాటులోకి వచ్చాయి. మద్రాస్ ప్రభుత్వం 1893లో ఆంధ్రలో స్థానిక బోర్డుల కింద దళితుల కోసం ప్రత్యేక పాఠశాలలను, శిక్షణాలయాలను నెలకొల్పింది. దళిత విద్య అనేదొక కీలకమైన అంశం – మాగ్నాకార్టా అని చెప్పవచ్చు. దానివల్ల ప్రత్యక్షంగా లబ్ధిపొందిన వారి సంఖ్య స్వల్పమే అయినా మొత్తం దళిత సమాజపు దృక్పథంలో, వారి జీవన విధానంలో మార్పు వచ్చేందుకు అది దోహదం చేసింది. అప్పటినుంచే దళితులకు ఓ గౌరవప్రదమైన భవిష్యత్తు రూపుదిద్దుకోవడం మొదలయింది. తెలంగాణా అంతటా ఆయా స్థానిక సంస్థల్లో చదువుకున్న దళితులు విభిన్న సిద్ధాంతాల, సంస్థల సాయంతో దోపిడీ సంప్రదాయాలను ప్రశ్నించడం మొదలుపెట్టారు. హైదరాబాద్‌లో మొట్ట మొదటి దళిత సంస్థ 1906లో ఏర్పడింది. ఈ దళిత చైతన్యం మూలాలను, దక్షిణ భారత దేశంలో దళితోద్యమం ఒక స్వతంత్ర ఉద్యమంగా రూపొందిన క్రమాన్ని కనుగొనేందుకు గాను 1900 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం జరిగింది. రెండోది, మన దేశానికి రాజకీయ

స్వాతంత్ర్యం 1947లోనే వచ్చినప్పటికీ ఈ అధ్యయన కాలాన్ని 1950 వరకూ పొడిగించాను. ఎందుకంటే మొత్తం ఆంధ్ర దళితోద్యమానికే కేంద్రబిందువైన హైదరాబాద్ అప్పటివరకూ నిజాం ఏలుబడిలో కొనసాగింది. దళితోద్యమంలో అనైక్యతా ధోరణులు చోటుచేసుకున్నందువల్ల 1950 సంవత్సరానికి ప్రత్యేక ప్రాముఖ్యత వుంది. కాగా తెలంగాణా విమోచనోద్యమం (1946–51) కారణంగా దళితోద్యమం మసకబారిపోయింది. తెలంగాణా విమోచనోద్యమంలో ఎంతోమంది దళితులు కమ్యూనిస్ట్ జెండా కింద పనిచేశారు.

భారతదేశంలో దళితోద్యమ మూలాలను, దాని అభివృద్ధినీ పరిశీలించేందుకు తగిన ప్రత్యక్ష వనరులు గానీ, సమాచారం గానీ అందుబాటులో లేవు. అంటే పందొమ్మితో శతాబ్దిలో, ఇరవైయ్యవ శతాబ్దం మొదట్లో దళితుల సామాజిక జీవితం రాజనీతి, కనీసం సంస్కృతి ఎలా వుండేదో సరిగా తెలియడం లేదు. దురదృష్టవశాత్తు అధికార వర్గాలు గానీ, అనధికార వర్గాలు గానీ దళితుల సమగ్ర జీవిత చిత్రణకు పనికొచ్చే సమాచారాన్ని ఎక్కడా నమోదు చేయలేదు. అయినప్పటికీ చెదురుమదురుగా లభించిన సమాచారంతోనే నేను దళితుల గతాన్ని పునర్నిర్మించే ప్రయత్నం చేశాను.

ఇటు ఆంధ్ర, హైదరాబాద్ ప్రాంతాలలోని దళితుల జీవితాలకు సంబంధించిన వివిధ అంశాలను అర్థం చేసుకోవడం, అటు సమకాలీన సామాజిక, రాజకీయ ఉద్యమాలతో దళితుల వ్యవహారం, భాగస్వామ్యం, సంబంధాలను విశ్లేషించడం ఈ అధ్యయన లక్ష్యం.

– యాగాటి చిన్నారావు

పరిచయం

సాధారణంగా మానవ శాస్త్రవేత్తలూ, సామాజిక శాస్త్రవేత్తలే దళితులపై అధ్యయనాలు జరుపుతుంటారు. వారి అధ్యయనాలు విలువైనవే అయినప్పటికీ వాటిలో చారిత్రక నేపథ్యం కొరవడుతూ వుంటుంది. అందుకే దళితుల చరిత్ర గురించి ... అందులోనూ కొంత నిర్లక్ష్యానికి గురైన దక్షిణ భారతదేశ తెలుగు ప్రాంతాల్లోని దళితుల గురించి మరో చరిత్రకారుడు రచనకు ఉపక్రమించడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది.

క్రైస్తవ మతమార్పిడితో, గాంధేయ ఉద్ధరణతో, కమ్యూనిస్ట్ సంఘాలతో దళితులకు వున్న అనుబంధాల గురించి యాగాటి చిన్నారావు మనకు ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తున్నారు. ప్రత్యేకించి ఆంధ్ర ప్రాంత పరిస్థితుల్లో ఈ మూడు ముఖ్యమైన శక్తులలో ఏదో ఒకదాన్ని ఎన్నుకునేందుకు దళితులు అనుసరించిన మార్గమేమిటో, దాని చారిత్రక నేపథ్యమేమిటో చిన్నారావు చాలా చక్కగా వివరించారు.

ఏ చరిత్రకారుడికైనా సానుభూతి, సమతుల్యత రెండూ వుండాలి. సానుభూతి ఎందుకంటే పీడిత వర్గం అనేకానేక సమస్యలనూ ఆంక్షలనూ అధిగమించాల్సిన పరిస్థితులలో వుంటుంది. ఇక సమతుల్యత దేనికంటే భారతదేశంలోని ఇతర వర్గాలు కూడా వివిధ సమస్యలనూ, పరిమితులనూ ఎదుర్కొంటుంటాయి. దళిత చైతన్యాన్ని ఆవిష్కరించాలంటే చరిత్రకారుడు దళితోద్యమాన్ని లోపలినుంచీ, బయటినుంచీ చూడాల్సి వుంటుంది. చిన్నారావు ఈ విషయంలో సఫలీకృతులయ్యారు. వాస్తవాలను ఎంతో సానుభూతితో పరిశీలించి వాటిని సమగ్రంగా నమోదు చేశారు. జన్మతః ఆంధ్రుడైన చిన్నారావు నేడు ఉత్తర భారత దేశంలో కూడా మంచి పేరు ప్రతిష్ఠలను సంపాదించుకున్నారు. తెలుగు ప్రాంత చరిత్రరచన వారికి చాలా సానుకూలమైన అంశం.

ఇవాళ దళిత జీవిత అధ్యయనానికి సంబంధించిన కీలకమైన అనేక ప్రశ్నలను చిన్నారావు ఈ పుస్తకంలో విశ్లేషించారు. క్రైస్తవ మిషనరీలూ, హిందూ జాతీయవాదులూ అడుగుపెట్టక ముందు దళితులకు స్త్రీ దేవతలపై ఆధారపడిన సొంత మతం అంటూ ఏదైనా వుండేదా? దళితులను ఎంతో సమర్థవంతంగా సంఘటిత పరచిన కమ్యూనిస్టులు – వారి అభిమానాన్నీ, విధేయతనూ ఎందుకు నిలుపుకోలేక పోయారు? వ్యవసాయిక వ్యవస్థకూ, కుల నిరంకుశత్వానికీ మధ్య ఏమేరకు పరస్పర సంబంధం వుంది? దానిని ఎలా మార్చాలి? భూస్వామ్య పెత్తందారీ వర్గాలను ప్రతిఘటించేందుకు పీడితవర్గాల ముందున్న మార్గాలేమిటి? డా.బి.ఆర్. అంబేద్కర్ ప్రభావం ఎప్పుడు, ఏవిధంగా మొదలయింది? వంటి ప్రశ్నలకు చిన్నారావు పరిశోధన సమాధానాలను వెతికింది.

ఈ రచనలో నాకు చాలా ఆసక్తిని కలిగించిన ముఖ్యమైన అంశం దళితోద్యమమే. అది దళితుల కృషిలోంచి పుట్టిందే తప్ప బయటి శక్తుల ప్రమేయం లోంచి కాదు అంటారీయన. "దళితులను అన్ని రాజకీయ పార్టీలు ... కాంగ్రెస్, కమ్యూనిస్ట్, బ్రాహ్మణేతర పార్టీలు అన్నీ వాడుకున్నాయి, వేధించాయి, రాజకీయం చేశాయి." అయినప్పటికీ ఇరవైయ్యవ శతాబ్దపు తొలినాళ్లనుంచే దళితులు తమ సొంత పోరాటాన్ని ప్రారంభించారు. దళితుల తొలినాళ్ల ఆందోళనా కార్యక్రమాల్లో ఆర్యులకంటే ముందు నుంచే ప్రాధాన్యత వుందని భావించే ఆది ఆంధ్ర ఉద్యమంతో పాటు ప్లేగు కార్యక్రమం, బుద్ధ జయంతి కార్యక్రమం మొదలైనవి వున్నాయి. అంతగా పేరు ప్రఖ్యాతులు లేని సంఘ సంస్కర్తలు–విద్య, బావుల తవ్వకం, దళితులను సంఘటిత పరిచేందుకు, చైతన్యవంతుల్ని చేసేందుకు సమావేశాలు నిర్వహించడం, దత్తతకు తీసుకోవడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. అయితే హైదరాబాద్ రాష్ట్రంలో కంటే కోస్తా ప్రాంతంలోనే ఇవి ఎక్కువగా జరిగాయి. 1932–33లో గాంధీ పర్యటనల ప్రభావం వల్ల పెద్ద సంఖ్యలో దళితులు గాంధీ మార్గాన్ని అనుసరించడంతో 1930లలో ఆది ఆంధ్ర ఉద్యమం కొంచెం చతికిలబడిపోయింది. అయితే 1944లో అంబేద్కర్ పర్యటన ఫలితంగా తిరిగి ఒక కొత్త ధోరణి చోటుచేసుకుంది. హైదరాబాద్ అంబేద్కర్‌గా పేరుపొందిన శ్రీబి.ఎస్.వెంకటరావు ఈ ప్రాంతంలో దళిత ఉద్యమాన్ని అంబేద్కర్ నాయకత్వంలోని జాతీయోద్యమానికి దీటుగా తీర్చిదిద్దాడు. ఆయన కృషికి మంచి గుర్తింపు కూడా వచ్చింది.

యాగాటి చిన్నారావు చేసిన ఈ రచనలోని మరో అసాధారణమైన అంశం – ఉద్యమ సాహిత్య సమీక్ష. ఈనాడు గుర్రం జాషువా ఒక్కరే ప్రముఖ దళిత కవిగా

గుర్తించబడుతున్నారు. ఆయనలో గాంధీయిజం పట్ల మొగ్గు; క్రైస్తవం పట్ల అభిమానం, అంబేడ్కర్ ప్రభావం కనిపిస్తాయి. తను హిందువును కానని కూడా ఆయన నొక్కి చెప్పారు. జాషువా రచనలు తొలినాటి దళిత సాహిత్యోద్యమం తాలూకు కాల్పనిక కవిత్వం కిందకు వస్తాయి.

ఈ పుస్తకంలోని మరో అసాధారణమైన విశేషం ఇందులోని ఉపయుక్త గ్రంథ సూచిక. నాలాగే చిన్నారావు కూడా చరిత్రకారుడు మాత్రమే కాక ఒక లైబ్రేరియన్, ఒక గ్రంథ పరిశీలకుడు కూడా. ఆయన పరిశోధనా విధానం ఈ విషయాన్ని నిరూపిస్తోంది. ఆయన సమర్థతనీ చాటుతోంది. ఇందులోని ఉపయుక్త గ్రంథ సూచిక ఒక్కటే ఒక అమూల్య నిధి అని చెప్పవచ్చు.

– ఎలియనార్ జెలియట్,

ప్రొఫెసర్ ఎమెరిటా, చరిత్ర విభాగం,

కార్లటన్ కళాశాల, నార్త్ ఫీల్డ్, మిన్నెసోటా, అమెరికా.

కృతజ్ఞతలు

ఈ గ్రంథానికి బీజం పడి మొలకెత్తడం ప్రొ. కె. ఎన్. పణిక్కర్ పర్యవేక్షణలో జరిగితే, దాన్ని పెంచి పోషించింది మాత్రం ప్రొ. సవ్యసాచి భట్టాచార్య గారి ఆధ్వర్యంలోనే. అయితే నా పరిశోధన గ్రంథ రూపం తీసుకోడానికి జరిగిన సుదీర్ఘ ప్రయాణంలో మాత్రం చాలా మంది చేయూతనిచ్చారు. బోయి భీమన్న, బొజ్జా తారకం, డా. బి. విజయభారతి, యం. బి. గౌతమ్, ప్రొ. కె. ఎస్. చలం, వజ్రపు సాంబమూర్తి, రావూరి ఏకాంబరం, కె. సూర్యప్రకాశరావు తదితరులు వారి చిన్ననాటి జ్ఞాపకాలను, అనుభవాలను పంచుకుంటే, గనుమల జ్ఞానేశ్వర్ నా పరిశోధనకు అవసరమైన సామాగ్రి ఎక్కడెక్కడ దొరుకుతుందో తెలియజేసారు. ప్రొ. అడపా సత్యనారాయణ, ప్రొ. గుమ్మడి నాంచారయ్య వారు నిర్వహించిన సెమినార్లకు ఆహ్వానించి నా పరిశోధనాంశాలను పంచుకొని, చర్చించే అవకాశం కల్పించారు. వారందరికీ రుణపడి ఉన్నాను.

ఈ పుస్తక మూల గ్రంథం ఆంగ్లంలో ఉంది. దాన్ని సరళమైన తెలుగులోకి అనువదించిన మందార ప్రభాకర్ గారికి, ఆ బాధ్యతల భారాన్ని మోసిన హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు.

ఈ గ్రంథం తెలుగులోకి రావాలనే కోరిక నాకన్నా నా శ్రీమతి డా. ప్రియదర్శిని విజయశ్రీకే ఎక్కువ. ఎందుకంటే ఆమె విమర్శించిన తీరే నన్ను కొత్త విషయాలవైపు నడిపించింది. తమదైన శైలిలో నాకు సహకారమందించిన బావమరిది ప్రభాకర్, మా కుమారుడు యాగాటి సిద్ధర్థలకూ మరియు మిత్రులు శ్రేయోభిలాషులు, ముఖ్యంగా దళిత యువతకూ దళిత సంస్థలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూ వారి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న శ్రీ రాజశేఖర్ వుండ్రు ఐ.ఏ.ఎస్ గారికి ప్రత్యేక అభినందనాలు తెలియజేస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్‌లో వెలుగులోకి రాని దళిత ఉద్యమ చరిత్రను పాఠకులకు పరిచయం చేయాలనే ఈ ప్రయత్నంలో ఈ గ్రంథం ఒక భాగం మాత్రమేననీ, మరెన్నో కోణాల నుండి పరిశీలించే ఇటువంటి గ్రంథాలు ఇంకా రావల్సిన అవసరం ఉన్నదనీ తెలియజేస్తూ, కావాలని కాకుండా అనివార్యంగా దొర్లిన తప్పులను మన్నించి మాకు తెలియజేస్తారని.... అందరు ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని ఆశిస్తూ.....

13-3-2007

అందరికీ వందనాలతో.....

డా. యాగాటి చిన్నారావు

విషయ సూచిక

1

ఉపోద్ఘాతం

అంతులేని చారిత్రక లోతుల్లోంచి ఆవిర్భవించిన సమాజం తన గతాన్ని గనక లెక్కలోకి తీసుకోకపోయినట్టయితే వర్తమానాన్ని, భవిష్యత్తును తీర్చిదిద్దుకోలేదు. తరతరాల చారిత్రక శక్తుల నేతృత్వంలో వివిధ అంతర్గత, బాహ్య సామాజిక అంశాల్లో జరిగే పరస్పర చర్యల ద్వారానే వర్తమానం ఏర్పడుతుంది. హెచ్చుతగ్గుల దొంతరలు (హైరార్కీ), ప్రాకృతిక ఏకత్వం (హోలిస్మ్), అవిచ్ఛిన్నత (కంటిన్యుటీ), పారమార్థికత (ట్రాన్స్‌కన్‌డెన్స్)ల తాలూకు సూత్రాలే భారతీయ సామాజిక స్వరూపాన్ని రూపుదిద్ది, విలువలను ఏర్పరచాయి.

కులతత్వపు గులాంగిరీ, అంటరానితనంల నుండి విముక్తికోసం దళితోద్యమం ఎంతో కాలంగా కొనసాగుతోంది. నిజానికి దళిత సమస్య అనేది ఒక పాత ప్రశ్న – ఒక కొత్త సవాలు. ఇదొక సామాజిక వాస్తవికతగా మనతోపాటే వుంటోంది. అయితే ఇది సృష్టిస్తున్న సంక్షోభం మాత్రం ఓ కొత్త పరిణామం. దళిత, దళితేతర సంఘసంస్కర్తలూ, మేధావులూ ఎంతో మంది సమాజంలోంచి అంటరానితనాన్ని నిర్మూలించాలని తమ శక్తిమేరకు కృషిచేశారు. అయితే బ్రిటీషువారి కాలంలో, భారతదేశంలో ప్రజాస్వామిక సంస్థలు ఏర్పడ్డ తర్వాతే దళితోద్యమానికి అపూర్వ ప్రేరణ లభించింది. అప్పటి నుంచే దేశమంతటా దళితోద్యమానికి నిలకడైన స్వరం, స్థిరత్వం, ప్రభావం సమకూరాయి.

మొత్తం దళిత ఉద్యమాన్ని రెండు రకాలుగా చూడొచ్చు. ఒకటి: సామాజిక ఆర్థిక అసమానతలనూ, అంటరానితనాన్నీ, అశాస్త్రీయ హేతువిరుద్ధ మత విశ్వాసాలనీ, భానిసత్వాన్నీ అనుమతించిన హిందూ సామాజిక వ్యవస్థను తిరస్కరించి, దాని స్థానంలో కొత్త సామాజిక వ్యవస్థను నెలకొల్పేందుకు పూనుకోవడం. రెండు: దళితేతరులు తమ మీద వేసిన ముద్రను చెరిపేసుకుని, దళితులు తమ సొంత గుర్తింపు కోసం పోరాడటం.

భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో ఛండాలురు, పరయాలు, హరిజనులు వంటి రకరకాల పేర్లతో సంబోధించబడే... సమాజంలోని అతిపెద్ద వర్గాన్ని అమానవీకరించడాన్ని కుల వ్యవస్థ చట్టబద్ధం చేసింది. ఈ విభిన్న కులాల మధ్య సారూప్యతలు స్వల్పమే అయినప్పటికీ వారినందరినీ 'అంటరానివాళ్లు' అంటూ ఒకే గాటన కట్టి వేరు చేయడం మాత్రం అంతటా ఒకేలా కనిపిస్తుంది. మత పెత్తందారీతనం వీరికి బానిస హోదాను ప్రసాదించింది. వీళ్లంతా ఇవాళ 'దళితులు' అన్న ఏక పదంతో గుర్తించబడుతున్నారు. ఈ పదం దోపిడీ వ్యవస్థపై తిరుగబడాలన్న స్వతసిద్ధ ఆకాంక్షకూ, నూతన చైతన్యానికీ ప్రతీక. అయితే ముందుగా మనం షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎస్‌సి) అన్న పదం విషయంలో స్పష్టమైన అవగాహనను కలిగివుండాలి. ఇది అఖిల భారత స్థాయిలో వర్తిస్తూ, పరిపాలనాపరంగా ఉపయోగించబడుతున్న పదం. స్థానికంగా మాత్రం బలమైన సొంత గుర్తింపుతో విడివిడిగా ఎన్నో కులాలున్నాయి. అయితే అందరికీ కలిపి ఒక ఉమ్మడి గుర్తింపును తెచ్చేందుకూ, చైతన్యాన్ని పెంపొందించేందుకూ, దళితులకు ఆత్మగౌరవాన్నీ, మానవ హక్కులనీ పునరుద్ధరించే ఒక కొత్త సామాజిక వ్యవస్థను నెలకొల్పేందుకూ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సాహిత్య సమీక్ష

భారతీయ చరిత్ర రచనలో దళిత ఉద్యమం ఇప్పటికీ అంతర్భాగంగా మారలేదు. మౌలిక సమకాలీన ఉద్యమాలతో దళితోద్యమానికి పరస్పర సంబంధం వున్న అంశాలపై జరిగిన అధ్యయనాల్లో కూడా దీనికి తగిన చోటు లభించలేదు. భారతదేశంలోని దళితోద్యమంపై జరిగే కొద్దిపాటి అధ్యయనాలు కూడా చారిత్రక, లిఖిత సమాచారం అందుబాటులో లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. తత్ఫలితంగా అస్పష్టత చోటు చేసుకుంటోంది. ప్రధానమైన చారిత్రక రచనల్లో ఎక్కడా దళిత చైతన్యంపట్లా, వలసవాద కాలంలో దేశంలోని విభిన్న ప్రాంతాల్లో జరిగిన దళిత పోరాటాలపట్లా సానుభూతి కనిపించనే కనిపించదు. భారతీయ సమాజంలోని వర్గాలను వివరించే రచనల్లో సైతం ఏదో ఒక ప్రాంతంలోని దళితుల గురించి పేర్కొనే ఒకటీ అరా అధ్యయనాలను కెటాయించి దానినే మొత్తం దళితుల చారిత్రక పూర్వపరాలుగా పేర్కొనడం కనిపిస్తుంది. అయితే ఈ అంశంపై విశ్లేషణాత్మకంగా జరిగిన అధ్యయనాల ప్రాధాన్యత తక్కువేమీ కాదు. నీడ సోకితేనే మైలపడిపోయినట్టుగా ఈసడించుకోబడే పరయా (ఒక అంటరాని కులం) పరిస్థితి నుంచి ఈనాటి కోపోద్రిక్త దళితుడి స్థాయి వరకూ సాగిన ఈ సంఘబహిష్కృతుల వీరగాథ ఎంతో సుదీర్ఘమైనది, సమస్యలతో కూడుకున్నది,

బాధాకరమైనది. విభిన్న కులాలలను న్యాయ చట్రం కింద షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి) అనే ఒక అధికారిక తరగతిగా పరిగణింపబడుతున్న వారికి ఈ ప్రజాస్వామిక గణతంత్ర వ్యవస్థలో సమాన పౌరులుగా గుర్తింపు లభించాలన్న ప్రణాళిక ఇంకా వాస్తవరూపందాల్చవలసే వుంది.

భారతీయ సమాజంలో అత్యంత అమానుషంగా, అతి నికృష్టులుగా చూడబడుతున్న దళితుల పట్ల సహజంగానే మిషనరీలకు, సామాజిక చరిత్రకారులకు, సామాజిక మానవ శాస్త్రవేత్తలకు ఆసక్తి ఎక్కువ. అందువల్ల చెదురుమదురుగా అసంపూర్ణంగానే అయినప్పటికీ దళితులపై అధ్యయనాలు పందొమ్మిదో శతాబ్దం మొదటినుంచే ప్రారంభమయ్యాయి. అవి చాలావరకు మిషనరీల పర్యటనా విశేషాల, వ్యక్తిగత అనుభవాల రూపంలో, అధికారిక పత్రాల, జిల్లా ఫర్మానాల, మానవశాస్త్ర సంబంధ నోట్సు రూపంలో కనిపిస్తాయి.[1] అయినప్పటికీ అవి ప్రత్యేకించి మతపరమైన ఆచారాలూ, నమ్మకాలూ, సంస్కృతీ మొదలైనవాటికి సంబంధించి ఎంతో ముఖ్యమైన, అమూల్యమైన సమాచారాన్ని అందిస్తున్నాయి. దేశ విదేశీ చరిత్రకారులు, మేధావులెందరో దళిత సమస్యకు సంబంధించిన అనేక అంశాలపై పరిశోధనలు చేశారు.

పదజాలం - దృక్పథం

ఈ సిద్ధాంత గ్రంథంలో ఉపయోగించిన కొన్ని పదాలకు, భావనలకు ముందుగా వివరణ యివ్వాల్సిన అవసరం వుంది. దళితులు అన్న పదం అంటరానితనం అనే వివక్షకు గురైన వాళ్లందరినీ సూచించేందుకు మాత్రమే ఉపయోగించబడింది. మొదట్లో వారిని పరయాలు, కులభ్రష్టులు, హరిజనులు, పీడితవర్గాలు, పంచములు, అతిశూద్రులు అని వ్యవహరించేవారు. ప్రస్తుతం లీగల్‌గా షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి) అని వ్యవహరిస్తున్నారు.

సామాజిక వర్గీకరణకు మూలమైన వర్ణవ్యవస్థ (చతుర్వర్ణాల) పరిధిలోకి దళితులు రారు. ఎందుకంటే ఆ వ్యవస్థలోని నాలుగు వర్ణాలవాళ్లు (బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ,

---

1. *పందొమ్మిదో శతాబ్దపు తొలి రోజుల్లో భారత ప్రజలు, సమాజం, సంస్కృతి గురించి ప్రస్తావించిన గ్రంథాల్లో అబ్బే జె.ఎ.దుబోయిస్ అనే ఫ్రెంచ్ మిషనరీ అనుభవాలను వివరించే గ్రంథం మొట్టమొదటిది అయివుంటుంది. అందులోని ఐదవ అధ్యాయంలో దళితులకు సబంధించిన తొలి లిఖిత వర్ణనలు వున్నాయి. ఈ గ్రంథం 1815 లో రచించబడింది. దుబోయిస్, 1953.*

శూద్రులు)– మాలిన్యానికి లేదా కాలుష్యానికీ ఎగువన వున్న వారిగా పరిగణింపబడుతుంటారు. కాలుష్య రేఖకి దిగువన వున్న వాళ్లని ఐదోవర్ణంగా... 'పంచములు'గా పరిగణిస్తారు. ఈ విభజన కాలుష్యం (మైల) పట్ల వున్న ప్రాకృతిక భావనలను బట్టి ఏర్పడింది. అందుకే ఆచరణకు అనుగుణంగా అంత్య (చిట్టచివరి), బాహ్య (గ్రామం వెలుపలి), అంత్యజ (ఆఖర్న పుట్టిన), అంత్యవాసిని (చివర్న నివసించేవారు) వంటి పదాలను కూడా వీరికి ఉపయోగించారు. సామాజిక వర్గీకరణను ఉద్దేశపూర్వకంగా శాశ్వతీకరించే కృషిలో భాగమే ఈ పదజాలం. భవిష్యత్తులో కూడా మనుషులంతా ఒకటి అవడానికి వీలులేకుండా ఈ పదజాలం ఇనుపగోడల్ని నిర్మించింది. పంచములకు ఉపయోగించిన పదాల్లో కొన్ని ఆ తరువాత నిర్దిష్ట కులాల పేర్లుగా స్థిరపడ్డాయి. ఉదాహరణకి 'నిషాద' అనే కులం పేరు అలాంటిదే. బ్రాహ్మణ తండ్రికి, శూద్ర తల్లికీ పుట్టిన వారితో ఈ కులం ఏర్పడింది.

ఇరవైయ్యవ శతాబ్దం ప్రారంభంలో...1920లలో దళితులు తామే అసలైన 'భూమిపుత్రులు' గా (సన్స్ ఆఫ్ ది సాయిల్) ప్రకటించుకున్నారు. తమ ప్రాంతీయ గుర్తింపునకు ముందు 'ఆది' అనే పదాన్ని ఉపయోగించారు. మద్రాసు ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడేవాళ్లు తాము 'ఆది ఆంధ్రులు' గా ప్రకటించుకున్నారు. అలాగే తమిళులు తాము 'ఆది ద్రావిడులు' గా ప్రకటించుకున్నారు. ఆ తదనంతర కాలంలో 1931 నాటి జనాభా లెక్కల సేకరణలో ఈ స్వయం ప్రకటిత బృందాలు కొత్త ఉపకులాలుగా మారి స్థిరపడిపోయాయి.

1930లలో దళితులకు ప్రత్యామ్నాయంగా 'పీడిత వర్గాలు', 'బాహ్యకులు', 'షెడ్యూల్డ్ కులాలు' అనే కొత్త వలసవాద పదజాలం ఏర్పడింది. అదే సమయంలో దళితులకు బదులు 'హరిజనులు' అన్న పదాన్ని గాంధీ బాగా ప్రాచుర్యంలోకి తీసుకొచ్చాడు. నిజానికి 'హరిజన్' అన్న పదాన్ని మొట్టమొదటగా 'నర్సీ మెహతా' అనే మధ్యయుగాల గుజరాతీ కవీ, యోగీ ఉపయోగించాడు. దేవదాసీలకు (దేవాలయాల్లో నృత్యం చేసే యువతులకు) పుట్టిన పిల్లల్ని, సంబోధించేందుకు ఆ రోజుల్లో 'హరిజనులు' అన్న పదాన్ని వాడారు. దేవదాసీలు దేవుడికి లేదా దేవతకు అంకితం చేయబడిన వాళ్లు. దేవుని ఏజెంట్లతో, దేవుని సేవకులతో వారికి లైంగిక సంబంధాలుంటాయి. అందుకే ఆ చర్యకు దైవత్వాన్ని ఆపాదించుకుంటూ తమకూ దేవదాసీలకూ పుట్టిన బిడ్డలను 'దేవుని బిడ్డలు' (హరిజనులు) అన్నారు. ఇరవైయవ శాతాబ్దపు ప్రారంభం నాటికే దేవదాసీలూ వారి పిల్లల జనాభా విపరీతంగా పెరిగిపోయింది. దాంతో వారికోసం విడిగా ఒక కులం ఏర్పడక తప్పలేదు. ఆ

తరువాత జనాభా లెక్కల సేకరణలో ఈ కొత్త కులం చోటు సంపాదించుకుంది. హరిజన అన్న పదాన్ని గాంధీ బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. అప్పుడు అనేక మంది దళిత మేధావులు కేవలం దళితులనే దేవుని బిడ్డలుగా వ్యవహరించడం చూసి ఆశ్చర్యపోయారు. మిగతా కులాలకు చెందిన పిల్లలు దేవుని బిడ్డలు కారా అని ప్రశ్నించారు. సమాజం నుంచి దళితులను శాశ్వతంగా వేరు చేసే మరో తెలివైన ప్రయత్నంగా దీనిని పరిగణించారు.

ఈ పుస్తకంలో దళితులు అనే పదాన్ని ఎక్కువగా ఉపయోగించడం జరిగింది. దళితులు అంటే అణగదొక్కబడిన, ముక్కలు ముక్కలుగా చితకగొట్టబడినవారు అనే అర్థాలున్నాయి. ప్రస్తుతం ఈ పదం ఒక కులాన్ని కాకుండా ఒక వర్గాన్ని సూచిస్తోంది. మహరాష్ట్ర ప్రజల ద్వారా ఈ పదం వాడుకలోకి వచ్చింది. మొట్టమొదటిసారిగా డా. బి.ఆర్. అంబేద్కర్ 'దళితులు' అన్న పదాన్ని ఉపయోగించారు. క్రమేణా ఈ పదానికి విశేషమైన ప్రాచుర్యం లభించింది. నేడు అకడమిక్ పదజాలంలో ఒకటిగా మారిపోయింది. 1970లలో "దళిత్ పాంథర్స్" ఉద్యమ ప్రభావంతో ఈ పదం మరింత విస్తృతమయింది. దళిత్ అంటే మార్పునకూ, విప్లవానికీ ప్రతీక. దళితుడంటే మానవత్వం మీద విశ్వాసం వున్నవాడు, దేవుని ఉనికిని నమ్మనివాడు, పునర్జన్మ సిద్ధాంతాన్నీ వివక్షను ప్రభోదించే పవిత్ర గ్రంథాలనీ, కర్మ సిద్ధాంతాన్నీ, స్వర్గాన్నీ తిరస్కరించేవాడు. తన దేశంలో తనే అన్ని రకాల దోపిడీకి గురైన వ్యక్తికి ప్రతీక దళితుడు. 1972లో నామ్‌దియో ధోసాల్ [2] దళితులు అన్న పదాన్ని అన్ని షెడ్యూల్డ్ కులాలకూ, తెగలకూ, భూమిలేని కూలీలకూ, ఆర్థిక దోపిడీకి గురవుతున్న వారికీ వర్తింపజేస్తూ విస్తృతపరిచారు. అయితే ఇవాళ కేవలం షెడ్యూల్డ్ కులాల వారికి మాత్రమే దళితులు అన్న పదాన్ని ఉపయోగిస్తున్నారు. ఎందుకంటే ఆదివాసీలకూ, వెనుకబడిన కులాల వారికంటే వీరి పరిస్థితి భిన్నమైనది.

ఈ పుస్తకంలో పంచములు, అంటరానివాళ్లు, హరిజనలు, అణగారిన వర్గం, షెడ్యూల్డ్ కులాలు, దళితులు వంటి పదాలను ఆయా సందర్భాలను బట్టి వాడినప్పటికీ దళితులు అన్న పదాన్ని ఎక్కువగా భారతీయ సమాజంలో అమానవీకరణకు గురైన వర్గాలను ఉద్దేశించే ఉపయోగించడం జరిగింది.

చివరగా అగ్రవర్ణ హిందువులు (క్యాస్ట్ హిందూ) అన్న పదం గురించి ఒక్కమాట – సామాజిక వర్గీకరణకు మూలమైన చతుర్ వర్ణ వ్యవస్థలో చోటువున్న కులాలన్నింటికీ కలిపి ఈ పదాన్ని ఉపయోగించడం జరిగింది.

2. నామ్‌దియో ధోసాల్ మహరాష్ట్రకు చెందిన సమర్థవంతుడైన దళిత కవి. దళిత్ పాంథర్స్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరు.

2

అంటరానితనం అవగాహన: ఒక చారిత్రక దృక్పథం

"ఆదిలోనూ అంతంలోనూ
అంతా మైల తప్ప మరేం లేదు.
ఎవరైనా పరిశుద్ధంగా పుట్టారా అనేది ఎవరికీ తెలియదు.
మరి ఎవరు శుద్ధులు?" ఆశ్చర్యంగా అన్నాడు చోకమేల.

–అభంగ్ 11 చోకమేల

అంటరానితనం మూలాలు ఎక్కడున్నాయో సరిగా తెలియడం లేదు. దాని అభివృద్ధిని పరిశీలించడం కూడా కష్టమైన విషయమే. అయితే భారతదేశంలోని అంటరానితనానికి ప్రాతిపదిక మాత్రం శుభ్రత/స్వచ్ఛత – మైల/ కాలుష్యం తాలూకు భావనలే అనేది సుస్పష్టం.[1] పుట్టుక సమయంలో, చనిపోయిన తదనంతరం మనుషులంతా కాలుష్యం/మైలగానే పరిగణింపబడతారు. దీనికి తోడు బహిష్టు, ప్రసవ సమయాల్లో మహిళల్ని మైలపడినట్టు పరిగణిస్తుంటారు. అయితే అది తాత్కాలికమైన మైల. కానీ అంటరాని వాళ్లుగా దగాపడిన వర్గానికి అంటగట్టబడిన మైల శాశ్వతమైనది. ఈ శాశ్వత మైల సిద్ధాంతం పట్ల బుద్ధుడికాలం నుంచే వ్యతిరేకత వుందనేందుకు ఆధారాలున్నాయి. కాగా ఆ వారసత్వ మైల సిద్ధాంతానికి వ్యతిరేకంగా చట్టం తెచ్చే ప్రయత్నం చేసింది మాత్రం ఆధునిక భారత ప్రభుత్వమే. అయితే తరతరాలుగా

---

1. కాలుష్యం/మైల అన్న భావన సంస్కృతంలో 'అస్పృశ్య' అనే పదంతో, కన్నడ మళయాల భాషల్లో 'పూలే' అన్న పదంతో, తమిళంలో 'టీట్టు' అన్న పదంతో, తెలుగులో 'అంటరానితనం' అన్న పదంతో వ్యక్తం చేయబడుతోంది. ఈ కాలుష్యంలో తాత్కాలికం, శాశ్వతం అనే రెండు రకాలున్నాయి. చూ. అంబేడ్కర్, 1948 మూన్ ద్వారా పునర్ముద్రితం.

వేళ్లూనికొనివున్న అంటరానితనాన్ని ఆ చట్టం సమూలంగా రూపుమాపలేకపోయింది. దక్షిణ భారతదేశంలోని అనేక గ్రామాలలో ఇప్పటికీ అంటరానితనం ఇంకా చెక్కుచెదరకుండా కొనసాగుతూనే వుంది.

చారిత్రక నేపథ్యం

భారతదేశపు ఆది రచన అయిన ఋగ్వేదంలో ఎక్కడా అంటరానితనం గురించిన ప్రస్తావన లేదు.[2] ఆ తదనంతరపు వైదిక గ్రంథాలలో 'ఛండాలుడు' అనే ఒకే రకమైన అంటరానితనపు ప్రస్తావన కనిపిస్తుంది. "దుష్కార్యాలు చేసే వ్యక్తి మరు జన్మలో కుక్క, పంది లేదా ఛండాలుడిగా పుడతాడు" అని ఛందోగ్య ఉపనిషత్‌లో వుంది. ఆ తరువాత కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో ఛండాలురకు కొన్ని వృత్తులను సూచించాడు. అవి – కాటికాపరి పని, నేరస్థులను శిక్షించడం, కొత్త ఆవాసాలకు కాపలాకాయడం వంటివి. వారు ఊరి బయట విడిగా నివసించాలి, తమ సమూహంలోని వాళ్లనే వివాహం చేసుకోవాలి అని నిర్దేశించాడు. అంటరాని వాళ్లని ఈసడించుకోవడం, వాళ్లను చూడకూడదు ... వాళ్లతో మాట్లాడకూడదు... వాళ్లనసలు దగ్గరకే రానివ్వకూడదు అని భావించడం సమాజంలో అప్పటికే మొదలైంది.

పరిశుద్ధత – మైలలకు సంబంధించిన భావనపై మనుస్మృతిలో వివరణ వుంది.[3] ఛండాలుడిని, బహిష్టులో వున్న స్త్రీని, పాపం చేసి బహిష్కరణకు గురైన వ్యక్తిని, అప్పుడే బిడ్డకు జన్మనిచ్చిన బాలింతరాలిని, శవాన్ని, శవాన్ని తాకిన వ్యక్తిని ఎవరైనా ముట్టుకుంటే మైలపడినట్టేనట. అలా మైలపడిన వ్యక్తి వెంటనే స్నానం చేస్తే తప్ప తిరిగి పరిశుద్ధుడు కాలేడు అంటుంది మను స్మృతి. ఛండాలురకు మూడు మూలాలు వున్నట్టు చెప్పాడు మనువు. ఒకటి: శూద్ర తండ్రికీ బ్రాహ్మణ తల్లికీ జన్మించడం (10.67). రెండు: హోమ నిర్వహణకు ఏ బ్రాహ్మణుడైనా శూద్రుడిని బిచ్చమడగడం (11.24). మూడు: బ్రాహ్మణ హత్యకు పాల్పడటం(11.55). ఛండాలురు అత్యంత నికృష్ట మానవులంటూ మనువు అనేక ఆంక్షలు విధించాడు. వర్ణ వ్యవస్థలో ఛండాలురను శూద్రుల కంటే నీచస్థాయిగా పరిగణించడం, ఆ తదనంతరపు న్యాయ శాస్త్రాలలో ఈ భావన పెరుగుతూ పోవడం, కింది కులాల వాళ్లు, బహిష్టు స్త్రీలు అస్పృశ్యులు (అంటరానివాళ్లు)గా పరిగణింపబడటం మనువు తదనంతరం నుంచే ఎక్కువయింది.

---

2. అత్యంత ప్రాచీన రచన అయిన ఋగ్వేదం క్రీ.పూ. 1000 ప్రాంతంలో రచించబడింది. చూ. థాపర్, 1966. పే. 31.

3. అతి ప్రధానమైన హిందూ న్యాయ శాస్త్ర గ్రంథం మనుస్మృతి. ఇది క్రీ.పూ. 200 – క్రీ.శ. 200 మధ్య కాలంలో వెలువడివుంటుంది. చూ. ఝా, 1989; మాండలిక్, 1886.

పాలీ గ్రంథాలలో నీచ కులాల గురించిన ప్రస్తావన వుంది. వారిని ముఖ్యంగా 'నిషాదులు', 'ఛండాలురు' అని పేర్కొన్నారు. వారు అంటరానివాళ్లుగా పరిగణించబడినట్టు, అంత్యులు, లేదా బాహ్యులు అని కూడా వ్యవహరించబడినట్టు ఆ గ్రంథాల్లో వుంది. అంటే ఊరు బయట లేదా విడి సెటిల్‌మెంట్లలో నివసించేవారని అర్థం.

మిశ్రమ వర్గాలకు చెందిన స్త్రీ పురుష కలయిక వల్ల – అంటే బ్రాహ్మణ స్త్రీ ... శూద్ర పురుషుడు కలుసుకోవడం వల్ల పుట్టిన సంతానమే ఛండాలురు అని ధర్మసూత్రాలు పేర్కొన్నాయి. ఇలాంటి అనేక మిశ్రమ కులాల గురించి కౌటిల్యుడు ప్రస్తావించాడు. విరుద్ధ శ్రేణి (తక్కువ కులం పురుషుడు – ఎక్కువ కులం స్త్రీ) కలయికలు ధర్మ విరుద్ధమన్న ధర్మసూత్రాలను అంగీకరిస్తూనే కౌటిల్యుడు ఈ అందరినీ మిశ్రమ కులాలుగా పరిగణించాడు. వాళ్లు తమకు తాము శూద్రులుగా పరిగణించుకోవడం విషయంలో ఆయనకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఛండాలురను (ఎక్కువ కులం స్త్రీకి – తక్కువ కులం పురుషుడికి జన్మించిన వారిని) మాత్రం ఆయన అతి నికృష్టమైనవారిగా పరిగణించడమేకాకుండా మిగతా మిశ్రమ కులాల వాళ్లు కూడా ఆ ఛండాలురను దగ్గరకు రానివ్వకూడదని శాసించాడు. అయితే ఆయన రూపొందించిన వారసత్వ చట్టంలో ఈ ధర్మ విరుద్ధ కలయిక వల్ల జన్మించిన పుత్రులకు కూడా స్థానం కల్పించడం ఆశ్చర్యం కల్గిస్తుంది. బ్రాహ్మణాలు, ధర్మసూత్రాలు, ధర్మశాస్త్రాలు వంటి తదనంతరపు వైదిక సాహిత్యంలో ఛండాలుర విషయంలోనే అంటరానివాళ్లు అన్న పదాన్ని ఉపయోగించడం కనిపిస్తుంది. ఈ గ్రంథాల ప్రకారం ఛండాలురు కర్మ ఛండాలురు, జన్మ ఛండాలురు అని రెండు రకాల వాళ్లు వుంటారు. ఒకరు తాము చేసిన చెడు వల్ల ఛండాలురైతే, మరొకరు పుట్టుకతోనే ఛండాలురుగా పుట్టిన వాళ్లు. వశిష్టుని అభిప్రాయం ప్రకారం నాస్తికుడు, లోభి, నీచుడు, నిత్యకోపిష్టి అనే నాలుగు రకాల వాళ్లు కర్మ ఛండాలురు, కాగా ఐదో రకం వాళ్లు జన్మ ఛండాలురు. బ్రాహ్మణ హత్యకు పాల్పడిన వాడినీ, బ్రాహ్మణుల సొమ్మును దొంగిలించిన వాడినీ, బ్రాహ్మణుడి తీర్థప్రసాదాలను తాగిన వాడినీ ఊరినుంచి బహిష్కరించాలి అన్నాడు మనువు.

తదనంతరపు వైదిక సాహిత్యంలో ఛండాలురను ఒక జాతిగా పరిగణించడం కనిపిస్తుంది. వైశ్య స్త్రీకీ, శూద్ర పురుషునకూ జన్మించిన సంతానాన్ని వశిష్టుడు విడిగా అంత్యవాసినులు అన్నాడు. ఛండాల పురుషుడికీ, నిషాద స్త్రీకీ జన్మించిన సంతానమైన అంత్యవాసినులను మరింత నికృష్టులుగా పరిగణించాడు మనువు. చతుర్ వర్ణవ్యవస్థలో కులాల మధ్య అంతర్ సంబంధాల ఫలితంగా అంటే అనులోమ, ప్రతిలోమ కలయికల ఫలితంగా పుట్టిన వాళ్లని ధర్మసూత్రాలతో సహా అన్ని బ్రాహ్మణీయ గ్రంథాలు

అంటరానివాళ్లుగా పేర్కొన్నాయి. ఈ కులాలను అహేతుకమైనవిగా పేర్కొంటూ చతుర్ వర్ణ వ్యవస్థకు అనుబంధంగా ప్రస్తావించాయి.

ధర్మసూత్రాల్లో, మనుచరిత్రలో లేదా ఇతర బ్రాహ్మణీయ న్యాయశాస్త్రాల్లో అంటరానితనం మూలాల గురించిన వివరణలు ఏమంత ఆమోదయోగ్యమైనవి కావు. ప్రాచీన భారతదేశం గురించి బాగా తెలిసిన కొందరు ఆధునిక విద్యావేత్తలు సైతం సిద్ధాంతపరంగా అంటరానివాళ్లని శూద్రుల కింద పరిగణిస్తున్నారు. అదేగనక నిజమైతే అలాంటి వాళ్లని అంటరానివాళ్లుగా సంబోధించడం జరిగేదికాదు. పంచములు, బాహ్యులు, అవర్ణులు వంటి భావనలకు అసలు ఆస్కారమే వుండేదికాదు. మౌర్య కాలానికి ముందరి గ్రంథాలలో కూడా – ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బౌద్ధ, జైన గ్రంథాల్లో సైతం ఛండాలురను ఎక్కడా శూద్రులలో చేర్చిన దాఖలాలు లేవు. కానీ ధర్మసూత్రాలు మాత్రం చేర్చాయి. ఎందుకంటే వారిలో శూద్రుల రక్తం వుండటమే కారణం. అయితే ఇంతకుముందే పేర్కొన్న వివరాలదృష్ట్యా ఈ మిశ్రమ కులాల్లో కేవలం శూద్రుల రక్తమేకాదు బ్రాహ్మణుల రక్తం కూడా కలగలిసి వుందని గమనించాలి.

అంటరానివాళ్లని చతుర్ వర్ణ వ్యవస్థలో చేర్చలేదని కౌటిల్యుడు పేర్కొన్నాడు. కానీ పాణిని మాత్రం వాళ్లని కూడా చతుర్ వర్ణ వ్యవస్థలో చేర్చినట్టు చెప్పాడు. అయితే సమాజంలో నాలుగే నాలుగు వర్ణాలున్నాయని మనువు చాలా నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. తన న్యాయశాస్త్ర గ్రంథంలో అంత్యజులను శూద్రుల నుంచి వేరు చేసి చూపాడు.

క్రీ.శ.5వ శతాబ్దం నాటికి ఈ కఠినమైన ఆదేశిక సూత్రాలు సిద్ధాంతపరమైన న్యాయశాస్త్ర గ్రంథాలుగా వాస్తవరూపం దాల్చాయి. భారతదేశాన్ని సందర్శించిన విదేశీ యాత్రికులు, రచయితలు అంటరానివాళ్ల గురించి రాస్తూ వారు కొన్ని నీచమైనవిగా భావించబడే వృత్తులు చేస్తూ గ్రామాల, పట్టణాల బయట శివార్లలో విడిగా నివశిస్తున్నట్టు పేర్కొన్నారు. చైనా యాత్రికుడు ఫాయియాన్ (ఫాసియెన్) [4] కొన్ని ఇతర సమూహాలతో పాటు ఛండాలురు శివార్లలో నివసించడాన్ని గమనించాడు. అలాగే మరో చైనా యాత్రికుడు హ్యూయన్ త్సాంగ్ (జువాన్ జాంగ్) [5] కూడా కసాయివాళ్లు, చేపలుపట్టేవాళ్లు, జనంలో ప్రదర్శనలు యిచ్చేవాళ్లు (బహుశ దొమ్మరి వాళ్లు), ఉరిశిక్షలు అమలు

---

4. ఫాయియాన్ చైనాకు చెందిన బౌద్ధ యాత్రికుడు. క్రీ.శ. 405–411 మధ్య భారత దేశాన్ని సందర్శించాడు. చూ. గైల్స్ 1923.

5. హ్యూ యన్ త్సాంగ్ మరో చైనా యాత్రికుడు. ఈయన గురించి పూర్తివివరాలకు చూ. వాటర్స్ 1904–05.

చేసేవాళ్లు, పాకీపని చేసేవాళ్లు తదితరులు నగరం వెలుపల నివశిస్తున్నట్టు పేర్కొన్నాడు. అల్‌బెరూని అనే పదకొండో శతాబ్దపు ముస్లిం మేధావి ఛండాలురు ఏ కులంలోనూ, ఏ సంఘంలోనూ భాగంగా లేరనీ, చాలా మురికి పనులు చేస్తూ అదో వర్గంలా వుంటున్నారనీ, తాము చేసే వృత్తులను బట్టే వాళ్లు గుర్తించబడుతున్నారనీ పేర్కొన్నాడు. మౌర్యుల కాలంలో ఈ అంటారనివాళ్లని వార్తాహరులుగా నియమించినట్టు కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల తెలుస్తోంది.[6]

బౌద్ధ కాలానికి సంబంధించిన కొన్ని న్యాయేతర గ్రంథాల ఆధారాల వల్ల బౌద్ధమతం అంటరాని వారిపట్ల ఎంతో ఉదారావాద ధోరణి కనబరిచినట్టు అర్థమవుతోంది. ఇద్దరు కాటికాపరులు బౌద్ధ మతంలో చేరినట్టు 'తెరిగాథ'లో వుంది.[7] సంస్కృత నాటకం 'మృచ్ఛకటికం'లో ఉరిశిక్షలు అమలుపరిచే అంటరానికులానికి చెందిన రెండు హాస్యపాత్రలున్నాయి. మునులకు హాని చేసేవాళ్లే అసలైన నీచజన్ములని ఆ పాత్రలు ప్రబోధిస్తాయి.

గుప్తుల కాలంలో భారతీయ సమాజంలో అంటరానివాళ్ల సంఖ్య పెరిగిపోవడమేకాక ఆ ఆచారం సమాజంలో బాగా వేళ్లూనుకుని విస్తృతమైనట్టు కనిపిస్తుంది. ఆ రోజుల్లో ఛండాలురు నగర ద్వారం దాటి లోపలికి వచ్చేముందు లేదా అంగడిలో అడుగుపెట్టేముందు జనం తప్పుకునేందుకు వీలుగా తమ రాకను తెలియజేసేందుకు కర్రతో శబ్దం చేసేవారని చైనా యాత్రికుడు ఫాయియాన్ (ఫాసియెన్) పేర్కొన్నాడు. ఛండాలుర వర్గానికి చెందిన చేపలు పట్టేవాళ్లూ, వేటగాళ్లూ మాంసం అమ్మేవాళ్లని కూడా ఆయన పేర్కొన్నాడు. అయితే కాళిదాసు ప్రస్తావించిన ఛండాలురు వేరు. వాళ్లు వేటమాంసం అమ్మడం, చేపలు పట్టడం వంటి పనులు చేసేవాళ్లు కాదు. ఏదేమైనా అందరూ ఏక వర్గానికి చెందినవాళ్లే, కష్టజీవులే. బ్రాహ్మణీయ గ్రంథాలు అంటరానివాళ్లని ఒక పొంతనలేకుండా చిత్రీకరించాయి. ఛండాలురు అపవిత్రులు, అబద్ధాలకోర్లు, దొంగలు, సంప్రదాయ వ్యతిరేకులు, చిల్లర తగాదాలకోర్లు, కాముకులు, కోపిష్టులు, దురాశాపరులు అంటూ చిత్రించాయి.

---

6. అంటరానివాళ్లని – సమాచారం చేరవేసేందుకు వినియోగించుకునే ఆచారం ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వుంది. చూ. శర్మ, 1958, పే.159.

7. తెరగాథ, తెరిగాథ అనేవి బౌద్ధ సన్యాసుల్లోని, సన్యాసినుల్లోని పెద్దలు ప్రవచించిన కీర్తనలు. భారతదేశపు గొప్ప మత సంబంధ కవిత్వం వీటిలో వుంది. చూ. బాషమ్, 1953, పే.267,456–7.

మిశ్రమ కులాల వల్ల, వివిధ నీచ స్థాయి వృత్తుల వల్ల హిందూ సమాజంలో అంటరానితనం అంతకంతకూ పెరిగిపోయింది. జైన సాహిత్యంలో కూడా జాతి జంగితాలు (జన్మతః అంటరాని వాళ్లు), కర్మ జంగితాలు (అంటరాని దేహం కలిగిన వాళ్లు) అనే ప్రస్తావన కనిపిస్తుంది. వేటగాళ్లు, వేటకు ఉపయోగపడేవాళ్లు, దర్జీలు, దొమ్మరివాళ్లు, జన్మతః అంటరానివాళ్లుగా వర్గీకరించబడ్డారు. అలాగే నెమళ్లు వంటి పక్షుల్ని, పందులు తదితర జంతువుల్ని పెంచేవాళ్లు, వేటాడేవాళ్లు, దొమ్మరి విన్యాసాలు చేసేవాళ్లు, అప్పుడప్పుడు మంగలి పనిచేసేవాళ్లు ప్రవర్తన రీత్యా ఛండాలురుగా పరిగణించబడ్డారు. ఇక వికలాంగులు, గూని వాళ్లు, మరుగుజ్జులు ఒంటికంటి వాళ్లు శారీరకంగా అంటరాని వాళ్లుగా పరిగణించబడ్డారు. పవిత్ర జైనుడెవడైనా ఇలాంటి అంటరానివాళ్లందరికీ దూరంగా వుండాలట.

బౌద్ధ రచనల్లో కూడా ఛండాలురు, వేనలు (బుట్టలు తయారుచేసేవాళ్లు), నిషాదులు (చేపలు పట్టేవాళ్లు), రథకరులు (రథాలను తయారుచేసేవాళ్లు), పుక్కాసులు (వేటాడేవాళ్లు) వంటి 'హీన జాతి' లేదా నీచ కులస్తుల ప్రస్తావన కనిపిస్తుంది. పుట్టుక రీత్యా, ప్రవర్తన రీత్యా అంటరానివాళ్లు అనే భావన ధర్మ సూత్రాలలో వుంది. బౌద్ధ గ్రంథాలైన ఈ ధర్మ సూత్రాలు పాళీ భాషలోంచి సంస్కృత భాషలోకి అనువదించబడ్డాయి. అటు అహింసా సిద్ధాంతం, ఇటు అగ్రవర్ణాలు పాటించిన వెలివేత ఆచారం... రెండూ భారతదేశంలో అంటరాని కులాల సంఖ్య పెరిగేందుకు ఎక్కువగా దోహదం చేశాయి.

దక్షిణ భారతదేశంలో ఆర్య సంస్కృతి పెరిగిపోవడానికి సంబంధించిన చిహ్నాలు బ్రాహ్మణులకు సర్వోన్నత హోదాను, భూదానాలను ఇవ్వడంలో కనిపిస్తుంది.[8] గుప్తులకు ముందరి కాలంలో విద్యా సంస్థల పరిణామ క్రమం కూడా ఆర్యనీకరణను సూచిస్తుంది. గుప్తకాలపు తొలి దశలో విద్యారంగం బౌద్ధ, జైన మతాల నియంత్రణలో వుండేది. సామాజిక సంబంధాలలో కుల ప్రభావం అధికంగా వుండేది. బ్రాహ్మణులు సమాజంలోని మిగతా వాళ్లందరికంటే ఉన్నతులుగా పరిగణింపబడేవారు. తమ సాధికార హోదా వల్ల వాళ్లు ధీమాగా వ్యవహరించేవాళ్లు. వైదిక సాంప్రదాయానికి తాము పరిరక్షకులుగా భావించేవారు. ఆ సంప్రదాయం పవిత్రమైనదిగా, అనుల్లంఘ

---

8. థాపర్, 1966. పే.180. ఈ వాదనను బొట్టోమోర్ కూడా సమర్థించారు. బ్రాహ్మణుల్లో తగినంతమందికి భూసంపద వుండేదనీ, వాళ్లు సామ్రాజ్యవాద, ఫ్యూడల్ కాలాల్లో భూస్వామ్య యోధ కులాల వారితో సన్నిహితంగా వుండేవారనీ అంటారాయన. చూ. బొట్టోమోర్, 1967. పే.41.

నీయమైనదిగా విశ్వసించేవారు. దక్షిణ భారతదేశంలోని బ్రాహ్మణులకు మత నాయకులుగా గౌరవం, అత్యున్నత ఆర్థిక హోదా రెండూ ఒకేసారి సంక్రమించాయి. వాళ్లకు పన్నుల చెల్లింపు నుంచి మినహాయింపు వుండేది. అనేకమంది బ్రాహ్మణులకు విస్తారమైన భూములుండేవి, తమ మిగులు సంపదను వారు వ్యాపారాల్లో మదుపు చేసేవారు. దీనికి తోడు వారికి రాజుల మద్దతు అపారంగా వుండేది. వాళ్లు నిజానికి ఒక పరాయి సంస్కృతికి ప్రతీకలుగా వుండేవారు. కానీ సమాజంలో వారికున్న భద్రత, హోదా కారణంగా ఎంతో గౌరవ మర్యాదల్ని పొందుతుండేవారు.

దక్షిణ భారతదేశంలో కులాల వర్గీకరణ అనేది ప్రధానంగా సమాజాన్ని బ్రాహ్మణులు – బ్రాహ్మణేతరులు అని విభజించే దృష్టితో జరిగింది. ఉత్తర భారతదేశంలో లాగా కాకుండా ఇక్కడ బ్రాహ్మణేతరుల్లో క్షత్రియుల, వైశ్యుల ప్రస్తావన చాలా తక్కువగా కనిపిస్తుంది. అంతటా శూద్రుల గురించిన ప్రస్తావనే ఎక్కువ. శూద్రులను తిరిగి శుద్ధులైన శూద్రులూ, అశుద్ధులైన శూద్రులూ అని రెండురకాలుగా విభజించారు. శుద్ధులైన శూద్రులను ముట్టుకుంటే ఎవరూ మైలపడరట, అశుద్ధులైన శూద్రులను ముట్టుకుంటే మాత్రం మైలపడటమే కాదు వారికి దేవాలయంలో అడుగుపెట్టే అర్హత కూడా లేకుండాపోతుందట. క్రమేణా అధికారిక ఉద్యోగాలన్నీ బ్రాహ్మణుల గుప్పిట్లోకి వచ్చాయి. మిగతా కులాల వాళ్లంతా బ్రాహ్మణులకు దాదాపు సేవకులుగా మారారు. బ్రాహ్మణేతరుల్లో ఐక్యత ఏర్పడకుండా వుండేందుకు బ్రాహ్మణులు సహజంగానే కుల కట్టుబాట్లను, కుల సంఘాలను ప్రోత్సహిస్తుండేవారు. అయితే ఆ తదనంతరకాలంలో బ్రాహ్మణేతరులు ప్రబల శక్తిగా మారారు. ఆ రోజుల్లో దేవాలయం అనేది ఒక సామాజిక, ఆర్థిక జీవనానికే కాకుండా విద్యకు కూడా కేంద్రంగా వుండేది. అందువల్ల దేవాలయాల్లో అడుగుపెట్టే అర్హతలేని అశుభ్ర శూద్రులంతా అక్షర జ్ఞానానికి దూరంగా వుండిపోయారు.

పదకొండవ శతాబ్ది నాటివరకు కూడా ఆంధ్రలో ఎలాంటి సాహిత్య రచనలు లేవు. క్రీ.శ. 800కు ముందు ఏవో తెలుగు పదాలు, వాక్యాలతో కూడిన కొన్ని శిలా శాసనాలు మాత్రం కనిపిస్తాయి. పదవ శతాబ్ది చివరినాటికి తెలుగు పద్యపాదాలతో కూడిన శాసనాలు తెలుగు కవిత్వ రచన మొదలైందనడాన్ని సూచనప్రాయంగా తెలియజేస్తున్నాయి. అయితే ఎంత తరచి చూసినా తెలుగు సాహిత్యం కొద్దిపాటి విద్యావంతులకే (ప్రధానంగా బ్రాహ్మణులకే) పరిమితమైందనేది సుస్పష్టం.

క్రీ.శ. 14వ శతాబ్దం వరకూ తెలుగులో హిందూ పురాణాల అనువాదాలు తప్ప వేరే సాహిత్య రచనలేమీ లేవు. అంతకు ముందరి కాలం బౌద్ధమత క్షీణ దశను, జైన మత ఉత్థాన దశను సూచిస్తోంది. ఆదికవిగా పేరుగాంచిన నన్నయ కంటే ముందు ఆంధ్ర, కన్నడ ప్రాంతాలలో జైన మతమూ, జైన సాహిత్యమూ వర్ధిల్లడం

ఒక చారిత్రక సత్యం. జైన పండితులు అప్పటికే తెలుగులో పలు గ్రంథాలు వెలువరించారు. అయితే ఆ తరువాత ఆ మతం అణచివేతకు గురైనప్పుడు అట్టి గ్రంథాలన్నీ ధ్వంసమైపోయి వుంటాయి. ఆనాటి జైన గ్రంథాలలో కొన్నింటితోనైనా నన్నయ్యకు పరిచయం వుండే వుంటుంది. లేకపోతే ఆయన అంత హఠాత్తుగా మహాభారత రచనతో గొప్ప కవిగా ఆవిర్భవించలేడు. ఆనాటి ఆంధ్ర పాలకుడు రాజరాజనరేంద్రుడు (11వ శతాబ్దం) బ్రాహ్మణులకు భూరిగా అగ్రహారాలను ప్రదానం చేసేవాడు. ఆ బ్రాహ్మణులు రాజుగారి గుణగణాలను కీర్తించేందుకూ, వైదిక సంస్కృతినీ వర్ణాశ్రమ ధర్మాన్నీ పరిరక్షించేందుకూ తమ మేధస్సును పూర్తిగా అంకితం చేసేవారు. పండిత గోష్ఠుల్లో, జమీందారీ దర్బారుల్లో శతావధానాలూ[9], అష్టావధానాలూ[10] వంటి సాహిత్య జిమ్మిక్కులను ప్రదర్శిస్తూ, శృంగార విరహ రసాలలో రచనలు చేస్తూ వారిని అలరిస్తుండేవారు.

పధ్నాల్గవ, పదిహేనవ శతాబ్దాలు తెలుగు సాహిత్యంలో స్వర్ణయుగ కాలమని చెప్పవచ్చు. అల్లసాని పెద్దన (మనుచరిత్ర), నంది తిమ్మన (పారిజాతాపహరణము), ధూర్జటి (కాళహస్తీశ్వర శతకము), పింగళి సూరన (కళాపూర్ణోదయము), భట్టుమూర్తి (వసుచరిత్ర) వంటి కవులు ప్రబంధ శైలిలో అనేక రచనలు చేశారు. ఈ కాలంలో కవులకుగానీ, కళాపోషకులకుగానీ కొరత వుండేదికాదు. సాహితీ వస్తువును మతం శాసించేది. అయితే తమ సంస్కృతితో నిమిత్తం లేకుండా కవులు పోటీపడి మరీ తమ సాహితీపోషకులను ఆకర్షించేందుకు రచనలు చేస్తూ అనేక బహుమతులను, అగ్రహారాలను పొందుతుండేవారు. పదహారవ శతాబ్ది వరకూ సమాజం గానీ, సామాజిక జీవనాంశాలు గానీ సాహిత్యనికి ఆలంబనగా లేదా వస్తువుగా వుండకపోవడం తెలుగు సాహిత్యంలో దిగ్భ్రమగొలిపే వాస్తవం. బ్రాహ్మణులు విద్యారంగం మీద గుత్తాధిపత్యాన్ని సంపాదించుకోవడమే కాదు, మొత్తం గ్రంథాలయాలనన్నింటినీ మతపర రచనలతో నింపేశారు. తద్వారా తమ ఆధిపత్యాన్ని, సమాజంలోని ఇతర వర్గాలమీద తమ పెత్తనాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఎక్కడైనా దళితుల గురించిన ప్రస్తావన కనిపిస్తుందంటే అది ఏహ్య భావంతో, అవమానించే ధోరణితో మాత్రమే. అంటరానివాళ్లని ఎలా శిక్షించాలి, ఎలా వారినుంచి తప్పుకోవాలి, నిషేధ నియమాలు ఏమిటి వంటి అంశాలనే వారు ప్రస్తావించారు.

---

9. అవధాని అంటే విలక్షణమైన వ్యక్తి. శతావధాని అంటే ఏకకాలంలో వంద అంశాలను పరిష్కరించగల వ్యక్తి అని అర్థం.

10. అష్టావధాని అంటే ఏకకాలంలో ఎనిమిది అంశాలను పరిష్కరించే వ్యక్తి.

భక్తి ఉద్యమం మొదలవడంతో (ఎనిమిదో శతాబ్దం నుంచి పద్దెనిమిదో శతాబ్దం మధ్య కాలంలో) ఒక విప్లవాత్మక మార్పు సంభవించింది. కొందరు అంటరానివాళ్లు సాధువులుగా, కవులుగా గౌరవించబడ్డారు. అలాంటి వారిలో నందనార్ (ఎనిమిదవ శతాబ్దం) ఒకరు. ఆయన తమిళనాడుకు చెందిన శైవ ఋషి, తిరుప్పన్‌కు సమకాలికుడు, పన్నెండు మంది వైష్ణవ అల్వారుల్లో ఒకరు. అలాగే మహారాష్ట్రలోని మహర్ కులానికి చెందిన చోకమేళ (పదమూడు నుంచి పధ్నాలుగో శతాబ్దం), ఉత్తర భారతదేశానికి చెందిన చమార్ (చెప్పులు కుట్టే) కులస్థుడైన రవిదాస్ (పదిహేనవ శతాబ్దం), ఉత్తర భారతదేశానికే చెందిన హిందూ ముస్లిం నేపథ్యం వున్న కబీర్ దాస్ మొదలైన వాళ్లు కనిపిస్తారు. వీళ్లు అంటరానితనాన్ని ధిక్కరించారు. కర్ణాటకలో 11వ శతాబ్దంలో వచ్చిన సాంప్రదాయ వ్యతిరేక లింగాయత్ ఉద్యమం, మహారాష్ట్రలో 13వ శతాబ్దం నుంచి మొదలైన సనాతనం కాని మహానుభవ ఉద్యమం, పంజాబ్‌లో 15వ శతాబ్దంలో వచ్చిన శిక్కు ఉద్యమం కులాన్ని నిర్మూలించేందుకు ప్రయత్నించాయి.

దళిత చరిత్రకు సంబంధించినంతవరకు భక్తి ఉద్యమానికి ఎంతో ప్రాధాన్యత వుంది. ఆ కాలంలో – భక్తి ఉద్యమంలో భాగంగా కాకపోయినా సమాంతరంగానైనా సామాజిక, మతపర పెత్తందారీ విలువలకు వ్యతిరేకంగా అంటరానివాళ్ల మత తిరుగుబాటు చోటు చేసుకుంది. భక్తి ఉద్యమంలోని కొన్ని శక్తులు హిందూమతానికి ఓ కొత్త రూపాన్నిచ్చేందుకు ప్రయత్నించాయి. మిణుకు మిణుకు మంటున్న బౌద్ధమతం పూర్తిగా ఆరిపోయేందుకు ఆ శక్తులే కారణమయ్యాయి. అయితే ఇందుకు విరుద్ధంగా అంటారాని కులాలకు చెందిన సాధువులు, కవులు సనాతనవాదులు మత, సామాజిక ఆత్మవంచనా విధానాలను అపహాస్యం చేస్తూ ఒక రాడికల్ ఉద్యమాన్ని నడిపారు. ఆనాటి ఆ తిరుగుబాటు ఉద్యమమే ఆ తదనంతరం ఆధునిక కాలంలో దళిత సమాజంలోని విద్యావంతులు, చైతన్యవంతులు ఒక దళిత ప్రతిఘటనా ఉద్యమాన్ని నిర్మించేందుకు స్ఫూర్తినిచ్చింది. అంటరాని వాళ్లలో ఒక ఉమ్మడి చైతన్యాన్ని కలిగించేందుకు కూడా అది దోహదం చేసింది. వాళ్లు తమ అమానవీయ పరిస్థితులను గుర్తించగలిగారు. తమ జంతు స్థాయి ఉనికి గురించిన విచక్షణను పొందగలిగారు. సంఘ సంస్కరణకు అనివార్యమైన మతపర పరిశోధనకూ, మతపర సంస్కరణకూ అది ఒక గట్టి పునాదిని నిర్మించింది. 'మతం ఒక బలమైన సిద్ధాంతం. దాని ప్రమేయం లేకుండా ఎలాంటి సామాజిక కార్యాచరణను చేపట్టడం సాధ్యం కాదు.' మొత్తం సామాజిక వ్యవస్థను మార్చే ఉద్యమాలకు అవసరమైన తిరుగుబాటు సాంప్రదాయాన్ని, ప్రశ్నించే స్వభావాన్ని, ఉమ్మడి చైతన్యాన్ని ఆ సంస్కరణోద్యమం తీసుకొచ్చింది.

తెలుగు సాహిత్యంలో సమకాలీన సమస్యలపై మొట్టమొదటగా వేమన రచనలు చేశాడు. ఆయన 17వ శతాబ్దానికి చెందినవాడు, రెడ్డి కులస్తుడు. మతం, కులం, సంప్రదాయాలు, కట్టుబాట్లు మొదలైనవాటిలో అంటరానితనానికి వ్యతిరేకంగా బెంగాలీలో చండీదాస్, హిందీలో కబీర్‌దాస్, పంజాబీలో గురునానక్, కన్నడంలో సర్వజ్ఞ, తెలుగులో వేమన అనేక కవితలు రాశారు. విశేషం ఏమిటంటే ఇతర కవులంతా దేవుళ్లనో, తమ పోషకుడినో సంబోధిస్తూ కవితలు రాస్తే వేమన మాత్రం తనను తానే సంబోధించుకుంటూ కవితలు రాశాడు. సమాజాన్ని వేమన ఇలా ప్రశ్నిస్తాడు:

కులము చేతబట్టి గుంపించ నేటకి
పాదు వున్న చోట ప్రబలు విత్తు
ఏటి కులంబింక ఎక్కడ ద్విజుడయా
విశ్వదాభిరామ వినుర వేమ!

మాలవాని నేల మరి మరి నిదింప
ఒడలనున్న మాంస మొకటిగాదె
వాని లోన వెలుగు వాని కులంబేది
విశ్వదాభి రామ వినుర వేమ!

మాల మాలగాదు మహిమ మీదనే ప్రొద్దు
మాట తిరుగువాడు మాల గాక
వాని మాల యన్న వాడెపో పెను మాల
విశ్వదాభిరామ వినుర వేమ!

మాల మాంసము దిన మహిమీద జనులెల్ల
కొవ్వు తావలేదో కోర్కె దీర
కులములన్నీ ఒక్క కులముగా తెలియుడీ
విశ్వదాభిరామ వినుర వేమ!

మాలవాని నంటి మరి నీళ్ల మునిగేరు
మాల కర్మచేత మాలడయ్యె
ఏల తెలియలేదొ యీ నరపశువులు
విశ్వదాభిరామ వినుర వేమ!

మద్య మాంస రుచిని మరిగె దైవాల
యెంగిలి దినువారి దెట్టి కులము
భక్తిని పారుగొల్పి భవ్యులు గారైరి
విశ్వదాభిరామ వినుర వేమ!

పద్దెనిమిదవ శతాబ్దం నాటికి తెలుగు సాహిత్యంపై పాశ్చాత్య ప్రభావం కనిపిస్తుంది. ఒక్క వేమనను మినహాయిస్తే పందొమ్మిదో శతాబ్దం నాటి వరకూ తెలుగు సాహిత్యానికి మతమే ప్రధాన వస్తువుగా వుండేది. అంటరానితనం గానీ, అంటరానివాళ్లు గానీ ఎప్పుడూ వస్తువుగా లేదు. అక్కడక్కడా సాహిత్యంలో అంటరాని వాళ్ల గురించిన ప్రస్తావన కనిపించినా అది వారికి ఇస్తున్న అంతులేని శిక్షల జాబితాను ఏకరువుపెట్టే రూపంలో మాత్రమే వుంది. దానివల్ల వారి పరిస్థితి మరింత దిగజారింది. సమాజానికి ఆ కవులు చేసిన సేవను తగ్గించి చెప్పడం నా ఉద్దేశం కాదు కానీ వారు కేవలం బ్రాహ్మణీయ హిందూ మతాన్ని సంస్కరించడంపైనే తమ దృష్టిని కేంద్రీకరించారు.

ఆధునిక కాలంలో ఐరోపా యాత్రికులు భారతదేశంలో ఇంకా ఇంత తృణీకారానికి గురయ్యే మనుషులుండటం చూసి నిర్ఘాంతపోయారు. అందుకే తమిళ 'పరయా'[11] కులం పేరు ఇంగ్లీషు పదజాలంలో సంఘ బహిష్కృతుడికి పర్యాయపదంగా చేరిపోయింది. భారతదేశంలోని అంటరానివాళ్లలో కుల వృత్తులు, పురాణ గాథలు, స్వీయ సంస్కృతులను బట్టి సమాజాలు ఏర్పడ్డాయి. సామాజిక దొంతరలో తమ స్థానం ఎక్కడో వారికి గ్రహింపు వుండేది. పందొమ్మిదో శతాబ్దంలోనూ, ఇరవైయ్యవ శతాబ్దం ప్రారంభంలోనూ కొన్ని నిర్దిష్ట కులాల్లో మార్పు వచ్చిందంటే అది ప్రధానంగా ఆయా కులాల వారసత్వ వృత్తులను బట్టే అని చెప్పవచ్చు.

పందొమ్మిదో శతాబ్దంలో అంటరాని వాళ్ల పట్ల ఆధునిక దృక్పథం మూడు అంచెల్లో మొదలయింది. ఒకటి: క్రైస్తవ మిషనరీలు అంటరానివాళ్లని అక్కున చేర్చుకుని వారికి తమ పాఠశాలల్లో ప్రవేశం కల్పించారు. రెండు: కొందరు అగ్రవర్ణ హిందువులు అంటరాని తనమనే దురాచారానికి వ్యతిరేకంగా మాట్లాడటం ప్రారంభించారు; మూడు: అంటరానివాళ్లు స్వయంగా సొంత గొంతు విప్పడం మొదలుపెట్టారు. ఈ అంశాల గురించి రాబోయే అధ్యాయాల్లో వివరంగా చర్చిద్దాం. కేవలం ఇరవైయ్యవ శతాబ్దంలో మాత్రమే సామాజిక చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు, మానవ శాస్త్రజ్ఞులు

---

11. పరయా అంటే తక్కువ కులానికి చెందిన వ్యక్తి లేదా కులం లేనివాడు, సంఘబహిష్కృతుడు అని అర్థం.

అంటరానివాళ్ల మూలాలు, అంటరానితనం మూలాలు ఎక్కడున్నాయో కనుగొనేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ అంశంపై తమ అవగాహనను క్రోడీకరించుకున్నారు.

ఆధునిక కాలంలో ఆంధ్రలోని దళితులు దళిత చరిత్రకూ, దళిత సంస్కృతికీ ఒక కొత్త దృక్పథాన్నిచ్చే ప్రయత్నం చేశారు. తమ రచనల ద్వారా వాళ్లు మతపరమైన పుక్కిటి పురాణాలని ప్రశ్నించారు. మూఢనమ్మకాలనీ దురాచారాలనీ బట్టబయలు చేశారు. దళితులు సృష్టించిన సాహిత్యం హిందూ మతాన్ని చీల్చి చెండాడింది. అది ఎంతో రాడికల్‌గా, తీవ్ర స్వభావాన్ని కలిగి వుండేది. అందులో ప్రశ్నించే ధోరణి, వ్యంగ్యం ఎక్కువగా కనబతుంది. ఆర్యుల మూలాలు, వారి సాంస్కృతిక ప్రాబల్యం తత్ఫలితంగా ఏర్పడిన సామాజిక రుగ్మతలు – ఇవే వారిని తీవ్రంగా స్పందింపజేసిన అంశాలు.

మూలానికి సంబంధించిన సిద్ధాంతాలు

అంటరానితనం అనేది వివిధ కారణాల వల్ల ఒక సామాజిక వ్యవహారంగా మారిపోయింది. కులం ఒక విస్తృత వ్యవస్థగా కేవలం దక్షిణ ఆసియా ఉపఖండంలోనే కనిపిస్తుంది. బ్రాహ్మణీయ హిందూమతం కులాన్ని పటిష్టపరచి పూర్తి స్థాయిలో ఆచరణలోకి తీసుకొచ్చింది. ముస్లిం దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోనూ బౌద్ధ దేశాలైన శ్రీలంక, జపాన్‌లలోనూ కులవ్యవస్థ కనిపిస్తుంది. అంటరానితనం మూలానికి సంబంధించి అనేక సిద్ధాంతాలున్నాయి. వెలివేతలు, మనుధర్మ శాస్త్రాలు మొదలుకుని జాతి సిద్ధాంతం, చేసే వృత్తిపై ఆధారపడిన సిద్ధాంతం ఇలా రకరకాలుగా వున్నాయి. ఇవన్నీ ఒక సంక్లిష్టమైన విధానాన్ని సునాయాసంగా వివరించేందుకు ప్రయత్నించాయి.

కుల వ్యవస్థ మూలాలపై అటు యురోపియన్లు, ఇటు అగ్రవర్ణ హిందువులు అనేక అధ్యయనాలు చేశారు. అయితే యురోపియన్లు కులవ్యవస్థకు వెలుపల వున్న వాళ్లు కనుక వాళ్లు ఈ సామాజిక దృక్పథంతో నిమిత్తంలేకుండా అధ్యయనం చేశారు. అగ్రవర్ణ హిందువులు కుల వ్యవస్థలో అంతర్భాగమైనవాళ్లు కాబట్టి ఒక విధమైన పక్షపాత ధోరణితో అధ్యయనం చేశారు. ఇలాంటి ప్రతిబంధకాల వల్ల అంటరానితనం అసలు రూపాన్ని అర్థం చేసుకోవడం సాధ్యపడదు. అయితే దళితులు, బ్రాహ్మణేతరులు తమ సొంత వాదాలను రూపొందించుకుని కుల నిర్మూలనకు, కుల దోపిడీని అంతం చేసేందుకు వాటిని సాధనాలుగా చేసుకున్నారు.

కుల వ్యవస్థను చట్టబద్ధం చేసేందుకు ఈ సిద్ధాంతాలు రెండురకాలుగా ఉపయోగపడ్డాయి. మొదటి రకం సిద్ధాంతం సాంప్రదాయ మతాన్ని ప్రాతిపదికగా

చేసుకుంది. దాన్ని ప్రధానంగా బ్రాహ్మణులే సృష్టించారు. మనువు చెప్పిన న్యాయ సూత్రాలు, ఋగ్వేద మంత్రాలు మొదలుకుని పురాణ గాథల టీకా టిప్పణులు, రామాయణ మహాభారతాల వరకూ అనేక రూపాల్లో ఆ సిద్ధాంతం వ్యక్తం చేయబడింది. ఆ శాస్త్రాలు, స్మృతులు, పవిత్ర గ్రంథాలన్నీ సాధికారమైనవంటూ వాళ్లు చేసే వాదనలోనే వారి అసలు ఉద్దేశం బయటపడుతోంది. పందొమ్మిదవ, ఇరవైయ్యవ శతాబ్దాలకు చెందిన రాజా రామమోహన్ రాయ్, అగార్కర్, గాంధీ వంటి అగ్రవర్ణ సంఘ సంస్కర్తలు జాతి, వర్ణ వ్యవస్థలను మార్చేందుకు లేదా రద్దు చేసేందుకు ఆ పవిత్ర గ్రంథాల ప్రాతిపదికతతోనే వాదనలు చేశారు. అయితే జ్యోతిబా ఫూలే, పెరియార్ ఇ.వి. రామస్వామి నాయకర్, డా.బి.ఆర్. అంబేద్కర్ వంటి సామాజిక విప్లవకారులు మాత్రం హిందూ పవిత్ర గ్రంథాల ప్రాతిపదితకనే ప్రశ్నిస్తూ సాంప్రదాయవాదులను ఎదిరించారు. కుల వ్యవస్థను కాపాడేందుకే అవి సృష్టించ బడ్డాయని వాదించారు. అవి అహేతుకమైనవనీ, దోపిడీకి కొమ్ముకాసేవనీ ప్రకటించారు.

ఆర్యుల జాతి సిద్ధాంతం మూలాలు యురోపియన్ ఓరియంటలిస్టుల రచనల్లో వున్నాయి. వాటిని బ్రిటీష్ పాలకులు జనాభా లెక్కల నివేదికలద్వారా, కులాలపై జరిపిన ప్రాదేశిక అధ్యయనాలద్వారా ప్రచారంలోకి తెచ్చారు. తొలినాటి బ్రాహ్మణులు తాము తెల్ల తోలు విదేశీ విజేతలతో సమానమైన వారమని, నల్లతోలు దిగువ కులాల వారికంటే ఎంతో ఉన్నతులమని నిరూపించుకునేందుకు వాటినే సాధనాలుగా చేసుకున్నారు. అయితే ఈ సిద్ధాంతాన్ని జ్యోతిబా ఫూలే, డా. బి.ఆర్. అంబేద్కర్‌లు ఆ తదనంతరపు తీవ్రవాద భావాలు కలవారు సవాలు చేశారు. ఆర్య – ఆర్యేతర జాతుల సిద్ధాంతాన్ని అంబేద్కర్ తిరస్కరించారు. వర్ణ వ్యవస్థ పరిధిలోని శూద్రులు, అతి శూద్రులు లేదా సంఘ బహిష్కృతులు వంటి దిగువ కులాలకు చెందిన అత్యధిక జనాభా అంతా ఆర్యేతరులు, మూలవాసులు అని ఆ సిద్ధాంత కర్తలు అంగీకరిస్తారు. అలాగే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఇండో యురోపియన్ (ఆర్య, వైదిక) విజేతల వంశానికి చెందిన వాళ్లని ఒప్పుకుంటారు. అయితే బ్రాహ్మణులు చెప్పుకునేదానికి ప్రతికూలమైన అర్థాన్ని ఈ సిద్ధాంతం సూచిస్తుందని వీరు వాదిస్తారు. నూతన భారతదేశానికి అవసరమైన విలువలను, జాతీయ సమైక్యతను రూపుదిద్దింది శూద్రులే అనే అర్థం వస్తుందంటారు.

ఇంతకుముందే చెప్పుకున్నట్టు కుల వ్యవస్థ అనేది దక్షిణాసియా ఉపఖండానికే పరిమితమైన నిర్దిష్ట సామాజిక వ్యవస్థ. ఈ ఒక్క వాస్తవమే కులవ్యవస్థపై ఇతర వ్యాఖ్యానాలన్నీ ఎంత అసంబద్ధమైనవో చాటి చెబుతుంది. అదేవిధంగా జాతుల

సిద్ధాంతాలు – మొదట్లో ఆర్థిక శ్రమ విభజనలోంచే కులాలు ఏర్పడ్డాయని సులువుగా తేల్చేసే ఆర్య విజేతలు లేదా సిద్ధాంతాలు మరి ఇది కేవలం దక్షిణాసియాలోనే ఎందుకు జరిగింది, మిగతా ప్రపంచంలో ఎందుకు జరగలేదు అని అడిగితే మాత్రం సమాధానం చెప్పలేరు. విజయాలు, ఆర్థిక మిగులు పెరగడం, శ్రమ విభజన ఎక్కువవడం, మొదలైనవి కేవలం దక్షిణాసియాకే పరిమితం కాదు– దాదాపు అన్ని ప్రాంతాలలో వున్నవే. పైగా వైదిక ఆర్యులు, ఇండో యురోపియన్లు కనీసం మొదట్లోనైనా పుట్టుకతో లేదా జాతిపరంగానో విభజనను కోరిన దాఖలాలు లేవు. కాబట్టి కేవలం ఇక్కడ మాత్రమే కులవ్యవస్థ ఎలా ఆవిర్భవించింది అనేది ఒక చిక్కు ప్రశ్న.

మిగులు అనేది ఏర్పడకముందే, ఆర్యుల వలస కంటే కూడా ముందే ఈ ఉపఖండంలో వున్న కొన్ని సామాజిక సాంస్కృతిక లక్షణాలు ఒక ప్రత్యేక దిశలో కొత్త సామాజిక పద్ధతులు ఏర్పడేందుకు దోహదం చేశాయని ఇటీవలి అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ ఉపఖండమంతటా ఆదివాసీ సామాజిక సమూహాల మధ్య (సమానత్వంతో కూడిన ఆదివాసీ బృందాల మధ్య) పరస్పర వ్యవహారానికి సంబంధించి ఒక ప్రత్యేక విధానం వుండేది అంటాడు మోర్టన్ క్లాస్. వ్యవసాయ మిగులు పెరిగినాకొద్దీ ఆర్థిక అసమానత ఎక్కువై ఒక విధమైన మార్పునకు అది దారితీసింది. దరిమిలా ప్రతి ఆదివాసీ సమూహంలో హెచ్చుతగ్గుల దొంతరలు ఏర్పడడం కంటే ఎక్కువగా – మిగులును పంచుకునే క్రమంలో విభిన్న ఆదివాసీ సమూహాలు ప్రవేశించి తమంతట తామే జాతులుగా మారిపోయాయి. వారిలో కొందరు సొంత భూములున్న వ్యవసాయదార్లుగా, మరికొందరు వివిధ సేవలను, శ్రమను అందించే సమూహాలుగా ఏర్పడ్డారు. ఈ సిద్ధాంతాన్ని పురావస్తు సాక్ష్యాధారాలు కూడా బలపరుస్తున్నాయి. ఆ బృందాలు, ఆదివాసీ జనాలే జాతులుగా ఏర్పడ్డాయి. క్రమేణా హెచ్చు తగ్గుల దొంతరలతో కూడిన వ్యవస్థ చోటుచేసుకుంది. దాంతో దోపిడీ సంబంధాలు, పెత్తందారీ తనం, సిద్ధాంతపరమైన భావనలు, శుచి– మైలకు సంబంధించిన ఆచారాలు ఏర్పడ్డాయి.

మైలకు సంబంధించిన మూల అంటరానితన సిద్ధాంతాలు ద్రావిడులకే ప్రత్యేకించినవనేది తిరుగులేని వాస్తవం.[12] పరిమిత సమూహాలు ఏర్పడే ధోరణి, శుచి–మైలకు సంబంధించిన హెచ్చుతగ్గులు ఈ ఉపఖండంలోని అతి ప్రాచీనుల్లో కనిపిస్తుంది. ఇందుకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన ఉదాహరణలు సంఘ

---

12. ఈశాన్య భారతదేశంలోని ఖాసీలు దీనికి అవశేషాలుగా నేటికీ కనిపిస్తారు. హోలు, సంతాల్‌లు కూడా పితృస్వామిక వ్యవస్థను అనుసరిస్తున్నారు అయితే ఇది వారికి పొరుగున వున్న హిందువుల సాంగత్యం వల్ల అబ్బివుండవచ్చు. చూ. ఫచ్స్ 1992, దాస్ 1987–89.

సాహిత్యంలో గమనించవచ్చు. అప్పటికి ఆర్యుల ప్రభావం అతి స్వల్పం. ఇందులో రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. మొదటిది తమిళ సామాజిక దృక్పథంలో బాగా పాతుకుపోయివున్న ఐదు తినాయీల సిద్ధాంతం. అంటే విభిన్న రకాల వాతావరణాలకు అలవాటుపడ్డ జనం. వారికి నేలతో వివిధ ఉత్పాదక సంబంధాలుంటాయి. వీటిని క్రీ.శ. 3వ శతాబ్దంలోనే ఈ కిందివిధంగా అభివర్ణించారు:

(1) ... భూమిని దున్నే ఆదివాసీలు (ఉలువర్) నీటి సౌకర్యం వున్న సారవంతమైన నేలలను అంటిపెట్టుకుని గ్రామాలలో నివసించేవారు.

(2) కొండ ప్రాంతాలలో నివసించే ఆటవికులు తాయెత్తుల్లాంటివి తయారు చేస్తూ, జోస్యాలు చెబుతుండేవారు. వీళ్లు అప్పుడప్పుడు పనాయిలో పనిచేసేందుకు అడవినుంచి బయటికి వచ్చేవారు.

(3) పశుపాలకులు. వీళ్లని అయర్ (గొల్లలు), కోవ్లర్ (గొర్రెల కాపర్లు) అని కూడా అనేవారు.

(4) చేపలు పట్టే జనం.

(5) బీడు, మైదాన ప్రాతాలలో నివసించే జనం. వీళ్లని ఎయినార్, మారవర్, వేడార్‌లు అనేవారు. వీళ్లు ఇటు మైదాన ప్రాంతాల్లోనూ అటు అడవుల్లోనూ వేటాడుతుండేవారు.

సామాజిక దొంతరలో అట్టడుగున వున్నట్టు పరిగణింపబడే వివిధ వృత్తులను (మౌలిక కులాలు) అనుసరించే ఈ విలక్షణమైన సమూహాలలో – వారిలో వారికే హద్దులు వుండటం ఆశ్చర్యమనిపిస్తుంది. వీళ్లలో చాలా సమూహాలను మైల పరిచే సమూహాలుగా పరిగణించేవారు. బ్రాహ్మణులు (ఆర్యులు/ఉత్తరాదికి చెందినవారు) ఇక్కడి ద్రావిడ మూలవాసులలోని శుచి – మైల తాలూకు భావనలను పోగుచేసి వాటిని మరింత పటిష్ట పరిచి తమ ఆధిక్యతను నిలబెట్టుకునేందుకు వాడుకున్నారు. పశుపోషణ తాలూకు సంచార దశనుంచి స్థిరమైన వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థకు మారిన తరువాత ఆర్య సమాజంలో క్రమేణా శ్రమ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది.

శుచి – మైల (ప్యూరిటీ–పొల్యూషన్) హెచ్చుతగ్గుల మూలానికీ పవిత్రశక్తి (సేక్రెడ్ పవర్) భావనకీ మధ్య సహజంగానే సంబంధాన్ని అంటగట్టారు. అథములుగా పరిగణించబడే వారంతా ప్రమాదకారులన్న ముద్రను ఎదుర్కోవలసి వచ్చింది. వాళ్లు చేసే వృత్తులను బట్టి పవిత్రశక్తితో ఏర్పడే ఘర్షణ వల్ల ఈ భావన ఏర్పడింది. చర్మకారుడు ఏ ఆవు తోలుతోనైతే పనిచేస్తాడో ఆ ఆవు ఆత్మ అతడిని ఆవహిస్తుందట. స్మశానంలో కాటికాపరి చచ్చిపోయిన వాళ్ల ఆత్మలతో సంఘర్షించవలసి వుంటుంది. రజక స్త్రీ

మైల (ముఖ్యంగా బహిష్టు మైల) తాలూకు ప్రభావాన్ని ఎదుర్కొంటుంది. పుల్సిట్టి మహిళ (పూనకం వచ్చే మహిళ) మీద దుష్ట శక్తులు ఆవహించి వుంటాయి. వృత్తిరీత్యా డప్పులు వాయించేవాళ్లను, వాయిద్యగాళ్లను ప్రమాదకరమైన వాళ్లుగా పరిగణిస్తారు. ఎందుకంటే వాళ్లు వాయించే డప్పుల్లో, ఉపయోగించే వాయిద్యాల్లో దైవిక శక్తులుంటాయనీ, యుద్ధ సమయాల్లో వాటిని మోగించేటప్పుడు అవి దుష్ట శక్తుల్ని నియంత్రిస్తుంటాయని ఓ విశ్వాసం.

ఈవిధంగా ఉపఖండంలోని అత్యధిక సంఖ్యాకులు, మూలవాసులైన ప్రాచీన ద్రావిడులు పర్యావరణానికీ ఆయా సమూహాలకీ మధ్య సాంస్కృతిక భావనలు ఏర్పరుస్తూ ఒకరకమైన కుల వ్యవస్థను సృష్టించారు. వాళ్లు ఇతర అనేక ఆదివాసీ సమాజాల్లో లాగే ప్రకృతిలో ఒక దివ్యశక్తి వుందనీ, అది అత్యంత ప్రమాదకరమైనదనీ భావించేవారు. ఆ దివ్య శక్తులకూ కొన్ని రకాల వృత్తులకూ, కార్యకలాపాలకూ మధ్య సంబంధం అంటగట్టడమనేది ఎక్కువగా జరిగింది. అయితే ఎప్పుడైతే మిగులు అనేది పెరుగుతూపోయిందో అప్పటినుంచీ యోధుల (వీరుల) ప్రాబల్యం కూడా బాగా పెరిగింది. పవిత్ర శక్తులతో నాటి వరకూ వుండిన సంబంధాల్లో మార్పు వచ్చింది. మైలపరిచేవి, అశుభ్రమైనవి, దిగువ స్థాయికి చెందినవే ప్రమాదకరమైనవి అన్న భావన చోటుచేసుకుంది. ఈ మార్పు ప్రధానంగా సింధూ నాగరికతకు చెందిన ద్రావిడులలోనే మొదలయింది. కానీ మూలవాసుల సంస్కృతి మీద ఆర్యుల దండయాత్ర తదనంతరమే దాని ప్రభావం పెరిగింది.[13] శుచి – మైలకు సంబంధించిన భావనలను పటిష్టపరుస్తూ క్రమేణా బ్రాహ్మణ వర్గం ఆవిర్భవించిన తరువాత వాళ్లు తమను తాము అగ్రస్థానంలో ప్రతిష్టించుకుని హెచ్చు తగ్గులతో కూడిన కుల వ్యవస్థను క్రమబద్ధీకరించారు. ఆరవ – ఎనిమిదవ శతాబ్దాల మధ్య కాలంలో మధ్యయుగపు భూస్వామ్య సమాజాల్లో వర్ణాశ్రమ ధర్మం ఒక బలమైన సామాజిక వ్యవస్థగా పరాకాష్టకు చేరుకుంది. నాలుగవ – ఆరవ శతాబ్దాల మధ్యకాలంలో అంటరానితనం ప్రబలంగా మారింది. అయితే దాని మూలాలు మాత్రం కులం ప్రారంభ దశనుంచే కనిపిస్తాయి.

రెండోది, మనకు డా. అంబేడ్కర్ ప్రతిపాదించిన అణగారిన ప్రజల సిద్ధాంతం (బ్రోకెన్ మెన్ థియరీ) వుంది. అలాగే సంఘ బహిష్కృతుల నమూనాలున్నాయి. అవి ప్రధానంగా దళితుల పౌరాణిక గాథల్లో కనిపిస్తాయి. జాతి మీద, వృత్తి మీద

---

13. దేశీయ సంస్కృతి మీద దాడి చేయడం వారి ప్రధాన లక్ష్యం. కాలక్రమేణా అసలు దేశవాసులంతా తమ సొంత గుర్తింపును కోల్పోయి పరాధీనులై కొత్త వ్యవస్థలో అంతర్భాగంగా మారిపోయారు. వివరాలకు చూ. సాంబశివరావు, 1920–21, పే. 150–6.

ఆధారపడిన సిద్ధాంతాలని పూర్తిగా తిరస్కరిస్తూ డా. అంబేద్కర్ అంటరాని కులాలు ఏర్పడడానికి రెండు కారణాలున్నాయని అంటారు. ఒకటి బ్రాహ్మణ వర్గం అణగారిన ప్రజలను (అంటరానివాళ్లని) బౌద్ధ మతస్తులుగా పరిగణించి తీవ్రంగా ద్వేషించడం. రెండు, గోమాంస భక్షణని ఇతరులంతా మానేసినప్పటికీ అణగారిన ప్రజలు మానేయకపోవడం.

అంటరానితనం మూలానికి సంబంధించి ఇద్దరు మానవ శాస్త్రవేత్తలు రెండు విభిన్న సిద్ధాంతాలను ప్రతిపాదించారు. బాహ్యకులాలనేవి కొంతవరకు జాతిపరంగా, మరికొంతమేరకు మతపరంగా – ఆమాటకొస్తే సామాజిక ఆచారంగా ఏర్పడ్డాయంటాడు హట్టన్. జాతి సిద్ధాంతాన్ని తిరస్కరిస్తూ అంటరానితనానికి మూలాలు సాంప్రదాయికతలోనే వున్నాయని భావిస్తాడాయన. మరో మానవ శాస్త్రవేత్త ఫ్యూరర్ హైమన్ డార్ఫ్ అంటరానితనం అనేది పట్టణీకరణ పెరగడం వల్ల ఏర్పడిందనీ; అశుభ్రత, సాంప్రదాయికంగా అపవిత్రంగా భావించబడే వృత్తుల ఫలితమే అంటరానితనమనీ అంటాడు.

బ్రాహ్మణేతర మరాఠా మేధావి వి.ఆర్. షిండే అంటరానితనం అంకురించడానికి అనేక కారణాలున్నాయంటారు. అయితే ఈ వాదన పైన ఉదాహరించిన సిద్ధాంతాల సమ్మేళనమని చెప్పవచ్చు. నీచమైన వృత్తులు చేసేవాళ్లు, యుద్ధంలో ఓడిపోయిన వాళ్లు, బౌద్ధ మతాన్ని అవలంభించేవాళ్లు, నాస్తికులు (అంటే ప్రధానంగా బ్రాహ్మణేతర దేవుళ్లని ఆరాధించేవాళ్లు), ఆదివాసీల్లా జీవించేవాళ్లు, ప్రతిలోమ వివాహాల ఫలితంగా పుట్టినవాళ్లు అంటరానివాళ్లుగా పరిగణింపబడ్డారు.

కులం మూలాలను అర్థం చేసుకోవడంలో ఆంధ్రప్రాంతానికి తనదైన సాంప్రదాయిక పద్ధతి వుంది. అంటరానివాళ్ల మూలాలకి సంబంధించి ఇరవైయవ శతాబ్దారంభంలో సాంబశివరావు చక్కని స్ఫూర్తిదాయకమైన వివరణ యిచ్చారు. ఆది ద్రావిడులే ఈ దేశపు అసలు మూలవాసులు, వాళ్లే దళితులుగా పరిగణింపబడ్డారు అనే భావన ఆధారంగా ఆయన వాదన సాగుతుంది. ఆకాలంలో లిఖిత సాంప్రదాయం లేదు. ఉత్తరాది నుంచి దండెత్తి వచ్చిన ఆర్యులు ద్రావిడులపై తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకున్నారు. స్థానికుల గొప్పతనాన్ని ఏమాత్రం గుర్తించకపోవడమే కాకుండా వారిని ఆర్యులు విద్వేషంతో తీవ్రంగా కించపరిచారు. ఆ తదనంతరపు కాలంలో అట్టి భావజాలాన్ని లిఖితబద్ధం చేశారు. ప్రత్యర్థిపై విజయాన్ని సాధించేందుకు రెండు మార్గలుంటాయి అంటారాయన. ఒకటి– యుద్ధంలోగెలవడం. కానీ ఈ గెలుపు వల్ల పూర్తి ఫలితాలు సమకూరవు. రెండు– పాలితుల మీద పాలకుల సంస్కృతిని రుద్దడం.

ఇది ఎంతో సమర్థవంతమైనది. ఇందులో పాలితులు క్రమేణా తమ సంస్కృతిని, సొంత గుర్తింపును కోల్పోయి... కొత్త సంస్కృతిలో కలగలిసిపోతారు. ఆర్యులు ఆది ద్రావిడుల సంస్కృతిని ధ్వంసం చేయడంతోపాటుగా వారిమీద తమ సంస్కృతిని రుద్దారు. తద్వారా తమ సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పుకున్నారు. ఆ క్రమంలో యుద్ధంలో ఓడిపోయినవాళ్లు విధిగా అథమ స్థాయి కూలీలుగా, గ్రామ కాపలాదార్లుగా, ఇంటి నౌకర్లుగా, నీచమైన వృత్తులు చేసేవారిగా ... ఇలా రకరకాలుగా స్థిరపడవలసిన ఆగత్యం ఏర్పడింది. అలాంటి వారిలో కొందరిని ఆర్యులు తమ సొంత సామాజిక వ్యవస్థలో చేర్చుకుని మిగతా మూలవాసులనందరినీ తీవ్ర అణచివేతకు గురిచేశారు.

తమదైన ప్రపంచం : దక్షిణాది అంటరానివాళ్లు

దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణులు – బ్రాహ్మణేతరులు అనే సమాజ విభజన ద్వారా కులాల హెచ్చు తగ్గులు నిర్ణయించబడ్డాయి. ముఖ్యంగా అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలలో మూడే సామాజిక విభజనలుండేవి. అవి – బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు, అంటరానివాళ్లు. మరోవిధంగా చెప్పాలంటే మొత్తం సమాజమంతా మూడు సామాజిక బృందాలుగా... అధికారం వున్న వాళ్లు, అధికారం స్వల్పంగా వున్నవాళ్లు, ఏ అధికారాలూ లేనివాళ్లుగా విడిపోయివుండేది.[14]

కాలక్రమేణా చతుర్వర్ణ వ్యవస్థను అనుసరిస్తూ అనేక ఉపకులాలు (ఉపజాతులు, లేదా క్లాస్ ప్రవచించినట్టు వైవాహిక సమూహాలు) ఏర్పడ్డాయి. ఇందుకు బహుశా కొత్త వృత్తులు ఏర్పడడం, భౌగోళికంగా విస్తరించడం కారణం కావచ్చు. పందొమ్మిదో శతాబ్దంలో ఆంధ్ర గ్రామీణ సమాజంలో సాంప్రదాయికంగా హెచ్చు తగ్గులతో కూడిన అనేక కులాలు వుండేవి. ప్రతి కులం సొంత వారసత్వ లక్షణాలు పుణికిపుచ్చుకుని నిర్ధారిత సామాజిక హోదాలో కొనసాగేది.[15]

వలసవాద కాలంలోనూ, అంతకు ముందరి కాలంలోనూ బ్రాహ్మణులే సామాజిక దొంతరలో అగ్రస్థానంలో వున్నారు. విద్య, అధికారిక హోదాల మీద గుత్తాధిపత్యాన్ని నెలకొల్పుకున్నారు. వాళ్లకు భూసంపద ముఖ్యంగా పాలకులు రాసిచ్చిన ఇనామ్ భూములు వుండేవి. వాటిని అగ్రహారాలు, శోత్రియణాలు అనేవారు. ఆ ఇనామ్

---

14. ఈ సిద్ధాంతానికి విరుద్ధంగా లక్ష్మణ్ణ ఆంధ్ర సమాజాన్ని స్థూలంగా ఏడు సమూహాలుగా అంటే బ్రాహ్మణులు, వైశ్యులు, చేతివృత్తుల కులాలవారు, అగ్రవర్ణాలవారు, సేవక కులాలవారు, గిరిజనులుగా విభజించారు. చూ. లక్ష్మణ్ణ 1973, అధ్యాయం 1.

15. ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలపై సెలక్ట్ కమిటీ రూపొందించిన ఐదవ నివేదిక, 1918, పే. 85.

భూములలో అమరం, కట్టుబడి వంటి అనేక రకాలున్నప్పటికీ అందరికంటే అత్యధికంగా లబ్ధిపొందింది మాత్రం కచ్చితంగా బ్రాహ్మణులే అని చెప్పవచ్చు.

ఇరవైయ్యవ శతాబ్దం ప్రారంభం వరకూ కూడా... అంటే మద్రాస్ ప్రెసిడెన్సీలో బ్రాహ్మణేతరులు ఎదురుతిరిగే నాటివరకూ అన్ని ప్రభుత్వ శాఖల్లో బ్రాహ్మణులదే పెత్తనంగా వుండేది.[16]

వర్ణ వ్యవస్థ తాలూకు సాంప్రదాయిక హెచ్చుతగ్గుల కుల దొంతరలో కోమట్లు లేదా శెట్టీల (వైశ్యుల) స్థానం మూడోది అయినప్పటికీ ఇక్కడ క్షత్రియులు లేకపోవడం వల్ల బ్రాహ్మణేతర సమాజంలో వారు బ్రాహ్మణుల తదనంతరపు స్థాయిలో వున్నారు. కోమట్లు ప్రధానంగా వ్యాపార వర్గమైనప్పటికీ వారిలో కొందరికి భూములుండేవి. రైతు కూలీల సహకారంతో వ్యవసాయం కూడా చేసేవారు. పందొమ్మిదో శతాబ్దం చివరి నాటికి వాళ్లు తమది ద్విజుల స్థాయి (రెండు సార్లు జన్మించిన వారు) అని చెప్పుకోవడం మొదలు పెట్టారు. ఇందుకు ఆత్మూరి లక్ష్మీనారాయణ అనే కోమటి ఉదంతాన్ని ఉదాహరణగా పేర్కొనవచ్చు. తనను వేదాధ్యయనానికి, వైదిక క్రతువుల నిర్వహణకు అనుమతించని బ్రాహ్మణ సాంప్రదాయం మీద ఆయన తిరుగబడ్డాడు. చివరికి యజ్ఞాలు చేసి సోమయాజి అన్న హోదాను కూడా సంపాదించుకున్నాడు.[17] కోమటివాళ్లు ప్రధానంగా వ్యాపారస్థులు కనుక వ్యాపార అవకాశాలను వెతుక్కుంటూ వాళ్లు మద్రాసుకు, ఇతర పట్టణాలకు వలస వెళ్లారు.

కుల దొంతరలో కోమట్ల తరువాత స్థానం శూద్రులది.[18] వీళ్లు తిరిగి అనేక కులాలుగా విభజించబడ్డారు. రెడ్డి, కమ్మ, తెలగ/కాపు/నాయుడు మొదలైన కులాలు. వాళ్లంతా రైతులు. కాగా బలిజ, కుమ్మరి, కమ్మరి, కంసాలి, సాలి, చాకలి, మంగలి కులాలకు చెందిన వాళ్లంతా చేతివృత్తులు చేసేవాళ్లు.[19] భూమి మీద, ఉత్పత్తి

---

16. మద్రాస్ ప్రెసిడెన్సీలో 1881, 1917 సంవత్సరాల్లో ప్రభుత్వ సర్వీసులోని కులాల పరిస్థితి ఎలా వుండేదో అనుబంధ పట్టిక - 2 లో చూడవచ్చు.

17. సోమయాజి అసలు అర్థం త్యాగి. అతని కార్యకలాపాలు, జీవిత చిత్రణ కోసం చూ. సుబ్బరాయ గుప్త 1922.

18. చతుర్వర్ణాలలో శూద్రులదే అత్యధిక సంఖ్యాక వర్గం. బ్రాహ్మణేతరులు, వైశ్యేతరులు, అంటరాని వాళ్లుకాని వారంతా శూద్రులకిందకే వస్తారు. శూద్రులను స్థూలంగా తిరిగి రెండు వర్గాలుగా విభజించవచ్చు. ఒకటి - రెడ్డి, కమ్మ, కాపు, నాయుడు కులాలతో కూడిన వర్గం. రెండు - కుమ్మరి, కమ్మరి, కంసాలి, సాలి, చాకలి, మంగలి తదితర వృత్తి కులాలతో కూడిన వర్గం. ఇందులో మొదటి వర్గం ఆర్థికంగా, రాజకీయంగా బాగా పలుకుబడి వున్న వర్గం. సమాజంలోని మిగతా కులాలపై వీరు ఆధిపత్యం చెలాయించగలిగే స్థితిలో వుంటారు.

19. దక్షిణ భారతదేశంలోని వివిధ సమూహాల వివరాల కోసం, వారి చారిత్రక మూలాల కోసం చూ. థర్స్టన్ అండ్ రంగాచారి, 1909.

మీద పట్టు వుండటం వల్ల రైతు కులాలవాళ్లు వలసవాద కాలానికి ముందు కూడా సామాజిక, రాజకీయాధికారాలను అనుభవించేవారు. స్థానిక స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ అధికార్లను ప్రభావితం చేసేవారు. లౌక్యంతో, పలుకుబడితో లేదా లంచాలతో వాళ్లు భూ సంస్కరణల చట్టాన్ని నిర్వీర్యం చేయగలిగారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అధికారాలను, తమ గుప్పిట్లో పెట్టుకోగలిగారు. చేతివృత్తుల కులాలకు చెందిన వారిలో కూడా కొందరికి భూములుండేవి. కానీ అవి జీవనోపాధికి సైతం తోడ్పడనంత స్వల్పమైనవి. పారిశ్రామికీకరణ వల్ల సాంప్రదాయిక చేతివృత్తులు క్షీణించిపోవడంతో ఎంతో మంది చేతి వృత్తుల వారు గ్రామీణ పేదలుగా మారిపోయారు. తమ వృత్తుల ద్వారా సరైన ఆదాయం లభించకపోవడంతో వాళ్లు వ్యవసాయ కూలీలుగా పనిచేయడం మొదలుపెట్టారు. వ్యవసాయ కార్మికులలో అంటరానివాళ్ల తరువాత అధిక సంఖ్యాకులు ఈ కులాలవాళ్లే.

శూద్రుల తరవాతి స్థానంలో అంటరానివాళ్లు, ఆదివాసీలు వస్తారు. అంటే సామాజిక దొంతరలో వీళ్లది అట్టడుగు స్థాయి. తెలుగు సాహిత్యంలో వీరి గురించిన ప్రస్తావనలను బట్టి మధ్యయుగాల కాలంలో వీరిని గోసాంగులు అనేవారనీ, లెంక అనే పదంతో వారి హోదాను సూచించేవారనీ తెలుస్తోంది. లెంక అంటే భూమి దున్నే జీతగాడు లేదా బానిస కూలీ అని అర్థం.[20] అంటరానివాళ్లని పంచములు అని కూడా సంబోధించేవాళ్లు. పంచములు అంటే ఐదోకులానికి (వర్ణానికి) చెందినవాళ్లన్నమాట. అంటే అసలు చతుర్ వర్ణ (నాలుగు కులాల – బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర) వ్యవస్థలో వీరికి చోటేలేదు. అయినప్పటికీ ఆంధ్ర ప్రాంతంలో ఆర్థిక రంగంలో వీరు అసమాన పాత్ర నిర్వహించారు. ఈనాటికీ కూడా వ్యవసాయ కూలీలలో వీరి సంఖ్యే ఎక్కువ. ఒక్కమాటలో చెప్పాలంటే మన సమాజంలో వీళ్లదే అసలు సిసలైన ఉత్పత్తి వర్గం. వీళ్లు లేకుండా ఇతర కులాల వాళ్లు మనుగడ సాగించలేరు.

ఇంతవరకు పేర్కొన్న ఈ కుల దొంతర హిందువుల మనసుల్లో నిక్షిప్తమై వుంటుంది. దానిని రకరకాల నియమాలు, నిషేధాల ద్వారా ఆచరిస్తూ పటిష్టపరుస్తుంటారు. తద్వారా అంటరానివాళ్లకీ, సమాజంలోని ఇతర వర్గాలవాళ్లకీ మధ్య సంబంధాలు నియంత్రించబడుతుంటాయి. కుల దొంతరలో ఎంత కింది స్థాయిలో వుంటే అంత ఎక్కువ వినయవిధేయతలను ప్రదర్శించాలి. అలాగే ఎంత ఎక్కువ స్థాయిలో వుంటే ఆ కులాల వాళ్లు అంత ధీమాగా, శక్తివంతంగా జీవనం సాగిస్తారు.

---

20. సి.పి.బ్రౌన్ నిఘంటువు ప్రకారం లెంక అంటే సేవకుడు అని అర్థం.

గ్రామీణ ప్రాంతాలలో అంటరానివాళ్లని వేరేగా వుంచి బానిసల్లాగా చూస్తారు. బ్రిటీష్ ఇండియా కంటే ముందరి కాలంలో గ్రామం కోసం, గ్రామాల్లో పలుకుబడి వర్గాల కోసం పాటుబడే సాధారణ కూలీల్లో ఈ పంచముల సంఖ్యే అధికంగా వుండేది. అంటరానివాళ్ల అథమ స్థాయి అనేది వాళ్లు ఊరిబయట నివసించడంలో, అశుభ్రమైన వృత్తులు నిర్వహించడంలో మాత్రమే లేదు. అసలు కుల శ్రమ విభజనలోనే వాళ్లను తీవ్రంగా దోపిడీకి గురయ్యేట్టు చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అంటరాని వాళ్లలో మొత్తం 59 కులాలు వున్నాయి.[21] 1991 జనాభా లెక్కల ప్రకారం వారిలో మాదిగలది అతి పెద్ద వర్గం. వాళ్లు మొత్తం దళితులలో 43.5 శాతం వరకు వున్నారు. ఆ తరువాత స్థానాల్లో 36.6 శాతంతో మాలలు, 10.6 శాతంతో ఆది ఆంధ్రులు వున్నారు. ఆంధ్రలోని దళిత జనాభాలో ప్రధానమైన ఈ మూడు ఉపకులాలవాళ్లు 90.8 శాతం వరకూ వుంటారు. అంటే మిగతా 56 కులాలకు చెందిన వాళ్ల సంఖ్య కేవలం 9.2 శాతం మాత్రమే. ఆంధ్రప్రాంతంలో మాలలు అధిక సంఖ్యలో వుంటే ... తెలంగాణా ప్రాంతంలో మాదిగలు అధిక సంఖ్యలో వున్నారు. రాయలసీమలో మాత్రం మాల మాదిగల జనాభా దాదాపు సరిసమానంగానే వుంది. హైదరాబాద్ సంస్థానంలో ఆది ఆంధ్రులు మొత్తం రాష్ట్రంలో వారి జనాభాతో పోలిస్తే దాదాపు 18 శాతం వరకు వుంటారు. సామాజిక, ఆర్థిక స్థాయి; కాలుష్య (మైల) భావనల స్థాయి, వారిలో వారికున్న మతపరమైన చీలికలు వంటి అంశాలను బట్టి సమాజంలో వారిని చూసే తీరులో హెచ్చుతగ్గులు కనిపిస్తాయి.

మాల అన్న పదం మైల (కాలుష్యం) నుంచి వచ్చింది. మాలలు తమిళనాడులోని పరయ, మహరాష్ట్రలోని మహర్‌ల వంటి వారు. జాతరల్లో (గ్రామీణ ఉత్సవాల్లో), గ్రామ సేవలలో మాలలు పాటుపడుతుంటారు. గ్రామ సేవకుడిని బారికి లేదా తలయారి/తళారి/తలమారి అని సంబోధిస్తారు. ఈ పనులతో పాటు మాలలు వీధులు

---

21. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతం (గత మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడేవారి ప్రాంతాలు), హైదరాబాద్ ప్రాంతం (గత నిజాం రాష్ట్రంలోని తెలుగు మాట్లాడేవారి ప్రాంతాలు) వున్నాయి. మొత్తం రాష్ట్రంలోని ఉపకులాల జాబితాను అనుబంధ పట్టిక - 3 లో చూడవచ్చు. 1931, 1961 సంవత్సరాల్లో మద్రాస్ ప్రెసిడెన్సీలలోని షెడ్యూల్డ్ కులాల జనాభాలో కాలం ప్రకారం పొందుపరచిన వివరాలు అనుబంధ పట్టిక - 4 లో వున్నాయి. 1971లో ప్రాంతంవారిగా షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) జనాభా వివరాలు అనుబంధ పట్టిక - 5 లో వున్నాయి.

ఊడ్వడం, పారిశుధ్యపనులు, బొందలు తవ్వడం వంటి ఇతర సాంప్రదాయక పనులు కూడా చేస్తుంటారు. పురాణగాథలను బట్టి హరిశ్చంద్ర చక్రవర్తి వీరబాహుడనే కాటికాపరికి కాటికాపలా హక్కును ప్రదానం చేశాడు.[22] తత్ఫలితంగా స్మశానాలన్నీ మాలలకే చెందాల్సివుంటుంది. సమాధి స్థలం నిమిత్తం వారికి శుల్కంచెల్లించాలి.[23] చనిపోయిన వ్యక్తి హోదాను బట్టి ఆ శుల్కం నిర్ణయించబడుతుంది. చావులు, ప్రసవాలు, పుష్పవతికావడం వంటి సందర్భాలలో మాలలు వార్తాహరులుగా కూడా పనిచేస్తారు.[24] అలాగే గ్రామ కాపలాదార్లుగా కూడా పనిచేస్తారు. ఊళ్లో చచ్చిపోయిన పశువుల కళేబరాలను తొలగించే పని కూడా వీళ్లదే.[25] వలసవాద కాలంలో వీళ్ల పనులు రెవెన్యూ విభాగానికి విస్తరించాయి. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులకు సరిహద్దు భూవివాదాలలో మార్గదర్శకులుగా, వార్తాహరులుగా సేవలు అందించారు. ఆ కాలంలో గ్రామీణ ప్రాంతాలలో మాలలు ఒక కొత్త పాలక వ్యవస్థగా సంఘటితమయ్యారు. తత్ఫలితంగా అశుభ్రమైన పనులు చేసే ఇతర అంటరాని వాళ్లతో పోలిస్తే మాలలకు ఒక కొత్త హోదా సంక్రమించిందని చెప్పవచ్చు.[26]

ప్రాచీన కాలంలో మాలలు స్వేచ్ఛగా సంచరించే ఒక ఆదివాసీ తెగకు చెందిన వాళ్లని, పెద్దపులుల మాదిరిగా పగలు పడుకుని రాత్రుళ్లు పనులు చేసుకునేవాళ్లని ముసలివాళ్లు, మతపెద్దలు చెబుతుంటారు. తమను రక్షించే ప్రభువు కోసం దాడులు, దోపిడీలు నిర్వహిస్తూ ఆ భూస్వాములనుంచి ప్రతిఫలం అందుకునేవారు. ఈ వృత్తికి

---

22. వీరబాహు ఒక కాటికాపరి. రాజా హరిశ్చంద్రుడి కాలానికి చెందిన వాడు. (ఈయననే సత్య హరిశ్చంద్రుడంటారు. సత్యానికి ప్రతీకగా ఈ పేరు నిలిచిపోయింది). వీరబాహువు తమ పూర్వీకుడని భావిస్తారు మాలలు. అయితే గొల్లలు (యాదవులు) కూడా అతడినే తమ పూర్వీకుడిగా చెప్పుకుంటారు. కానీ ఆ వాదనకు ఏ ఆధారాలు లేవంటారు సాంబశివరావు. 1920–21, పే.150–151; థర్స్టన్ అండ్ రంగాచారి 1909, సంపుటి4.

23. కోస్తా జిల్లాల్లో ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో చాకలి కులానికి చెందినవాళ్లు స్మశానాలను నిర్వహిస్తుంటారు. అరసబాలగ (శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సరిహద్దు గ్రామం) వంటి ప్రాంతాల్లో బొందలు తవ్వే పనిని మాలలు, సమాధి చేసే పనిని చాకలివాళ్లు నిర్వహిస్తుంటారు. కులాన్ని బట్టి వారి రేట్లు మారతాయి.

24. ఈ ప్రత్యేక విధిని ఆంధ్రలోని మరో అంటరాని కులమైన పైడిమాలలు నిర్వహిస్తారు.

25. చర్మకార వృత్తితో సంబంధం వున్నందువల్ల ఈ పనిని సాధారణంగా మాదిగలు చేస్తారు. వాళ్లు లేకపోతే మాలలు చేస్తారు.

26. ప్రస్తుత రెవెన్యూ, పాలనా వ్యవస్థరీత్యా ఈ వృత్తి అత్యంత అట్టడుగున వుంది. తలయారి (తలారి) అనే ఈ ఉద్యోగంలో ఎక్కువగా మాదిగలే నియమించబడుతుంటారు.

మూలాలు వున్నాయి. చాలామంది మాలల ఇంటిపేర్లు ఈటె, దప్పు వంటి యుద్ధ సంబంధమైనవిగా వుండటం ఈ అంశాన్ని ధృవీకరిస్తోంది. మొదట్లో భూస్వామ్య ప్రభువులు మాలల సేవలు ఉచితంగా పొందొచ్చుగానీ ఆ తదనంతరం ఇనాం భూములు (కౌలు లేని భూములు) వారికి కేటాయించడం ఆ భూముల మీద వచ్చే పంటను వారి సేవలకు ప్రతిఫలంగా ఇవ్వడం చేశారు. అలాంటి భూములకు శిస్తులుండేవి కావు. ఇనాం భూములు మొదట్లో విస్తారంగా కలిగివున్నప్పటికీ కాలక్రమేణా చాలా మంది మాలలు వాటిని ఇతర్లకు తాకట్టుపెట్టేశారు.

భూ తగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వం నెరిపే పని చేస్తున్నందువల్ల మాలలు తామే అసలైన భూమి పుత్రులమని భావిస్తారు. వారిలో భూపరిజ్ఞానం స్వతసిద్ధంగా వుంటుంది.[27] తూర్పు ఆంధ్రలోనూ, తెలంగాణాలోని కొన్ని ప్రాంతాలలోనూ మాలలు నేత పనిని తమ ప్రధాన వృత్తిగా అవలంభించడం కనిపిస్తుంది. సాధారణంగా వ్యవసాయ కార్మికులుగా పనిచేసేవారికి వేతనాలు ధాన్యం రూపంలో లభిస్తాయి. కాబట్టి కోస్తా ఆంధ్రలోవారి పరిస్థితి శాశ్వత బానిసల మాదిరిగా వుంటుంది. భూమిలేని వ్యవసాయ కూలీల లాగా భూస్వాముల భూముల్లో పని చేయాలి. ప్రతిఫలంగా డబ్బుకు బదులు ధాన్యాన్ని పొందాలి. ఈ వెట్టిచాకిరీలో పాలేరు, వెట్టి,[28] కంబారితనం, రైతరికం [29] మొదలైన వివిధ రూపాలుంటాయి.

అంటరానివాళ్లలో మాదిగలది ఎక్కువ బహిష్కరణకు గురైన వర్గం. తమిళ ప్రాంతాలలో చక్కిలియాల మాదిరిగా వుంటుంది వీరి స్థితి.[30] గొడ్డు చర్మాలు తీయడం, వాటిని సాఫు చేయడం, వాటితో రకరకాల వస్తువుల్ని తయారు చేయడం మాదిగల ప్రధాన వ్యాపకం. అలాగే అగ్రవర్ణ హిందువుల కోసం వారు కొన్ని విధులను

---

27. వై. లక్ష్మడు నెలకు 25 పైసల జీతంతో గ్రామ పోలీసు/తలయారిగా 70 సంవత్సరాలపాటు పనిచేశాడు. 1980లో అతను రిటైరైన తరువాత కూడా రెవెన్యూ అధికారులు అతని గ్రామానికి వచ్చినప్పుడు అతడిని పిలిపించుకుని భూవివరాలు అడిగేవారట. భూముల తాలూకు మూడు తరాల యజమానుల వివరాలను అతను అలోకగా నోటికి చెప్పేవాడట. అరసబలగ గ్రామానికి చెందిన వై.రాములు అనే దళిత ఉపాధ్యాయుడు ఈ సమాచారాన్ని తెలియజేశాడు. ఇంటర్వ్యూ జరిపిన తేది 14 డిసెంబర్ 1993.

28. వెట్టి లేదా వెట్టిచాకిరికి మూలం అప్పులే. పాత అప్పు తాలూకు వడ్డీని చెల్లించేందుకు భూస్వాముల పొలాల్లో తరాలతరబడిగా వెట్టి పని చేసేవారు. చేసిన పనికి కొద్దిపాటి వేతనం పొందుతూ కొందరు శాశ్వతంగా బానిస బతుకు బతకవలసి వచ్చేది.

29. కంబారితనం, రైతరికం రెండు పదాల అర్థం ఒకటే. కాకపోతే ఆయా ప్రాంతాలను బట్టి స్వల్ప తేడా వుండొచ్చు.

30. మాదిగలు సాంప్రదాయికంగా చర్మకారులు. ఉత్తర భారతదేశంలో చమర్లు, మహారాష్ట్రలో చంబార్లు వీరికి సమానులు.

నిర్వర్తించవలసి వుంటుంది. గ్రామోత్సవాల సందర్భంగా వీధులని ఊడ్వడం, పచ్చతోరణాలు కట్టడం దండోరా/చాటింపుల[31] ద్వారా ప్రజలకు సమాచారం చేరవేయడం వంటి పనులు చేయాలి. అలాంటి సేవలకు లభించే ప్రతిఫలాలు నామమాత్రంగా వుంటాయి. ఆ ప్రతిఫలమైనా ఎప్పుడూ నాసిరకం ధాన్యం లేదా కూరగాయల రూపంలో లభిస్తుంది. సంఖ్యాపరంగా ఆంధ్ర ప్రదేశ్ లోని అంటరానివాళ్లలో మాదిగలదే మొదటి స్థానం. అయితే సాంప్రదాయికంగా మాత్రం వీరిది మాలల తర్వాతి స్థాయిగా భావిస్తారు. బహుశ వీరు చేసే అశుభ్రమైన చర్మకార వృత్తే అందుకు ముఖ్య కారణమైవుంటుంది. మాదిగలది ఎడమ చేతి కులమని, మాలలది కుడి చేతి కులమనీ ఇరు పక్షాలు తరచూ కలహించుకునేవారనీ అంటారు ఎన్.జి.చట్టీ.

మాల మాదిగల తరువాత ఆది ఆంధ్ర, అరుంధతీయ, దండాసి, గోసంగి, మస్తి, పైడి గొడగలి, మాల దాసరి, మాతంగి, బేడజంగం మొదలైన కులాలు ఇతర ముఖ్యమైన ఉపకులాలు.

ఈ కుల దొంతరలో తమ ఆధిక్యతను చాటుకునేందుకు ఆంధ్ర దళితులలోని రెండు అతిపెద్ద కులాలైన మాల మాదిగల మధ్య నిరంతరం సాంప్రదాయక సమరం కొనసాగుతోంది. ఆ క్రమంలో వారు తమలో తాము చతుర్ వర్ణ వ్యవస్థలో మాదిరిగా హెచ్చు తగ్గులు రూపొందించుకున్నారు. అదే పద్ధతిలో లాగా ఒక ద్వితీయ శ్రేణి వర్గాన్ని సృష్టించుకున్నారు. ఇది తమిళనాడులోని ఎండావుర్ హరిజనులను పోలివుండడం విచిత్రం. అక్కడ వారికి పైన దాసరి పురోహితులు – కింద తమ కులంలోని సొంత చాకలీలు వుంటారు. మాల దాసరీలు మతపర బిక్షకులు అంటారు నికోల్సన్. ఈ విధంగా మతపరంగా బిచ్చమెత్తుకోవడాన్నే జీవనోపాధిగా చేసుకున్న వ్యక్తుల సంఖ్య కోస్తా జిల్లాల్లో గణనీయంగా వుంది.

మాదిగలలోని ఇతర ప్రధాన ఉపవర్గాలలో ఛండాల, జాంబవులు, డక్కలి వాళ్లు, సిందోళ్లు మొదలైనవారు వున్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపూర్, కర్నూలు జిల్లాల్లో వీళ్లు చెప్పుకోదగ్గ సంఖ్యలో కనిపిస్తారు. మాతంగినులు పైస్థాయి పూజారిణులు చాలావరకు మాదిగలకు చెందినవాళ్లే. అలాగే డక్కలివాళ్లు, మస్తీలు అనబడే బిక్షుక బృందాలు కూడా మాదిగలకు చెందినవే. డక్కలివాళ్లు మాదిగలను పొగడుతూ పాటలు పాడతారు. వాళ్ల శాపాలకు శక్తివుంటుందని కావాలని వాళ్లకు పారితోషకాలు చెల్లిస్తుంటారు.

---

31. జంతు చర్మంతో తయారైన ఢంకానో, డప్పునో మోగిస్తూ గ్రామాల్లో ప్రకటనలు చేస్తుంటారు.

అంటరాని కులాల సాంస్కృతిక, మతపర, సామాజిక అంశాలను ఇక్కడ సంక్షిప్తంగా పరిశీలించాల్సిన అవసరం వుంది. ప్రత్యేకించి భూస్వామ్య, నిరంకుశ, అతి పితృస్వామిక దళితేతర సమాజాలలోని పరస్పర సంబంధాలతో పోలిస్తే – దళిత సంస్కృతిలో కుటుంబ, సామాజిక సంబంధాలు ఎంతో ప్రజాస్వామికంగా వుంటాయి. ఆర్థిక, సామాజిక రోజువారీ కుటుంబ వ్యవహారాలలో స్త్రీ పురుషులు ఇరువురూ పాల్గొంటారు. మిగతా సమాజాలకంటే కూడా వీరిలో స్త్రీ పురుష సమానత్వం ఎక్కువ. ఒకవేళ ఎక్కడైనా ఒక పాలు అధిక మొగ్గు కనిపిస్తే అది స్త్రీలవైపునకే వుంటుంది. సమస్యల్లో జోక్యం చేసుకునే, మధ్యవర్తిత్వం నెరిపే, జగడాన్ని కుల పంచాయితీ దృష్టికి తీసుకెళ్లే విషయంలో ఇరువురికీ హక్కు వుంటుంది. కుల వృత్తుల్లో సైతం స్త్రీ పురుషుల మధ్య తేడాలంటూ వుండవు. తమ ఆర్థిక పరిస్థితి రీత్యా వారిలో వ్యక్తిగత ఆస్తి తాలూకు భావనలు చాలా తక్కువ. ఇతరుల్లో కంటే వివాహం, విడాకులు వంటి అంశాలలో వెసులుబాటు ఎక్కువ.

దళితులు అనుసరించే మతం హిందూ మతానికి పూర్తి భిన్నంగా వుంటుంది. దళితులు ఎక్కువగా ఇంటి దేవుడిని (పితృదేవుళ్లని), కులదేవతని–అందులోనూ స్త్రీ దేవతలని ఆరాధిస్తారు. వాళ్లు శక్తిని నమ్ముతారు. పురాణాల్లో ఇది స్వతసిద్ధంగా కనిపిస్తుంది. మౌలికంగా శక్తి అనే భావనకూ తల్లిదేవతకూ మధ్య అవినాభావ సంబంధం వుంటుంది. ఈ దేవతలను రాయలసీమ ప్రాంతంలో కోల్హాపురమ్మ, బాతమ్మ, పెద్దమ్మ అనీ; తెలంగాణా ప్రాంతంలో ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ, మారెమ్మ అనీ; కోస్తా ఆంధ్ర ప్రాంతంలో దేశమ్మ, గైరమ్మ, పోలేరమ్మ అనీ వ్యవహరిస్తారు. మాదిగల మత విధానంలో కొట్టొచ్చినట్టు కనిపించేది మాతంగి వ్యవస్థ. మాతంగి అనే పూజారిణి అన్ని సాంప్రదాయిక ఉత్సవాల్లో ఓ దైవ ప్రతినిధిగా, మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది. ప్రముఖ క్రతువులలో, బలుల సమయంలో తరచూ దళితులే పూజారులుగా సేవలు అందిస్తుంటారు. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో మాదిగ పురుషులు ప్రధాన పూజారులుగా లేదా పోతరాజులుగా సేవలు అందిస్తే – మాలలు బలుల విషయంలో ప్రధాన భాగస్వాములుగా సేవలు అందిస్తారు.

ఈ విధంగా దళిత సంస్కృతి అగ్రవర్ణ హిందువుల సంస్కృతిని ఏవిధంగానూ పోలివుండకపోగా భిన్నంగా కూడా వుంటుంది. కరువు కాటకాలప్పుడు, దుష్ట శక్తులను పారదోలేప్పుడు దళితులు దేవత పేరుతో బలులు ఇస్తుంటారు. కోస్తా జిల్లాల్లో పండుగలు సాధారణంగా పంటకోతల కాలంతో, విత్తనాలు నాటే కాలంతో ముడిపడి వుంటాయి. ఒక్కో దేవతకు ఒక్కోరకమైన వ్యక్తితో సంబంధం వుంటుంది. ఉదాహరణకి పక్షపతమ్మకి

పశువుల జబ్బుల్ని నయంచేసే శక్తి వుంటుందనీ, మరికొందరు దేవతలకి కలరా, మశూచి వంటి అంటువ్యాధుల్ని పారదోలే ప్రత్యేక శక్తులు వుంటాయనీ నమ్ముతారు. (రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్ వంటి జిల్లాలో ఈ నమ్మకాలు ఇప్పటికీ ప్రబలంగా వున్నాయి). అదేవిధంగా ఈ కులాల్లో మాతంగి/బసివి/భోగం వారు వంటి పేర్లతో ఆయా ప్రాంతాల్లో పడుపు వృత్తిని పవిత్రంగా కొనసాగించే ఆచారం వుంది. ఆడపిల్లల్ని (ఎక్కువగా దళితులు, అక్కడక్కడా దళితేతరులు) ఒక దేవతకు అంకితమిచ్చే ఆచారమిది. ఆ ఆడపిల్లలు కులంతో నిమిత్తంలేకుండా ఆయా పురుషులకి సేవల పేరిట శారీరక సుఖం అందించాలి. ఈ దురాచారం కర్నూలు, నిజామాబాద్ జిల్లాల్లో ఇంకా కొనసాగుతోంది.

వలసవాద కాలంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ వికాసం చెందిన కారణంగా గ్రామీణ సంపన్నులు గ్రామీణ ప్రాంతాలలో ప్రబల ఆర్థిక శక్తులుగా అవతరించేందుకు అవకాశం ఏర్పడింది. అత్యధిక భూమిని కలిగివుండటంతో ఈ ఆర్థిక పరిస్థితి నుంచి అంటే వాణిజ్య సాగు, వ్యవసాయిక సరుకుల వ్యాపారం పెరగడం మొదలైనవాటి వల్ల ఎక్కువ లబ్ధిపొందగలిగారు. ప్రధానంగా కమ్మ, కాపు, వెలమ, రెడ్డి కులాలకు చెందిన రైతులు ఒక బలమైన కర్షక వర్గంగా, రైతాంగ శక్తిగా ఆవిర్భవించారు. అదే సమయంలో వెనుకబడిన తరగతులకు, చేతి వృత్తుల పనివారికి, దళితులకు చెందిన అసంఖ్యాక రైతులు మాత్రం పేదలుగా, సేవక వర్గంగా మిగిలిపోయారు. ఈ ఆర్థిక పరిణామ క్రమంలో కింది కులాలకు చెందిన సన్నకారు రైతులను గ్రామీణ సంపన్నులు దోచుకుతిన్నారు. గ్రామీణ పేదలలో అత్యధికులు ఇవాళ వెనుకబడిన తరగతులకు, దళితులకు చెందిన వాళ్లే. భూస్వామ్య ప్రభువుల స్థానాలను ఆక్రమించిన అగ్రవర్ణాల వాళ్లు గ్రామీణ ప్రాంతాలలో ప్రధాన దోపిడీ వర్గంగా తయారయ్యారు. కుల ఘర్షణ కారణంగా గ్రామీణ సంపన్నులకూ – గ్రామీణ పేదలకూ మధ్య వైరుధ్యం విస్తృతమయింది. అందువల్లనే మార్పు అనేది వ్యవస్థ స్వరూపంలో కాకుండా వ్యవస్థలో అంతర్గతంగా (బ్రాహ్మణులు మొదలుకుని బ్రాహ్మణేతరుల వరకు) చోటుచేసుకుంది. అది అంటరాని వాళ్ల హోదాను ఏమాత్రం మార్చకపోగా వారిని మరింత ఏకాకులను చేసింది.

ఇరవైయ్యవ శతాబ్దం వచ్చేటప్పటికి వలసవాద ప్రభావం వల్ల వేతన విధానంలో (వేతనాన్ని వస్తువు రూపంలో కాకుండా డబ్బు రూపంలో చెల్లించడం) మార్పు చోటుచేసుకుంది. ప్రాంతీయ కాలమాన పరిస్థితులను బట్టి డబ్బు రూపంలో వేతనాలు చెల్లించడం అనేది మొదలయింది. దాంతో పాటు ఒక కొత్త ఋణ బానిసత్వం

పుట్టుకొచ్చింది. అది కార్మికుల దుర్బలతని మరింత పెంచింది. దాంతోపాటు దళితులను మరింత వేరుచేస్తూ కుల వ్యవస్థ భూస్వామ్య వర్గాల సేవకు కట్టు బానిసలను సృష్టించింది. అంటరానివాడికి భూమిని కౌలుకు ఇవ్వకూడదు అనే సాంప్రదాయక నిషేధం శ్రామిక ప్రజలకూ, వారు పనిచేసే భూమికీ మధ్య అగాధాన్ని ఎక్కువ చేసింది. వలసవాదులు తమ పాలనను సుస్థిరం చేసుకునేందుకుగాను భారత భూ వ్యవహారాలలో భూస్వామిక అంశాలను అలాగే కొనసాగనిచ్చారు. వాటిలో జోక్యం చేసుకోకూడదనే వారి విధానం ప్రత్యేకించి కుల హెచ్చుతగ్గుల దొంతరను పెంచి పోషించింది.

వ్యవసాయిక సామాజిక వ్యవస్థ దళిత కార్మికుల మీద కొన్ని రకాల విధులను రుద్దింది. అందులో మొదటిది వెట్టిచాకిరి (ఋణ బానిసత్వం). ఇది దాదాపు అర్థ బానిసత్వంతో సమానం. ఈ విధానంలో ఒక కూలివాడు ఏ బిడ్డ పెళ్లికో, అనారోగ్య చికిత్సకో చేసిన కొద్దిపాటి అప్పు కారణంగా ఆ భూస్వామి వద్ద అతనే కాకుండా అతని భార్య, అతని పుట్టబోయే పిల్లవాడు సైతం చాకిరీకి కట్టుబడి వుండవలసి వస్తుంది. ఈ అప్పులు ఆధునిక ఋణ ఒప్పందాలకు ఏమాత్రం అనుగుణంగా వుండవు. ఆ కూలివాడు చిన్నపాటి ఇంటి స్థలం, కొద్దిపాటి పొలం కలిగివుండవచ్చు – అయితే అది ఆ భూస్వామి ఇష్టాయిష్టాలని బట్టి వుంటుంది.

రెండోది, పాలేరుతనం (పొలంలో పనిచేసేవాడు). ఇదొక వార్షిక కూలిపని. ఇందులో చిన్న పాలేరు, పెద్ద పాలేరు అని రెండు రకాలుంటాయి. చిన్న పాలేర్లు ఆరు నుంచి పధ్నాలుగేళ్ల వయసు బాలకార్మికులు. వీళ్లు పశువుల్ని కాయడం, పశువుల కొట్టాలని శుభ్రం చేయడం, చిన్న చిన్న ఇంటి పనులు (సాధారణంగా నీచమైన పనులు) చేస్తుంటారు. ఇక పెద్ద పాలేరు అనే వాడు భూస్వామి పొలాన్ని సాగు చేస్తాడు. వీళ్లకి సాధారణంగా తిండి పెట్టి వేతనాన్ని వస్తురూపంలో చెల్లిస్తారు. పెట్టుబడి లేదా జీతం అనబడే ఈ వేతనాలు ఊరును బట్టే కాకుండా భూస్వాములను బట్టి కూడా రకరకాలుగా వుంటాయి.[32] ధాన్యం రూపంలో జీతాలను చెల్లించినా, తరచుగా నిబంధనలతో కూడిన వడ్డీలేని రుణాలను కూడా ఇస్తుంటారు. పాలేరు వెట్టిచాకిరీ తరగతి కిందికి మాత్రం రాడు. వలసవాద కాలంలో వచ్చిన మార్పును ఎకనమిక్ ఇంక్వైరీ కమిటీ (1930) నివేదికలో ఇలా నమోదు చేశారు:

---

32. భూస్వామిని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 'బుగత' అని, కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో 'ఆసామి' అని అంటారు. వై. రాములు, వజ్రపు సాంబ మూర్తి గార్లతో జరిపిన ఇంటర్వ్యూలు.

"గతంతో పోలిస్తే క్రైస్తవ మతం ప్రవేశించి, అంటరానితనం వ్యతిరేక ఉద్యమం మొదలై ఒక కొత్త చైతన్యం చోటు చేసుకున్న తరువాత వారు మరింత స్వేచ్ఛా జీవులయ్యారు. అవగాహన పెరిగింది. పాలేరు పనికంటే అడవుల్లో పనిచేయడానికి ప్రాధాన్యం యిస్తున్నారు. ఇతర్ల పొలాల్లో తాత్కాలిక కూలీల్లా పనిచేయడం కంటే వ్యవసాయదార్లుగా మారేందుకు మక్కువ చూపుతున్నారు. సహజంగానే తమ జీతాలను పెంచాలనీ, డబ్బు రూపంలో జీతాలను చెల్లించాలనీ డిమాండ్ చేయడం మొదలయింది."

పాలేర్లు తమ యజమానులను తరచూ మార్చుకుంటుంటారు. ఒకరివద్ద ఒక సంవత్సరానికి మించి పని చేయరు. ఎవరైనా ఎక్కువ కాలం ఒకరివద్దే పనిచేస్తున్నారంటే అది వారి ఇష్టపూర్వకంగానే అయివుంటుంది తప్ప ఏ బలవంతం వల్లనో కాదు. ఆంధ్రలో ఆయా ప్రాతాలను బట్టి పాలేర్లను జీతగాడు, కంబారి వంటి పేర్లతో పిలుస్తుంటారు. ఈ పనికి కులంతో సంబంధం లేకపోయినా 80 శాతం మంది దళితులే ఈ పనిలో వున్నారు. సామాజిక దొంతరలో పాలేరు స్థానం యజమానికంటే దిగువన వుంటుంది. తమ కంటే ఎక్కువ కులం వారిని ఎవరూ పాలేర్లుగా నియమించుకునేందుకు వీలులేదు.

మూడోది, తాత్కాలిక కూలీలను ప్రధానంగా విత్తనాలు నాటడం, నారుపోయడం, పంటకోతలు వంటి వ్యవసాయిక పనుల కాలాల్లోనే నియమించుకుంటుంటారు. మెట్ట ప్రాంతాలతో పోలిస్తే మాగాణి భూముల్లోనే ఎక్కువ సాగు అవుతూ వుంటుంది. నీటి సరఫరా, వాతావరణం బాగున్నప్పుడు ధాన్యం పండించే మాగాణి భూముల్లోనూ, జనుము, వేరుశనగ వంటి వాణిజ్యపంటలను, చెఱకు, తమలపాకులు, పొగాకు వంటి భారీ పంటలను పండించే భూముల్లోనూ కూలీలకు డిమాండ్ చాలా ఎక్కువగా వుంటుంది. అలాంటి పరిస్థితుల్లో అధిక వేతనాలను సాధించుకునేందుకుగాను ఈ స్వేచ్ఛా కూలీలంతా స్థానికంగా సంఘటితమై "గుత్త" పేరుతో సంఘాలను ఏర్పాటు చేసుకుంటారు. వారి సమ్మెలను ఎదుర్కొనేందుకు భూస్వాములు ఇతర ప్రాంతాలనుంచి కూలీలను దిగుమతి చేసుకోవడం మొదలు పెట్టారు. స్థానిక కూలీలకు ప్రత్యామ్నాయంగానే కాకుండా చైతన్యవంతులైన స్థానిక కూలీలను ఆకలితో మాడ్చి లొంగిపోయేలా చేసుకునేందుకు కూడా వారీ పద్ధతిని అనుసరిస్తారు. ఈ వ్యవసాయ కూలీల, కార్మికుల పోరాటాల్లో ఇతర శుద్ధ శూద్ర కులాల వాళ్లు వున్నప్పటికీ అంటరాని వాళ్లే ఎక్కువ తిరుగుబాటు ధోరణితో కనిపిస్తారు. అదే మిలిటెంట్ దళిత ఉద్యమానికి ప్రాతిపదిక అయింది. అంటరాని కులాలకు చెందిన వ్యవసాయ కూలీలు భూస్వాముల

అణచివేతను ప్రతిఘటించేందుకు, తమ నీచ స్థాయిని వదిలించుకునేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. వారి ప్రయత్నాలు తరచూ విఫలమవుతూ వచ్చినా ఆ వైఫల్యాలను తమ భవిష్యత్ కార్యాచరణకు ఒక అనుభవంగా భావించారు. ఒకోసారి ఆ పోరాటాలు – పనులు నెమ్మదిగా చేయడం, మాట వినకపోవడం, కొద్దిపాటి విధ్వంసం, ఎగవేత, ఎదురు తిరగడం వంటి రూపాల్లో వుండేవి. అప్పుడప్పుడు తీవ్రంగా, హింసాత్మకంగా కూడా జరిగేవి. 1930లలో, 1940లలో 'గుత్త' సంఘాలు అధిక వేతనాల కోసం సమ్మెలు చేసిన సందర్భాలు కూడా వున్నాయి.

సంఘటితమైన కార్యాచరణ లేకపోవడం వల్ల దళిత కార్మికులు మొత్తం సామాజిక వ్యవస్థను, రాజ్య స్వరూపాన్ని, చట్టాలను మార్చడం పట్ల అంతగా ఆసక్తి చూపలేకపోయారు. హోబ్స్ బామ్ చెప్పినట్టు ఈ వ్యవస్థ తమ కనీస అసౌకర్యాలను తొలగిస్తే చాలనుకున్నారు. అందుకే దళిత కార్మిక వర్గానికీ వారి శ్రమను దోచుకుంటూ అద్దెలూ వడ్డీలూ వసూలు చేసుకునే అగ్రవర్ణ హిందూ భూస్వాములకూ మధ్య నిరంతర ఘర్షణ కొనసాగింది. వారి తీవ్రమైన అసంతృప్తి పని ఎగ్గొట్టడం, విధ్వంసం, గొడవలు, ఏమీ తెలియనట్టు నటించడం వంటి దుర్బలురు అనుసరించే పద్ధతులలో వ్యక్తమయ్యేది. ఈ నిరంతర మౌన పోరాటాలకు, ప్రతిఘటనలకు పెద్దగా ప్రణాళికలు, సమన్వయం అవసరం వుండదు. ఆయా వ్యక్తుల అస్పష్ట అవగాహన, అరకొర సమాచార వ్యవస్థలపై ఆధారపడి సాధ్యమైనంత వరకు అధికార వర్గంతో ప్రత్యక్ష ఘర్షణలేకుండా వాటిని కొనసాగిస్తారు. ఈ రకమైన ప్రతిఘటన వల్ల తక్షణ ఫలితాలు వుండవుగానీ, దీర్ఘకాలికంగా చూస్తే అవి ఒక స్థిరమైన, సమర్థవంతమైన ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. దళితులకు, ముఖ్యంగా తమ స్థితిని మెరుగుపరచుకునేందుకు ఏ అవకాశాలూ లేని పరాధీన కార్మిక వర్గానికి ఇలాంటి ప్రతిఘటనా పద్ధతులకు ముందస్తు శిక్షణ అవసరం వుండదు. ప్రాథమిక స్థాయిలోనే ఒకరినుంచి మరొకరికి చేరతాయి. ఉదాహరణకి ఒక భూస్వామి కింద పనిచేస్తున్న కుటుంబంలో ఐదారేళ్ల పిల్లవాడు సాధారణంగా పశువులుకాచే పని చేస్తుంటాడు. అతను భూస్వామి కనిపించినప్పుడు శ్రద్ధగా పనిచేస్తున్నట్టు నటిస్తూ, భూస్వామి వెళ్లిపోగానే విశ్రాంతి తీసుకుంటూ ఒకరకమైన ప్రతిఘటనా పద్ధతిని తనకు తానుగా అనుసరించడం కనిపిస్తుంది. చిన్నతనంలో అబ్బిన ఈ ప్రాథమిక ప్రతిఘటనా పాఠాలు అతను పెద్ద పాలేరుగా లేదా రైతుగా/ కంబారిగా మారిన తరువాత కూడా కొనసాగుతాయి. పెద్ద పాలేరు అంటే మామూలుగా వార్షిక జీతగాడు. ఆ దశలో అతను తన ప్రతిఘటనా పద్ధతులకు మరింత మెరుగుపెట్టుకుంటాడు.

చిన్న పాలేరుగా వున్నప్పుడు అతని ప్రతిఘటన రెండు రకాలుగా వుంటుంది. మొదటిది తన యజమాని అయిన భూస్వామికి పాలు దక్కకుండా చేయాలన్న కసితో మొత్తం ఆవు పొదుగులోని పాలన్నీ దూడే తాగేట్టు చేస్తాడు. యజమాని నిలదీస్తే తనకేం తెలియనట్టు అమాయకత్వం నటిస్తాడు. ఇక రెండో పద్ధతి– యజమాని పశువులు పక్కవారి పొలంలో పడి మేసేట్టు చేసి వాళ్ల మధ్య తగాదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తాడు.

చిన్న పాలేరు నుంచి పెద్ద పాలేరుగా ఎదిగిన తరువాత అతని స్థాయి పశువుల కాపరి నుంచి భూస్వామి పొలంలో పంటలు పండించే రైతు స్థాయికి పెరుగుతుంది. పెద్ద పాలేరుగా అతను భూస్వామి పొలాన్ని దున్నుతాడు, విత్తనాలు వేస్తాడు, నారుపోసి నీరు పడతాడు, ఎరువులు వేస్తాడు. అదే సమయంలో అతనిలో పెరిగిన అసమ్మతి కొత్త ప్రతిఘటనా రూపాల్లో వ్యక్తమవుతుంటుంది. నాగలి తదితర పనిముట్లను పనికి రాకుండా చేయడం, ఎడ్లబండిని పాడుచేయడం, అవి మళ్లీ ఉపయోగించేందుకు వీల్లేకుండా చెడగొట్టడం వంటి పనులు చేస్తాడు. కంబారి తనం అనేది వార్షిక కూలితో పనిచేసే ఉద్యోగం కాబట్టి అప్పుల్లో చిక్కుకుని వుండకపోతే అతను ఏడాదికో యజమానిని మర్చేసుకోగలడు. యజమాని తన పట్ల, దురుసుగా ప్రవర్తిస్తూ, శ్రమ దోపిడీ చేస్తూ మొండిగా వుంటే అతను మరో యజమానిని చూసుకుని వెళ్లి పోతాడు. కంబారికి వ్యవసాయం లోతుపాతులన్నీ తెలిసి మంచి అనుభవం వచ్చిందంటే అతను ఒకరి దగ్గర పడివుండకుండా స్వేచ్ఛాయుతుడైన దినసరి కూలీగా మారిపోవాలని ఆశిస్తాడు.

ఈ స్వేచ్ఛా కూలీలను రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి సొంతగా పనిచేసే కూలీలు. రెండు 'గుత్త' అనే పేరుతో గుంపులో పనిచేసే కూలీలు. ఈ రెండో రకంలో స్వేచ్ఛాయుతులైన వ్యక్తిగత కూలీలు సంఘటితమై ఒక గుంపుగా పనిచేస్తుంటారు. ఒంటరి కూలీల కంటే సామూహిక కూలీలకు ఎక్కువ వేతనాలు లభించే అవకాశం వుంటుంది. తగిన వేతనం ఇవ్వనంటే పొరుగూరికి వలసపోతామనీ, స్థానికంగా కూలీలే దొరక్కుండా చేస్తామనీ వారు భూస్వామిని బెదిరించగల స్థితిలో వుంటారు. అది ఆ భూస్వామికి పరువు ప్రతిష్టకు సంబంధించిన వ్యవహారంగా మారిపోతుంది.

తక్కువ జీతాలను ఒక క్రమపద్ధతిలేకుండా యిస్తూ నిర్దయగా వ్యవహరించే భూస్వామిపట్ల వుండే అసమ్మతి దుర్బల స్థితిలోని వారు అనుసరించే పద్ధతిలో వ్యక్తమవుతుంటుంది. అంటే ఆ భూస్వామి చేపల చెరువుల్లో విషం కలపడం, చెట్ల వేర్లను కత్తిరించివేయడం (మామిడి చెట్లు మొదలుకుని వంకాయ తదితర కూరగాయల మొక్కలు వరకు), మొక్కలను పీకి మళ్లీ నాటడం తద్వారా మూడు నాలుగు రోజుల్లో

అవి వాడిపోయేట్టు చేయడం వంటి పనులు చేస్తారు. భూస్వామి పొలాల్లోని పంటను, ధాన్యాన్ని దొంగిలించడం అనేది రెండు కారణాల వల్ల జరుగుతుంటుంది. ఒకటి దుర్భర దారిద్ర్యం, రెండు కసి. వారు తమ అసహనాన్ని వ్యక్తం చేసేందుకు భూస్వామి ఇంట్లో పండుగలు పబ్బాలు జరుగుతున్నప్పుడు తాము చేయాల్సిన సాంప్రదాయిక పనులను ఎగ్గొట్టడం, భూస్వామి పశువులకు విషం పెట్టడం వంటి కొన్ని ఇతర పద్ధతులను కూడా అనుసరిస్తుంటారు. వెంటనే ప్రాణాలు తీసే మోతాదులో గన్నేరుకాయలను నూరి పశువులకు పట్టిస్తారు. అవి చచ్చిపోయిన తరువాత ఆ కళేబరాలను తొలగించడానికి నిరాకరిస్తారు. ఆ సాకుతో పంచాయితీ పెట్టించి తమ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ఒత్తిడి చేస్తారు. అలాంటి సందర్భాల్లో సాధారణంగా తీర్పు వారికి అనుకూలంగా వస్తుంటుంది. మరికొందరు తమ డప్పులు పాడైపోయాయన్న నెపంచూపి పండుగలు పబ్బాలప్పుడు వాటిని వాయించకుండా తప్పించుకుంటారు. పాత డప్పుల్ని అందుకు సాక్ష్యంగా చూపిస్తారు. సాంప్రదాయికంగా అగ్రవర్ణ హిందువులకు సంబంధించిన ఉత్సవాల్లో విధిగా అంటరానివాళ్లే డప్పులు వాయిస్తారు. దొరలు తమ పితృదేవతల సంతృప్తికోసం చేసే క్రతువులప్పుడు తప్పనిసరిగా డప్పులు తదితర వాయిద్యాలను ఉపయోగించవలసి వుంటుంది.

గ్రామ తలారి లేదా బారికి పనిచేసే వాళ్లు సాధారణంగా స్వేచ్ఛా కూలీలు. ఆయా సందర్భాలనుబట్టి అదనపు విధులు నిర్వర్తిస్తూ సాంప్రదాయిక ప్రయోజనాలను పొందుతుంటారు.[33] అంటే అగ్రవర్ణ హిందువుల ఇళ్లలో జననం, మరణం, పుష్పవతి అవడం వంటివి సంభవించినప్పుడు ఆ వార్తను ఇతర గ్రామాలలోని వారి బంధువులకు చేరవేయడం, పితృదేవతలకు ఆహారాన్ని సమర్పించేందుకు కావలసిన విస్తరాకులు తయారుచేయడం వంటి పనులు చేస్తారు. అలాంటి సందర్భాలలో నిరసనను వ్యక్తం చేయవలసివస్తే ఆ ఊరికి దారితెలియనట్టు అమాయకత్వం నటిస్తారు. పండుగలప్పుడు సంప్రదాయం ప్రకారం అగ్రవర్ణ హిందువులు పెట్టే ఆహారాన్ని బారికి విధిగా తీసుకోవాలి. కాని అసహనం వ్యక్తం చేయాలనుకుంటే అతను ఆ ఆహారాన్ని తీసుకోడానికి నిరాకరిస్తాడు. 'పండుగ బరతం' పేరిట అదనపు ఆదాయం లభిస్తుంది. అగ్రవర్ణ హిందువుల సంపదమీద అది ఆధారపడి వుంటుంది. పంటల అనంతరం ధాన్యాన్ని గోడౌన్‌కో, మార్కెట్‌కో తరలించేటప్పుడు "పొల్లాయి" పేరుతో అతనికి కొంత ధాన్యాన్ని

---

33. బారిక అనేది గ్రామ సేవక వృత్తి. ఇతను అంటరాని కులానికి చెందినవాడై వుంటాడు. మైల వార్తలను (దుర్వార్తలను) చేరవేస్తుంటాడు.

యిస్తారు. అగ్రవర్ణ హిందువులు భరతం చెల్లించడమనేది ఒక ఆచారంగా వస్తోంది. అయితే రాను రానూ అది ఒక విధిగా, బారికల పాలిటి హక్కుగా మారిపోయింది.

పైన పేర్కొన్న ప్రతిఘటనా పద్ధతులన్నీ విఫలమైనప్పుడు దళిత కూలీలు చివరకు ఊరు విడిచి పట్టణాలకో నగరాలకో భవన నిర్మాణ కూలీలుగా వలసపోతారు.[34] అయితే ఏడాది పొడవునా పని దొరుగుతుందన్న హామీ వుంటేనే వాళ్లాపని చేస్తారు. జేమ్స్ స్కాట్ ఇలా అన్నారు. "స్వప్రయోజనమే లక్ష్యంగా వుండే తిరుగుబాటుకంటే ఈ వలసలే ఎంతో కొంత సాధిస్తాయి. వ్యవస్థాపరమైన సంఘర్షణలకంటే ఈ పరిత్యాగం సమర్థవంతమైనది. పెద్ద ఎత్తున వలసపోవడం వల్ల దాని ప్రభావాలు అమితంగా వుంటాయి." ఎందుకంటే దళిత కూలీలు దీనివల్ల కోల్పోయేదేమీలేదు అగ్రవర్ణ భూస్వాముల అమానుష దోపిడీని తప్ప!

జీవితమంతా వెట్టి సేవలు చేయాల్సిన వాళ్లు యజమాని పట్లవుండే అసహనాన్ని – నిర్లక్ష్యంగా, సామర్థ్యం కనబరచకుండా విధులను నిర్వర్తిస్తూ విలక్షణంగా వ్యక్తపరుస్తుంటారు. ఉద్దేశపూర్వకంగా లేదా యాదృచ్ఛికంగా ఒంట్లో బాగోలేనట్టు, తమకేమీ తెలియనట్టు, ఆ పని చేతకాదన్నట్టు నటిస్తారు. తద్వారా తమ యజమానులకు విసుగు పుట్టిస్తారు. ఆ యజమాని వారికి జీతం పెంచకుండా ప్రతీకారం తీర్చుకుంటాడే తప్ప అతడిని దూరంచేసుకుని తన పెట్టుబడిని వదులుకోవడం యిష్టపడడు. అందుకే వారిని అలాగే తక్కువస్థాయి పనుల్లో వాడుకుంటూ కొనసాగనిస్తుంటాడు.

ఈ సానుకూల ప్రతిఘటనా విధానం బాహాటమైన వ్యతిరేకతగా మారనంతవరకు దాదాపు తిరుగులేని విధానంగానే వుంటుంది.

వలసవాద కాలంలో ఏర్పడిన నూతన పరిస్థితులు సరికొత్త అవకాశాలను సృష్టించాయి. పల్లెల్లో భూములతో సంబంధంలేని పనులకు – అంటే చెరువులు తవ్వే వాళ్లుగా, భవన నిర్మాణ కార్మికులుగా, రవాణా సిబ్బందిగా, సైనికులుగా పనిచేసేవాళ్ల అవసరం ఏర్పడింది. కాలానుగుణమైన అవసరాలతో పాటు కార్మికులకు డిమాండ్ పెరిగింది. వారి బేరసారాల శక్తి కూడా పెరిగింది. దాంతో వారు తమ తిరుగుబాటును లేదా ప్రతిఘటనను వ్యక్తం చేసేందుకు ఇంకో భూస్వామి వద్ద పనిచేసేందుకు లేదా పట్టణ ప్రాంతాలకు వెళ్లిపోవడం వంటి పద్ధతులు అనుసరించారు.

---

34. మనదేశంలో గ్రామాలనుంచి వలసవెళ్లే వారిలో 90 శాతం మంది ఓడ కార్మికులుగా పనిచేసేందుకు బర్మాకు వెళ్లేవారు. ఇస్సాక్ 1965, సత్యనారాయణ 1998.

అయితే భూస్వాములు కూడా ఈ కూలీల పొగరును అణిచేందుకు ఇతర గ్రామాలనుంచి కూలీలను రప్పించుకునేవారు. అలాంటప్పుడు స్థానిక కూలీలు పొరుగు ప్రాంత కూలీలకు నచ్చచెప్పి వెనక్కు పంపించేందుకు ప్రయత్నించేవారు. లేదంటే బెదిరింపులకు దిగేవారు. తరచూ అవి సత్ఫలితాలనే యిచ్చేవి. కూలీల ఉమ్మడి ప్రయోజనాలను ఇరుపక్షాలు గుర్తించేలా, తమ కోరికలను ఉమ్మడిగా సాధించుకునేలా వారినవి సంఘటితపరిచాయి. మార్క్సిస్ట్ భావజాలం వ్యాపించిన ప్రాంతాలలో ఇలాంటి ప్రతిఘటనలు ఎక్కువగా కనిపిస్తాయి. కొద్దిమంది రాజకీయ చైతన్యం వున్న కార్మికుల కృషి ద్వారా బలమైన రైతు సంఘాలు (కిసాన్ సభలు) ఏర్పడి చురుకైన పాత్రను పోషిస్తుంటాయి.

గ్రామీణ సమాజంలోని ఈ వర్గ సంబంధాలు, వాటి వెనుక అంతర్లీనంగా వుండే అసంతృప్తి, తీవ్రమైన అశాంతి, నివురుగప్పిన నిప్పులాంటి గ్రామీణ తిరుగుబాటు భావనలు కేవలం ఈ అధ్యయనానికి సంబంధించిన (ఆంధ్ర) ప్రాంతానికే పరిమితం అని భావించనవసరం లేదు. ఇలాంటి వాతావరణం వున్న ఏ ప్రాంతనికైనా ఇది వర్తిస్తుంది.

3

దళిత విద్య - ఏజెన్సీల పాత్ర

సామాజిక మార్పునకూ, అభివృద్ధికీ విద్య ఎంతగానో దోహదపడుతుంది. సమాజంలో విద్య పోషించే పాత్రను రెండు ముఖ్యమైన పద్ధతుల ద్వారా అంచనావేస్తారు. ఒక పద్ధతి విద్యను సామాజికీకరణకూ చైతన్యానికీ ప్రతీకగా, సామాజిక మార్పునకు సాధనంగా గుర్తిస్తుంది. మరో పద్ధతి విద్యను సామాజిక హెచ్చుతగ్గులను పెంచిపోషించేదిగా, అణచివేతను శాశ్వతీకరించేదిగా పరిగణిస్తుంది.

సామాజిక శాస్త్రవేత్తలైన బ్రూకోవర్, హేవింగ్ హర్స్ట్, నూగార్టెన్, ఇంకెల్, రెసిస్, సిల్వర్ బెర్గ్, గౌల్డ్ మొదలైనవాళ్లు మార్పుతీసుకురావడంలో విద్య పాత్రను నొక్కిచెప్పారు. మరోపక్క బోవెల్స్, గింటిస్ వంటివారు విద్యావ్యవస్థలు సామాజిక విభజనను, ఆర్థిక అసమానతలను శాశ్వతీకరిస్తున్నాయంటూ వాదించారు. బడుగువర్గప్రజలను అణచివేసేందుకు విద్య తోడ్పడుతోందనేది వారి అభిప్రాయం. గ్రామ్‌స్కీ ఇదే అంశాన్ని ఒక్క మాటలో చెప్పారు: "మేథావులు... అంటే ఉన్నత వర్గాల నుంచి వచ్చినవాళ్లు లేదా విద్యావ్యవస్థ సృష్టించిన వ్యక్తులు సామాజిక పెత్తందార్లుగా, రాజకీయ ఉపవిధులను నిర్వహించే పాలకవర్గ తాబేదార్లుగా మారారు." పాలకవర్గాలు తమకు ఊడిగం చేసేందుకు, తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు, ప్రస్తుత ఆర్థిక రాజకీయ అధికార వ్యవస్థను నిలుపుకునేందుకు విద్యా వ్యవస్థను ఒక బలమైన సాధనంగా మార్చుకున్నాయని వీరు భావిస్తారు. మొత్తం సమాజమంతా తమ ఆలోచనలకు, ప్రయోజనాలకు అనుగుణంగా నడచుకునేలా చేసేందుకుగాను పాలకవర్గాలు విద్యను ఒక ముఖ్యమైన సైద్ధాంతిక అధికార సాధనంగా మలచుకున్నాయంటారు ఆల్థసర్. ఇక వెబర్ అభిప్రాయం ప్రకారం " ప్రస్తుత సామాజిక వ్యవస్థను శాశ్వతీకరించేందుకు దోహదపడే విద్య మునుముందు ఆ వ్యవస్థ మారినా కర్మ సిద్ధాంతం కంటే మెరుగైన సిద్ధాంతంగా ఉన్నత వర్గాలకు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తుందనే హామీనిచ్చింది." సామాజిక సిద్ధాంతాలలో ఇదొక విశేషంగా పేర్కొన్నారాయన. వలసల చట్రంలో మతపరమైన అర్హతలను బట్టి కులవ్యవస్థ పరిధిలో ప్రతివ్యక్తి తాలూకు సామాజిక స్వభావాన్ని అది సమర్థించింది. ఆ ధోరణే (స్కూల్) ఇవాళ "ప్రకృతి ప్రసాదాలు",

"పుట్టుకతో వచ్చే సుగుణాలు" వంటి సిద్ధాంతాలను ముందుకు తెచ్చి సామాజిక హెచ్చుతగ్గులను పునరుద్ధరించి వాటిని చట్టబద్ధం చేస్తోంది. అందువల్ల సామాజిక వ్యవస్థకూ విద్యావిధానానికీ మధ్యవున్న అవినాభావ సంబంధాన్ని మనం గ్రహించాలి. ఇవి ఒక దానిమీద ఒకటి ప్రభావం చూపుతుంటాయి. అంతేకాదు, విద్య ఈనాటి సామాజిక ప్రత్యేకతలను కాపాడే శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుంది. మార్పు ఎప్పుడూ ఒక రాజకీయ విస్ఫోటనంగా, తీవ్ర ప్రతిఘటనకు గురయ్యేదిగా, ఒక చేదు అనుభవంగా వుంటుంది.

అందువల్ల సామాజిక సంస్థలూ, గ్రూపులూ ఒక నిర్దిష్టమైన సామాజిక చైతన్యాన్ని తీసుకురావడంలో విద్యను సాధనంగా పరిగణిస్తాయి. విద్యలో పెరుగుదల, అభివృద్ధి కనిపించినప్పుడు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విప్లవం ముందుకెళ్లడం స్పష్టంగా కనిపిస్తుంటుంది. కాబట్టి విద్యకూ, సామాజికమార్పునకూ మధ్య తిరుగులేని పరస్పర సంబంధం వుంటుంది. ఆర్థికాభివృద్ధికీ, సామాజిక మార్పునకూ విద్యే చోదక శక్తిగా పనిచేస్తుంది.

వలసవాద కాలంలోనే దళిత మేధావులు విద్యకున్న ఈ విశిష్ట సామాజిక శక్తిని గుర్తించారు. విద్య సాంప్రదాయిక విలువలను తారుమారు చేయడంలోనే కాదు సమాజాన్ని మార్పునకు సిద్ధం చేసే సాధనంగా తోడ్పడుతుందని బి.ఆర్. అంబేడ్కర్ విశ్వసించారు. విద్యను కేవలం జీవనోపాధికి సాధనంగా కాకుండా దళితులను అజ్ఞానం నుంచి విముక్తి చేసి, అన్యాయానికీ అమానుషత్వానికీ వ్యతిరేకంగా పోరాడేలా చేసే గొప్ప ఆయుధంగా చూశారు. ఏ దళిత సంస్థకైనా, ఏ ఇతర ఉద్యమానికైనా ముందుగా కావలసింది విద్యే అంటారు అంబేడ్కర్. ఆయన యిచ్చిన సుప్రసిద్ధ నినాదం "ఐక్యంకండి... చదువుకోండి... పోరాడండి..." లో ఈ అంశం స్పష్టమవుతోంది.

వలసవాద కాలంలో భారతదేశంలో విద్య పరస్పర వైరుధ్య భరితమైన ప్రక్రియగా కొనసాగింది. తొలిదశలో ఆధునిక విద్యను అగ్రకులాల వారు తమ సాంప్రదాయిక గుర్తింపును బలోపేతం చేసుకునే సాధనంగా వాడుకున్నారు. ఆ తరువాత అది వైరుధ్యాలకు మూలంగా మారింది. కొత్తగా ఏర్పడిన దళిత మేధావి వర్గం, నిమ్నకులాల వారు విద్యను విముక్తి ప్రదాయినిగా గుర్తించారు. ఈ దృష్టితోనే దళితులను విద్యావంతులను చేయడంలో మిషనరీల పాత్రనీ, లోకోపకారులు, సంఘసంస్కర్తలూ చేసిన కృషినీ, అలాగే దళితులు తమను తాము విద్యావంతుల్ని చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలనీ అంచనా వేయడం జరిగింది.

ప్రాచీన భారతదేశంలో విద్య భారతీయ జ్ఞానసిద్ధాంతంలోంచీ, తత్సంబంధ జీవన విధానంనుంచీ, విలువలనుంచీ రూపుదిద్దుకుంది. ఇరవైయ్యవ శతాబ్దంనాటి వరకూ కూడా దళితులకు విద్య అనేది గగన కుసుమంగానే వుండిపోయింది. ఆకాలంలో పాఠశాలలు దేవాలయ ప్రాంగణాల్లో వుండేవి. అంటరానితనం అనే దారుణమైన ఆచారం కారణంగా దేవాలయాలలో అడుగుపెట్టే అర్హతలేని దళితులకు విద్య సైతం దూరంగా వుండిపోయింది. జ్ఞానాన్ని సృష్టించేవారుగా, సమీకరించేవారుగా, సంరక్షించేవారుగా, వ్యాప్తిచేసేవారుగా బ్రాహ్మణులే అన్ని పాత్రలూ పోషించేవారు. విద్యపై వారిదే గుత్తాధిపత్యం. దళితులకూ, ఇతర బడుగువార్గాల వారికీ బ్రాహ్మణులు విద్యను నిరాకరించారు. విద్య ద్వారా రూపుదిద్దుకునే సంస్కృతి మొత్తం సామాజిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో కీలక పాత్రను పోషిస్తుంది. అందువల్లనే నాటి విద్య అగ్రవర్ణాల ప్రయోజనాలకు అనుగుణంగా సాంస్కృతిక విలువలను ప్రతిష్టించింది.

భూస్వామిక, మతపరమైన ఆనాటి వాతావరణం విద్యను ఒక మహా పవిత్రాంశంగా నిలిపింది. సాంప్రదాయిక విద్యలో ద్విజులు, శూద్రులు, చేతివృత్తులవారు అనే ప్రస్తావన ఏదో ఒక రూపంలో కనిపిస్తుంటుంది. మతపరమైన గ్రంథాలకు, శాస్త్రాలకు బ్రాహ్మణులే వ్యాఖ్యాతలు. ఆ వ్యాఖ్యానాలలోని అంశాలను నాలుగు వర్ణాలలోని నిరక్షరాస్యులకోసం బ్రాహ్మణులే స్థానిక మాండలికాల్లో వివరిస్తుంటారు. క్షత్రియులు పాలించడం నేర్చుకోవాలి. వివిధ ఆయుధాలను ఉపయోగించడం నేర్చుకోవాలి. రాజ్యవ్యవహారాల నిర్వహణ, పాలనా పద్ధతులు నేర్చుకోవాలి. అందుకు వారికి తప్పనిసరిగా కొంతమేరకు పాఠశాల విద్య అవసరం. ఇక వైశ్యులకు లెక్కలు, వ్యాపార లావాదేవీలు, పద్దు పుస్తకాల నిర్వహణ మొదలైన పనుల కోసం కొంత చదువు కావాలి. శూద్రులకు, దళితులకు, చేతివృత్తుల వారికి ఒకవిధమైన వృత్తినైపుణ్యం అవసరం. అయితే దానిని వారు తమ ఇళ్లల్లోనే నేర్చుకోవచ్చు అన్నారు బ్రాహ్మణులు. ఈ విధంగా కేవలం శూద్రులను, దళితులను మాత్రమే విద్యకు దూరంగా వుంచారు. వారి పిల్లలకు చదువు చెప్పడానికి నిరాకరించారు. అంతేకాదు ఆనాటి న్యాయకోవిదుడైన మనువు శూద్రులు చదువు నేర్చుకోవడం (అక్షరజ్ఞానం సంపాదించుకోవడం) నేరమని తీర్మానించాడు.[1] ఇలాంటి ఆంక్షలు మన సమాజంలో పందొమ్మిదో శతాబ్దం ద్వితీయార్థం వరకు నిరాటంకంగా కొనసాగాయి.

---

1. మనువు ఉద్దేశం ప్రకారం అంటరానివాళ్ల మూలాలు కులసంకరంలో వున్నాయి. అనులోమ సంబంధాల వల్ల పుట్టిన పిల్లల కంటే (అగ్రకులం తండ్రికీ తక్కువ కులం తల్లికీ పుట్టిని పిల్లలు) – ప్రతిలోమ సంబంధాల వల్ల పుట్టిన పిల్లలు (శూద్ర కులం తండ్రికీ, బ్రాహ్మణ కులం తల్లికీ పుట్టిన పిల్లలు) నీచంగా పరిగణించబడతారు. ఈ కులాంతరాలకు (వర్ణ సంకరానికి) సంబంధించిన వివరాలు అనుబంధ పట్టిక 1లో చూడవచ్చు.

వలసవాద కాలంలో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియాలలోని సాంప్రదాయిక సమాజాలు కీలకమైన ఆర్థిక, రాజకీయ మార్పులకు గురయ్యాయి. వలసవాదులు తమ వలస ప్రాంతాలను తమ అవసరాలకు అనుగుణంగా మలచుకుని గుప్పిట్లో పెట్టుకోవాలనే ఉద్దేశంతో తమ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలను ఆ సమాజాలలో వ్యాపింపజేశారు. అదేవిధంగా తమ రాజకీయార్థిక అవసరాలకోసం తమ మాతృదేశంలో మాదిరి విద్యా వ్యవస్థను ప్రవేశపెట్టారు. వలసవాద విద్యా వ్యవస్థ పుణ్యమాని కొద్దిమంది భారతీయులు విద్యావంతులై పాశ్చాత్య ఉదారవాద భావాలనుంచి, సంస్కరణ వాదుల ఆలోచనలనుంచి ప్రేరణ పొంది సాంప్రదాయిక భారత సమాజంలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ కొత్త విద్యా విధానం తాలూకు సామాజిక పునాది కేవలం పట్టణ ప్రాంతాల్లోని అగ్రవర్ణాల పురుషులకూ, కొద్దిమంది ముస్లిం మతస్థులకూ, నిమ్నకులాల వ్యక్తులకు మాత్రమే పరిమితమయింది.

వలసవాద పాలకుల విధానాలూ ఆలోచనలూ వస్తుగతంగా, ప్రయోజన పరంగా భారతీయ సంస్కర్తల దృష్టిలో, క్రైస్తవ మిషనరీల దృష్టిలో పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. బ్రిటిష్ ప్రభుత్వ విద్యా విధానానికి రెండు లక్ష్యాలున్నాయి. 1. వలసవాద భావ వ్యాప్తి 2. పాలనాపరమైన అవసరాలు. అయితే భారతీయ మేధావులు మాత్రం విద్యను విముక్తికీ, దేశ పునరుజ్జీవనానికీ ఒక సాధనంగా వినియోగించుకోవాలని భావించారు. ఇక క్రైస్తవ మిషనరీలైతే విద్యను ప్రధానంగా తమ మత ప్రచారానికి వాడుకున్నారు.

దళిత విద్య - తొలి ప్రయత్నాలు

ఆధునిక ఐరోపాలో మొదట్లో నవీన విద్యా ప్రయత్నాలన్నీ జనబాహుళ్యం కోసం, జాతికోసం, నూతన సంస్థల ఏర్పాటుకోసం వినూత్న సాంకేతిక పద్ధతులను ముందుకు తెచ్చాయి. ప్రజాదరణపొందిన విద్య కూడా అలౌకిక స్వప్నాల, యుగ సిద్ధాంత దృక్పథం నుంచి ప్రేరణ పొందింది. డెన్మార్క్ హానోవర్ రాజప్రసాదాల వరకూ విస్తరించిన ఆనాటి ఉద్యమం హాలే విశ్వవిద్యాలయానికి చెందిన ఆగస్ట్ హెర్మన్ ఫ్రాంక్ (1663-1717) నుంచి సెయింట్ జేమ్స్ న్యాయ స్థానం నుంచి ఉత్తేజం పొందింది. క్రైస్తవ జ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్లే సమాజ సృష్టికి దోహదం చేసింది. భారతదేశంలో విద్యా కార్యక్రమాన్ని చేపట్టింది అదే. 1780 నాటికల్లా క్రైస్తవ ఫ్రెడరిక్ స్క్వార్ట్జ్, అతని అనుయాయులు నడిపే పాఠశాలలు అనేకమంది క్రైస్తవేతరులను, ప్రత్యేకించి బ్రాహ్మణులను, ఇతర అగ్రవర్ణాల వారిని ఆకర్షించాయి. వాళ్లు ఈ కొత్త చదువుల ద్వారా వేగంగా విస్తరిస్తున్న కంపెనీ కార్యాలయాల్లో ఉన్నత ఉద్యోగాలను

సంపాదించుకోవచ్చని ఆశించారు.

పందొమ్మిదో శతాబ్దం తొలి అర్థభాగంలో మద్రాస్ ప్రెసిడెన్సీలోని విద్యారంగ చరిత్రలో గణనీయమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. అక్షరాస్యత కేవలం బ్రాహ్మణులకు, వ్యాపారస్థులకు, భూస్వాములకు, బడా రైతులకు మాత్రమే పరిమితమవడాన్ని గమనించిన మద్రాస్ గవర్నర్ (1820–27) సర్ థామస్ మన్రో ఒక సమగ్రమైన, దూరదృష్టితో కూడిన పథకాన్ని ప్రవేశపెట్టాడు. దేశవాళీ విద్యా విధానాలలో జోక్యం చేసుకోవాలనే ఉద్దేశం మన్రోకి లేకపోయినా, ప్రజలు తమ పద్ధతిలో తాము పాఠశాలలను నిర్వహించుకోవాలనే ఉద్దేశం కలిగినవాడు కాబట్టి అన్ని జిల్లాల్లో వున్న మొత్తం పాఠశాలల జాబితాను రూపొందించాలంటూ అధికార్లను ఆదేశించాడు. ఒక్కో జిల్లాలో ఎన్ని పాఠశాలలున్నాయి? వాటిలో ఎంతమంది విద్యార్థులు చదువుకుంటున్నారు? ఎంతమంది ఉపాధ్యాయులున్నారు? వారి కులాలేమిటి? అక్కడ ఏ పుస్తకాలు, ఏ సామాగ్రిని ఉపయోగిస్తున్నారు? ఆ పాఠశాలల నిర్వహణకు నిధులు ఎక్కడినుంచి వస్తున్నాయి? ఆ జిల్లాల్లోని మొత్తం జనాభా ఎంత? మొదలైన వివరాలన్నీ పొందుపరచాలని సూచించాడు. ఆ సర్వే ఫలితంగానే 1820లలో –ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 1823–25 సంవత్సరాల్లో విద్యకు సంబంధించిన అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. మద్రాస్ ప్రెసిడెన్సీ అంతటా కలిపి అప్పట్లో మొత్తం 12,498 పాఠశాలలుండేవి. జనాభా 1,28,50, 941. చదువుకునే విద్యార్థుల సంఖ్య 1,80,000. అలాగే వెయ్యి మందికి ఒక పాఠశాల చొప్పున అందుబాటులో వుండేదనీ, ప్రతి 67 మందిలో ఒకరు విద్యార్థిగా వుండేవారనీ తెలిసింది.

నాటి విద్య బ్రాహ్మణుల నియంత్రణలో వుండేది. వస్తువు మతపరమైనదిగా వుండేది. సంస్కృతం, తెలుగు బోధనా మాధ్యమాలుగా వుండేవి. మొత్తం విద్యార్థులలో బ్రాహ్మణుల సంఖ్య 60 నుంచి 75 శాతం వరకు వుండేది. శుద్ధ బ్రాహ్మణేతర విద్యార్థులలో చెట్టీలు, కోమట్లు, ఒకనాటి గ్రామ పాలకులైన రెడ్డి, కమ్మ, రాజు కులాలకు చెందిన వాళ్లు వుండేవారు. ఆనాటి పాఠశాలల్లో ఉపయోగించే పాఠ్య గ్రంథాలలోని అంశాలన్నీ నేరుగా వేదలనుంచి, వివిధ శాస్త్రాల నుంచి, పురాణాలు, ఇతిహాస గ్రంథాలనుంచి సంగ్రహించినవై వుండేవి.[2] ఉపాధ్యాయులందరూ చాలావరకు బ్రాహ్మణ కులానికిచెందినవారై వుండేవారు.

---

2. ఉదాహరణకు రాజమండ్రిలోని పాఠశాలల్లో, కళాశాలల్లో వేదాలు, శాస్త్రాలు కాకుండా పాఠ్య గ్రంథాలుగా ఉపయోగించని ఇతర పుస్తకలు ఇలా వున్నాయి: బాల రామాయణం,

అయితే ఆ సర్వేలో అంటరాని కులాల వారిని చేర్చకపోవడం ఆశ్చర్య కలిగిస్తుంది. 'పరయ' కులానికి చెందిన వారిని అంటే శుభ్రతలేని శూద్ర కులాన్ని సర్వేనుంచి కుట్ర పూరితంగానే మినహాయించారు. మొత్తం జనాభాలో యాభై శాతం వరకు వుండే అంటరాని కులాల వాళ్లని – పరయాలను, పలార్లను (తమిళం మాట్లాడే ప్రాంతాల్లో); మాల మాదిగలను (తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో) ఆ సర్వేలో అసలు పరిగణనలోకే తీసుకోలేదు. సర్వే ఫారాలను తయారు చేసిందీ, సర్వేలో పాల్గొన్నదీ ప్రధానంగా బ్రాహ్మణులే అవడం ఇందుకొక కారణమని స్పష్టమవుతుంది. దళిత వాడల్లో తిరుగుతూ, దళితుల వివరాలను సేకరించే దుస్థితిని వారు తమకు తాముగా నివారించుకున్నారు. ఆనాటి విద్యార్థులలో పిడికెడుమంది వెనుకబడిన కులాలలకు చెందిన వాళ్లు తప్ప అంటరాని కులాలలకు చెందిన వాళ్లు ఒక్కరు కూడా లేరని మద్రాస్ విచారణల్లో తేలింది. వడబోత సిద్ధాంత ప్రభావంతో, అగ్రవర్ణ హిందువులకు కోపం వస్తుందనే ఉద్దేశంతో బ్రిటిష్ ప్రభుత్వం దాదాపు పందొమ్మిదో శతాబ్దం ద్వితీయార్థం వరకూ కూడా భారతదేశంలో అంటరానికులస్థులకు విద్యా సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నించలేదు. వెనుకబడిన కులాలతో పాటు అంటరాని కులాలకు చెందిన వాళ్లను కూడా విద్యావంతుల్ని చేసేందుకు క్రైస్తవ మిషనరీలు చేసిన కృషిని కూడా అధికారవర్గం పెద్దగా పట్టించుకోలేదు. నాటి క్రైస్తవ మిషనరీల ప్రయత్నాల మూలంగానే పందొమ్మిదో శతాబ్దం నాటికి దళిత చైతన్యం క్రమేణా ఊపందుకుంది.

విద్య ప్రాధాన్యతను గుర్తించి 1813 చార్టర్ యాక్ట్ – కంపెనీకి చెందిన భారత ప్రాంతాలలో పనిచేసేందుకు మిషనరీలకు అనుమతిని ప్రసాదించింది. 1837లో ఇంగ్లీషును పరిపాలనా భాషగా ప్రకటించారు. 1844లో భారతీయులకు దిగువ స్థాయి ఉద్యోగాలను కల్పిస్తూ ప్రభుత్వం ఒక తీర్మానం చేసింది. దాంతో ఇంగ్లీషు విద్య ఆకర్షణీయంగా మారి వేగంగా విస్తరించింది. 1854నాటి సుప్రసిద్ధ వూడ్స్ నివేదికలో ప్రజలను కేవలం ఇంగ్లీషు ద్వారా మాత్రమే కాక స్థానిక భాషల ద్వారా విద్యావంతుల్ని చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. 1854 నివేదిక వెలువడిన అనంతరం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ వారు విద్యా శాఖ బాధ్యతలను కూడా తీసుకున్నారు. రేట్ స్కూల్స్ అనేవి ప్రెసిడెన్సీకీ, ఆంధ్రాకూ కొత్త. వాటిని మొదటగా గోదావరి జిల్లాలో

రుక్మిణీ కళ్యాణం, కృష్ణ శతకం, సుమతీ శతకం, వసు చరిత్ర, మను చరిత్ర, భాగవతం, గజేంద్ర మోక్షం మొదలైనవి. పూర్తి వివరాలకోసం 19 సెప్టెంబర్ 1823 నాటి కలెక్టర్లకు రెవన్యూ బోర్డుకు మధ్య జరిగిన ఉత్త ప్రత్యుత్తరాలను, తమిళనాడు రాష్ట్ర భాండాగారాలను, రెవెన్యూ బోర్డు ప్రొసీడింగ్స్ వాల్యూమ్ నెం. 963ని చూడవచ్చు.

ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా గ్రామీణులు తమ పిల్లల్ని చదివించేందుకు ముందుకు రావాలి. తమ గ్రామాల్లో పాఠశాలల్ని నిర్వహించేందుకు రైతులు స్వచ్ఛందంగా రేట్‌ను లేదా చందాని చెల్లించాలి. ఇందుకు రైతులు అంగీకరించారు. అయితే రేట్ స్కూళ్ల విధానం ప్రధానంగా భూమి వున్న రైతులకు సంబంధించింది. వారు ఇతర పన్నులతో పాటు ఈ పాఠశాలల నిర్వహణా రుసుమును కలిపి ప్రభుత్వానికి చెల్లించేవారు. అయితే అంటరాని కులాలకు చెందినవాళ్లంతా దాదాపు భూమిలేని వ్యవసాయ కూలీలే కాబట్టి ఈ రేటు స్కూళ్ల వల్ల వాళ్లేమీ లబ్ధిపొందలేకపోయారు. దరిమిలా ఈ స్వచ్ఛంద రేటు పథకం తన లక్ష్యాన్ని నెరవేర్చలేకపోయింది. దాంతో ఆ పథకాన్ని క్రమబద్ధీకరించి 1863లో మద్రాస్ ఎడ్యుకేషన్ యాక్టును తీసుకొచ్చారు.

భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టాలని తీసుకున్న నిర్ణయం ఆధునిక భారతదేశ చరిత్రలో ఒక మైలురాయి వంటిది. ఇంగ్లీషు విద్య ప్రవేశంతో ప్రాచ్య ప్రపంచం నుంచి పాశ్చాత్య ప్రపంచంలోకి తలుపులు తెరుచుకున్నాయి. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇంగ్లీష్ విద్యను మొట్టమొదటగా పద్దెనిమిదవ శతాబ్దం చివరలో జాన్ సలివాన్ ప్రవేశపెట్టాడు. ఆ తరువాత దానిని క్రైస్తవ మిషనరీలు మరింత ముందుకు తీసుకెళ్లారు. బ్రిటిష్ వాళ్లు విద్యను తమ బాధ్యతగా, తమ ఆధిపత్యాన్ని బలోపేతం చేసేసాధనంగా భావించారు. క్రైస్తవ మిషనరీలు, వలసవాద ప్రభుత్వం, ఇతర మానవతావాదుల కృషి ఫలితంగా పాశ్చాత్య విద్య తెలుగు మాట్లాడే ప్రాంతాలకు పందొమ్మిదో శతాబ్దం ద్వితీయార్థంలో నెమ్మదిగా విస్తరించింది. తమ మత మార్పిడి కార్యక్రమంలో భాగంగా క్రైస్తవ మిషనరీలు విద్యాసంస్థలను నెలకొల్పి పాశ్చాత్య విద్యను నేర్పడం, బడుగువర్గాల అభ్యున్నతిపట్ల ఆసక్తి చూపడం మొదలుపెట్టారు.

మద్రాసు ప్రెసిడెన్సీలో 1841లో వలసవాద ప్రభుత్వం ఇంగ్లీషు మాధ్యమం ద్వారా పాశ్చాత్య విద్యను ప్రవేశపెట్టింది. అదే సంవత్సరం మద్రాస్ ప్రెసిడెన్సీలో ఒక కళాశాలను నెలకొల్పారు. ప్రజల్లో విద్యా వ్యాప్తికి మద్రాస్ ప్రభుత్వం చేసిన కృషి విశిష్టమైనది. కానీ అది స్వల్పకాలంపాటే కొనసాగింది. బెంగాల్, బొంబాయి ప్రభుత్వాలు ఉన్నత వర్గాలకు ప్రాచ్య విద్యను అందించాలా లేక పాశ్చాత్య విద్యను అందించాలా అని మల్లగుల్లాలు పడుతున్న దశలోనే మద్రాస్ గవర్నర్ సర్ థామస్ మన్రో ఇక్కడి ప్రజలకు ప్రాంతీయ భాషల్లో సార్వత్రిక విద్యను అందించేందుకు కృషిచేశాడు. అనేకమంది భారతీయుల పరిస్థితిని తీర్చిదిద్దేందుకు దోహదం చేశాడు. అయితే అది ఎంతో కాలం కొనసాగలేదు. 1822 నుంచి ప్రజలకు స్థానిక భాషల్లో విద్యను అందించేందుకు ఆయన పెద్ద ఎత్తున ప్రయత్నించినప్పటికీ 1830లో ఆయన మరణంతో

అది ఆగిపోయింది. దాంతో పరిస్థితి తిరిగి ఆంగ్ల విద్యకు అనుకూలంగా మారిపోయింది. వివిధ కులాల వాళ్లు విద్యను వివిధ దృక్పథాలతో చూశారు. చదువు మీద గుత్తాధిపత్యం కలిగివున్న అగ్రకులాల వాళ్లు మార్పునకు దోహదపడే ఆంగ్ల విద్యను అక్కున చేర్చుకున్నారు. కింది కులాలవాళ్లకు మాత్రం మొదట్లో అది దూరంగా వుండిపోయింది. ఆధునిక విద్య మానసిక శ్రమ గురించి ప్రస్తావిస్తుంది. కింది కులాల వాళ్లు అందులోనూ అంటరాని కులాల వాళ్లు శారీరక శ్రమలో కూరుకుపోయివుంటారు. తమ సాంప్రదాయిక నైపుణ్యాలకూ ఈ ఆధునిక విద్యకూ సంబంధంలేదని వారు భావించారు.[3]

మహాత్మా జోతీరావు పూలే (1826–90) దళిత విద్యకు వేగుచుక్కవంటి వారు. బొంబాయి ప్రెసిడెన్సీలో అంటరాని వాళ్ల కోసం ఆయన 1851లోనే ఒక ప్రత్యేక పాఠశాలను ప్రారంభించారు. మొత్తం భారతదేశంలోనే అంటరాని వాళ్లకోసం స్థాపించిన మొట్టమొదటి పాఠశాల అదే. మహాత్మా పూలే సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించి అంటరానివాళ్లు చదువుకోవలసిన ఆవశ్యకతను ప్రభోదించారు. ఆధునిక విద్యను శాస్త్రీయ పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవలసిన అవసరాన్ని చాటిచెబుతూ సాంస్కృతిక విప్లవ సాధనకు ఆధునిక విద్య ఒక ఆయుధంలాంటిదని పేర్కొన్నారు. విద్యకూ అణగారినతనానికీ మధ్య వున్న సంబంధాన్ని విశ్లేషిస్తూ ఆయన విద్య లేకపోవడం వల్ల విజ్ఞానం క్షీణిస్తుంది, విజ్ఞానం లేకపోతే నైతికత దెబ్బతింటుంది, అభివృద్ధి లోపిస్తే సంపద హరిస్తుంది, సంపదలేకపోవడం వల్లనే శూద్రులు సర్వనాశనమవుతున్నారు అన్నారు. అందుకే అంటరానివారి అభ్యున్నతి కోసం ఆయన పాఠశాలలు నెలకొల్పడం ప్రారంభించారు. పూనా పరిసర ప్రాంతాలలో ఆయన 1848–1852 మధ్య కాలంలో మొత్తం 18 పాఠశాలలు నెలకొల్పారు. తన శ్రీమతి సావిత్రీ బాయి పూలే (1831–1897)తో కలిసి ఆయన ఒక ఉద్యమంలా ప్రజల విద్యాభివృద్ధికి పాటుపడ్డారు. ఆయన కృషి భారతదేశంలోని అనేక ప్రాంతాలపై ఎంతో ప్రభావాన్ని కలిగించింది. పాశ్చాత్య, మానవతావాద, ఉదారవాద, హేతువాద భావజాలం వున్న ఇతర సంఘసంస్కర్తలకు గొప్ప ఉత్తేజాన్నిచ్చింది. దాంతో అనేకమంది అంటరానివారి అభ్యున్నతి కోసం నడుంబిగించారు. ఆ తరువాత ఎందరో భారతీయ రాజులు– ముఖ్యంగా బరోడా, మైసూరు, ట్రావెంకూరు సంస్థానాదీశులు, హిందూ

---

3. చేతివృత్తులు దెబ్బతిని జీవనభృతిని కోల్పోయినప్పుడు వ్యవసాయం కంటే ఎక్కువగా ప్రజలకు విద్యే ప్రత్యామ్నాయ జీవనోపాధిని చూపించింది. చౌహాన్ 1967. పే.232.

సంఘ సంస్కర్తలు తమ బ్రిటిష్ సలహాదార్ల ప్రోద్భలంతో అంటరానివారి అభివృద్ధిపట్ల మానవీయ, రాజకీయ ఆసక్తిని కనబరిచారు. ఈ క్రమంలోనే పిఠాపురం మహారాజావారు అంటరాని వాళ్లకోసం ఉచిత వసతి సౌకర్యాలతో కూడిన ఒక (బోర్డింగ్) పాఠశాలను నెలకొల్పారు. ఇరవైయ్యవ శతాబ్దపు తొలినాళ్ల దళిత మేధావుల్లో అనేకమంది ఈ పాఠశాలనుంచి వచ్చినవాళ్లే.

1930 దశకం ప్రారంభం వరకూ వలసవాద ప్రభుత్వం అంటరానివాళ్ల చదువుకోసం పెద్దగా ప్రయత్నం చేయలేదు. 1882నాటి విద్యా కమిషన్ ద్వారా వలసవాదులు ప్రభుత్వ నిర్వహణలో వున్న లేదా ప్రభుత్వ సహాయం పొందుతున్న పాఠశాలలు విధిగా అన్ని కులాల వారిని చేర్చుకోవాలని ఓ ఆదర్శప్రాయమైన సిఫారసు చేశారు. అయితే వలసవాద ప్రభుత్వం దాదాపు 50 సంవత్సరాల పాటు తన ఆదేశాలను కచ్చితంగా అమలుపరిచేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దాదాపు అర్థ శతాబ్దం అనంతరం వెనుకబడిన తరగతులవారిలో విద్యను ప్రోత్సహించేందుకు 1931లో ఒక వెనుకబడిన తరగతుల విభాగాన్ని ఏర్పాటు చేశారు. మద్రాసులో ఆ విభాగానికి ఒక కమిషనర్‌ను నియమించారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో బడుగు వర్గాల వారికి ప్రవేశ హక్కును కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అణగారిన వర్గాల వారు 1917లో “భారత దళిత వర్గాల సేవా సంఘం” పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. దాని ద్వారా నిర్బంధ ఉచిత విద్యను డిమాండ్ చేశారు. దళిత వర్గాల విద్యా సంఘం 1928లో ఏర్పడింది. ఈ సంఘాలన్నీ తమ పిల్లల చదువుకోసం కృషిచేశాయి. కొన్ని సంస్థానాల్లో పరిస్థితి కొంతమేరకు మెరుగ్గా వుండేది. ముఖ్యంగా ట్రావెంటూరు, కొచ్చిన్, బరోడా వంటి అభ్యుదయ సంస్థానాలు 1926లోనే దళిత వర్గాల వారికోసం విద్యా సౌకర్యాలను కల్పించాయి. అయితే ఆ ప్రగతిశీల ప్రయత్నాన్ని అగ్రవర్ణాలవారు గట్టిగా ప్రతిఘటించారు. ప్రభుత్వ చర్యలకు నిరసనగా వారు తమ పిల్లల్ని ఆ పాఠశాలల నుంచి ఉపసంహరించుకున్నారు. అగ్రవర్ణాల ప్రతిఘటనకు తలొగ్గిన సంస్థానాలు 1931లో అంటరానివాళ్లకు ప్రత్యేక పాఠశాలల్ని రద్దుచేశాయి.

మిషనరీల పాత్ర

దళిత విద్యా చరిత్రలో మిషనరీలు నిర్వహించిన పాత్ర అపూర్వంగా, అద్భుతమైన ప్రభావాన్ని కనబరచినట్టు స్పష్టమవుతోంది. ఆధునిక క్రైస్తవ మతప్రచార సంస్థల చరిత్రలో విద్యా కార్యక్రమం అనేది ఒక నూతన మత ప్రచార విధానంగా

ముందుకొచ్చింది. అది స్కాట్‌లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ డఫ్ "ఫ్రీ చర్చ్"తో మొదలైంది. క్రైస్తవ మత ప్రచార సంస్థలు తమ పాఠశాలల ద్వారా బోధించే పాశ్చాత్య విద్య, విలువలు క్రైస్తవ మత ప్రచారానికి గొప్ప సాధనంగా తోడ్పడతాయనేది ఆయన విశ్వాసం. తెలుగు ప్రజల్లో క్రైస్తవ మత ప్రచార సంస్థల కార్యక్రమాలు 15వ శతాబ్దిలోనే ప్రారంభమయ్యాయి. అప్పుడు ఇద్దరు జెసూట్ ఫాదర్‌లు, ఒక బ్రదర్ చిత్తూరు జిల్లాలోని చంద్రగిరిలో పనిచేశారు.

క్రైస్తవ మిషనరీలు అణగారిన, బడుగు వర్గాల ప్రజల్లో విద్యావ్యాప్తికి కృషిచేశారు. ఆంధ్రాలో ప్రప్రథమంగా అంటరానివారిని నాగరీకరించేపనికి పూనుకున్నది వాళ్లే.[4] క్రైస్తవ మిషనరీలు ప్రత్యేకించి ప్రొటస్టెంట్లు ముందుగా ఆంధ్రాలో అంటరానికులాల ప్రజల మధ్య పనిచేశారు. బడుగువర్గాల సంక్షేమానికి అత్యంత పట్టుదలతో కృషిచేసిన మిషనరీలు వేలాదిమందిని క్రైస్తవ మతం వైపు ఆకర్షించగలిగారు. భయంకరమైన కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు వారు కనబరచిన మానవతా దృక్పథం అనేక విధాలుగా వ్యక్తమయింది. 1876-79 మధ్యకాలంలో సంభవించిన దారుణమైన కరువు సందర్భంగా కరువు కోరల్లో చిక్కుకున్న తెలుగు, తమిళ ప్రాంతాల ప్రజానీకానికి వారు ఎనలేని సేవలు అందించారు. అంటరాని కులాలకు చెందిన ప్రజలు ఇటు తమను ఈసడించుకునే హిందూ మతానికీ అటు ప్రేమతో అక్కున చేర్చుకుని ఆదరించే క్రైస్తవ మతానికీ మధ్య వున్న తేడాని గుర్తించి క్రైస్తవ మతంలో చేరిపోయారు. ముఖ్యంగా కరువు వాతబడి అనాథలుగా మారి క్రైస్తవ మిషనరీల ఆపన్న హస్తంతో బతికి బట్టకట్టిన అంటరాని కులాల ప్రజలు క్రైస్తవ మతంలో చేరడం ఏమీ ఆశ్చర్యం కలిగించదు. తమ సహాయక చర్యలు, సేవా కార్యక్రమాలు బీదలను ఆకర్షించి, ఆ తరువాత వారిని తమ మతానికి విధేయులుగా మారుస్తాయనీ మిషనరీల నమ్మకం.

1876-79 కరువు అనంతరం పందొమ్మిదో శతాబ్దపు చివరి దశలో ఆంధ్రాలో పెద్ద ఎత్తున మతమార్పిడులు జరిగాయి. అతి కింది స్థాయినుంచి వచ్చినప్పటికీ మాల మాదిగలు గౌరవంగా చూడబడ్డారు. మిషనరీలు వారితో స్వేచ్ఛగా వ్యవహరించారు. వారు ఒకపక్క వస్తురూపంలో సాయం అందించడం, మరోపక్క గౌరవమర్యాదలు కనబరచడం మాల మాదిగలకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. మతమార్పిడి వల్ల తమకు మర్యాద, ఆత్మగౌరవం పెరగడమేకాక, తమను సాటిమనుషుల్లా

---

4. బి.ఆర్. అంబేద్కర్ 29 మే 1928న ఇండియన్ స్టాట్యుటరీ కమిషన్‌కి సమర్పించిన "బొంబాయి ప్రెసిడెన్సీలో దళిత వర్గాల విద్య స్థితిగతులపై నివేదిక" ను చూడండి.

పట్టిక 3.1
1871 - 1931 మధ్యకాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీలో క్రైస్తవ జనాభా పెరుగుదల

జిల్లా	1871	1881	1891	1901	1911	1921	1931
1. గంజాం	679	1,551	2,292	2,426	2,367	1,969	8,584
2. విశాఖపట్నం	2,185	3,410	3,014	4,191	4,983	5,656	34,124
3. గోదావరి*	1,483	3,687	8,622	16,వ66	8,240	14,237	-----
4. ప. గోదావరి	----	----	----	----	----	----	29,577
5. తూ. గోదావరి	----	----	----	----	----	----	62,661
6. కృష్ణా	7,670	36,194	68,524	1,01,414	49,863	91,087	1,01,289
7. గుంటూరు**	----	----	----	----	1,23,707	1,53,510	2,37,727
8. నెల్లూరు	3,012	20,794	47,176	53,948	44,298	52,496	65,593
9. కడప	4,973	6,067	9,725	18,923	22,408	25,739	36,667
10. బళ్లారి	5,545	4,129	5,283	5,066	4,481	3,532	7,113
11. అనంతపురం***	857	1,783	2,675	3,636	4,923	6,546	
12. చిత్తూరు	----	----	2,535	3,864	4,558	6,916	10,645
మొత్తం	29,402	88,144	1,71,689	2,42,609	3,10,609	4,13,721	6,74,826

* *గోదావరి జిల్లా 1920లలో రెండు జిల్లాలుగా విభజించబడింది.*

** *అనంతపుర జిల్లా 1882లో ఏర్పడింది.*

*** *చిత్తూరు జిల్లా 1900లో ఏర్పడింది.*

గంజాం, విశాఖపట్నం గోదావరి జిల్లాలతో కూడిన ఏజెన్సీ ప్రాంతంలోని జనాభాను, కర్నూలు జిల్లాలోని బనగానపల్లి, బళ్లారి జిల్లాలోని పొందూరు సంస్థానం జనాభాను ఇందులో చేర్చలేదు.

ఆధారం : 1871, 1881, 1891, 1901, 1911, 1921, 1931 జనాభా లెక్కల నివేదికలు.

చూసే సహచరులు దొరకడం వంటి అపూర్వ ప్రయోజనాలు కలుగుతాయని వారు గుర్తించారు. హిందూ సమాజంలోని అంటరానివాళ్లకున్న నీచ స్థాయిని మతమార్పిడి పటాపంచలు చేసి వారికో కొత్త సామాజిక మతపరమైన గుర్తింపును తీసుకొచ్చింది. అది అగ్రకులాల వారి దయాదాక్షిణ్యాల మీదనో, వారి అనుమతి మీదనో ఆధారపడిన

పట్టిక 3.2
1871 - 1931 మధ్యకాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీలో మొత్తం జనాభా / క్రైస్తవ జనాభా పెరుగుదల

జిల్లా	1871		1901*		1931	
	మొ.జనాభా	క్రై.జనాభా	మొ.జనాభా	క్రై.జనాభా	మొ.జనాభా	క్రై.జనాభా
1. గంజాం	15,20,088	697	16,89,142	2,426	24,11,619	8,584
2. విశాఖపట్నం	21,59,199	2,185	20,82,662	4,191	36,07,948	34,124
3. గోదావరి	15,92,939	1,483	21,41,917	16,066	----	----
4. పశ్చిమ గోదావరి	----	----	----	----	19,20,582	29577
5. తూర్పు గోదావరి	----	----	----	----	12,23,056	62,661
6. కృష్ణా	14,52,374	7,670	21,54,803	1,01,414	12,54,208	1,01,289
7. గుంటూరు	----	----	----	----	21,35,660	2,37,772
8. నెల్లూరు	13,73,811	3,102	14,96,987	53,948	14,86,222	65,593
9. కడప	13,51,194	3,102	14,96,987	53,948	14,86,222	65.593
10.కర్నూలు	9,59,649	3,855	8,72,055	34,043	10,24,961	74,255
11.బళ్లారి	16,68,006	5,545	9,47,214	5,066	9,69,774	7,113
12.*అనంతపురం	----	----	7,88,254	2,675	10,50,411	6,546
13.చిత్తూరు	----	----	----	3,864	14,17,103	10,645
మొత్తం	1,20,80,251	28,402	1,34,64,301	2,42,616	1,93,80,941	6,74,826

* *గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాలతో కూడిన ఏజెన్సీ ప్రాంతాల్లో, కర్నూలు జిల్లాలోని బనగానపల్లి ప్రాంతంలో, బళ్లారి జిల్లాలోని పొందూరు సంస్థాన ప్రాంతంలో వున్న జనాభాను ఈ సంవత్సరాలలో లెక్కలోకి తీసుకోలేదు.*

గుర్తింపు కాదు. ఆ కొత్త గుర్తింపుద్వారా వారు క్రమంగా పరివర్తనచెందుతూ తమ వృత్తులను, హోదాను కూడా మార్చుకోగలిగారు. అంటరాని కులాలకు చెందిన ప్రజల్లో మతమార్పిడికి అనువైన పరిస్థితులు పుష్కలంగా వున్నాయని క్రైస్తవ మత ప్రచారకులు పసికట్టారు. అందుకే వారిని విద్యావంతుల్ని చేసి మెరుగైన జీవన ప్రమాణాలు అందుకునేందుకు సిద్ధం చేయడం మొదలుపెట్టారు. పందొమ్మిదో శతాబ్దపు తొలినాళ్ల నుంచీ క్రైస్తవమత ప్రచారకులు అంటరానివాళ్లకోసం పాఠశాలలు నెలకొల్పడం, వారిని క్రైస్తవ మతంలోకి మార్చడం చేస్తున్నారు. పందొమ్మిదో శతాబ్దపు ద్వితీయార్థం మొదలుకుని ఇరవైయ్యవ శతాబ్దపు తొలి దశాబ్దాల నాటి వరకు అనేకమంది

అంటరానివాళ్లు క్రైస్తవ మతం స్వీకరించారు.

ఆంధ్రాలో అంటరాని ప్రజల సామూహిక మతమార్పిడి ఉద్యమం ఇరవైయ్యవ శతాబ్దపు తొలి దశాబ్దాల వరకు ఉధృతంగా సాగింది. దళిత వర్గ జనాభాలో 1931 నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 20 శాతం మంది, కృష్ణా జిల్లలో 32 శాతం మంది, గుంటూరు జిల్లాలో 57 శాతం మంది క్రైస్తవ మతం స్వీకరించినట్టు అంచనా. కొన్ని ప్రాంతాలలో అంటరానివారి గూడాలకు గూడాలే క్రైస్తవ మతంలో చేరిపోయాయి. మతమార్పిడి చేసుకున్న వారి సంఖ్యను ఎక్కువగా పెంచింది మాల మాదిగలే. ఆ రోజుల్లో చర్చీలు పీడిత ప్రజల, కులహీనుల అవసరాలను నెరవేర్చి ఆదుకునేందుకే అవతరించాయని ఎవరైనా భావించినా పెద్దగా ఆశ్చర్యపోనవసరం లేదు.

మతమార్పిడి ఈ పీడిత ప్రజల జీవన విధానాన్ని మార్చడమే కాదు ఆ తదనంతరపు కాలంలో అగ్రకులాలకు చెందిన వాళ్లు కూడా అంటారిన వారి మార్గాన్ని అనుసరించేందుకు ప్రేరణనిచ్చింది. 1871-1931 మధ్య కాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడే వారి ప్రాతాలలో క్రైస్తవ జనాభా ఏవిధంగా పెరిగిపోయిందో పై పట్టికలో చూడవచ్చు.

క్రైస్తవ విశ్వాసానికి కులం ఒక బలమైన అడ్డంకిగా వున్న విషయాన్ని క్రైస్తవ మిషనరీలు గమనించారు. అందుకే పాఠశాలలను స్థాపించి, సామాజిక సంస్కరణలను తీసుకొచ్చి జీవన విధానంలో మార్పును తెచ్చే పద్ధతులను అవలంభించారు. హిందూ వ్యవస్థలో మరీ ముఖ్యంగా దళిత సమాజాల్లోని దురాచారాలను ఎదిరించే పనికి పూనుకున్నారు.

ఆవిధంగా ఆంధ్రాలో పనిచేసేందుకు 20 విభిన్న క్రైస్తవ మిషనరీలు వచ్చాయి. పద్దెనిమిదవ శతాబ్దం నాటికే మిషనరీలు ఆంధ్ర ప్రాంతంలో తమ కార్యక్రమాలను మొదలుపెట్టారు. కర్ణాటక మిషనరీ అనే మతప్రచార సంస్థ క్రీ. శ. 1700లో నెల్లూరులో మూడు సంవత్సరాలపాటు మత ప్రచార కార్యకలాపాలను ఉధృతంగా సాగించింది. ఆ జిల్లాలో అనేకమంది దళితులనే కాక ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఎందరో ఆదివాసీలను కూడా వారు విజయవంతంగా క్రైస్తవ మతంలోకి మార్చగలిగారు. దళితుల కోసం, ఆదివాసీల కోసం వారు అనేక పాఠశాలలను, చర్చీలను నిర్మించారు. వారి ప్రభావం కడప, కృష్ణా జిల్లాలకు కూడా విస్తరించింది. ఆ తదనంతరం ఆ సంఘం 1773లో ఫ్రెంచి దేశపు విదేశీ మతప్రచార పరిషత్తులో విలీనమైంది.

కడపలో 1735లో రోమన్ కాథలిక్ మిషన్; విశాఖపట్నంలో 1805లో లండన్ మిషనరీ సొసైటీ ఏర్పాటయ్యాయి. అవి తమ శాఖలను బళ్లారి, కడప, అనంతపూర్, విజయనగరం ప్రాంతాలకు విస్తరించాయి. వారు విశాఖపట్నంలో ఒక ఉన్నత

పాఠశాలను, ఒక పుస్తక ప్రచురణ సంస్థను నెలకొల్పారు. ఫ్రెంచివాళ్లు 1807లో కృష్ణా జిల్లాలో సొసైటీ డిమిషన్స్ స్ట్రేంజర్స్‌ను నెలకొల్పారు. 1832లో వికార్ ఆఫ్ అపోలిస్టిక్ మిషన్‌ను స్థాపించారు. ఆ తరువాత దానిని నెల్లూరు, కడప, అనంతపురం, కృష్ణా జిల్లాలకు విస్తరించారు. నెల్లూరులో 1840లో అమెరికన్ బాప్టిస్ట్ మిషన్‌ను ప్రారంభించారు. ఆ తదనంతరం అది నెల్లూరు పరిసర ప్రాంతాలు, ఉదయగిరి, ఒంగోలు, బాపట్ల, కంభం కర్నూలు లకు విస్తరించింది. అమెరికన్ లూథరన్ మిషన్ 1842లో ప్రవేశించి గుంటూరు, రేపల్లె, బాపట్ల, పలనాడు, వినుకొండ, బందారు, రాజమండ్రి తదితర ప్రాంతాలకు విస్తరించింది.

ప్రొటెస్టెంట్ మిషన్లు 1843లో నెల్లూరు, గుంటూరు, బందారు ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో తమ కార్య కలాపాలను ప్రారంభించాయి. అవి అనేక కళాశాలలను స్థాపించాయి. అందులో మచిలీపట్నంలోని నోబుల్ కళాశాల ఒకటి. ఆ తరువాత 1848లో స్కాట్‌లాండ్‌కు చెందిన ఫ్రీ చర్చి, 1865లో ఇంగ్లీష్ చర్చ్ మిషనరీ సొసైటీ ప్రవేశించి అదే మార్గాన్ని అనుసరించాయి. ఆ సంస్థలు కృష్ణ, గోదావరి, కర్నూలు, కడప జిల్లాల్లో పనిచేశాయి. నంద్యాల, ముత్యాలపాడు, బందారు, ఏలూరు, బెజవాడలతో సహా అన్ని ముఖ్యపట్టణాలలో తమ శాఖలను ఏర్పాటు చేసుకున్నారు. హెర్మాన్స్ బెర్గ్ లూథరన్ మిషన్ తన శాఖలను నాయుడుపేట, సాలోరుపేట, పూడూరు, వెంకటగిరి, కూడూరుపేటల్లో ఏర్పాటుచేసుకుంది. 1890లో ప్రవేశించిన కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ కాకినాడ, భీమునిపట్నం, శ్రీకాకుళం, బొబ్బిలి, తుని మొదలైన చోట్ల తన శాఖలను నెలకొల్పుకుంది. వీటికితోడు అమెరికన్ మధుర మిషన&, ది బాసెల్ ఎవాంజెలికల్ మిషన్, ది షెల్స్‌విగ్ హోస్టెన్ లూథరన్ మిషన్, ది సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ సేల్స్ మిషనరీలు మానవీయ దృక్పథంతో అణగారిన ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డాయి.

క్రైస్తవ మిషనరీల కృషి దళితులలో మూడు ముఖ్యమైన పద్ధతులలో అభ్యున్నతిని తీసుకొచ్చింది. ఒకటి: క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు సమాజంలో క్రైస్తవులుగా ఒక నూతన సామాజిక హోదా లభించింది. రెండు: హిందూ మతం పరిధిలోనే వుండిపోయిన దళితులకు తరతరాల తమ దుస్థితికి కారణమైన అంటరానితనం పచ్చి మోసమనీ, క్రైస్తవ మిషనరీలుగానీ బ్రిటిష్ ప్రభుత్వంగానీ దానిని ఏమాత్రం సమర్థించడంలేదనీ గ్రహించగలిగారు. మూడు: దళితులు క్రైస్తవ, ఇస్లాం తదితర మతాలవైపు తరలిపోకుండా నిరోధించేందుకు వారికి సామాజిక విద్యను అందించాలనీ, హిందూ మతాన్ని సంస్కరించాలనీ హిందూ మత సంఘ సంస్కర్తలకు ప్రేరణ కలిగింది. క్రైస్తవ మిషనరీల కార్యకలాపాల వల్లనే ఆంధ్ర దళితలు తమ సామాజిక, రాజకీయ హక్కుల గురించీ, ఆర్థిక సామాజిక అసమానతతో కూడిన తమ హోదా గురించీ

తెలుసుకోగలిగారు. క్రైస్తవ మిషనరీలు నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానాన్ని ప్రసాదించి, అంటరానివాళ్లకు వివిధ అవకశాలు కల్పించి, భారతీయులలో పాశ్చాత్య నాగరికతను, జాతీయ భావనా బీజాలను నాటారు. దళితులతో మమేకమై అమానవీయ హోదా నుంచి వారిని విముక్తుల్ని చేసి కొత్త ఆకాంక్షలకు ప్రాణం పోశారు. ఈ ప్రాంతానికి చెందిన అత్యధిక దళిత మేధావులకు క్రైస్తవ మిషనరీలతో వివిధ స్థాయిల్లో అనుబంధాలున్నాయి.

బ్రిటిష్ ప్రభుత్వ ఏజెన్సీల పాత్ర

అంటరానివాళ్లకు విద్యా సౌకర్యాన్ని కల్పించే వలసవాద విధానంలో క్రియాశీలత, సందిగ్ధత, లెక్కలు, మానవీయ అంశాలు సమ్మిళితమై వున్నాయి. అవి కాలాన్ని బట్టి మారుతూ వచ్చాయి. క్రైస్తవ మిషనరీలు ప్రారంభించిన దళితోద్ధరణ కార్యక్రమం కారణంగానే బ్రిటిష్ ప్రభుత్వం దళిత వర్గాలకు విద్యా సౌకర్యం కల్పించాల్సిన అవసరాన్ని దాని ప్రాధాన్యతను గుర్తించింది.

మొదట్లో వలసవాద ప్రభుత్వం దళిత విద్య సామాజిక సుహృద్భావానికి తప్పనిసరి కాదని, దోహదకారి కూడా కాదని భావించింది. అందుకే దళిత విద్య పట్ల ఒక ఉదాశీన వైఖరిని కనబరిచింది. దళిత విద్యను గట్టిగా అమలు చేస్తే అగ్రవర్ణ హిందువుల సహకారం తనకు లభించకుండా పోతుందని వలసవాద ప్రభుత్వం అనుమానించింది. అన్ని కులాల వారికీ విద్యా హక్కు సమానంగా వుందని గుర్తించినప్పటికీ ఇరవైయవ శతాబ్దపు తొలినాళ్ల వరకూ ఎలాంటి సాహసోపేత విధానాన్ని ప్రభుత్వం అమలు పరచలేక పోయింది. కులం కారణంగా చదువుకునే అవకాశాన్ని ఎవరికీ నిరాకరించకూడదని ప్రభుత్వం 1854లోనే ప్రకటించినప్పటికీ దళిత విద్య కుల వివక్ష కారణంగా నత్తనడకన సాగుతూవచ్చింది. దళిత విద్య విషయంలో వలసవాద ప్రభుత్వం అగ్రవర్ణ హిందువుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంది. దాంతో వలసవాద ప్రభుత్వం అగ్రవర్ణ హిందువులతో రాజీపడి "జాగ్రత్త – దూరదృష్టి" అనే విధానాన్ని అనుసరించింది.

ఏది ఏమైనా దళిత విద్యకోసం క్రమంగా చర్యలు తీసుకన్నారు. అంటరానివాళ్లని బడిలో చేర్చుకోకుండా అగ్రవర్ణ హిందువులు కల్పించే అడ్డంకులనూ, అలాగే దళిత పిల్లలకు పాఠాలు చెప్పడానికి అగ్రవర్ణ హిందువులు విముఖంగా వుండడం వల్ల ఏర్పడిన ఉపాధ్యాయుల కొరతనీ అధిగమించేందుకు ప్రయత్నించారు. వలసవాద ప్రభుత్వం 1854లో న్యాయస్థాన సంచాలకులకు యిచ్చిన ఒక సమాధానంలో కేవలం

కులం ప్రాతిపదికతతో ఎవరినీ ప్రభుత్వ పాఠశాలలో చేరకుండా అడ్డుకునేందుకు వీలులేదని స్పష్టం చేసింది. కానీ అగ్రవర్ణ హిందువుల ఉదాశీనత, సామాజిక ఆర్థిక బెదిరింపుల కారణంగా ప్రభుత్వానికి తన విధానాన్ని పునఃపరిశీలించుకోక తప్పలేదు. తత్ఫలితంగానే ప్రభుత్వం దళితుల సంఖ్యను బట్టి ఈ విషయంలో ఉదారంగా వ్యవహరించాలనీ ఒక నిబంధనను చేర్చారు. ఆ పాఠశాలలను ప్రభుత్వ నిధులతో నిర్వహించారు.

మద్రాస్ ప్రెసిడెన్సీలో అట్టడుగు వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరకుండా అగ్రవర్ణాల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరకేత ఎదురయ్యింది. 1891లో దళితులకు ప్రత్యేక పాఠశాలల విధానాన్ని స్వాగతిస్తూ హిందూ దిన పత్రిక ఇలా వ్యాఖ్యానించింది. ఒకే పాఠశాలలో అగ్రవర్ణాల పిల్లలూ, అట్టడుగువర్గాల పిల్లలూ కలిసి చదువుకుంటారని ఆశించడానికి వీలులేని అంశం. స్థానిక సంస్థలు ఈ విషయంలో ఏదో చేస్తాయని కూడా ఆశించలేం. కాబట్టి నాగరిక వ్యవస్థకు మాయని మచ్చలా మిగిలిపోయే అంటరాని కులాల వారిపట్ల ప్రభుత్వం కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధి ఎంతైనా సమర్థనీయం.

మద్రాసు ప్రభుత్వం 1893లో పంచముల చదువు పాలిటి మాగ్నాకార్టాగా అభివర్ణించతగ్గ స్థాయిలో అనేక ప్రతిపాదనలను ఆమోదించింది. వాటిలో కొన్ని ఇలా వున్నాయి: ప్రభుత్వ యాజమాన్యం కింద దళితులకు ప్రత్యేక శిక్షణా పాఠశాలలు నెలకొల్పి విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేయాలి; దళితులు గణనీయంగా వున్న గ్రామాలన్నింటిలో స్థానిక సంస్థలూ, మున్సిపాల్టీలూ వారికోసం ప్రత్యేక పాఠశాలలను నిర్వహించాలి; ప్రభుత్వ భూములను దళిత పాఠశాలలకు ఉచితంగా కేటాయించాలి; దళిత శ్రామికుల అవసరాలకు అనుగుణంగా రాత్రి పాఠశాలలను తెరవాలి; పాఠశాలలకోసం ఉపయోగించబడుతున్న భవనాలకు సంబంధించి గృహ నిర్మాణ రుణాలేమైనా వుంటే వాటిని ఆరేళ్ల వరకూ వసూలు చేయకుండా నిలిపియేయాలి; ఫీజుల చెల్లింపుల నుంచి దళిత విద్యార్థులను మినహాయించాలి; ఎయిడెడ్ పాఠశాలలకు ప్రత్యేక ఉపకారవేతనాలు, పలకలూ పుస్తకాల సౌకర్యం కల్పించాలి; క్రైస్తవ దళితులకు సమానావకాశాలనీ, సమభావాన్ని కనబరచాలి; అదేవిధంగా దళిత విద్య పట్ల విముఖంగా వుండే బ్రాహ్మణుల, ఇతర అగ్రవర్ణాల వారి స్థానంలో దళితుల ప్రగతిని ఆకాంక్షించే మిషనరీలకు చెందిన వారిని పాఠశాలల ఇన్స్పెక్టర్లుగా నియమించాలి అని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

ఈ ప్రాథమిక విద్యావాప్తి దళితుల అభివృద్ధికి ఎంతగానో దోహదంచేసింది. ప్రభుత్వం, స్థానిక సంస్థలు 1893 నుంచి తీసుకున్న ఈ ప్రత్యేక చర్యల కారణంగా ఎన్నో ప్రత్యేక పాఠశాలలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పథకాల నుంచి అదనపు ఆర్థిక సహాయాన్ని పొందగలిగాయి. దళిత విద్య కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు మిషనరీలకు, ఇతర మానవీయ సంస్థలకు, వ్యక్తులకు గొప్ప ఉత్సాహాన్నిచ్చాయి. అయితే ప్రభుత్వం దళిత విద్య కోసం ఇంతగా సహకరించినప్పటికీ ఒక సంవత్సరం అనంతరం సాధించిన ఫలితాలను బేరీజు వేస్తే అంత ఆశాజనకంగా ఏమీ కనిపించలేదు. అందుకు కారణం మిషనరీల కార్యకలాపాలు పట్టణ, మైదాన ప్రాంతాలకే పరిమితమవడం, సరైన ఉపాధ్యాయులు లభించకపోవడమే అని చెప్పవచ్చు.

అధికార్ల కుల పక్షపాత వైఖరివల్ల ప్రత్యేక పాఠశాలల నిర్వహణలో ఎన్నో సమస్యలు చోటు చేసుకున్నాయి. తనిఖీ సిబ్బందిలో ఎక్కువ మంది అగ్రకులాల వాళ్లే కాబట్టి వారు దళిత వాడల్లో అడుగుపెట్టేందుకు, దళిత పాఠశాలలను తనిఖీ చేసేందుకు ఇష్టపడలేదు. తనిఖీ అధికారుల ఈ కుల వివక్ష ధోరణిని ఒక క్రైస్తవ మిషనరీ సంస్థ 1905లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. తనిఖీ అధికారులు దళితవాడల్లో అడుగుపెట్టేందుకు ఇష్ట పడటంలేదనీ, దూరంగా ఎక్కడో కూచుని పాఠశాల ఉపాధ్యాయులనే తమ వద్దకు రప్పించుకుని డాక్యుమెంట్లని పరిశీలించి పంపించేస్తున్నారనీ, చివరికి విద్యార్థుల జవాబు పత్రాలను కూడా ముట్టుకోకుండా పది అడుగుల దూరం నుంచే చూసి చేతులు దులిపేసుకుంటున్నారనీ మిషనరీ సంస్థ వాపోయింది. ఈ సమస్యకు పరిష్కారమార్గంగా ఒక యురోపియన్‌ను లేదా స్థానిక క్రైస్తవుడిని, లేదా ఒక పంచముడిని ప్రత్యేక సహాయక ఇన్స్‌పెక్టర్‌గా నియమించాలని సూచించింది. విద్యాశాఖల అధికార్లు బడుగువర్గాల విద్య పట్ల సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తున్న వైనాన్ని వలస ప్రభుత్వం కూడా గుర్తించింది.

దళితుల చదువులో తన ప్రత్యక్ష ప్రమేయం లేకుండా ప్రైవేటు సంస్థల్ని, స్థానిక సంస్థల్ని ప్రోత్సహించాలనేది ప్రభుత్వ ప్రాథమిక విధానంగా వుండేది. బడుగువర్గాల పిల్లలకు పలకలు, పుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం 1913 లో రూ. 75,700/-ల భారీ మొత్తాన్ని కేటాయించింది. దళిత విద్యార్థుల కోసం 1915 లో మరిన్ని రాయితీలను ప్రకటించింది. ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రాథమిక పాఠశాలల్లో దళిత విద్యార్థులకు మొత్తం ఫీజును మాఫీ చేసింది. అలాగే మాధ్యమిక పాఠశాలల్లో చదువుకునే వారికి ఫీజులలో 50 శాతం రాయితీని మంజూరు చేసింది. దళిత ఉపాధ్యాయులకోసం ప్రభుత్వం మద్రాస్‌లో ఒక ప్రత్యేక శిక్షణా కళాశాలను నెలకొల్పింది. అదేవిధంగా ప్రభుత్వ శిక్షణా కళాశాలల్లోని అభ్యర్థులకు యిచ్చే ఉపకారవేతనాలనీ,

పట్టిక 3.3
మద్రాస్ ప్రెసిడెన్సీలో కార్మిక శాఖ కింద నిర్వహించబడ్డ పాఠశాలలు : 1919–1949

సంవత్సరం	పాఠశాలల సంఖ్య	మొత్తం విద్యార్థులు
		(లక్షల్లో)
1919–20	6,438	1.75
1920–21	7,007	1.93
1921–22	8,045	2.22
1922–23	8,575	2.38
1924–25	9,086	2.54
1931–32	9,413	2.63
1936–37	10,215	2.92
1948–49	----	4.90

ఆధారం: మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆయా సంవత్సరాల ప్రభుత్వ వార్షిక నివేదికలు.

సహాయక గ్రాంటునీ పెంచింది.

1918–19 సంవత్సరంలో దళిత విద్యా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభించింది. దళిత పిల్లలు కూడా బడిలో చేరి చదువుకునేందుకు వీలుగా అగ్రహారాలలోని ప్రభుత్వ పాఠశాలలను వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంది. అదేవిధంగా ఆయా ప్రాంతాలలోని దళితులకు అందుబాటులో వుందన్న ధృవీకరణ వుంటేనే పాఠశాలల నూతన భవన నిర్మాణాలను చేపట్టాలని తీర్మానించింది. పాఠశాలల్లో దళిత పిల్లల ప్రవేశానికి వున్న అడ్డంకులన్నీ తొలగించాలని ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది.

దళితులకు ప్రత్యేక పాఠశాలలతో పాటు వారి ప్రయోజనాల కోసం ఒక ప్రత్యేక

5. దీంతోపాటు భారత ప్రభుత్వం దళిత వర్గాల కోసం ఇప్పటివరకు ఏం చేశారు, ఇంకా ఏంచాయాలి అని ప్రాదేశిక ప్రభుత్వాలను అడిగి తెలుసుకుంది. భారత ప్రభుత్వ హోం (మిస్‌లేనియస్) శాఖ ప్రొసీడింగ్స్‌ను, జి.ఒ. నెం. 1676 తేది డిసెంబర్ 2,1919 చూడండి.

పట్టిక 3.4
రాజమండ్రిలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల కులాల నేపథ్యం : 1924-38

కులం	1924	1926	1935	1936	1938
బ్రాహ్మణులు	221	257	170	172	201
బ్రాహ్మణేతరులు	91	120	70	79	83
ముస్లింలు	18	15	10	13	11
క్రైస్తవులు	06	04	03	02	01
దళితులు	లేరు	లేరు	02	01	లేరు

ఆధారం : కళాశాలల అడ్మిషన్ రిపోర్టులు.

ఏజెన్సీని నియమించాలని రెవెన్యూ బోర్డు సిఫారసు చేసింది.[5] దళితుల పట్ల ప్రభుత్వపరంగా ఎంత ఉదార వైఖరి కనబరుస్తున్నా, వారి పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఎన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా ప్రభుత్వ విధానాలను, రెవెన్యూ బోర్డు విధానాలను అమలుపరిచేందుకు అవసరమైన ప్రత్యేక యంత్రాంగంలేకపోతే ఆశించిన ప్రయోజనాలు నెరవేరవని ప్రభుత్వం గ్రహించింది. అందుకే ప్రత్యేక ఏజెన్సీతో పాటు దళిత వర్గాల రక్షణకు తగిన సిబ్బందితో కూడిన ఒక ప్రత్యేక అధికారిని కూడా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ అధికారి నిర్వర్తించాల్సిన బాధ్యతలు: దళిత వర్గాల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసి వారి పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి; దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న మానవీయ సేవా సంస్థలకు అవసరమైన ప్రభుత్వ సహాయం అందేలా చూడాలి; దళిత విద్య కోసం వారి జీవన పరిస్థితుల మెరుగుదల కోసం కృషిచేయాలి.[6] ఇక ప్రత్యేక ఏజెన్సీ నిర్వర్తించాల్సిన విధులు: ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో దళిత వర్గాల విద్యార్థులు చేరేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలి; దళిత పిల్లలను చేర్చుకోడానికి నిరాకరించే ప్రైవేటు పాఠశాలలకు గ్రాంటులను నిలిపివేయాలి; దళిత విద్యార్థులకు ఉపకారవేతనాలను

---

6. పూర్తి వివరాలకోసం మద్రాసు ప్రభుత్వ కార్మికశాఖ అడ్మినిస్ట్రేటివ్ రిపోర్ట్ 1937-38, జి.ఒ. నెం. 2623 చూడవచ్చు.

పట్టిక : 3.5

అనంతపురంలోని సీడెడ్ డిస్ట్రిక్ట్ కాలేజీలో విద్యార్థుల కులాల నేపథ్యం: 1921-38

కులం	1921	1923	1924	1925	1928	1935	1936	1937	1938
బ్రాహ్మణులు	127	131	135	1138	156	107	125	150	148
బ్రాహ్మణేతరులు	23	33	63	75	92	122	99	123	145
ముస్లింలు	05	09	18	18	19	15	17	14	24
క్రైస్తవులు	లేరు	01	02	04	05	03	04	06	08
దళితులు	లేరు	లేరు	లేరు	లేరు	లేరు	లేరు	03	02	03

ఆధారం : కాలేజి వార్షిక ప్రవేశ నివేదికలు.

మంజూరు చేయాలి; వారి ఫీజులను తనే భరించాలి.

ఈ ప్రత్యేక ఏజెన్సీని కార్మిక శాఖ (లేబర్ డిపార్ట్‌మెంట్)గా వ్యవహరించేవారు అయితే ఆ పేరుని బట్టి అది పారిశ్రామిక కార్మికులకు ఉద్దేశించినదిగా పొరబడతారు. కానీ అది అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసేందుకు ఉద్దేశించినది.[7] 1920లో సి.ఎఫ్. పెర్డిషన్ అనే సీనియర్ ఐసిఎస్ అధికారిని మొట్టమొదటి లేబర్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. అదే సంవత్సరం ఒక యురోపియన్, ఒక బ్రాహ్మణ, ఒక ఆదిద్రావిడ వ్యక్తులతో కార్మిక సలహా మండలిని (లేబర్ అడ్వైజరీ బోర్డును) ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు 1922లో జిల్లాల్లో డిస్ట్రిక్ట్ లేబర్ ఆఫీసర్లను కూడా నియమించారు. దళితుల స్థితిగతులను మెరుగుపరిచేందుకు, దళిత విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు ప్రభుత్వపరంగా, క్రమపద్ధతిలో తీసుకున్న తొలిక్రియాశీల చర్యలు యివి.

కార్మిక శాఖ 1920లో గోదావరి జిల్లాలో తన కార్యక్రమాలని ప్రారంభించింది. ఈ శాఖ ఏజెన్సీ ప్రాంతంలో నెలకొల్పిన పాఠశాలల్ని లేబర్ స్కూల్స్ అనేవారు. క్రమేణా ఈ పాఠశాలల పరిమాణం, లక్ష్యం విస్తృతమవుతూ వచ్చాయి. 1921-24 మధ్యకాలంలో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ ప్రత్యేక కార్యకలాపాలు ఉధృతంగా సాగాయి. ప్రాథమిక విద్యను ప్రోత్సహించడం ఈ శాఖ ప్రాథమిక విధిగా మారింది. ఈ శాఖ కార్యకలాపాలతో పాటు పాఠశాలల సంఖ్య కూడా పెరుగుతూ పోయింది.

7. ఆదివాసీలు, కొండ గిరిజనులకు తోడు ఈ ఏజెన్సీ పరిధిలో అంటరాని కులాల కిందకు వచ్చే ఇతర్లు : ఆది ద్రావిడులు, చక్కిలియన్లు, చెరుమాలు, హోలెయలు, మాలలు, పొల్లార్లు, పరయాలు, సోమేవాలు, హడ్డీలు, బావరీలు, దండోసీలు, కోవాంగులు, నగడీలు, వల్లుయాన్లు. ఆధారం : మద్రాసు ప్రభుత్వ కార్మిక శాఖ అడ్మినిస్ట్రేటివ్ రిపోర్ట్, 1937.

మద్రాస్ ప్రెసిడెన్సీ అంతటా ప్రత్యేక కార్మిక పాఠశాలలు ఏర్పాటయ్యాయి. అదేవిధంగా బడుగువర్గాలకు ఉద్దేశించిన ప్రభుత్వ సంస్థల సంఖ్య కూడా క్రమేణా పెరుగుతూపోయింది. ఆ వివరాలను పట్టిక 3.3 లో చూడవచ్చు.

అంటరానివాళ్ల కోసం నిర్వహించిన ప్రత్యేక పాఠశాలలు 1919-20 నుంచి 1936-37 మధ్యకాలంలో 42.4 శాతం మేరకు పెరిగాయి. 1919-20 నుంచి 1948-49 మధ్యకాలంలో దళిత విద్యార్థుల సంఖ్య 180 శాతం మేర పెరిగింది. చూడటానికి ఈ పెరుగుదల ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ మొత్తం జనాభాని పరిగణనలోకి తీసుకుంటే 1928-29లో పాఠశాల విద్య వల్ల ప్రయోజనం పొందిన దళిత బాలురు కేవలం 7.52 శాతం, దళిత బాలికలు 1.65 శాతం మాత్రమే అని తేలింది. అదే సంవత్సరం మొత్తం పాఠశాల విద్యార్థులలో దళితులు 11.6 శాతం వరకు వున్నారు. మరో అంశం ఏమిటంటే పై తరగతులకు వెళ్లినా కొద్దీ దళిత విద్యార్థుల సంఖ్య పడిపోయింది. 1928-29లో ప్రాథమిక పాఠశాల స్థాయిలో మొత్తం విద్యార్థులలో దళిత విద్యార్థులు 6.6 శాతం వరకు వుంటే మాధ్యమిక పాఠశాల స్థాయిలో అది 2.8 శాతానికి, ఉన్నత పాఠశాల స్థాయిలో 0.84 శాతానికి తగ్గిపోయింది. మరోవిధంగా చెప్పాలంటే ఆంధ్రలోని కళాశాల విద్యార్థుల సామాజిక నేపథ్యంను బట్టి ఉన్నత విద్యా సంస్థల్లో దళితులను ఉద్దేశపూర్వకంగా నిరాకరించారు.

అందుబాటులో వున్న ఆనాటి కళాశాల విద్యార్థుల ఆర్థిక, సామాజిక నేపథ్యాల తాలూకు ఆధారాలను బట్టి వారిలో అత్యధికులు సామాజికంగానో, ఆర్థికంగానో ఉన్నత వర్గాలకు చెందినవాళ్లేనని స్పష్టమవుతోంది. 1918-19లో దళితుల కోసం 82 అదనపు ప్రాథమిక పాఠశాలలను తెరిచేందుకు స్థానిక సంస్థలకు సబ్సిడీలను మంజూరు చేశారు. విజయనగరంలోనూ అనేక ఇతర ప్రాంతాలలోనూ దేవాలయాలలో, అగ్రహారాలలో వున్న పాఠశాలలను చాలావరకు ఆయా మున్సిపాల్టీలలో అందరికీ అందుబాటులో వున్న ప్రదేశాలకు మార్చారు. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ముఖ్యంగా పెద్దాపురం తాలూకాలోని వీరవాసరంలో, రామచంద్రాపురం తాలూకాలోని వెంకటాయపాలెంలో బోర్డు ఎలిమెంటరీ స్కూళ్లలో దళిత విద్యార్థులను చేర్చుకున్నారు.

ప్రభుత్వం 1919లో ఎలాంటి కులపరమైన ఆంక్షలకు వీలులేకుండా దళితులను చేర్చుకోవాలి అంటూ జిల్లా బోర్డులకు ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ అగ్రవర్ణ హిందువులతో కూడిన అమలాపురం తాలూకా బోర్డు ప్రభుత్వ ఆదేశాలను ఖాతరు చేయకుండా బోర్డు స్కూళ్లలో దళితుల ప్రవేశం అవాంఛనీయం అంటూ తీర్మానం చేసింది. సాధారణ అభ్యర్థనలూ, తాకీదులూ అగ్రవర్ణ హిందువుల మీద ఎలాంటి

ప్రభావమూ చూపలేదు. ప్రభుత్వ ఆదేశాలను గనుక పాటించకపోతే ప్రభుత్వ నుంచి సబ్సిడీలు గానీ, ఇతరత్రా సహాయాలు గానీ ఏమీ అందవంటూ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ వారు 1922లో దళితులకు ప్రత్యేక పాఠశాలల గురించిన యోచనకంటే అన్ని కులాల వారినీ పాఠశాలల్లో చేర్చుకునే అంశానికి ప్రాధాన్యతనిస్తూ కుల వివక్షా ధోరణిని నిర్మూలించాలంటూ స్థానిక సంస్థలకూ, మున్సిపాల్టీలకూ ఆదేశాలు జారీచేశారు.

మద్రాస్ ప్రాథమిక విద్యా చట్టం 1920, జిల్లా విద్యా మండళ్లు, తనిఖీ అధికారులు అందరూ ఈవిధమైన ప్రభుత్వ ఒత్తిళ్లు, హెచ్చరికలు కుల వివక్షను తగ్గిస్తాయనీ, బడుగు వర్గాల జీవితాలలో కొంతైనా వెలుగును ప్రసాదించగలుగుతాయనీ భావించారు. నెల్లూరు జిల్లాలో మర్కాపూర్, కనిగిరి, కందుకూరు తాలూకాలలోని పాఠశాలల్లో దళితుల పిల్లల్ని చేర్చుకున్నారు. వీరవాసరంలో దళిత ఉపాధ్యాయులను కూడా నియమించారు.

అయితే ప్రభుత్వ ప్రభోదాలు ఎలా వున్నా దళితుల పట్ల వివక్షా ధోరణి అలాగే కొనసాగింది. ధర్మవరం, చంద్రగిరి, నర్సాపూర్ తాలూకాలలో దళితులను చేర్చుకున్నారన్న కారణంగా అగ్రవర్ణ హిందువుల పిల్లలు ఆ పాఠశాలలకు వెళ్లడం మానేశారు. ఆంధ్రాలోని ఉత్తర సర్కారు జిల్లాల్లో దళిత పిల్లలూ అగ్రవర్ణ హిందువుల పిల్లలూ పక్కపక్కన కూర్చుని చదువుకునే పాఠశాలలకు అగ్రవర్ణ హిందువులే కాదు దళిత తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని పంపేందుకు ఉత్సాహం చూపలేదు. ఎందుకంటే దానివల్ల మునుముందు ఘర్షణలు తలెత్తుతాయని వారు జంకారు.

మద్రాసు ప్రభుత్వ విద్యా శాఖ అధికారులు తమ పరిశీలనల్లో కుల వివక్ష ధోరణి గ్రామీణ ప్రాంతాలలో లోతుగా వేళ్లూనుకుని వున్నట్టు గమనించారు. సాధారణ పాఠశాలల్లో దళిత విద్యార్థుల ప్రవేశం నత్త నడకలా సాగడానికి అదే కారణమని గ్రహించారు. సాధారణ పాఠశాలల్లో దళితులను చేర్చుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి తెచ్చినప్పుడల్లా అగ్రవర్ణ హిందువులు తమ పిల్లల్ని ఆ పాఠశాలల నుంచి ఉపసంహరించుకుంటూ నిరసనను తెలియజేశారు. ఈవిధంగా సాధారణ పాఠశాలల నుంచి అగ్రవర్ణ హిందువులు తమ పిల్లల్ని ఉపసంహరించుకునే ధోరణిని సమీక్షిస్తూ మద్రాసు ప్రభుత్వ విద్యా శాఖ కార్యదర్శి ఇది ప్రభుత్వ విధానాన్ని అమలుపరచడంలో స్థానిక సంస్థల అవాంఛనీయ వైఫల్యాన్ని సూచిస్తోందని పేర్కొన్నారు. గట్టి నిర్ణయం గనక తీసుకుంటే ఆ పాఠశాలల్లో దళిత తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదివిస్తారు, అగ్రవర్ణ హిందువులు తమ పద్ధతిని మార్చుకుంటారు అని ప్రభుత్వం భావించింది.

పట్టిక 3.6

ఆంధ్రాలో కులాల వారిగా చదువుకున్న వారి సంఖ్య పెరుగుదల : 1891 - 1931 (శాతం)

	1891		1901		1911		1921		1931	
కులం	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు
బ్రాహ్మణ	72.21	3.73	67.30	4.55	68.19	9.91	59.66	14.98	68.2	9.9
బలిజ	20.12	1.44	11.70	0.73	20.90	2.03	22.46	3.25	20.9	2.0
కోమటి	60.46	0.88	49.47	0.86	52.11	2.50	52.13	5.37	52.1	2.5
కాపు/రెడ్డి	9.45	0.22	3.82	0.06	8.98	0.29	13.56	0.48	12.2	0.7
కమ్మ	3.41	0.24	4.79	0.15	12.21	0.69	13.56	0.48	12.2	0.7
మంగలి	6.61	0.11	3.53	0.12	6.86	0.27	8.61	0.54	6.9	0.3
మాల	1.13	0.05	0.56	0.03	1.3	0.07	1.63	0.14	1.4	0.1
మాదిగ	0.46	0.02	0.23	---	0.82	0.06	0.89	0.11	0.8	0.1
కంసాలి	28.53	0.56	16.45	0.47	25.05	1.35	27.61	2.55	25.1	1.4
గొల్ల	2.66	0.06	1.02	0.07	2.76	0.14	2.90	0.25	2.7	1.1

ఆధారం: మద్రాస్ ప్రెసిడెన్సీ జనాభా లెక్కల నివేదికలు.

"దళిత విద్యార్థులను చేర్చుకున్నందుకు అగ్రవర్ణ హిందువుల పిల్లలెవరైనా ఆ పాఠశాలల నుంచి వెళ్లిపోతే ఆ ఖాళీల్లో సాధ్యమైనంత త్వరగా దళిత పిల్లల్ని చేర్చుకోవాలి." సాధారణ పాఠశాలల్లో దళిత పిల్లలు విరివిగా చేరడాన్ని ప్రోత్సహించేందుకు పాఠశాలలను దేవాలయాలు, చావిడీల నుంచి అందరికీ అందుబాటులో వుండే ప్రదేశాలకు తరలించే విధానాన్ని ప్రభుత్వం అమలుపరిచింది. అయినప్పటికీ అగ్రవర్ణ హిందువుల విముఖత వల్ల పెద్దగా ప్రయోజనం కలుగలేదు.

ఈ అంశంలో ఒక సమగ్ర చిత్రాన్ని ఆవిష్కరించాలంటే దళిత విద్యాభివృద్ధిలో ప్రాంతీయ తేడాలను తరచి చూడాల్సి వుంటుంది. అనకాపల్లి, తెనాలి, నరసరావుపేట, హిందూపూర్, తిరుపతి మున్సిపల్ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన దళిత పిల్లల సంఖ్య దాదాపు శూన్యం. గంజాం, నెల్లూరు ప్రాంతాలలో స్వల్ప అభివృద్ధి కనిపిస్తుంది. గోదావరి ప్రాంతంలో అభివృద్ధి గణనీయంగా వుంది. గోదావరి జిల్లాల్లో 34 మంది మాదిగలతో సహా మొత్తం 2,448 మంది దళిత విద్యార్థులతో 62 పాఠశాలలు వుండేవి. దళిత కూలీల కోసం 43 రాత్రి పాఠశాలలు కూడా పనిచేసేవి. కాగా కృష్ణా జిల్లాలో 671 అగ్రవర్ణ హిందూ పాఠశాలలుంటే కేవలం 28 పాఠశాలల్లో మాత్రమే దళిత విద్యార్థులు చదువుకునేవారు. 1921-22 సంవత్సరం నుంచీ ముఖ్యంగా గుంటూరు, కర్నూలు, కడప, నెల్లూరు, చిత్తూరు ప్రాంతాల్లో దళిత ప్రాథమిక విద్యలో స్వల్ప ప్రగతి కనిపిస్తుంది. విశాఖపట్నం, కృష్ణా ప్రాంతాలలో మాత్రం పరిస్థితి 1920-21లాగే వుండిపోయింది. ఆంధ్రలోని మిగతా ప్రాంతాలలో మాత్రం దళితుల దుర్భర దారిద్ర్యం, కుల వివక్షల కారణంగా పరిస్థితి మరింత దయనీయంగా మారింది. బ్రాహ్మణ వర్గం సామాజిక, రాజకీయ రంగాలలోనే కాకుండా విద్యారంగంలో కూడా తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. వారి తరువాత స్థానం కోమట్లు, శూద్ర కులాల వారు ఆక్రమించారు. ఈ వివరాలన్నీ పట్టిక 3.6లో చూడవచ్చు.

మిషనరీల కార్యకలాపాలు, వలసవాదుల ప్రోత్సాహం వున్నప్పటికీ వివిధ కారణాలవల్ల దళిత విద్య అంతగా ముందుకు సాగలేదు. అందుకు ముఖ్యంగా స్థానిక సంస్థల మద్దతు లేకపోవడం, అగ్రవర్ణ హిందువుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడం, దళితుల ఆర్థిక దారిద్ర్య పరిస్థితులు కారణమని చెప్పవచ్చు. తత్ఫలితంగా బ్రాహ్మణ, కోమటి, కాపు/రెడ్డి కులస్థులే అత్యంత విద్యావంతులైన వర్గాలుగా కొనసాగారు. కంసాలి, బలిజ, మంగలి వంటి కొన్ని వృత్తి కులాల్లో కొంత ప్రగతి కనిపిస్తుంది. ఆంధ్రాలో ఏ కాలంలో చూసినా అతి తక్కువ స్థాయి విద్యావంతులున్న కులాలు మాల, మాదిగలేననేది సుస్పష్టం.

1931లో బాహ్య కులాల (ఆరోజుల్లో అలాగే అనేవారు) పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చుకోవాలని నిర్ణయించినప్పుడు అనేక పాఠశాలలు మూతపడ్డాయి, అనేక ఇతర పాఠశాలల నుంచి అగ్రవర్ణాలవారు తమ పిల్లల్ని ఉపసంహరించుకున్నారు. ఎన్నో సౌకర్యాలు కల్పించినప్పటికీ దళితులలో ప్రాథమిక విద్యకు పై స్థాయిలో ఒక శాతం మించిన అభివృద్ధి కనిపించలేదు. 1901కి ముందు దళితులలో అక్షరాస్యులు ఒక శాతంగా వుంటే 1931 నాటికి అది ఒక శాతం కంటే అతి స్వల్పంగా పెరిగింది. 1930 దశాబ్దపు ద్వితీయార్థంలో ఆయా సంస్థానాలలో ప్రజారంజక ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత ఉపకార వేతనాలు, వసతి సౌకర్యం వంటి అనేక సౌకర్యాలు దళితుల విద్యా కార్యక్రమాలకు తోడయ్యాయి. 1930 దశకంలో దళిత విద్యార్థులు ప్రాథమిక పాఠశాలల్లో (లేబర్ స్కూళ్లలో) గణనీయంగా చేరారు.

మద్రాసు ప్రెసిడెన్సీలో దళిత విద్యాభివృద్ధి తీరుతెన్నులు పట్టిక 3.7లో చూడవచ్చు. 1937–38లో తప్ప మిగతా సంవత్సరాలలో ప్రభుత్వం ఒక పక్క కొత్త పాఠశాలలను పెంచుతూ పోతుంటే మరోపక్క అంతకంటే ఎక్కువ సంఖ్యలో పాఠశాలలు మూతపడుతూ వచ్చాయి. తరచూ ఈ అభివృద్ధి కార్యక్రమాలు కాగితాల మీదనే కనిపించాయి తప్ప ఖచ్చితంగా అమలుపరిచిన పాపాన పోలేదు.

వలసవాద ప్రభుత్వం తిరిగి 1944లో ప్రత్యేక చర్యలు తీసుకుంది. 1944–45 నుంచి ఐదు సంవత్సరాల కాలానికి గాను వెనుకబడిన తరగతుల వారి విద్య కోసం రూ. 3 లక్షల మొత్తాన్ని కేటాయించింది. విద్యామంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం అందులో రూ. 17,21,680/– లు షెడ్యూల్డ్ కులాల వారికోసం కేటాయించబడ్డాయి.

పట్టిక : 3.7

మద్రాసు ప్రెసిడెన్సీలో దళిత విద్య : 1936 – 39

సంవత్సరం	సం. మొదట్లో బడుల సంఖ్య	ఆ సం. తెరిచిన కొత్త బడులు	ఆ సం. మూసేసిన బడులు	మొత్తం రాత్రి బడులు	మొత్తం బడులు	మొత్తం విద్యార్థులు
1936–37	1006	31	59	6	978	39,926
1937–38	978	238	26	3	1190	48,203
1938–39	1190	36	48	3	1178	48,947

ఆధారం: కార్మిక శాఖ కార్యవ్యవహారాలు, మద్రాస్ ప్రెసిడెన్సీ పరిపాలక నివేదిక ప్రభుత్వ ఆదేశం 2623, తేది 26–11–1937, జిఓ 2196 తేది11–6–1938, జీఓ 2109 తేది 25–8–1939

వలసవాద ప్రభుత్వం 1920లలో, 1930లలో రూపొందించిన విద్యా విధానాలను అంతవరకు విద్యా సౌకర్యాలు నిరాకరించబడుతూ, నిరాదరణకు గురైన వర్గాల డిమాండ్ల నేపథ్యంలో చూడాల్సివుంటుంది. బ్రాహ్మణేతర ఉద్యమాల పెరుగుదల, దళిత ఉద్యమాలు తలెత్తడం, వివిధ బ్రాహ్మణేతర కులాలవారు కుల సంఘాలు స్థాపించుకుని సంఘటితం కావడం, సామాజిక-రాజకీయ జాగృతి, మారుతున్న రాజ్యాంగ, రాజకీయ పరిణామాలు మొదలైనవన్నీ వలసవాద ప్రభుత్వం మీద ఒత్తిడిని పెంచాయి. అంతవరకు అలక్ష్యానికి గురవుతూ వచ్చిన దళిత వర్గాలకు విద్యావకాశాలు కల్పించాల్సిన అనివార్యతను సృష్టించాయి.

బడిమానేసే వారి సంఖ్య పెరగడానికి అగ్రవర్ణ హిందువులు అణగదొక్కుతారన్న భయంతో పాటు దళితుల నిరంతర దారిద్ర్య సమస్య ప్రధానకారణమని స్పష్టమవుతోంది.[8] వ్యవసాయ పనులు ఉధృతంగా సాగేకాలంలో అదనపు కూలీ కోసం దళితులు తమ పిల్లల్ని బడికి పంపకుండా పనులకు తీసుకెళ్తారు. వివక్ష ఎదుర్కోవడమే కాక అనేకమంది దళితులకు ట్యూషన్ ఫీజు చెల్లించే స్థోమత వుండదు. ఇంటివద్ద చదువుకునేందుకు వీలైన వాతావరణం వుండదు. చదువు పూర్తయిన తరువాత ఉపాధి అవకాశాలూ వుండవు. ఈ విధంగా సామాజిక అసమానతలకు, అగ్రవర్ణ హిందువులు అణచివేస్తారన్న భయాలకు తోడు ఆర్థిక వెనుకబాటుతనం కారణంగా ఆంధ్రాలో వెనుకబడిన వర్గాల వారి విద్యాభివృద్ధి కుంటుబడింది.

సంస్కరణోద్యమం, దాని ప్రభావం

పందొమ్మిదవ శతాబ్దపు సంఘ సంస్కర్తలు కుల వ్యవస్థను నైతికంగా అర్థంలేని, సామాజికంగా హీనమైన, రాజకీయంగా విభజనకు గురిచేసే విధానంగా పరిగణించారు. క్షీణిస్తున్న భారతీయ సంస్కృతిలోని అన్ని చెడులకీ అజ్ఞానమే కారణమని భావించారు. ఒక సహనశీల, మానవీయ సమాజాన్ని నిర్మించేందుకు విజ్ఞాన వ్యాప్తి ఒక్కటే మార్గమని గుర్తించారు. అందుకే ఈ కారణాలన్నింటి రీత్యా ప్రజా విద్యా కార్యక్రమానికి ఆంధ్రాలోని సంఘ సంస్కరణోద్యమంలో అత్యంత ప్రాధాన్యత లభించింది. క్రైస్తవ మిషనరీలు అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యకి, మతమార్పిడికి చేసిన

8. మనువు దృష్టిలో అంటరానివాళ్లకు ఏవో నిత్యావసరమైన మట్టికుండలు తప్ప మరే ఇతర వస్తువులు/ ఆస్తి వుండేందుకు వీల్లేదు. మనుధర్మాన్ని అభిమానించే ఆధునికులు అంటరానివాళ్లపై విధించబడిన కఠినమైన, దోపిడీ స్వభావం వున్న సామాజిక ఆచారాలను పద్ధతులను ఇప్పటికీ ఇంకా పాటిస్తూనే వున్నారు. హట్టన్, 1933, పేజి 471-501.

కృషి, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అందించిన ప్రోత్సాహం హిందూ సాంఘిక - మతపర సంస్కరణల మీద బలమైన ప్రభావాన్ని కలిగించింది. అంటరానితనమనే దురాచారాన్ని హిందూమతం నుంచి నిర్మూలించేందుకు, అంటరానివాళ్లు క్రైస్తవమతాన్ని ఆశ్రయించకుండా చూసేందుకు అంటరానివాళ్లని అక్కున చేర్చుకునే ప్రయత్నాలను ప్రారంభించారు. వలసవాద అవసరాలను, ప్రయోజనాలను తీర్చేందుకు ప్రభుత్వం రూపొందించి అమలు పరుస్తున్న ప్రాథమిక, ఉన్నత విద్యా కార్యక్రమాలకు దీటుగా ప్రాంతీయ భాషల్లో ప్రత్యామ్నాయ ప్రజా విద్యా కార్యక్రమాన్ని చేపట్టాలన్న ఆకాంక్ష కూడా ఇందుకు మరింత ప్రేరణనిచ్చింది. . జనబాహుళ్యంలో సంస్కరణ భావాలను విస్తరింపజేయాలంటే ప్రాంతీయ భాషలను అభివృద్ధిపరచాల్సిన అవసరం ఎంతగానో వుందన్న వాస్తవాన్ని ఆంధ్ర సంఘ సంస్కర్తలు గుర్తించారు.

మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలో తెలుగు బ్రాహ్మణులైన ఇద్దరు సుప్రసిద్ధ సంఘ సంస్కర్తలుండేవారు. ఒకరు కందుకూరు వీరేశలింగం పంతులు (1848-1919), రెండవవారు రఘుపతి వెంకటరత్నం నాయుడు (1862-1939). వీరేశలింగం పంతులు రాజమండ్రిలో, తూర్పు సర్కారు జిల్లాల్లో తన కార్యకలాపాలను సాగిస్తే, రఘుపతి వెంకటరత్నం నాయుడు తన కార్యక్రమాలను కాకినాడ, మచిలీపట్నం ప్రాంతాలలో కేంద్రీకరించారు. వారు పాఠశాలలను నెలకొల్పారు. కుల వివక్షలను నిర్మూలించాలనీ, అంటరానివారి పట్ల సానుభూతి చూపాలనీ ప్రబోధించారు. రాజమండ్రి దగ్గరలోని దానవాయిపేటలో దళితులకు తాగునీటి సౌకర్యం లేదని తెలుసుకొన్నవీరేశలింగం పంతులు అక్కడివారికోసం ఓ బావిని తవ్వించారు. విద్యావంతులైన హిందువులకు- దళితోద్ధరణ కంటే ముందుగా మతపరమైన అంశాలు ప్రేరణనిస్తే ఆ తరువాత మానవీయ ఆదర్శాలు ప్రోద్బలమిచ్చాయి. ఈ ఇరువురు సంస్కర్తలకు తోడు కాశీనాథుని నాగేశ్వరరావు, గురజాడ అప్పారావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, త్రిపురనేని రామస్వామి చౌదరి మొదలైన వారు కూడా అదేమార్గాన్ని అనుసరించారు. పత్రికలు, పుస్తకాలు ప్రచురించడం, సంఘాలు స్థాపించడం, ఉపన్యాసాలివ్వడం వంటి అభ్యుదయ కార్యక్రమాల ద్వారా ప్రజలను సంస్కరణ దిశగా నపిడించారు. ఈ సంఘ సంస్కర్తలందరూ కూడా అంటరానివాళ్ల పరిస్థితి మెరుగుపడడానికి చదువే పరిష్కార మార్గమని భావించారు.

కొంతమంది ప్రముఖ సంస్కర్తలు అంటరానివాళ్లు చదువుకునేందుకు ఏర్పాట్లు చేశారు, చెడు సంప్రదాయాలనుంచి బయటపడేందుకు వారికి సాయం చేశారు. మచిలీపట్నంలో 1907లో స్థాపించబడిన ఆంధ్ర దీన సంఘం సామాజిక, ఆర్థిక,

ఆధ్యాత్మిక అంశాలకు సంబంధించి ప్రగతిశీలంగా కృషిచేసింది. ప్రధానంగా అంటరానివాళ్ల చదువు మీద తమ దృష్టిని కేంద్రీకరించింది. మచిలీపట్నం ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో 12 రాత్రి పాఠశాలలను, 9 పగటి పాఠశాలలను, ఆడపిల్లలకోసం ఒక పార్ట్‌టైం పాఠశాలను తెరిచింది. అంటరానివాళ్లు స్వతంత్రులుగా బతికేందుకు దోహదపడే కుట్టుపని, చిత్రలేఖనం, అల్లికలు వంటి చేతి పనులను ఆ పాఠశాలల్లో నేర్పించారు.

ఉదారవాద అగ్రవర్ణ హిందువులు అంటరానివాళ్ల అభ్యున్నతికి పాటుపడ్డారు. వీరేశలింగం పంతులు ఒక ఉన్నత పాఠశాలను స్థాపించి అందులో అంటరానివాళ్ల పిల్లలను చేర్చుకున్నారు. పిఠాపురం మహారాజావారి సహాయంతో వారికి ఉచిత విద్యను అందించారు. కాకినాడలోని ఉన్నత పాఠశాలలో, రాజమండ్రిలోని వీరేశలింగం ఉన్నత పాఠశాలలో మహారాజావారు దళిత పిల్లలను చేర్పించడమేకాక వారికి ఉచితంగా చదువు చెప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. దళిత బాలబాలికల కోసం ఆయన కాకినాడలో రామమోహన్ రాయ్ హాస్టల్‌ను నిర్వహించారు. తొలితరం ఆంధ్ర దళిత మేధావులలో అత్యధికులు మహారాజావారి దాతృత్వంతో నిర్వహించబడిన ఈ విద్యా సంస్థలనుంచే వచ్చారని అంటారు.

ఇంగ్లీషు, తెలుగు బోధనా మాధ్యమాలుగా చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గారు 1909లో రాజమండ్రిలో దళితులకోసం రామమోహన్‌రాయ్ పాఠశాలను స్థాపించారు. ఆయన పిల్లల కోసం ఉచిత ట్యూషన్లను ఏర్పాటు చేశారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు తమ కార్యక్రమాలను 1880 దశకం నుంచి మొదలుపెట్టారు. ఆయన పిఠాపురం రాజా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించబడిన తరువాత (1905-19) దళిత కులాలకు చెందిన ఆడపిల్లల్ని, మగపిల్లల్ని కళాశాలలో చేర్చుకోవడంలో కృతకృత్యులయ్యారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఆయన అంటరానితనానికి వ్యతిరేకంగా అనేక సదస్సులను నిర్వహించారు. 1904లో ఒక రైల్వే స్టేషన్‌లో కనిపించిన ముగ్గురు దిక్కులేని దళిత బాలికలను చేరదీసి, వారిని పెంచి పెద్దచేసి, ఉన్నత చదువులు చదివించి వారికి బ్రాహ్మణ యువకులతో పెళ్లిళ్లు జరిపించారు. దళిత పిల్లల కోసం, ప్రత్యేకించి ఆడపిల్లలకోసం ఆయన హాస్టళ్లను నెలకొల్పారు. అలాంటి కార్యక్రమాల్లో పట్టాభి సీతారామయ్యకి, సబ్బారాయుడికి సహాయం అందించారు. కాశీనాథుని నాగేశ్వరరావు (సంపాదకులు, ఆంధ్ర పత్రిక), వేమూరి రాంజీరావు (సంపాదకులు, దీనబంధు), నల్లపాటి హనుమంతరావు (వ్యవస్థాపకులు, గుంటూరు శ్రీకృష్ణాశ్రమం) మొదలైనవారు కూడా ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు.

వీరి కృషి దళితులలో చదువు సామాజిక చైతన్యాన్ని తీసుకురావడమే కాక దళిత యువతలో సంఘటిత తత్వాన్ని పెంచి ఆ తరువాత తమ సొంత కులాల ప్రయోజనం కోసం సంస్కరణ కార్యక్రమాలను చేపట్టేందుకు దోహదపడింది.

అయితే సంస్కరణకు సంబంధించిన వారి కార్యక్రమాలలో తీవ్రమైన లోపాలు కూడా కనిపిస్తాయి. ప్రార్థనా సమాజం, బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం వంటి మతపరమైన, పునరుజ్జీవ సంస్థలు కుల వ్యవస్థలోని చెడును విమర్శించి, అంటరానితనాన్ని నిర్మూలించాలని విజ్ఞప్తులు చేసినప్పటికీ ఆ దిశలో గణనీయమైన కృషి చేయలేకపోయాయి. ప్రార్థనా సమాజం మానవతా కోణంలోంచి సంస్కరణల మీద దృష్టిని కేంద్రీకరిస్తే, ఆర్య సమాజం సాంస్కృతిక ఆధిపత్యం, హిందూ ఏకీకరణ మీద దృష్టిని సారించింది. మన్య సంఘం, ఆది ఆంధ్ర సంఘం సభ్యులు వేదాల పెత్తనాన్ని ధిక్కరిస్తూ యజ్ఞోపవీతాన్ని (ప్రవిత్ర జంధ్యం పోగులని) తెంచిపారేయడం వంటి బ్రహ్మోయిజం పట్ల మక్కువ చూపారు. ఆర్య సమాజంలో చేరిన అగ్రవర్ణ హిందువులకు లభిస్తున్న గౌరవం అందులో చేరిన అంటరానివాళ్లకు లభించడం లేదన్న వాస్తవాన్ని వారు అనతికాలంలోనే గ్రహించారు. ఆర్య సమాజంతో సంబంధమున్న భాగ్యరెడ్డి వర్మ సంఘటన అగ్రవర్ణ పక్షపాత వైఖరి ఎంత లోతుగా పాతుకుపోయివుందో స్పష్టం చేసింది. 1914లో బేగంపేట వైదికాశ్రమంలో ఆర్య సమాజ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థుల కోసం అర్థతాత్పర్యాలతో వేద మంత్రోచ్చారణ పోటీని నిర్వహించారు. ఆది హిందూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూడా ఆ పోటీలో పాల్గొన్నారు. ఓ దళిత విద్యార్థి ప్రథముడిగా నిలిచి అందరి చప్పట్లను అందుకున్నప్పుడు ఆ వైదికాశ్రమ కార్యదర్శి కుళ్లుబోతుతనంతో బ్రాహ్మణ విద్యార్థులు గెలవకుండా ఒక దళితుడు గెలవడం ఏమిటని తీవ్రంగా విమర్శించాడు. అసలు అంటరానివాళ్లకి ఇలాంటి గౌరవాన్ని పొందేందుకు అర్హతలేదని వాదించాడు. చివరికి ఆ దళిత విద్యార్థికి బహుమతిని ప్రదానం చేయడానికి నిరాకరించాడు. ఆర్య సమాజంలో చేరడంవల్ల తమ పట్ల హిందువుల హృదయాల్లో మార్పు వస్తుందనీ, అంటరాని కులాల వారిని తాము ఉద్ధరించగలమనీ, అందరితో సమానంగా వారిలో చైతన్యం తీసుకురాగలమని ఆశపడ్డవారు నిరాశచెంది వర్మ తదితర దళితులు ఆర్య సమాజంతో తమ సంబంధాలను తెంచేసుకున్నారు.

దళిత విద్యా కార్యక్రమాలకు 1932లో మహాత్మా గాంధీ నెలకొల్పిన హరిజన సేవక్ సంఘ్ ఆంధ్ర శాఖనుంచి మంచి ప్రోత్సాహం లభించింది. దళిత వాడలను పరిశుభ్రపరచడం, దళిత పిల్లలకోసం ప్రత్యేక పాఠశాలలనీ, హాస్టళ్లనీ నెలకొల్పడం,

తాగునీటికోసం బావులు తవ్వించడం వంటి సంక్షేమ కార్యక్రమాలను ఆ సంఘం చేపట్టింది. 16 అక్టోబర్ 1932 నుంచి 30 సెప్టెంబర్ 1934 మధ్యకాలంలో హరిజన సేవక్ సంఘ్ దళిత విద్యార్థుల కోసం మొత్తం 41 రాత్రి పాఠశాలల్ని, 11 పగటి పాఠశాలల్ని 19 వసతి గృహాలని ఏర్పాటు చేసింది. అందుకు మొత్తంం 22,000 రూపాయలను వెచ్చించింది. వృత్తి విద్యల్లో శిక్షణ యిచ్చే పాఠశాలలను కూడా నెలకొల్పి వివిధ ఉపకార వేతనాలను యిచ్చింది. 1935 లో 215 మంది బాలురకు, 18 మంది బాలికలకు వసతి కల్పించే హాస్టళ్ల నిర్వహణ కోసం రూ. 4,778/–ల మొత్తాన్ని వెచ్చించింది. అదేవిధంగా ఆంధ్రాలో 6 కొత్త పాఠశాలల నిర్మాణం కోసం రూ. 1,963/– మొత్తాన్ని వెచ్చించింది. హరిజన్ సేవక్ సంఘ్ విరాళాలను కూడా స్వీకరించేది. ఆ నిధులను వృత్తి విద్యా పాఠశాలల్లో చదువుకునే దళిత బాలికలకు ఉపకారవేతనాల కోసం వెచ్చించేది. 1934–35 విద్యా సంవత్సరంలో దళిత విద్యార్థుల స్కూల్ ఫీజు ఖర్చులకోసం స్థానిక బోర్డులు చేసిన ఖర్చును తిరిగి చెల్లించాలని ప్రాదేశిక ప్రభుత్వం మీద సంఘ్ నాయకులు ఒత్తిడి తెచ్చారు.

గాంధీ తరహా హరిజనోద్ధరణ ప్రభావం వున్న జాతీయవాద మేధావులకు దళిత విద్య పట్ల సానుభూతి చూపినా తమ కుల అహంకారం నుంచి వారు పూర్తిగా విముక్తులు కాలేకపోయారు. ఆంధ్ర విద్యా సంస్థల్లో ఈ జాతీయవాదుల కుల వివక్ష గురించి కొన్ని తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. అలాంటి వాటిలో ఆంధ్ర జాతీయ కళాశాల పారిశ్రామిక పాఠశాల సంఘటన ఒకటి. ఆ కళాశాల అగ్రవర్ణ హిందువుల ఆధిపత్యం కింద వుండేది. జాతీయవాద విధానాలను అనుసరిస్తూ సాహిత్య, శాస్త్ర, సాంకేతిక చదువును అందించడం, జాతీయ నియంత్రణలో వుంటూ సర్వోన్నత జాతీయ లక్ష్యాన్ని సాధించడం తన ఆదర్శంగా ఆ పాఠశాల పేర్కొంది. ఆ పాఠశాల వసతి గృహంలో దాదాపు వందమంది విద్యార్థులుండేవారు. అందులో సగం మంది బ్రాహ్మణులు కాగా మిగతా సగం మంది శక్తివంతులైన బ్రాహ్మణేతర కులాలకు చెందిన వారు. కేవలం ముగ్గురో నలుగురో దళిత విద్యార్థులుండేవారు. వారిని విడిగా వేరే షెడ్డు కింద వుంచేవారు. ఇదీ వారు సాధించాలనుకునే "జాతీయ సమున్నత లక్ష్యం"! ఇదిలావుంటే కృష్ణా జిల్లా బందరులోని హిందూ హైస్కూలు ఉపాధ్యాయుల నియామకాలలో దళితుల పట్ల చూపిన కుల వివక్ష గురించి కూడా పత్రికలలో వెల్లడయింది. బ్రాహ్మణ కులస్థులు, కమ్మ, రెడ్డి, కాపు, వెలమ వంటి అగ్ర బ్రాహ్మణేతర కులాలకు చెందిన వారి ఆధిపత్యం కింద వున్న పాఠశాల యాజమాన్యం కులం నెపంతో ఒక దళిత అభ్యర్థిని టీచర్ ట్రైనీగా నియమించేందుకు నిరాకరించినట్టు

పత్రికలలో వార్తలు వచ్చాయి. ఆ విద్యా సంస్థ ప్రభుత్వ గుర్తింపు పొంది, ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుకుంటున్నప్పటికీ ప్రభుత్వ విధానాలను పాటించకుండా దళిత కులస్తులను ఉపాధ్యాయులుగా నియమించేందుకు నిరాకరిస్తోందన్న విమర్శలు వచ్చాయి. విస్తృత నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సంఘటనను చూడవలసి వుంటుంది. కృష్ణా గోదావరి జిల్లాల్లోని బోర్డు హైస్కూళ్లలో ఒక్క దళిత ఉపాధ్యాయుడు కూడా కనిపించేవాడు కాదు. హరిజనోద్ధరణ గురించి విస్తృత చర్చ జరుగుతున్న ఈ రోజుల్లో– 'పట్టణాలలో అందులోనూ ప్రభుత్వ పాఠశాలల్లోనే కులవివక్షా ధోరణి ఈ విధంగా వుంటే ఇక గ్రామీణ ప్రాంతాలలో ఏ స్థాయిలో వుంటుందో కదా' అంటూ ఆ వార్తా కథనంలో ఒక ముక్తాయింపు వుంది.

స్వయం సహాయం : దళితుల కోసం దళితులు నిర్వహించిన పాత్ర

ఇరవైయవ శతాబ్దం తొలి దశాబ్దాలలో ఆంధ్రలో అంటరాని వర్గాల అభివృద్ధి సమస్యపై ఒక సమగ్ర విధానం, విశాల దృక్పథం కలిగిన స్వతంత్ర ప్రగతిశీల దళిత ఉద్యమం కొనసాగుతూ వుండేది. అంటరానివాళ్ల జీవన పద్ధతులలో మార్పు తెచ్చే సంస్కరణ భావాలను వ్యాపింపజేయడం, సమాజంలో గౌరవ ప్రదమైన స్థానం సంపాదించుకునేలా మూఢనమ్మకాలను వారినుంచి దూరం చేసి చైతన్యవంతుల్ని చేయడం అనే రెండు ప్రయోజనాల సాధనకు చదువును ఒక ఆయుధంగా ఉపయోగించారు. ప్రభుత్వమూ, సంఘ సంస్కరణ సంస్థలూ తీసుకుంటున్న విద్యాపరమైన కార్యక్రమాలకు వున్న పరిమితులను దళితులు గ్రహించారు. మొదటితరం విద్యావంతులైన దళిత యువకులు సంస్కరణ భావాలతో, సమానత్వ ఆకాంక్షలతో ప్రభావితులై తమ స్వంత వర్గ అభ్యున్నతికి దోహదం చేసే చర్యలను, విద్యా కార్యక్రమాలను చేపట్టారు.

హైదరాబాద్‌కు చెందిన భాగ్యరెడ్డి వర్మ, రాజమండ్రికి చెందిన కుసుమ ధర్మన్న లతో పాటు రాయుడు గంగయ్య, చుండ్రు వెంకయ్య, అరిగే రామస్వామి, ఎలివాడ పల్లి, ఎం.ఎల్. ఆదయ్య, జె. ఈశ్వరీబాయి మొదలైన వారు మొదటి తరం చైతన్యవంతులైన దళిత కార్యకర్తలు. వీరంతా తమ తమ ప్రాంతాల్లో దళితుల అభ్యున్నతికి కృషి చేశారు. ఈ దళిత మేధావులంతా మిషనరీ పాఠశాలలు, కార్మిక పాఠశాలలు, పిఠాపురం మహారాజావారు స్థాపించిన విద్యా సంస్థల నుంచి వచ్చిన వాళ్లు.

దారుణ స్థితిలో వున్న నిరక్షరాస్యతను, అజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకుని దళిత నాయకులు దళిత విద్యార్థుల కోసం పాఠశాలలను, వసతి గృహాలను నెలకొల్పారు. ప్రెసిడెన్సీలో కార్మిక శాఖను ప్రవేశపెట్టిన తరువాత వలసవాద ప్రభుత్వం దళిత

నేతల సహకారంతో ఆంధ్రాలో ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పింది. అవి ఎక్కువగా గోదావరి జిల్లాల్లో వుండేవి. కోస్తాంధ్ర దళిత నేతల్లో అత్యధికులు ఆ పాఠశాలల నుంచి వచ్చినవాళ్ళే. అలాంటి పాఠశాలల్లో వుంద్రు తాతయ్య (1850–1930) నెలకొల్పిన పొన్నమండ, అనంతారం, అల్లవరం, మొగళ్ల కుదురు పాఠశాలలు చెప్పుకో తగ్గవి. ఆయన దళిత జనం కోసం పాఠశాలలు నెలకొల్పడమే కాకుండా ఉపకార వేతనాలను కూడా అందించారు. దళిత జనోద్ధరణ కార్యక్రమాలలో కీలక పాత్ర పోషించిన గొల్ల చంద్రయ్య, తాడి స్వామి, కోన వెంకన్న, కుసుమ తాతయ్య మొదలైనవాళ్లను ఆయన ఎంతగానో ప్రోత్సహించారు. జాలా రంగస్వామి (జననం 1904–) అనే రచయిత దళితులలో చైతన్యాన్ని తెచ్చేందుకు అనేక చారిత్రాత్మక రచనలు చేశారు, నాటకాలు, గేయాలు రాశారు. ఆయన భార్య జాలా మంగమ్మ (జననం 1909–) ఆయనకు ఈ కార్యక్రమాల నిర్వహణలో తోడునీడగా నిలిచింది. ఇద్దరూ కలిసి 1920 దశకంలో దళిత నిరక్షరాస్యుల కోసం రాందాసు పేట, కోలమ్రు, రాయుడుపాకలు, పాలచర్ల మొదలైన ప్రాంతాల్లో రాత్రి పాఠశాలలు నడిపారు.

దళిత విద్యార్థుల కోసం ఎందరో దళితులు వసతి గృహాలను నెలకొల్పారు. విశేషం ఏమిటంటే ఆ వసతి గృహాల్లో అనేకం ప్రభుత్వ సహాయం లేకుండానే పనిచేశాయి. 1928లో రాజమండ్రిలో జాలా రంగస్వామి దళిత బాలురకు, బాలికలకు విడివిడిగా రెండు వసతి గృహాలు ఏర్పాటు చేశారు. ఈలివాడపల్లి (1911–1972) మండపేటలో 1931లో వసతి గృహం నెలకొల్పారు. అయితే ఆ తరువాత అది రామచంద్రాపురంకు మార్చబడింది. ఆయనే 1940లో మరో వసతి గృహాన్ని ప్రారంభించారు. ఆ విద్యార్థులకు తిండి పెట్టేందుకు ఆయన బిక్షాటన చేయడం ఇప్పటికీ ఇంకా అనేకమందికి గుర్తుంది. ఆయన రామచంద్రాపురంలో లక్ష్మీ పారిశ్రామిక శిక్షణా కేంద్రంను కూడా నెలకొల్పారు. 1936లో రాజోలులో గొల్లా చంద్రయ్య (1818–1972) ఇంకో వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. అది ఎంతో మంది దళిత విద్యార్థులకు ఆసరాగా నిలిచింది. ఇప్పటికీ ఆ వసతి గృహం నడుస్తోంది. ఆ తరువాత 1937లో అమలాపురంలో పందు లక్ష్మణ స్వామి (1892 – 1860) మరో వసతి గృహాన్ని నెలకొల్పారు.

కోస్తా జిల్లాల్లో పరిస్థితి ఈ విధంగా వుంటే హైదరాబాద్ (నిజాం) రాష్ట్రంలో కొస్తాంధ్రలో కంటే ముందే భాగ్యరెడ్డి వర్మ (1888–1939) ఒక చైతన్యాన్ని తీసుకొచ్చారు. అంటరానివాళ్ల సమగ్ర ప్రగతికోసం విద్య చాలా అవసరమని ఆయన గుర్తించారు. ఆ రోజుల్లో హైదరాబాద్ రాష్ట్రంలో అంటరానికులాలకు చెందిన పిల్లల్ని పాఠశాలల్లో

చేర్చుకోవడం అనేది లేదు. కాబట్టి ప్రాథమిక పాఠశాలల్ని తెరవడమే ఆయన ప్రధాన కార్యక్రమంగా వుండేది. మొదట 1910లో హైదరాబాద్ నగరంలోని ఇసామియా బజార్‌లో "జగన్ మిత్ర మండలి" కార్యాలయంలో ఒక దిగువ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు.[9] ఆ తరువాత లింగంపల్లి, బొగ్గుల కుంటల్లో మరొకటి ప్రారంభించారు. క్రమంగా చంచల్‌గూడ, సుల్తాన్ షాహి, ధూళ్‌పేట్, గన్‌ఫౌండ్రీలలో ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ పథకం కింద మరికొన్ని ఆది హిందూ ప్రాథమిక పాఠశాలలు వచ్చాయి. అనతికాలంలోనే ఈ ఆది హిందూ పాఠశాలల సంఖ్య 26కు, దళిత విద్యార్థుల సంఖ్య 2,500కు పెరిగింది. మొదట్లో ఈ పాఠశాలలకు దక్కన్ హ్యూమనిటేరియన్ లీగ్ (జీవన్ రక్ష జ్ఞాన ప్రచారక మండలి) నుంచి ఈ పాఠశాలలకు నిధులు అందేవి. ఆ తరువాత సామాజిక, రాజకీయ చైతన్యం ద్వారా సామాజిక మార్పును తెచ్చే లక్ష్యంతో 1934లో నిజాం ప్రభుత్వం వాటి నిర్వహణ బాధ్యతలను స్వీకరించింది. అప్పటి వరకు ఒక్క "దీన బంధు" పత్రిక తప్ప మరే ఇతర అగ్రవర్ణ హిందూ వార్తాపత్రికలు దళిత సమస్యల గురించి ప్రస్తావించేవి కావు. (దీన బంధు పత్రికను మచిలీపట్నం నుంచి వేమూరి రాంజీరావు ప్రచురించేవారు) మొట్టమొదటి దళిత పత్రిక "జయభేరి"ని కుసుమ ధర్మన్న (1894–1948) ప్రారంభించారు. "వీర భారతి" అనే వార పత్రికను జాలా రంగస్వామి 1933లో రాజమండ్రిలో స్థాపించారు. ఆ తరువాత 1944లో రాజోలు నుంచి "హరిజనులు" అనే పత్రికను వుండ్రు సుబ్బారావు, అమలాపురం నుంచి "ఆదిమాంధ్ర" అనే పత్రికను గెద్దాడ బ్రహ్మయ్య, రాజమండ్రి నుంచి "జీవన జ్యోతి" అనే పత్రికను చుండ్రుమల్ల వెంకటరత్నం, కాకినాడ నుంచి "ఆది హిందూ" అనే పత్రికను పాము రామమూర్తి, "నవజీవన్" అనే పత్రికను బి.ఎస్. మూర్తి వెలువరించారు. హైదరాబాద్ రాష్ట్రంలో 1918లో మన్య సంఘం వారు "పంచమ" అనే పత్రికను ప్రారంభించారు. ఈ పత్రికలన్నీ 1950కి పూర్వం జనచైతన్యాన్ని పెంచి సామాజిక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్రను పోషించాయి.

దళితులు తమ నైతిక, భౌతిక ప్రమాణాలను పెంచుకునేందుకు కుల సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. దళిత ప్రజానీకంలో మార్పులు తీసుకురావడానికి వాటి ఏర్పాటు అనివార్యమయింది. దళిత సమాజాల్లోని వివిధ జాతుల బృందాల మధ్య

---

9. జగన్ మిత్ర మండలిని ముందుగా హైదరాబాద్‌లో 1911లో భాగ్యారెడ్డి వర్మ స్థాపించారు; 1921 నుంచీ ఈ సంస్థను ఆది హిందూ సామాజిక సేవా సంఘంగా సంబోధిస్తున్నారు.

సామాజిక అంతరాలను తగ్గించేందుకు ఈ సంఘాల ద్వారా వారు విశేషంగా కృషిచేశారు. మొత్తం ఆంధ్ర, హైదరాబాద్ అంతటా ఈ సంఘాలు ఏర్పడ్డాయి. ఆది ఆంధ్ర మహాజన సభ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్, అరుంధతీయ మహాసభ, జగన్ మిత్ర మండలి, హైదరాబాద్ రాష్ట్ర బడుగు వర్గ సంఘం వంటి పది సంఘాలు ఇరవైయవ శతాబ్దపు తొలి అర్ధభాగంలో ఈ దిశలో ఎంతో కీలక పాత్రను పోషించాయి.

నెమ్మదిగానే అయినా నిలకడగా సాగిన విద్యాభివృద్ధి వల్ల ఎందరో దళితులు తమ సాంప్రదాయిక వృత్తులకు దూరం కాగలగడం నిజంగా ఒక ప్రగతిశీల మార్పు అని చెప్పవచ్చు. విద్య వల్ల వారికి కొత్త వృత్తులు చేపట్టే అవకాశం లభించింది. ఈ విద్యాభివృద్ధి స్వల్పమే అయినా అంతకు పూర్వం అసలు దళిత విద్య అనేదే లేదు కదా. తొలితరం దళితులు మిషనరీల, మానవతావాదుల, సంఘ సంస్కర్తల, వలసవాద ఏజెన్సీల మానవీయ కృషి వల్ల విద్యావంతులయ్యారు. ఇరవైయ్యవ శతాబ్ది నాటికి కొన్ని కొత్త ఉద్యోగ అవకాశాలు దళితులకు అందుబాటులోకి వచ్చాయి. మిలటరీ, రైల్వేలు వంటి ప్రభుత్వ సర్వీసుల్లో తొలితరం దళిత యువతకు ప్రవేశం లభించింది. స్వల్ప సంఖ్యలో నైనా కొందరు దళిత పెద్దలు కాంగ్రెస్ రాజకీయోద్యమంలో, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధీ ప్రారంభించిన పోరాటంలో పాల్గొన్నారు.

దళిత మేధావులు బలమైన ఐక్యతను నిర్మించే లక్ష్యంతో దోపిడీ సిద్ధాంతాన్ని బట్టబయలు చేశారు.[10] ప్రస్తుత విద్యా విధానాలను విమర్శిస్తూ తమ ఆకాంక్షలను స్పష్టంగా వ్యక్తం చేశారు. సుప్రసిద్ధ దళిత కవి గుర్రం జాషువా ఇలా ఆరోపించారు:[11]

> "మన గ్రంథాలు మన తాతముత్తాతల శవాల్లాగే విలువలేనివి. అవే గ్రంథాలను మనం చదువుకుంటూ పోతే యజమాని ప్రయోజనం కోసం ప్రతిదానికీ తల ఊపే గంగిరెద్దుల్లా తయారవుతాం. అలాంటి క్షీణ గ్రంథాలు ప్రజల అవసరాలను తీర్చవు, వాటివల్ల జ్ఞానమనే వృక్షం చిగురించదు."

---

10. గుర్రం జాషువా (1895–1971) గారు మదాలస (1919), ఫిరదౌసి (1930), కాందిశీకులు (1943) వంటి అనేక కావ్యాలు రాశారు.

11. గుర్రం జాషువా రచనల్లో గబ్బిలం సుప్రసిద్ధమైనది. దళితుల కష్టాలనీ, కన్నీళ్లనీ ఈ కావ్యంలో ఆయన కళ్లకు కట్టినట్టు చిత్రించారు. చీకటిలో తిరుగాడే మురికి పక్షి గబ్బిలంను అపశకునంగా, అపవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఇది అంటరాని వాళ్ల దుస్థితిని సూచిస్తుంది. గబ్బిలాన్ని ఆయన కేవలం దోపిడీని ఎదురించే ఆయుధంగానే కాక దళితులలో సామాజిక చైతన్యాన్ని తెచ్చే సాధనంగా అభివర్ణించారు. ఈ కావ్యం ద్వారా ఆయన దళితులకు ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా జీవించే హక్కు వుందన్న సందేశాన్నిచ్చారు.

ఇక ఆర్థిక రంగానికి వస్తే పందొమ్మిదవ శతాబ్దంలో కృష్ణా, గోదావరి నదుల మీద భారీ నీటి పారుదల పథకాలు మొదలయ్యాయి. వరి తదితర వాణిజ్య పంటలను విస్తారంగా పండించేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. మార్కెట్ పరిధి పెరిగిపోయింది. తత్ఫలితంగా ఇరవైయ్యవ శతాబ్దపు తొలినాళ్లలో కుల కట్టుబాట్లు, దళిత కూలీలకు హద్దులు ఏర్పరచిన “జజమానీ” విధానాలు సడలిపోయాయి. ఈ పరిస్థితి అనేకమంది దళితులు ఒక చోటు నుంచి మరో చోటుకి పనులకోసం గుంపులుగా వలస వెళ్లే అవకాశాలను కల్పించింది. ప్రతి సంవత్సరం భారత తూర్పు తీర ప్రాంతం నుంచి వేల సంఖ్యలో బర్మాలోని రంగూన్ ఓడ రేవులో పనుల కోసం తరలి వెళ్లేవారు.[12] ఈ బర్మా అవకాశాల వల్ల ఎంతోమంది ఆర్థికంగా ఎదిగారు. వారిలో చాలామంది తిరిగి వచ్చినతరువాత తమ కులం వారికి విద్యావకాశాలు కల్పించేందుకు పెట్టుబడులు పెట్టారు. బర్మా నుంచి తిరిగి వచ్చిన దళితుల్లో ఒకడైన వుండ్రు తాతయ్య బర్మాలో 300 ఎకరాల స్థలం, తన సొంత ఊరైన తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకాలోని పొన్నమండలో 150 ఎకరాల స్థలం సంపాదించుకోలిగారు. ఆయన ఇతర సంస్కర్తలతో కలిసి ఆంధ్రలో దళిత విద్య కోసం డబ్బును సమీకరించేందుకు బర్మాకు వెళ్లివస్తుండేవారు. 1920లలో ఆయన దళితుల కోసం పొన్నమందలో ఒక పాఠశాలను నెలకొల్పారు. తూర్పు గోదావరి జిల్లాలోని అనంతవరం, అల్లవరం, మొదలకుదురు గ్రామాల్లో పాఠశాల భవనాల నిర్మాణానికి విరాళాలిచ్చారు.

ఆ తరం వారు విద్యా వ్యాప్తికి ఎంతగానో కృషిచేశారు. దళితులు బాగా చదువుకుని అభివృద్ధి చెందాలని నిరంతరం ప్రచారం చేశారు. తమ కులంవారి భవిష్యత్ ప్రగతికి ఆధునిక విద్య ఏవిధంగా దోహదం చేస్తుందన్న అంశంపై వారికి స్పష్టమైన అవగాహన వుండేది. ఆధునిక విద్య దళిత విముక్తికి ఒక సాధనంగా ఎలాంటి పాత్ర పోషించగలదో వారికి తెలుసు. విద్య ద్వారా వారు సామాజిక సమానత్వాన్నీ, ఆత్మగౌరవాన్నీ సాధించాలని భావించారు. వారు నిర్వహించిన వివిధ మహాసభల్లో దళిత పిల్లలకు ప్రభుత్వం ఉచిత విద్యను అందించాలంటూ తీర్మానాలు చేశారు. అటు విద్య, ఇటు సాహిత్యం రెండూ రెండు చోదక శక్తుల్లా పరస్పరం సహకరించుకుంటూ ఒకే లక్ష్యం కోసం కృషిచేశాయి.

---

12. బర్మాలో 1930 నాటికి నివసిస్తున్న భారతీయులలో తెలుగువాళ్లు మిగతా వారికంటే ఎక్కువగా వుండేవారని 1931 సంవత్సరపు బర్మా జనాభా లెక్కలను బట్టి తెలుస్తోంది. ఆ నివేదిక ప్రకారం భారతీయ జనాభా ఇలావుండేది. బెంగాలీలు 1,23,319; ఉత్తరాదికి చెందినవారు (హిందుస్థానీలు) 1,25,054; ఒరియావాళ్లు 5,790; తమిళులు 84,327; తెలుగువాళ్లు 1,31,727. అయితే అనధికార లెక్కల ప్రకారం తెలుగు వాళ్ల సంఖ్య 1.5 లక్షల నుంచి 2.18 లక్షల మధ్య వుండేదని తెలుస్తోంది.

పందొమ్మిదో శతాబ్దంలో సంఘ సంస్కరణోద్యమం విద్యకు చైతన్య సాధనంగా ప్రాధాన్యతను యిచ్చింది కానీ దాని అభివృద్ధి ద్విజులకు మాత్రమే పరిమితమయింది. విద్యను స్త్రీలకూ, అంటరానివాళ్లకూ అందించేందుకు చేసిన ప్రయత్నాలు అంతంత మాత్రమే. కేవలం దళితులను అణగారిన హిందువులుగా సంఘ సంస్కర్తలు గుర్తించారు. అదైనా క్రైస్తవులు మతమార్పిడి కోసం చేస్తున్న కృషి కారణంగానే. దళితుల అధోస్థాయిని గుర్తుచేసే, కొనసాగించే సాధనాలుగా పాఠశాలలు తయారయ్యాయి. అంటరానివాళ్ల పట్ల క్రైస్తవ మిషనరీలు మాత్రం మానవత్వంతో స్పందించేవారు. దళితుల తక్షణ అవసరాలను తీర్చి, సమస్యలను పరిష్కరించి వారిని సంతృప్తి పరచాలని తహతహలాడేవారు. అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తల కృషిలో అలాంటి వైఖరి మచ్చుకు కూడా కనిపించేది కాదు. తొలి తరం అంటరానివాళ్లు దళిత సమస్యను పరిష్కరించే కార్యకర్తలుగా, సిద్ధాంతకర్తలుగా ముందుకొచ్చారు. వారు సమాజంలో వేళ్లూనికొని వున్న కుల ప్రాబల్యాన్ని ఛేదించేందుకు విద్యను ఒక మహత్తర సాధనంగా చూశారు. అందుకే దళితులు చదువుకునేలా కృషి చేశారు. అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తల డొల్ల ప్రయత్నాలను వారు పత్రికలు, కరపత్రాలు, రచనలు, ఉపన్యాసాలు మొదలైన వాటిద్వారా ఎండగట్టారు. దళితులంతా విద్య ఆవశ్యకతను గుర్తించాలని ప్రభోదించారు.

చైతన్యవంతులైన అగ్రవర్ణ హిందువులు దళితుల కోసం సంఘటిత సామాజిక ఉద్యమాన్ని నిర్వహించేందుకు ఎలాంటి చెప్పుకోదగ్గ ప్రయత్నమూ చేయలేదు. ఆ కాలపు కమ్యూనిస్టుల విషయంలో కూడా ఇదే జరిగింది. ఈ విధంగా దళితేతర వర్గాల నుంచి దళితులకు పెద్దగా సహాయం అందలేదు.

పందొమ్మిదో శతాబ్దపు చివరలో, ఇరవైయవ శతాబ్దపు ప్రారంభంలో స్త్రీల సంస్కరణ, స్త్రీల విద్య ఆవశ్యకతను గుర్తించారు. తత్ఫలితంగా అనేకమంది అగ్రవర్ణ మహిళలు రాజకీయ, విద్య, వృత్తి రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకోగలిగారు. ఈ అధ్యయనానికి సంబంధించిన కాలంలో ఏవో ఒకటి రెండు అరుదైన కేసులు మినహా దళిత మహిళలు చదువురాని వాళ్లుగానే మిగిలిపోయారు. విద్యా వ్యవస్థకు దూరంగానే వుండిపోయారు.

అందుబాటులో వున్న ఆధారాలను బట్టి చూస్తే చదువు వల్ల అప్పటి దళితుల ఆర్థిక స్థితి మెరుగైన దాఖలాలు కనిపించవు. జనాభా లెక్కల నివేదికలో ఏ రంగంలోనూ వృత్తిపరమైన అభివృద్ధి చిహ్నాలు కనిపించవు. అయితే చదువు వల్ల దళిత మేధావులు, సంఘసంస్కర్తలు, రాజకీయ నాయకులు, రచయితలు తయారయ్యారు. వారు దళితుల హక్కుల కోసం పోరాడారు. వలసవాద తదనంతర సమాజంలో వారు పోరాడి సాధించిన హక్కులే చట్టరూపం ధరించాయి.

వృత్తులలో మార్పు, నూతన చైతన్యం దళితులలో భద్రతా భావాన్ని తెచ్చాయి. సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి దోహదం చేశాయి. ఈ మొత్తం ఉద్యమం పాశ్చాత్య

ఆదర్శాలు, పాశ్చాత్య విద్య ప్రభావం ఫలితమే అని చెప్పవచ్చు. కొత్త హక్కులు, సమాన హోదా, నూతన చైతన్యం దళితులను ఒక నూతన జీవన విధానం వైపునకు నడిపింది. అయితే ఇరవైయవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాల్లో ఈ సామాజిక మార్పు దళితుల అధికార, హోదాల్లో అభివృద్ధి ఫలితంగానే సాధ్యమైందనడంలో సందేహంలేదు. ఆ అధికారం, హోదాల అభివృద్ధి ప్రధానంగా రాజకీయంగా, స్వల్పంగా సంఘ సంస్కరణ ద్వారా జరిగింది.

4

రాజకీయ భాగస్వామ్యం

రాజకీయ భాగస్వామ్యం వెనుక వున్న ప్రధానమైన భావన ప్రతి వ్యక్తికీ తన జీవన పరిస్థితుల మీద స్వీయ నియంత్రణ వుంటూ, ఇతర్లతో కలిసిముందుకు సాగగలుగుతూ, సామాజిక జీవనంలో మమేకం కావడం. దీనర్థం తమ నైతిక, సామాజిక, స్వీయ విలువ పరమైన అభివృద్ధి విషయంలో అటు వ్యక్తులుగా, ఇటు పౌరులుగా హేతుబద్ధమైన స్వీయ నియంత్రణ మధ్య ఎలాంటి తేడా వుండకూడదు. ఇదే పద్ధతిలో ఆర్డెంట్ ఇలా అన్నారు: "ప్రజా సంతోషంలో ఒక వ్యక్తికి భాగం లేనప్పుడు ఎవరినీ స్వేచ్ఛాజీవిగా పరిగణించలేం; ప్రజా సంతోషంలో ఒక వ్యక్తికి పాలు లభించనప్పుడు, అందులో భాగం లేనప్పుడు ఎవరినీ సంతోషంగా, స్వేచ్ఛగా వున్నట్టు భావించలేం; ప్రజాధికారంలో పాలుపంచుకోకుండా, అందులో తగిన భాగస్వామ్యం పొందకుండా ఎవరినీ సంతోషంగా, స్వేచ్ఛగా వున్నట్టు పరిగణించలేం." ఒక వ్యక్తి మానసిక విద్యకు తన శక్తి సామర్థ్యాలను పెంపొందించు కునేందుకు, తన నిర్ణాయక శక్తిని వినియోగించుకునేందుకు ఇదొక సాధనం.

భాగస్వామ్యం దేశభక్తిని, విధేయతని, మొత్తంగా సమాజం పట్ల నిబద్ధతని పెంపొందిస్తుంది. రాజకీయ భాగస్వామ్యంలో ఓటువేయడం, సభలకు హాజరుకావడం, సిద్ధాంతపరంగా/ఆర్థికంగా సహాయం అందించడం, ప్రతినిధులను ప్రభావితం చేయడం, వారితో సంప్రదింపులు జరపడం వంటి చర్యలు వుంటాయి. రాజకీయ భాగస్వామ్యం అనేది ఈ చర్యలన్నింటిలో లేదా కొన్నింటిలో ప్రతిబింబించవచ్చు. సంతృప్తి చెందడం, ఇతర్ల అవసరాలను తీర్చి సంతృప్తిపరచడం అనే రెండు ప్రయోజనాలను అది నెరవేరుస్తుంది. ఒక వ్యక్తి సమాజంలో తనకు హక్కుగా వున్న స్థానం, ప్రభుత్వ విధానంతో చురుకైన సంబంధం, ప్రస్తుత సామాజిక రాజకీయ వ్యవస్థతో పనిచేయడం

ప్రయోజనకరం అని భావించలేనంత కాలం ఇది వికసించదు.

వలసవాద పూర్వ సాంప్రదాయిక భారతదేశంలో దళితులకు రాజకీయాలు నిషిద్ధంగా వుండేవి. చైతన్యపరిచేందుకు అనర్హులైన జనంగా దళితులను పరిగణించేవారు. రాజకీయాల భావన అగ్రవర్ణ హిందువులకు మాత్రమే చెందినదిగా వుండేది. మరొకవిధంగా చెప్పాలంటే రాజకీయాలు అనేవి పాలకుల, రాజుల, జమీందార్ల, కొద్దిమంది అభివృద్ధిచెందిన వర్గాల - సామాజిక ఆర్థిక హోదాను అనుభవించే వ్యక్తుల గుత్త సొమ్ముగా వుండేవి.

అంటరానివాడు కేవలం సామాజిక, మతపరమైన వాటిలో మాత్రమే అంటరానివాడు కాదు – రాజకీయాల్లో కూడా అంటరానివాడే. గ్రామం బయటి ప్రపంచంతో అంటరానివాళ్లకు వుండే సంబంధాలు పూర్తిగా ఆ గ్రామంలోని పెత్తందారీ మధ్యవర్తుల ద్వారానే వుంటాయి. భూస్వాములతో తమ తగాదాలకు సంబంధించిన అభ్యర్థనలను ఆ పెత్తందారీ వర్గం ద్వారానే అధికార్లకు సమర్పించుకోవాల్సి వుండేది. ఈ కులాల వాళ్లు తమలో తలెత్తే వివాదాలను పరిష్కరించుకునేందుకు తమ సొంత కుల పంచాయితీలను ఏర్పాటు చేసుకున్నారు. రాజకీయాలు, వాటిలో భాగస్వామ్యం విషయానికి వస్తే కేవలం పెత్తందారీ కులాల వాళ్లే అనుభవించేవారు. జాతీయోద్యమంపై, వ్యవసాయిక పోరాటాలపై, చివరికి భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమంపై జరిపిన ఏ అధ్యయనంలో కూడా దళితుల పాత్ర గురించిన ప్రస్తావన లేదు. ఆ ఉద్యమాలలో బలహీనవర్గాలు నిర్వహించిన పాత్రను ఏ అధ్యయనమూ గుర్తించలేదు. ఈ నేపథ్యంలో రాజకీయాలలో దళితుల ప్రవేశం గురించీ, రాజకీయాలవైపు వారిని నడిపిన పరిస్థితుల గురించీ, రాజకీయ అజ్ఞానం నుంచి రాజకీయ చైతన్యం దిశగా వచ్చిన మార్పు... ఆ అభివృద్ధి తాలూకు వివిధ దశల గురించీ ఈ అధ్యాయంలో తడిమే ప్రయత్నం చేయడం జరిగింది.

రాజకీయ గుర్తింపును సాధించే ప్రయత్నం

వలసవాద పాలనా వ్యవస్థ క్రమంగా, సమూలంగా భారత దేశపు సామాజిక, ఆర్థిక, రాజకీయ, పరిపాలనా వాతావరణాన్ని మార్చివేసింది. ఈ కొత్త వ్యవస్థ కనీసం సిద్ధాంతపరంగానైనా కులం, రంగు, జాతి వంటి పక్షపాతాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా పోటీతత్వం, వ్యక్తివాదం, స్వేచ్ఛా సమానత్వ సూత్రాల ప్రాతిపదికన భారత సమాజాన్ని మలిచేందుకు ప్రయత్నించింది. దళిత చరిత్రలో వలసవాద దశ ఎంతో ముఖ్యమైనది. బహిష్కృత కులాల అమానవీయ స్థాయిని చట్టబద్ధం చేసిన

సాంప్రదాయక విధానంలో మార్పునకు ప్రతీకగా నిలుస్తుందది. నాటి జీవన విధానం బహిష్కృత కులాలకు కొత్త శక్తిని, ఒక సాధికారతా భావనను, ఆశావాదాన్ని అందించింది. కిందిస్థాయి కులాల వాళ్లకు కనీసం పేరుకైనా చట్టం ముందు సమాన హోదాను కల్పించింది. మొట్టమొదటిసారిగా కింది కులాలవాళ్ళు ముందడుగువేసేందుకు, అభివృద్ధిచెందేందుకు చట్టం కొన్నైనా అవకాశాలను అందుబాటులోకి తెచ్చింది. విద్యలో, ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలనన్నీ కొద్దిమంది ఉన్నతవర్గాలవాళ్లే హక్కుభుక్తం చేసుకున్నారు. అయితే ఈ దశలోనే అంటరానివాళ్లకు ప్రత్యక్ష కులహీనతను తోసిరాజంటూ కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి.

1920వ దశకంలో బొంబాయితో పాటు మద్రాసు ప్రెసిడెన్సీలోని సామాజిక, రాజకీయ జీవనంలో ఒక చైతన్యవంతమైన, సంఘటితమైన దళితోద్యమం పెల్లుబికింది.[1] ప్రపంచ స్థాయిలో మొదటి ప్రపంచ యుద్ధానికి ముందున్న అల్లకల్లోల పరిస్థితులలో రష్యా విప్లవం పెను సవాలును విసిరింది. అప్పుడే భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులకు కొత్త రాజకీయ అధికారాలను "మాన్‌టేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణ"ల రూపంలో ప్రసాదించింది.[2] ప్రజా ఉద్యమాలు, సిద్ధాంతపరమైన తిరుగుబాట్లు వెల్లువెత్తుతున్న కాలమది. భారతదేశంలో కార్మిక వర్గం సంఘటితమై అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి)ని ఏర్పాటు చేసుకున్న దశ అది. ప్రభుత్వ లెవీలకూ, భూస్వాముల అణచివేతకూ వ్యతిరేకంగా రైతుల ఉద్యమాలు, కిసాన్ సభ నేతృత్వంలో పోరాటాలు సాగాయి. ఇవన్నీ మద్రాస్ ప్రెసిడెన్సీలో కూడా సంభవించాయి.

---

1. కోస్తా ఆంధ్రలోని ఏడు జిల్లాలు– శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఒంగోలు, గుంటూరు, నెల్లూరు; రాయలసీమలోని నాలుగు జిల్లాలు – కర్నూలు, చిత్తూరు, అనంతపూరు, కడప మద్రాస్ ప్రెసిడెన్సీ కింద వుండేవి.

2. భారత ప్రభుత్వానికి కార్యదర్శిగా వున్న ఎడ్విన్ మాంటేగ్ 20 ఆగస్ట్ 1917న భారత వలస ప్రభుత్వానికి ఒక కొత్త విధానాన్ని అమలుపరుస్తున్నట్టు హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రకటించాడు. బ్రిటిష్ సామ్రాజ్యంలో భారత ప్రభుత్వం ఒక సమగ్ర అంతర్గత భాగంగా అభివృద్ధి పరిచే ఉద్దేశంతో క్రమేణా స్వీయ పాలనా వ్యవస్థలను పెంపొందించేందుకు ప్రతి పాలనా రంగంలో భారతీయులకు భాగస్వామ్య కల్పన గురించి ఆ విధానంలో వివరించారు. ఆ ప్రకటన భారతదేశంలోని దళితవర్గాల్లో ఎంతో ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఆ వెనువెంటనే మాంటేగ్ భారత వైస్‌రాయ్ ఛెమ్స్‌ఫర్డ్‌తో కలిసి దేశమంతటా విస్తృతంగా పర్యటించారు. అదే మాంట్ ఫర్డ్ సంస్కరణలకు దారితీసింది. తద్వారానే దళితుల రాజకీయ భాగస్వామ్యానికి బీజంపడింది. చూ. కననాయ్ కిల్, 1981; జెలియట్, 1966.

రైతాంగ, కార్మికవర్గ పోరాటాలతో పాటు గాంధీ నేతృత్వంలో సాగిన నూతన అహింసాత్మక ప్రజోద్యమం పరిధిలోనే సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం కూడా పెరిగింది.

దళితులలో జాతీయ స్థాయిలో రాజకీయ చైతన్యం 1917–1929 సంవత్సరాల మధ్య కాలంలో ఊపందుకున్నట్లు కనిపిస్తుంది. మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు, దాంతోపాటు లార్డ్ సౌత్ బోరో అధ్యక్షతన ఏర్పడిన ఫ్రాంచెస్ కమిటీతో ఈ పరిణామం మొదలయింది. 1924 మడ్డిమాన్ కమిటీ సిఫారసుల ఫలితంగా లెజిస్లేటివ్ కౌన్సిల్‌లోని బడుగువర్గాల ప్రతినిధులను సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నామినేట్ చేసేందుకు అనుమతించారు.[3] అంతకు పదేళ్లముందు మొదలుపెట్టిన పార్లమెంటరీ సంస్కరణలను విశ్లేషించేందుకు 1928లో ఇండియన్ స్టాట్యుటరీ కమిషన్ [4] భారతదేశమంతా పర్యటించింది. ఆ కమిటీతో పాటు వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ నిరాకరించినా దళిత కమిటీలు మాత్రం తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు అదొక అవకాశం యిస్తుందన్న ఉద్దేశంతో స్వాగతించాయి. కాంగ్రెస్‌తో సహా ఇతర జాతీయ రాజకీయ పార్టీలన్నీ 1928లో ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో సంపూర్ణ స్వరాజ్యం కోసం కార్యక్రమాన్ని ఖరారు చేశాయి. దాంతోపాటే ఢిల్లీలో అఖిల భారత బడుగువర్గాల సదస్సు కూడా జరిగింది. ఆ సదస్సుకు 500 మంది సభ్యులు హాజరయ్యారు. అన్ని రాజకీయ పార్టీల సమావేశం స్వాతంత్ర్యంకోసం రూపొందించిన కార్యక్రమాన్ని – స్వాతంత్ర్యం కంటే ముందు దళిత హక్కులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్న డిమాండుతో బడుగువర్గాల సదస్సు వ్యతిరేకించింది. ఈ సంఘటనలు 1920లలో దళితులలో పెరుగుతూ వచ్చిన రాజకీయ చైతన్యాన్ని సూచిస్తున్నాయి. ఇది ఇతర రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగింది.

ఆ కాలంలో వ్యవసాయం పెద్ద ఎత్తున వ్యాపారీకరణకు గురైనందున ఆంధ్రాలో ఒక సరికొత్త పరిస్థితి ఏర్పడింది. అది విస్తృత స్థాయి గ్రామీణ దళితోద్యమానికి బీజంవేసింది. అందులోంచి స్వతంత్ర దళితోద్యమం రూపుదిద్దుకుంది. వ్యవసాయ వ్యాపారీకరణ, అంతవరకూ దళితులను అణిచివేస్తూ వచ్చిన కుల, జాతిపరమైన కట్టుబాట్లను నిర్మూలించింది. సంచార శ్రమ శక్తిని ఏర్పరచి అభివృద్ధి చేసేందుకు

---

3. మద్రాస్‌కు చెందిన యం.సి. రాజయ్య 1927లో సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఎంపికైన మొట్ట మొదటి బడుగువర్గాల ప్రతినిధిగా సేవలు అందించారు.

4. కమిటీకి ఛైర్మన్ అయిన జాన్ ఆల్స్‌బ్రూక్ సైమన్ వల్లనే ఆ కమిటీకి సైమన్ కమిషన్ అనే పేరు వచ్చింది.

సాయపడేక్రమంలో మాల, మాదిగలకు కూడా అభివృద్ధిచెందేందుకు కొన్ని అవకాశాలను కల్పించింది. అనేకమంది చేతివృత్తుల వాళ్లు, గ్రామీణ సేవకులు నూతన సాంకేతిక పద్ధతులు, నూతన ప్రభుత్వ విధానాల ఫలితంగా తమ సాంప్రదాయిక

పట్టిక : 4.1
ఎంపిక చేసిన అంటరాని కులాల జనాభా, 1921 - 1931

కులం	1921	1931
చెరుమాన్	2,48,000	2,15,000
హోలెయ	92,000	50,000
మాదిగ	7,37,000	6,12,000
మాల	14,93,000	8,38,000
పరయన్	23,87,000	1,17,000
తోటి	1,54,000	2,000
ఆది ఆంధ్ర	------	6,65,000
ఆది ద్రావిడ	50,000	16,19,000
ఆది కర్ణాటక	------	1,000

ఆధారం : భారత జనాభా లెక్కలు 1931, సంపుటం 14, మద్రాస్ - పార్ట్ 1.

స్థానాలను, అధికారాలను కోల్పోయారు. ఈ ఆర్థిక మార్పులు గణనీయమైన సామాజిక మార్పునకు, రాజకీయ విస్ఫోటనానికి దోహదం చేశాయి. 1920లో ముందుకొచ్చిన మరో ముఖ్యమైన పరిణామం హిందూ - ముస్లిం గుర్తింపు అంతకంతకూ బిగదీసుకుపోతూ పరస్పర విరుద్ధాంశాలుగా మారి మతపరమైన జాతీయవాదం చోటుచేసుకోవడం. సాంస్కృతికపరంగా చెప్పాలంటే గాంధీ హిందూ మత సంస్కరణవాదిగా ప్రాతినిధ్యం వహిస్తే - పశ్చిమ, దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణేతర ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. దళిత ఉద్యమాలు దేశవ్యాప్తమయ్యాయి. దిగువ కులాల రైతులు, ప్రాంతీయ సమాజాల ఉనికి వంటివి హిందూ మతానికి సవాళ్లుగా మారాయి.

సంస్కృతీకరణకు, సంస్కరణవాద సమైక్యవాద ధోరణులకు అంటరానివాళ్ల నుంచి ఎదురైన ప్రతిఘటన, వారు తమకు తాముగా సంఘటితమయ్యేందుకు దోహదం చేసింది. ద్రవిడ ఉద్యమం ఆది ద్రావిడులు (తమిళం మాట్లాడే అంటరానివాళ్ల కొత్త పేరు) అనే నూతన గుర్తింపునకు ప్రాణప్రతిష్ఠ చేసింది. అది ద్రావిడులు తమంతటతాము జాతి, ప్రాంత పరమైన గుర్తింపులను సృష్టించుకునేందుకు దారి చూపింది. ఉదాహరణకు ఆది ఆంధ్రులు (తెలుగు మాట్లాడే అంటరానివాళ్లు), ఆది కర్ణాటక వంటివి. ఈ గుర్తింపునకు ప్రాతిపదికత దళితులలో తామే ఈ దేశంలోని అసలు మూలవాసులం, భూమి పుత్రులం అన్న నమ్మకం. ఆది అన్న మాట వెనుకవున్న అర్థం యిదే. భాషాపర / ప్రాంతపరమైన ఈ పేరును ప్రభుత్వం ఆ తదనంతరం గుర్తించింది.

ఆంధ్రాలో మాలమాదిగల జనాభా 7,80,000కు తగ్గిపోయినట్టు 1931 మద్రాస్ జనాభా లెక్కలు సూచిస్తున్నాయి. ఇందులో ఆరు లక్షలమంది ఆది ఆంధ్రులుగా కొత్త గుర్తింపును పొందివుండవచ్చు.[5] మొత్తంగా 6,65,000 మంది మాల మాదిగలు తమను తాము ఆది ఆంధ్రులుగా పరిగణించుకున్నారు.

పందొమ్మిదో శతాబ్దపు చివరలో, ఇరవైయ్యవ శతాబ్దపు మొదట్లో చోటుచేసుకున్న సంఘ సంస్కరణోద్యమాల ఫలితంగా అనేక కుల సంఘాలు ఏర్పడ్డాయి. అవి ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపకార వేతనాల కోసం డిమాండ్ చేశాయి. కుల సంఘాలు రెండు ముఖ్యమైన మార్పులను, వాటితోపాటు కుల స్వభావంలో పరివర్తనను తీసుకొచ్చాయి. ఏకాకి జాతులుగా వున్న కులాలు సంఘటితమై ప్రాంతీయస్థాయి పొత్తులు కుదుర్చుకోగలిగాయి. అదే సమయంలో ఆది-ఆంధ్ర మహాజన సభ, మద్రాస్ అరుంధతి మహాజన సభ, మద్రాస్ ప్రాదేశిక ఆది-ఆంధ్ర సంఘం వంటి స్వచ్ఛంద సంస్థల ఏర్పడి గ్రామీణ వ్యవస్థలోని సాంప్రదాయిక పద్ధతులు, ప్రవర్తన మారేందుకు దోహదంటః చేశాయి..

మద్రాస్ ప్రెసిడెన్సీలో బ్రాహ్మణేతర ఉద్యమం బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని సవాలు చేసింది. వారి ఆధిపత్యాన్ని గట్టిగా వ్యతిరేకించింది. దళిత ఉద్యమాన్ని ప్రభావితం చేసిన అనేక ఆలోచనలకు అది ప్రాతిపదికతను సమకూర్చింది. రాజకీయంగా చైతన్యవంతులైన బ్రాహ్మణేతర అగ్రవర్ణ హిందువులు 1916నాటి హోంరూల్‌కు వ్యతిరేకంగా మొదలు పెట్టిన పోరాటానికి ప్రతిక్రియగానే బ్రాహ్మణేతర ఉద్యమం

---

5. ఈ కొత్త గుర్తింపు 1917లో చేసిన ఒక తీర్మానం ద్వారా వచ్చి వుంటుందని భావిస్తున్నారు. చూ. గౌతమ్, 1976. పే.67-8.

తలెత్తింది. అభివృద్ధిచెందిన బ్రాహ్మణ వర్గాలు తమ పోరాటం ద్వారా అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని భావించాయి. ప్రముఖ బ్రాహ్మణేతర నాయకులలో ఒకరైన టి.యం.నాయర్ హోంరూల్ పోరాటం బ్రాహ్మణుల గుత్తాధికారం కోసం ఉద్దేశించిందనీ, దాని వల్ల బ్రాహ్మణేతరులకూ, బడుగువర్గాలకూ ఎంతో హాని జరుగుతుందనీ వివరించారు. దళితులంతా తమ ప్రతినిధులతో ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలనీ తద్వారా బ్రాహ్మణేతరులూ, దళితులూ ఒకే దిశలో కలిసి నడవాలనీ ఆయన సూచించారు. స్వపరిపాలన కోసం కృషిచేసే ముందు బ్రాహ్మణేతరులకూ, దళితులకూ సీట్ల రిజర్వేషన్‌కు హామీ యివ్వాలనీ బ్రాహ్మణేతరులు డిమాండ్ చేశారు. అప్పుడే స్వయం పాలన ముసుగుతో బ్రాహ్మణాధిపత్యాన్ని నెలకొల్పుకునేందుకు వీలులేకుండా వుంటుందని వారు వాదించారు.

దళితులలోని సామాజిక అసౌకర్యాల పట్ల అవగాహనను పెంచడంలో, సామాజిక రాజకీయ గుర్తింపు కోసం నినదించడంలో విద్యావ్యాప్తికి తగిన భాగస్వామ్యం వుంది. అలాగే ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు కూడా పట్టణ ప్రాంత దళిత కార్మికులలో ఆత్మ గౌరవం పెరిగేందుకు దోహదం చేసింది. జనరల్ ట్రేడ్ యూనియన్లతో పాటు పూర్తిగా అంటరాని కులాలకు అంకితమైన పారిశుధ్య పనివాళ్ల సంఘాలు కూడా వుండేవి. అధిక వేతనాలకోసం వారు పోరాటాలు చేసినప్పుడు వారి స్థానంలో ఆ అపరిశుద్ధ పనులు చేసేందుకు ఎవరూ ముందుకురారు కాబట్టి అగ్రవర్ణ హిందువులు వారి డిమాండ్లకు తలొగ్గుతుండేవారు. 1920లలో మద్రాస్ ప్రెసిడెన్సీలో అనేక సార్లు పారిశుధ్య పనివాళ్ల సమ్మెలు జరిగాయి. అణగారిన వర్గాలలో పెరుగుతున్న చైతన్యాన్ని ఆ సమ్మెలు సూచిస్తాయి. కలకత్తా, జంషెడ్‌పూర్‌లలో కూడా ఇలాంటి పరిస్థితులే చోటుచేసుకున్నాయి.

ఇరవైయవ శతాబ్దం మొదట్లో జాతీయవాదం, బ్రాహ్మణ వ్యతిరేక భావాలు పెరిగినా కొద్దీ అంటరానితనాన్ని నిషేధించాలన్న డిమాండ్‌కు రాజకీయ ప్రాధాన్యత ఏర్పడుతూవచ్చింది. 1915 నాటికి ఈ సమస్యపై భారత పత్రికలలో, అన్ని రాజకీయ వేదికల మీద తీవ్రంగా చర్చించడం మొదలయింది. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే– మతపర ప్రాతినిధ్యం విషయంలో కూడా దళితుల సంఖ్యకు ప్రాధాన్యత పెరిగింది.

ఈ దశలోనే రాజకీయ చైతన్యంవున్న అగ్రవర్ణ హిందువులు ముస్లింల కంటే ఎక్కువ ప్రాతినిధ్యాన్ని సంపాదించుకోవాలన్న ఉద్దేశంతో దళితులను హిందువులుగా లెక్కల్లోకి తీసుకోవడం ప్రారంభించారు. సమాజంలోని బడుగు వర్గాలను తరతరాల

బంధనాల నుంచి విముక్తి చేసేందుకు రాజకీయ ప్రాతినిధ్యం ఒక సాధనగా ఇరవైయవ శతాబ్ది ప్రారంభం వరకూ ముందుకు రాలేదు. అందుకే 1858 నాటి భారత చట్టంగానీ, 1861, 1891 నాటి ఇండియన్ కౌన్సిల్ యాక్టులుగానీ అణగారిన వర్గాల ప్రత్యేక అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదు, ఏ చట్టంలోనూ వారి ప్రస్తావనే లేదు. రాజకీయ ప్రాతినిధ్య చిత్రపటంలో వారి ఉనికే కనిపించదు. బడుగువర్గాలను ఎవరూ వినలేదు, వారు కూడా ఎవరికీ చెప్పుకోలేదు. ఇరవైయవ శతాబ్దపు తొలి దశాబ్దాలలో దళితుల సంఖ్యకు గుర్తింపు లభించి, ఆ సంఖ్యకు ప్రాధాన్యత పెరిగిన తరువాతే వారిలో చైతన్యం వెల్లివిరిసింది.

దళితుల సంఖ్యకు పెరుగుతున్న ప్రాధాన్యత

జనాభా లెక్కల సేకరణను 1871లో ప్రారంభించినప్పటికీ దేశవ్యాప్తంగా ఒక క్రమబద్ధమైన, విశాల ప్రాతిపదికతతో కూడిన జనాభాలెక్కలు ఒకే పద్ధతిలో సేకరించింది మాత్రం 1881లోనే. జనాభా లెక్కల సేకరణను ప్రతీ పది సంవత్సరాల కొకసారి నిర్వహించాలని నిశ్చయించారు. తత్ఫలితంగా 1891, 1901 నాటి జనాభా వివరాలు లభిస్తున్నాయి. ఆ నివేదకల్లో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తున్నప్పటికీ వాటి పరిధి మాత్రం పరిమితంగానే వుంది. ఏ జనాభా లెక్కల్లోనూ మొత్తం భారతదేశంలో ఎంతమంది అంటరానివాళ్లున్నారు అని తెలుసుకునేందుకు, కనీసం ఉజ్జాయింపుగా ఆ సంఖ్యను అంచనావేసేందుకు ప్రత్యేక కృషి జరుగలేదు. డి. ఇబెట్సన్ 1881లో మొట్టమొదటిసారిగా కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాలలో, ఎంపిక చేసిన కులాల, ఆదివాసీల సంఖ్యను సమీకరించేందుకు ప్రయత్నించారు. ఆ తరువాత రిచర్డ్ బర్న్ 1901 జనాభా లెక్కల సేకరణ సమయంలో కులాలలను సామాజిక వరుస క్రమంలో వాటి స్థాయిని వర్గీకరించేందుకు, స్థానిక ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు ప్రయత్నించారు. ఇందుకు అగ్రవర్ణ హిందువుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కులం అంశాన్ని తొలగించాలని వారు ఒత్తిడి చేశారు. కానీ భారతదేశ సామాజిక వ్యవస్థకు ఇప్పటికీ కులమే ప్రాతిపదికగా వుంది కనుక కులాల వారిగా జనాభా లెక్కలను సేకరించడం ముఖ్యమనీ, అవసరమనీ భావించారు. ఈ వర్గీకరణలు ఎలావున్నప్పటికీ 1901 జనాభా లెక్కలలో మొత్తం అంటరాని కులాలకు చెందిన జనాభా ఎంత అని నిర్ధారించలేదు. ఎందుకంటే అసలు అంటరానివాళ్లు అంటే ఎవరు అనేది నిర్ణయించేందుకు కచ్చితమైన ప్రయోగాలు జరుగలేదు. పైగా ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన అంటరానివాళ్లు కానివారు కూడా ఎంతోమంది అంటరానివాళ్లలో కలగలిసిపోయి వున్నారు.

జాతీయోద్యమం ఇంకా ఊపందుకోని కాలమది. ప్రజలలో అప్పటికి చైతన్యం పెరగలేదు. 1909 చట్టం అమలులోకి వచ్చి భారత ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహించే ప్రక్రియకోసం ప్రత్యేక నియోజకవర్గాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఆ తరువాత 1911లోని జనాభా లెక్కల సేకరణలో ఎవరు అంటరానివాళ్లు అనేది నిర్ణయించేందుకు పది పరీక్షలు నిర్వహించారు. అవి మరింత గందరగోళాన్ని సృష్టించాయి. కుల/మత హోదాకి ఆ కాలంలో ప్రాధాన్యత పెరిగింది. రాజకీయంగా, కుల/మతపరంగా సంఖ్యా బలాన్ని పరిగణనలోకి తీసుకుని బేరీజువేయడం ఎక్కువయింది. దాంతో ఆయా వర్గాలు తమ వర్గం సంఖ్యాబలం గురించేకాక ఇతర వర్గాల సంఖ్యాబలం గురించి కూడా ఆలోచించడం మొదలుపెట్టాయి. కొన్ని వర్గాల నాయకులు రాజకీయ వ్యూహ రచనలో భాగంగా తమ వర్గం సంఖ్యను ఎక్కువచేసి, ప్రత్యర్థి వర్గం సంఖ్యను తక్కువచేసి చూపే ప్రయత్నాలు కూడా చేశారు. భారతదేశ జనాభా లెక్కల్లోని తప్పొప్పుల స్వభావాన్ని, మూలాలను ఎత్తిచూపుతూ కింగ్స్‌లే డేవిస్ ఇలా అన్నారు: "1909లో ప్రత్యేక మతపరమైన నియోజక వర్గాలు ఏర్పాటు చేసినప్పటినుంచీ ఆయా మతాలు జనాభా లెక్కల్లో తమ మతస్థుల సంఖ్యను పెంచి చూపేందుకు ఆరాటపడడం ఎక్కువయింది."

జనాభా లెక్కల్లో చోటుచేసుకున్న రాజకీయాలు ఒకవిధంగా దళితులకు మేలే చేశాయి. శతాబ్దాలుగా కొనసాగిన నిర్లక్ష్యం అంతరించి క్రమేణా దళితుల పట్ల కాస్త శ్రద్ధాసక్తులు కనబరచడం మొదలయింది. ఈ మార్పు కేవలం హిందువులలోనే కాదు అప్పటి వరకు దళితుల మతం మార్చేందుకు ప్రయత్నిస్తూ వచ్చిన ఇతర మతస్తులలో కూడా వచ్చింది. హిందువుల సంఖ్యాబలాన్ని దృష్టిలో పెట్టుకుని అంటరానివాళ్ల స్వతంత్ర గుర్తింపునకు ముస్లింలు మద్దతునివ్వడం మొదలుపెట్టారు. బి.ఆర్. అంబేద్కర్ ఇలా అన్నారు:

> "హిందూ – ముస్లింల మధ్య నెలకొన్న ఈర్ష్యాద్వేషాల నేపథ్యంలో దళిత వర్గాల వారిని తమలో ఇముడ్చుకుని హిందువులు ఎక్కడ మరింత శక్తిమంతులవుతారో నన్న భయం కారణంగా ముస్లింలు దళితులను సదా ప్రత్యేకంగా చూసేవారు. 1909లో భారత జనాభా లెక్కల సేకరణలో దళితులెవరూ తమ పేర్లను నమోదు చేయించుకోవద్దని ముస్లింలు సలహాయిచ్చే సాహసం చేశారు."

ఆ మూడు జనాభా లెక్కల్ని (1881–1901) పోలుస్తూ టి.వి. శేషగిరి అయ్యర్ ఈ విధంగా విశ్లేషించారు: " ప్రతి 10,000 జనాభాలో 1881 జనాభా లెక్కల ప్రకారం హిందువులు 9,143 ; ముస్లింలు 642 ; క్రిస్టియన్లు 229 చొప్పున వున్నారు.

ఈ అంకెలే అప్పటి వాస్తవ పరిస్థితులను వివరిస్తున్నాయి." ఆయన ఇంకా ఇలా అన్నారు: " ఆ తదనంతరపు జనాభా లెక్కల్లో కచ్చితంగా క్రిస్టియన్ల, ముస్లింల సంఖ్య పెరగడం, ఆమేరకు హిందువుల సంఖ్య తగ్గడం ఖాయం."

అగ్రవర్ణాలవారు దళితులను హిందూ మతానికి కట్టిపడేయాలంటే వారి స్థితిగతులను మెరుగుపరచాల్సిన అవసరం వుందని గుర్తించారు. వారిలో హఠాత్తుగా ఈ మార్పు రావడం వెనక వున్న కారణం తెలిసిందే. హిందువులు దళితులను నిర్లక్ష్యం చేస్తే అది హిందువులకే సామాజిక, రాజకీయ ప్రమాదంగా మారుతుంది. దళితులపట్ల సత్వరమే న్యాయాన్ని, మానవత్వాన్ని చూపకపోతే వారు హిందూమతంనుంచి దూరం కావడం లేదా ఇతర మతాల్లో కలిసిపోవడం జరుగుతుందని వారు పసిగట్టారు. ఈ పరుగు పందెంలో అటు హిందువులూ, ఇటు ముస్లింలూ దళితులను తమ మతాల్లోకి ఆకర్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ముస్లింలు తమ సంఖ్యా బలాన్ని పెంచుకునేందుకు గాను అంటరానివాళ్లను పెద్ద ఎత్తున మతమార్పిడి చేసేందుకు పూనుకున్నారు.

ఆ తదనంతరం, జనాభా లెక్కల నిర్వహణకు తోడు ప్రభుత్వం 1912-17లో భారతదేశ విద్యాభివృద్ధికి సంబంధించిన ఏడవ పంచవర్ష సమీక్షలో దళితుల మొత్తం సంఖ్యను, వారి అక్షరాస్యత రేటుతో సహా అంచనా వేసేందుకు ప్రయత్నించింది. ఆనాటి నుంచీ అధికారిక రికార్డులలో దళితుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అంతవరకు అసలు దళితుల ఉనికినే ఎవరూ పట్టించుకునేవారు కాదు. వివిధ ప్రాంతాలలో వున్న దళితులలోని విద్యావంతులు దళిత గుర్తింపు కోసం ఉద్యమించడం మొదలుపెట్టారు.

దళితుల సంఖ్య గురించిన కచ్చితమైన లెక్కలు కనుగొనడం కష్టమైన విషయమే. హోం డిపార్ట్‌మెంట్ (పబ్లిక్) పేర్కొన్న అంకెలకూ 1921నాటి జనాభా లెక్కల కమిషనర్ పేర్కొన్న అంకెలకూ మధ్య ఎంతో తేడా కనిపిస్తుంది. ఆ అంకెలన్నీ అంచనాలే తప్ప కచ్చితంగా వాస్తవికమైనవి కావు. ప్రభుత్వ ఏజెన్సీలు వివిధ అవసరాల కోసం అంచనా వేసిన అంకెలవి. ఏడవ పంచవర్ష సమీక్షలో పేర్కొన్న వివరాలు అంటరానివాళ్ల విద్యాభివృద్ధికి ఉద్దేశించినవి. కాగా హోం శాఖ పేర్కొన్న వివరాలు దళితుల స్థితిగతులను మెరుగుపరచాలంటూ అప్పటి ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని అమలుపరిచేందుకు ఉద్దేశించినవి.[6] అదేవిధంగా సౌత్ బోరో కమిటీ,

---

6. ఈ తీర్మానాన్ని ఎం.బి. దాదాబాయ్ ప్రతిపాదించారు. వివరాలకు భారత ప్రభుత్వ చట్టం 1915 కింద సమావేశమైన ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ప్రొసీడింగ్స్‌ని చూడవచ్చు. భారత ప్రభుత్వ హోం డిపార్ట్‌మెంట్ జీ.ఓ. నెం 130-131 (జులై 1916) లలోని నోట్సుని, ప్రొసీడింగ్స్‌ని కూడా చూడవచ్చు.

ఫిఫ్త్ డిశ్పాచ్‌లు పేర్కొన్న వివరాలు రాజ్యాంగపరమైన పురోగతికి ఉద్దేశించినవి.

ఈవిధంగా వివిధ ప్రభుత్వ ఏజెన్సీలు ప్రస్తావించిన సంఖ్యా వివరాలన్నీ చిత్తుగా వేసిన అంచనాలే. జనాభాలెక్కల్లో అసలు అంటరానివాళ్ల ఉనికిని గుర్తించడమనేది అంతంత మాత్రంగానే జరిగింది. అంటరానివాళ్ల నివాస ప్రాంతాలు ఊరికి దూరంగా వుండటం, వారి వివరాలను సేకరించేందుకు ఎవరూ దళితవాడల్లో అడుగుపెట్టడానికి ఇష్టపడకపోవడమే ఇందుకు కారణం. కాబట్టి 1931 వరకు సేకరించిన జనాభా లెక్కలన్నీ అంచనాలే తప్ప ఖచ్చితమైనవి కావు. ప్రతి కొత్త అంచనాలో వారి సంఖ్య పెరిగినట్టో, పరస్పర తేడాలున్నట్టో కనిపిస్తుంది.

వివిధ వర్గాల వారు తమ సంఖ్యాబలాన్ని ఎక్కువచేసి చూపుకోవాలనే తహతహ ఇరవైయవ శతాబ్దపు లక్షణంగా 1911 జనాభా లెక్కల నుంచీ మొదలయింది. ఆ తరువాత జనాభా లెక్కల్లో అది మరింత విస్తృతమైంది. వాద ప్రతి వాదాలన్నీ తమ సంఖ్యా బలాన్ని ఎక్కువ చేసి చూపుకునేందుకే సాగాయి. అగ్రవర్ణ హిందువులలో అదొక ప్రబలమైన ప్రచార కాంక్షలా కనిపిస్తుంది. అనేకమంది హిందువులు శిక్కులను, జైనులను, బౌద్ధులను హిందువులుగా పరిగణించారు. ఆ మతాలు హిందూ మతంలోంచి పుట్టినవేనని వాదించారు. అయితే ఆ వాదనను శిక్కులు తీవ్రంగా ఖండించారు. ప్రతి 10,000 జనాభాలో 1911 జనాభా లెక్కల ప్రకారం 6,688 మంది హిందువులున్నారు. కాగా 1931 జనాభా లెక్కల నాటికి ఆ సంఖ్య 6,549కి తగ్గిపోయింది. ఈ విధంగా హిందువుల జనాభా తగ్గిపోవడం, బెంగాల్, పంజాబ్, మద్రాస్, యునైటెడ్ ప్రావిన్సులలో ఎక్కువగా కనిపిస్తుంది. అదే సమయంలో ఆ ప్రాంతాలలో శిక్కుల, ముస్లింల జనాభా గణనీయంగా పెరగడం కూడా కనిపిస్తుంది. అస్సాం సెంట్రల్ ప్రావిన్సులలో మాత్రం హిందువుల సంఖ్యే పెరిగింది. అయితే ఈ రెండు ప్రావిన్సులలో ఆదివాసీ జనాభా గణనీయంగా తగ్గిపోయింది. అస్సాం బీహార్, ఒరిస్సాల్లో ఆదివాసీ జనాబా తగ్గడం, ఆ మేరకు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ జనాభా పెరగడం కనిపిస్తుంది. దాదాపు అన్ని ప్రాంతాలలో క్రిస్టియన్ల జనాభా పెరిగింది.

ఆయా ప్రాదేశిక ప్రాంతాలలో వివిధ వర్గాల సంఖ్యకు సంబంధించిన సాధారణ హెచ్చుతగ్గులకు మూలం జాతీయ జనగణన విధానంలోని లోపాలే అని భావించవచ్చు. కానీ ఒక ప్రాంతంలో ఒక వర్గం సంఖ్య విపరీతంగా పెరిగి మరో వర్గం సంఖ్య అదే స్థాయిలో తగ్గడాన్ని సహజ పరిణామంగా భావించలేం. పెద్ద ఎత్తున మత మార్పిడులు జరగడం వల్లనో లేదా రాజకీయ కుతంత్రాల వల్లనో ఈ హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయనేది సుస్పష్టం. దోపిడీ స్వభావంతో కూడిన రాజకీయ కుతంత్రాల వల్ల ఆదివాసీలు, దళితులు ఎంతగానో నష్టపోయారు.

1931 నాటివరకు సరైన అంచనాలే లేవు. 1911 నాటి జనాభా లెక్కల్లో - ఇంకా కచ్చితంగా చెప్పాలంటే 1909 నాటి మింటో - మోర్లే సంస్కరణలు ప్రారంభించినప్పటి నుంచీ స్థానిక సంస్థల్లో తమకు తక్కువ ప్రాతినిథ్యం లభించడం వల్ల వీరి ప్రాధాన్యత పెరిగింది. 1931 జనాభా లెక్కలు తొలిసారిగా కుల ప్రాతిపదికన కచ్చితమైన పద్ధతిలో సేకరించారు. బహుశా అందువల్లనే భారత జనాభాలో విపరీతమైన పెరుగుదల కనిపించింది. దళితులు మొట్ట మొదటిసారిగా 1931 జనాభా లెక్కలప్పుడు రెండంచెల వ్యూహాన్ని అనుసరించారు. ఒకటి - తమ సంఖ్యను హిందువులు తక్కువ చేసి చూపడాన్ని, కొన్ని ప్రాంతాల్లో తమ సంఖ్యాబలం మీద ప్రభావం చూపుతున్న రాజకీయ కుతంత్రాలను ప్రతిఘటించడం. రెండు - ఇతర మతాలవారు తమ వర్గం వాళ్ల మతమార్పిడి ప్రయత్నాలను ఎదుర్కోవడం.

రాజకీయంగా దళితులకు ప్రాధాన్యత పెరిగిపోవడంతో వారు కూడా రాజకీయాలను అలవర్చుకున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగిన జాతీయోద్యమంలో, బ్రాహ్మణేతర ఉద్యమాల్లో, కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నారు. అయితే అంటరానివాళ్లనే ముద్ర కారణంగా వారి పాత్ర నామమాత్రంగా వుండిపోయింది. ఆయా ఉద్యమాలలో వారిని సరిగా గుర్తించకపోవడం లేదా వారి పాత్రను సరిగా నమోదు చేయకపోవడం జరిగింది.

1920, 1930లలో దళిత దృక్పథం, భాగస్వామ్యం

ఇరవైయవ శతాబ్దపు తొలినాళ్లలో ఆంధ్ర దళితోద్యమంలో మూడు రాజకీయ ధోరణులు కనిపిస్తాయి. మొదటిది స్వతంత్రమైన అంబేద్కరీయ ఉద్యమం. అది స్వతంత్ర ప్రతిపత్తికీ సమైక్యతకూ మధ్య అనేక అవకాశాలను కనబరిచింది. రెండవది 1930లలో 1940లలో దళితులను చేర్చుకుని విశాల దృక్పథంతో సాగిన కాంగ్రెస్ జాతీయోద్యమం. మూడవది కమ్యూనిస్టు ఉద్యమంలో అంతర్భాగంగా పాల్గొనడం భారత రాజకీయ రంగంలో దళితులకు పెరుగుతున్న ప్రాధాన్యత, దళితులను ప్రధాన స్రవంతికి దూరంగా వుంచితే సంభవించబోయే రాజకీయ విపత్తుల గురించి అగ్రవర్ణాలలో పెరిగిన అవగాహన ఫలితంగా బ్రాహ్మణాధిపత్యంతో కూడిన అగ్రవర్ణ హిందూ జాతీయ రాజకీయాలలో దళితులకు చోటు లభించింది. సంస్కరణోద్యమాలలో రెండు ధోరణులు కనిపిస్తాయి. ఒకటి హిందూ మతాన్ని అంటరానితనం లేకుండా పవిత్రీకరించి దళితుల అభ్యున్నతికి కృషి చేయడం. రెండు - పరిమితులతోనైనా సరే దళిత చైతన్యానికి దోహదపడటం.

దళితుల సంఖ్యా బలానికి పెరిగిన ప్రాధాన్యత రాజకీయ రంగంలో విశిష్ట

రీతిలో ప్రేరణాత్మకంగా కనిపిస్తుంది. వారు రాజకీయంగా ఎదిగే ప్రక్రియను అది వేగవంతం చేసింది.[7] ఇదంతా 1906లోనే మొదలయింది. ఈ క్రమంలో 1920లలో, 1930లలో ఎంతో గుర్తింపును సంపాదించుకుంది. వారి కార్యకలాపాల రీత్యా అప్పుడు వాటిని అల్పసంఖ్యాకుల రాజకీయాలుగా పేర్కొనేవారు. బ్రాహ్మణేతర ఉద్యమం దళితులు ప్రధాన జాతీయ రాజకీయాలలో చురుకుగా పాల్గొనే క్రమంలో నిరసన, అభ్యర్థన, ఆర్గనైజేషన్ విధానాలను అలవర్చుకునేందుకు దోహదం చేసింది. ఆంధ్ర దళిత నాయకులు మొదట్లో రాజకీయ హక్కుల సాధన దిశలో జనాన్ని చైతన్యపరిచేందుకు దరఖాస్తులు, అభ్యర్థనలు, బహిరంగ ఉపన్యాసాల వంటి పద్ధతులను అనుసరించారు. మద్రాసులోని అనేకమంది బ్రాహ్మణేతరుల మాదిరిగానే వీరికి కూడా భారత జాతీయ కాంగ్రెస్ మీద నమ్మకం లేదు. వాళ్లు కాంగ్రెస్‌ను అగ్రవర్ణాల పార్టీగా పరిగణించారు.[8] ఇరవైయవ శతాబ్ది ప్రారంభం నుంచీ 1920ల వరకూ ప్రధాన స్రవంతిలో వారి పాత్ర అలక్ష్యానికి గురైంది. అయితే కమ్యూనల్ ప్రాతినిధ్యం ద్వారా ప్రభుత్వం తమను గుర్తించిన తరువాత వలసవాద ప్రభుత్వం నుంచి వారు అంతకంతకు ఎక్కువ ప్రయోజనాలు పొందడం మీద దృష్టిని కేంద్రీకరించారు. కాంగ్రెస్ పార్టీ తమను నిర్లక్ష్యం చేసినందుకు, తమ సమస్యలను సానుభూతితో చూడనందుకు ప్రతిచర్యగా దళితులు కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగిన స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, హోం రూల్ వంటి ఉద్యమాల పట్ల ప్రతిస్పందించలేదు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో అగ్రవర్ణ హిందువుల అణచివేత, పెత్తందారీతనం మూలంగా వారు బ్రాహ్మణాధిపత్యంలోని ఏ ఉద్యమంలోనూ చేరేందుకు ఇష్టపడలేదు.[9] కాంగ్రెస్‌లో చేరడంకంటే వలసవాద ఏజెన్సీలకు ఎప్పటికప్పుడు మహజర్లు సమర్పించుకోవడమే మేలని దళితులు భావించారు. అప్పుడు అగ్రవర్ణ హిందువులకంటే బ్రిటిష్ వాళ్లే సానుభూతి, మానవత, నిష్పాక్షికత వున్నవారిగా కనిపించారు.

---

7. దళితులు తమ హక్కుల కోసం 1906 లోనే హైదరాబాద్‌కు చెందిన భాగ్యారెడ్డి వర్మ నేతృత్వంలో సంఘటితమై తమకు తాముగా పోరాటాలు చేశారు. ఆ పోరాటాలు ఆనాటి మద్రాసు ప్రెసిడెన్సీ కింద వున్న కోస్తా ఆంధ్ర ప్రాంతాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి, స్ఫూర్తి నిచ్చాయి. చివరికి అవి ఆ ప్రాంతానికి కూడా విస్తరించాయి.

8. యూజిన్ ఎఫ్. ఇర్షిక్, పాలిటిక్స్ అండ్ సోషల్ కానఫ్లిక్ట్ ఇన్ సౌత్ ఇండియా, నాన్ బ్రాహ్మిన్ మూమెంట్ అండ్ తమిళ్ సెపరేటిజమ్, 1916–1929, బొంబాయి, 1969.

9. అంబేడ్కర్, 1945, పే. 17; ఇండియన్ స్టాట్యుటరీ కమిషన్, 1930బి, పే. 96; హెయిమ్‌సత్, 1964, పే. 190.

ప్రజల్లో చైతన్యాన్ని పెంచేందుకు, ఉద్యమ నిర్మాణానికి బహిరంగ సభలు ప్రధాన సాధనంగా తయారయ్యాయి. మద్రాసు ఆది ద్రావిడ మహాసభ 4 నవంబర్ 1917న జరిగింది. అందులో హోమ్ రూల్‌ను విమర్శిస్తూ ఉపన్యాసాలిచ్చారు, తీర్మానాలు చేశారు. "ఇంతకాలం మన ఉనికినే నిర్లక్ష్యం చేసిన హిందువులు, రేపు పరిపాలనా పగ్గాలు చేతికొచ్చిన తరువాత మన ప్రయోజనాలను కాపాడతారన్న నమ్మకమేమిటి?" అని ప్రశ్నించారు.[10] మరోపక్క బ్రిటీషువాళ్లు కల్పించిన నామ మాత్రపు సౌకర్యాలను కూడా దళితులకు దక్కకుండా అగ్రవర్ణ హిందువులు అడ్డుకున్నారు. "దేవుడు దయతలచి ఓ చుక్కబొట్టు విదిల్చినా ఈ పూజారులు దాన్నికూడా మనకు దక్కనివ్వరు." అంటూ దళితులు ఆక్రోశించారు.[11]

అదేకాలంలో ఆంధ్ర రాజకీయరంగంలో ప్రాంతీయ, జాతీయవాద చైతన్యం పెరుగుతూ వచ్చింది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం, వందేమాతరం ఉద్యమాల అనంతరం ఇరవైయవ శతాబ్దపు ప్రారంభంలో ప్రత్యేక ఆంధ్రకోసం డిమాండు వినిపించింది. అనేకమంది జాతీయవాదులు కలిసి ఆంధ్ర మహాసభను స్థాపించారు. అది 1913 నుంచి వార్షిక సదస్సులను నిర్వహించడం మొదలుపెట్టింది. అయితే దళితులు ఆ తెలుగు చైతన్యంలో... ఆంధ్రోద్యమంలో పాలుపంచుకోలేదు. తమ స్వయం ప్రతిపత్తికోసం ఆంధ్రలోని దళితులు అంతకు ముందునుంచే పోరాటాలు చేస్తూ వచ్చారు.

మద్రాస్ ప్రెసిడెన్సీలో దళితుల తరపున యం.సి. రాజా, ఆర్. శ్రీనివాసన్, ఎన్. శివరాజ్ మొదలైన వాళ్లు యిచ్చిన అభ్యర్థనలను అన్ని స్థాయిల్లోని బ్రిటీష్ అధికారులు ఆదరించేవారు. మద్రాస్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ సర్ అలెగ్జాండర్ కార్డ్యూ అయితే రాజకీయ రంగంలో అంటరానివాళ్లకు ఏదో ఒక రూపంలో కొన్ని రకాల రక్షణలు కల్పించకపోయినట్టయితే వారు బ్రాహ్మణీయ పెత్తందార్ల చేతుల్లో మరింత పీడనకు, అవమానాలకు గురవుతారని వాదించారు.[11ఎ] అప్పటి మద్రాస్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ బాధ్యతలు చూస్తున్న ఎసి టాడ్ హంటర్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ మద్రాస్ ప్రెసిడెన్సీకి

---

10. హిజ్ ఎక్సలెన్సీ ది వైస్‌రాయ్ అండ్ ది రైట్ హానరబుల్ ది సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా సమర్పించిన ప్రసంగపాఠం 1918, పే. 60-61

11. మద్రాస్ ప్రభుత్వ విద్యా శాఖ ప్రొసీడింగ్స్, జిఓ నెం. 68 తేది. 1 ఫిబ్రవరి 1893. ఇంకా చూ. రామస్వామి, 1974ఎ.

11ఎ. మద్రాస్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ - భారత ప్రభుత్వ హోంశాఖ కూ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు. చూ. ఇండియన్ ఫ్రాంచైజ్ కమిటీ, 1932ఎ అనుబంధం.

చెందిన హిందూ జనాభాలోని వెనుకబడిన దుర్బల వర్గాల వారికి నామినేషన్ ద్వారా ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం వుందని వాదించారు. చివరకు అనేక చర్చోపచర్చలు జరిపిన అనంతరం భారత ప్రభుత్వం దళితులకు నామినేషన్ పద్ధతిలో పది సీట్లు కేటాయించింది. దళిత జనాభాను బట్టి చూస్తే ఆ సీట్లు ఏమూలకూ సరిపోకపోయినా వాటిని కూడా అంటరానివాళ్లలో సరైన ప్రతినిధులు లేరన్న సాకుతో ఎగగొట్టాలని చూసేవారు. ఒకసారి ఆంధ్రలో ఇలాగే దళితులకు కేటాయించిన సీట్లలో ఇద్దరు దళితేతరులను నామినేట్ చేసినప్పుడు పెద్ద ఎత్తున ఆందోళన చెలరేగింది. దాంతో వారిని తొలగించి వెంటనే తిరిగి ఆ సీట్లలో దళిత అభ్యర్థులను నియమించారు.[12]

సహాయ నిరాకరణోద్యమ సమయంలో కూడా దళితులు ఆ ఉద్యమాన్ని బహిష్కరించడమే కాకుండా ప్లకార్డులు పట్టుకుని వేల్స్ రాకుమారునికి స్వాగతం పలికారు.[13] ఇది ఒక్క మద్రాస్‌కే పరిమితం కాలేదు. దేశంలోని మిగతా ప్రాంతాలలో కూడా ముఖ్యంగా బొంబాయి, ఢిల్లీ, ఔధ్, బెంగాల్ మొదలైన చోట్ల కూడా ఉవ్వెత్తున సాగింది. దళితులు సహాయ నిరాకరణోద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జాతీయోద్యమం పట్ల దళితుల ఈ వైఖరిపై వ్యాఖ్యానిస్తూ సి.రాజగోపాలాచారి ఇలా అన్నారు: " దళితులకు అన్ని రకాల రాజకీయ ఉద్యమాల పట్ల అనుమానాలున్నాయి. వాళ్లు అనుభవిస్తున్న కష్టాలే వాళ్లనలా అనుమానించేట్టు చేశాయి. అందుకు వాళ్లను ఎవరూ తప్పుపట్టడానికి వీలులేదు." 1920లో పన్నుల చెల్లింపు నిరాకరణ ప్రచారం పట్ల కూడా దళితులు ఎలాంటి ఆసక్తిని కనబరచలేదు. ఎందుకంటే ప్రధానంగా దళితులందరూ వ్యవసాయ కూలీలు. వారికి అప్పటి పరిస్థితులలో ఆ ప్రచారోద్యమం ఏమాత్రం సంబంధంలేనిదిగా కనిపించింది.

1927లో సైమన్ కమిషన్ తాలూకు – మొత్తం తెల్ల వాళ్ల కమిషన్ భారత చట్టాన్ని సమీక్షించేందుకు వచ్చినప్పుడు కూడా దళితులు ఇదే విధానాన్ని పాటించారు. బ్రాహ్మణాధిపత్యంలోని అగ్రవర్ణ హిందూ రాజకీయ పార్టీలు కమిషన్‌లో తమకు చోటు కల్పించక పోవడం అవమానకరంగా భావించి అందుకు నిరసనగానూ, తమ ముసాయిదా రాజ్యాంగాన్ని తామే రాసుకోవాలన్న ఉద్దేశంతోనూ ఆ కమిషన్‌ను బహిష్కరించారు. ఆ పరిస్థితిని దళితులు తమ సమస్యలను బ్రిటీష్ పాలకుల దృష్టికి

12. గూడూరు రామచంద్రరావు, వేమూరి రాంజీరావులు దళిత టికెట్లపై నామినేట్‌చేయబడ్డారు. తరువాత వారి స్థానాల్లో సుంద్రు వెంకయ్య, నరాలసెట్టి దేవేంద్రుడు నియమించబడ్డారు. వివరాలకు చూ. పాము రామమూర్తి, 1976.

13. మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ప్రొసీడింగ్స్, 1921–22.

తీసుకెళ్లేందుకు అపూర్వ అవకాశంగా భావించారు. మొత్తం తెల్లవాళ్లే కాబట్టి ఆ బాడీ నిష్పాక్షికంగా వ్యవహరిస్తుందని ఆశించారు. వారు కమిషన్‌కు ఈవిధంగా తోడ్పడం కాంగ్రెస్ పార్టీనీ, దాని కమిషన్ బహిష్కరణ చర్యను ఖండించేందుకు ఉద్దేశించబడింది. అలహాబాద్‌లో 27 డిసెంబర్ 1927లో జి.ఎ. గవాయ్ అధ్యక్షతన జరిగిన అణగారిన, బలహీన వర్గాలకు చెందిన అఖిల భారత ఆది హిందూ మహాసభలో అగ్రవర్ణ హిందువులు తమను అలక్ష్యం చేస్తున్నారు కాబట్టే చట్టబద్ధమైన (సైమన్) కమిషన్‌ను ఆహ్వానించినట్టు తీర్మానం చేశారు. ఆ సదస్సులో అధ్యక్షోపన్యాసం చేస్తూ గవాయ్ ఇలా అన్నారు: “భారత దేశానికి స్వరాజ్యం అంటే మనపై బానిసత్వ బంధనాలను మరింత గట్టిగా బిగించడం తప్ప మరేం కాదు.” ఆయన మరింత ముందుకెళ్లి “అసలు మన కష్టాలు తొలగడానికి విదేశీ పాలనే బాగా తోడ్పడుతుంది” అనికూడా అన్నారు. ఆ సమయంలోనే అఖిల భారత అణగారిన వర్గాల సంఘం అధ్యక్షులు ఎం.సి. రాజయ్య అధ్యక్షతన మద్రాస్ ప్రెసిడెన్సీలో ఆది ద్రావిడ సదస్సు జరిగింది. ఆ సదస్సు సైమన్ కమిషన్‌ను స్వాగతించింది. తమ దిగజారిన పరిస్థితిని కమిషన్ దృష్టికి తీసుకెళ్లేందుకు, దానిపై సరైన నిర్ణయం తీసుకునేందుకు అదే సరైన సమయమని తీర్మానిస్తూ కమిషన్ నిర్మాణంపై తమ సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించింది. అదేవిధంగా దేశంలోని అణగారిన వర్గాలకు చెందిన అన్ని ప్రాంతీయ సంఘాలూ సైమన్ కమిషన్‌ను జాతీయవాదులు బహిష్కరించడాన్ని ఖండించడమే కాక కమిషన్‌కు తమ పూర్తి సహకారాన్ని ప్రకటించాయి.[14] వాళ్లు కమిషన్ ముందుంచిన డిమాండ్లలో ముఖ్యమైనవి – “దళితుల జనాభాకు తగిన నిష్పత్తిలో స్థానిక సంస్థల్లోనూ, లెజిస్లేటివ్ బాడీల్లోనూ సీట్లను రిజర్వు చేయాలి; ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లలో రిజర్వేషన్లు కల్పించాలి, ప్రభుత్వరంగంలో ఉద్యోగావకాశాలు కల్పించాలి; ఆస్తి అర్హత నిబంధను తొలగించి గానీ విశ్వజనీన ఓటింగ్ విధానం పాటిస్తూ గానీ దళితులకు ఓటు హక్కు కల్పించాలి; దళితులు విద్యాపరంగా సాంఘికంగా ఆర్థికంగా అభివృద్ధిచెందేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.”

దీని ఫలితంగా మద్రాస్ అణగారిన వర్గాల ప్రతినిధి ఎం.సి. రాజయ్య సెంట్రల్ కమిటీకి సభ్యుడిగా నియమించబడ్డారు; బి.ఆర్. అంబేద్కర్ బొంబాయి ప్రావిన్షియల్ కమిటీకి సభ్యుడిగా; ఎన్.ఎస్. శివరాజ్ మద్రాస్ కమిటీకి, బాబు రామచంద్రన్ యునైటెడ్ ప్రావిన్షియల్ కమిటీకి సభ్యులుగా నియమించిబడ్డారు. వలసవాద ప్రభుత్వం

14. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఈ కేసును చేపట్టిన సంస్థల్లో మద్రాస్ ప్రావిన్షియల్ ఆది–ఆంధ్ర అసోసియేషన్, మద్రాస్ అరుంధతీయ మహాసభ, ఆది–హిందూ సభ మొదలైనవి వున్నాయి. వివరాలకు చూ. ఇండియన్ స్టాట్యుటరీ కమిషన్, 1930బి.

దళితులను జాతీయవాదులకు వ్యతిరేకంగా ఉసిగొల్పుతోందంటూ జాతీయ పత్రికలు ఆరోపణలు చేశాయి.

ఈ పరిణామాలన్నీ కాంగ్రెస్ విధానాలలో మార్పులు రావడానికి ముఖ్యంగా దళితుల పట్ల దాని వైఖరి మారడానికి దారితీశాయి. దాంతో దళితుల పరిస్థితులు మెరుగుపరచాలనీ, అంటరానితనం నిర్మూలించాలనీ, దళితులకు విద్యావకాశాలు కల్పించాలనీ, దళితులను ప్రధాన స్రవంతిలో తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించింది. కాంగ్రెస్ వాదులు ఈ విషయంలో అనేక తీర్మానాలు చేశారు. అయితే ఆలోచనలకూ ఆచరణకూ మధ్య అగాధం మాత్రం అలాగే కొనసాగింది.

దళితులు - కాంగ్రెస్ చైతన్యం జాతీయోద్యమంలో వారి పాత్ర

భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సి) 1885లో ఏర్పడింది. ఒక దశాబ్దం తరువాత అది వలసవాద పాలకులకు తన రాజకీయ ఆకాంక్షలను వ్యక్తం చేస్తూ తమది పూర్తిగా రాజకీయ పార్టీ అని, రాజకీయాలే తమ లక్ష్యమని ప్రకటించుకుంది. ఆవిధంగా అది ఒక రాజకీయ సంస్థ కాబట్టే సంఘ సంస్కరణకు సంబంధించిన అంశాలకు ఉద్దేశపూర్వకంగానే దూరంగా వుంటూ వచ్చింది. ఆ విధానాన్ని పార్టీ తార్కికంగా సమర్థించుకుంది: "ఇందుకు మీరు మమ్మల్ని తప్పుపట్టడానికి ముందు... లెక్కల గురించీ లేదా అధిభౌతిక శాస్త్రం గురించీ ఎందుకు చర్చించడం లేదంటూ హౌస్ ఆఫ్ కామన్స్‌ని అడగండి" అంటూ వితండవాదం చేసింది. ఈ వాదన 1895లో స్పష్టంగా ముందుకొచ్చింది.

మొదట్లో భారత జాతీయ కాంగ్రెస్ వివాదాస్పదమైన అంశాల నుంచి, సామాజిక సమస్యల నుంచి తప్పించుకునే ఉద్దేశంతో పార్టీ వేదికమీద ఎలాంటి సామాజిక అంశాలను చర్చించకూడదనే విధానాన్ని అనుసరించింది.[15] కానీ 1917లో కలకత్తా సదస్సు ఆ విధానాన్ని సవరిస్తూ ఒక గుణాత్మకమైన తీర్మానాన్ని ఆమోదించింది...బడుగు వర్గాల మీద సాంప్రదాయం పేరిట విధించిన అన్ని రకాల దురన్యాయాలను, అక్రమాలను నిర్మూలించాల్సిన అవసరం వుందనీ, అవి ఆ వర్గాలను తీవ్ర అసౌకర్యానికి,

15. డబ్ల్యు.సి. బెనర్జీ 1885లో బొంబాయిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశంలోనే ఆనాటి సామాజిక సమస్యలపై చర్చ జరపాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కానీ ఆ తదనంతరపు నాయకత్వం దానిని ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టింది. చూ. నటేశన్, 1917, పే.3.

16. కలకత్తాలో 26-29 డిసెంబర్1917 తేదీల్లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ 32వ సమావేశ నివేదిక. చక్రవర్తి, భట్టాచార్య 1935.

కష్టనష్టాలకు గురిచేస్తున్నాయని, ఈ దురన్యాయాన్ని కొనసాగించవద్దని కాంగ్రెస్ పార్టీ భారత ప్రజలకు విజ్ఞప్తి చేస్తోందంటూ ఆ తీర్మానంలో పేర్కొన్నారు.[16] అయితే అదొక లాంఛనప్రాయమైన తీర్మానం. అంటరానితనాన్ని నిజంగా నిర్మూలించేందుకు ఎలాంటి కార్యాచరణను పార్టీ అనుసరించలేదు. అయినప్పటికీ అది ఆహ్వానించతగిన చర్యేనని చెప్పవచ్చు. "కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే అదొక విశిష్టమైన అంశం" అని షిండే ఆ తీర్మానాన్ని చాలా గొప్పగా అభివర్ణించారు.[17] బి.ఆర్. అంబేడ్కర్ కూడా దానిని ఒక అనూహ్యమైన సంఘటనగా పేర్కొన్నారు. కాంగ్రెస్ – ముస్లిం లీగ్ సంస్కరణల పథకానికి దళితుల మద్దతును పొందేందుకు భారత జాతీయ కాంగ్రెస్ తహతహలాడింది. వారి సహకారం లభించడం సులభంకాదని తెలిసినప్పుడు సర్ నారాయణ్ చంద్రావర్కార్ ద్వారా సంప్రదింపులు జరిపింది[18] ఆయనకు బడుగు వర్గాలలో విశేష పలుకుబడి వుండేది. హోమ్ రూల్‌ను సాధించడంలో, కాంగ్రెస్ – లీగ్ సంస్కరణలను విజవంతంగా అమలు పరచడంలో జాతీయ మద్దతు లేదనే భావన కలగకూడదని కాంగ్రెస్ నాయకులు గట్టిగా కోరుకున్నారు.

ఆనాటి నుంచీ భారత జాతీయ కాంగ్రెస్ క్రమక్రమంగా మారుతూ, తన కార్యక్రమాన్నీ, తన పాత్రనీ విస్తరించుకుంటూ వచ్చింది. ఆ మార్పునకూ సమకాలీన రాజకీయ పరిణామాలకూ మధ్య దగ్గరి సంబంధంవుంది. ముఖ్యంగా కాంగ్రెస్ వ్యతిరేక ధోరణులను ఎదుర్కొనేందుకు, వలసవాద అధికార వర్గం భారత దేశంలోని సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా వెనుకబటుతనానికి గురైన ప్రజలను ఆకట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడుకునేందుకు ఆ మార్పు అనివార్యమైంది. పార్టీ ప్రధాన వ్యూహం అగ్రవర్ణ హిందువులను చైతన్యపరచి వారి అభిప్రాయాలను పరిస్థితులకనుగుణంగా మలచడం. నిజానికి కాంగ్రెస్‌కు అంటరానితనాన్ని నిర్మూలించాలనేంలేదు. అంటరాని వాళ్లకు ప్రత్యేక పాఠశాలలు, ప్రత్యేక బావులు అనే

---

17. వి.ఆర్.షిండే మరాఠా దళితోద్యమ నాయకుడు. అంటరానితనానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో అనేక సదస్సులను నిర్వహించారు. వాటిలో 1907లో సూరత్‌లో, 1908లో బంకిపోర్‌లో, 1910లో మద్రాస్‌లో, 1912లో కరాచీలో, 1918లో బొంబాయిలో నిర్వహించిన సదస్సులు ముఖ్యమైనవి. బొంబాయి ప్రావిన్స్‌లో విద్యాపరమైన అనేక కార్యక్రమాలకు కూడా ఈయనే ఆద్యుడు.

18. సర్ నారాయణ్ చంద్రావర్కార్ కాంగ్రెస్‌కు ఒకప్పటి అధ్యక్షులు. షిండే నెలకొల్పిన డిప్రెస్డ్ క్లాసెస్ మిషన్ సొసైటీకి అధ్యక్షులుగా పనిచేశారు. అప్పుడే వీరి ఆధ్వర్యంలో బొంబాయిలో బడుగువర్గాల సమావేశాలు జరిగాయి.

విధానాన్ని ఆ పార్టీ ఆమోదించింది. అంటే అంటరానివాళ్ల పరిస్థితులను మరింత దుర్భరం చేయడం తప్ప మరేంకాదు. పార్టీ ఉద్దేశం – దళితులకు చోటు కల్పించి, చేర్చుకుని, సంఘటితపరచి ప్రధాన స్రవంతి రాజకీయాల పరిధిలోకి తీసుకరావడం తద్వారా వేర్పాటు లేదా వ్యవస్థాపరమైన మార్పు తదితర అంశాలనుంచి వారిని దూరంగా వుంచడం. దళితులకు చోటు కల్పించడం అనే ఈ విధానం ముఖ్యంగా వారిని అగ్రవర్ణ హిందువుల ఆధిపత్యంలోని జాతీయోద్యమానికి కట్టిపడేయడానికి ఉద్దేశించింది. వారి అభివృద్ధి కోసం కొద్దిపాటి కార్యక్రమాలు చేపట్టి, నామమాత్రపు ప్రాతినిథ్యం కల్పించి వారిని జోకొట్టడానికి ఉద్దేశించింది. అగ్రవర్ణ హిందువుల ఆధిపత్యానికి రాబోయే ప్రమాదాన్ని నివారించేందుకు అనుసరించిన పద్ధతి అది.

హరిజన రాజకీయ చైతన్యం అంటే గాంధేయ విధానం ఉద్దేశంలో వారిని క్రమేణా అవకాశవాదులుగా మార్చి లోబరచుకోవడం. ఈ వ్యూహానికి ఒక చక్కని ప్రతిరూపం – బీహార్ హరిజన విద్యావంతుడైన నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్. ఆయన బడుగువర్గాల సంఘాన్ని (దీనిని హరిజన్ లీగ్ అని కూడా అనేవారు) 1930లలో నెలకొల్పారు. గాంధేయ కాంగ్రెస్ కార్యక్రమాలు రెండు అంచెలుగా సాగేవి. ఒకటి హరిజన సేవక్ సంఘ్ ద్వారా పనిచేయడం. ఆ సంఘం శాఖలను దేశవ్యాప్తంగా విస్తరించారు. అగ్రవర్ణ హిందువుల అనంగు సంస్థ అది. దానికి పెద్ద ఎత్తున నిధులు, అపారమైన నెట్‌వర్క్ వుండేది. ఇంకోపక్క ఈ లీగ్ ద్వారా కాంగ్రెస్ అనుకూల దళితుల సమీకరణ జరిగేది.

ఆంధ్రాలో గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ రాజకీయ కార్యక్రమాలు రెండు విధాలుగా సాగేవి. ఒకటి కళా వెంకటరావు, కాశీనాథుని నాగేశ్వరరావు, పి. సీతారామయ్య వంటి కాంగ్రెస్ నేతల ద్వారా దళితులను ప్రభావితం చేసేవారు. వారు దళిత నాయకులతో స్నేహపూర్వకంగా మెలిగేవారు. అప్పుడప్పుడు సంస్థాపర కార్యక్రమాలకు సాయం చేసేవారు. క్రమేణా దళితులను కాంగ్రెస్ పరిధిలోకి తీసుకొచ్చేవారు. ఇక రెండోది కాంగ్రెస్ నేతృత్వంలో హరిజనుల ద్వారా సమీకరణ జరపడం. ఈ విధానం 1932 నవంబర్‌లో విజయవాడలో హరిజన సేవక్ సంఘ్ శాఖను స్థాపించడం ద్వారా మొదలైంది. ఆంధ్రాలో గాంధీ జరిపిన పర్యటన అనేకమంది దళితులను కాంగ్రెస్ పరిధిలోకి తెచ్చింది. హరిజన సేవక్ సంఘానికి అగ్రవర్ణ హిందువులైన కె. నాగేశ్వరరావు, యం. బాపినీడు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరిస్తే– దళితులైన వేముల కూర్మయ్య, నరాలశెట్టి దేవేంద్రుడు సంయుక్త కార్యదర్శులుగా వుండేవారు. ఆ ఇద్దరు దళిత నాయకులు ఆంధ్ర దళితోద్యమంలో చాలా చురుకుగా పనిచేశారు. ఆ తరువాత వారిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు.

కాంగ్రెస్ పరిధిలోని దళిత విభాగం రెండు అంచెల్లో పనిచేసింది. అందులో ఒకటి హరిజన (దేవుని పిల్లలు)[19] అనే భావనను ప్రభుత్వం ఆమోదించేలా కృషిచేయడం. అయితే ఆ భావనను అంబేద్కర్‌తో పాటు ఇతర ప్రాంతాలలోని దళితులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఖాదీ వస్త్రధారులైన దళిత క్యాడర్‌ను సృష్టించడం ద్వారా దళిత వీధులను, దళిత వాడలను హరిజనీకరించడం వల్ల, దళిత నాయకుల వల్ల ప్రత్యేకించి కోస్తా ఆంధ్ర ప్రాంతంలో దళిత చదువు పట్ల కొత్త ఆశలు రేకెత్తాయి. ఖాదీ వస్త్రధారుల నాయకత్వం ఒక దశలో అటు ప్రభుత్వ పరిపాలనా రహస్యాల లోతుపాతులు తెలుసుకుంటూ ఇటు ఆ పాలనా సంబంధ సమాచారాన్ని అందిస్తూ మధ్యవర్తుల్లా వ్యవహరించారు. దళిత వాడలు రాజకీయ కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. ఆ తదనంతరం కాంగ్రెస్ దళిత బృందం అంబేద్కర్ పాత్రను గుర్తించినప్పటికీ గాంధేయ హరిజనీకరణ పరిధిలో పనిచేయడాన్నే కొనసాగించింది.

1930లలో ఎంతో రాడికల్‌గా, స్వయం ప్రపత్తితో వున్న దళిత ఉద్యమం 1940ల నాటికి క్రమేణా క్షీణిస్తూ దాదాపు దళిత నాయకులంతా 1930 దశకం చివరి దశలో విజృంభించిన కాంగ్రెస్ ఉద్యమంలోనో కమ్యూనిస్టు ఉద్యమంలోనో చేరిపోయారు. అతిశయోక్తి అనిపించవచ్చు గానీ 1947 నాటికి ఆంధ్రాలోని దళితుల్లో 90 శాతం కంటే ఎక్కువ మంది కాంగ్రెస్ పరిధిలో వున్నారు. ప్రత్యేకించి 1940లలో ఆంధ్రలో అనేకమంది దళితులు కాంగ్రెస్ నేతృత్వంలో సాగిన జాతీయోద్యమంలో, తత్సంబంధ కార్యకలాపాల్లో పాల్గొన్నారు.

పందు లక్ష్మణ స్వామి (1892–1960) అనే ఓ ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుడు తూర్పు గోదావరి జిల్లాలో దళిత ఉద్యమాలను చాలా చురుకుగా నిర్వహించారు. ఆయన కళా వెంకటరావుతో సన్నిహితంగా వుంటూ ఆ తరువాత కాంగ్రెస్‌లో చురుకుగా పనిచేసేందుకు ఉద్యోగానికి రాజినామా చేశారు. రాజమండ్రి తాలూకా బోర్డులో కాంగ్రెస్‌కు చెందిన సభ్యుడిగా తన రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టి ఆ తరువాత మద్రాసు శాసన సభకు ఎంపికయ్యారు. 1930ల నుంచి 1940ల వరకు ఆయన కాంగ్రెస్‌లో చురుకైన నేతగా వున్నారు. కాంగ్రెస్ తరఫున సత్యాగ్రహాల్లో పాల్గొని కఠిన కారాగార శిక్షలను అనుభవించారు.

ఓ మిషన్ స్కూల్లో చదువుకున్న సరిపెల్ల భీమయ్య మరో గాంధేయవాది. ఆయన

---

19. హరిజన అన్న భావనను మొట్ట మొదట మధ్య యుగాలనాటి గుజరాత్‌కు చెందిన కవి, తత్వవేత్త నర్సీ మెహతా రూపొందించాడు. దానిని గాంధీ స్వీకరించి ఈ ప్రజలకు వర్తింపజేశారు.

1942లో గాంధీ పిలుపునకు స్పందించి సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. తదనంతరకాలంలో తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీకి వరుసగా మూడుసార్లు నామినేట్ అయ్యారు.

వేముల కూర్మయ్య (1903-1970) అత్యంత సుదీర్ఘమైన రాజకీయ జీవితంతో మంత్రి స్థాయికి ఎదిగిన మరో నాయకుడు. ఆయన ఆంధ్రా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం పట్టా అందుకున్నారు. 1920ల నుంచి 1930ల వరకు కూర్మయ్య దళిత ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో, 1940లలో వ్యక్తిగత సత్యాగ్రహాల్లో పాల్గొని ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించారు. 1937లో, 1946లో ఆయన మద్రాస్ శాసన సభకు ఎంపికయ్యారు. 1946-49 మధ్య కాలంలో ప్రకాశం పంతులు ప్రభుత్వంలో ఆయన హరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు.

బయ్యా సూర్యనారాయణ మూర్తి మరో ముఖ్యమైన కాంగ్రెస్ వాది. రాజమండ్రిలో డిగ్రీ వరకు చదువుకున్నారు. కాంగ్రెస్ సభ్యుడిగా వున్నప్పటికీ 1935 వరకు అంత చురుకుగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొలేదు. ఆంధ్రప్రదేశ్ హరిజన సేవక్ సంఘానికి 1935లో ఆయన కార్యదర్శిగా ఎంపికయ్యారు. 1940 నుంచి 1949 వరకు ఆ సంఘానికి అధ్యక్షుడిగా వున్నారు. 1937లో ఆయన మద్రాస్ శాసన సభకు ఎన్నుకోబడ్డారు. 1937-39, 1946-47 ప్రాంతాల్లో ఆయన పరిశ్రమలు, కార్మిక శాఖల మంత్రిగా పనిచేశారు. 1947లో తిరుపతిలోని సుప్రసిద్ధ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హరిజనుల ప్రవేశం కోసం జరిగిన ఉద్యమానికి నాయకత్వం వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో వ్యక్తిగత సత్యాగ్రహాలలో చురుకుగా పాల్గొన్నారు. అందుకు ప్రతిఫలంగా తొమ్మిది నెలల కఠిన కారాగార శిక్షను 300 రూపాయల జరిమానాను ఎదుర్కొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మరో సంవత్సరం కఠిన కారాగార శిక్షని, వంద రూపాయల జరిమానాని ఎదుర్కొన్నారు. ఆయనకు రచయితగా కూడా మంచి పేరుంది. "ఆరు కోట్ల తిరుగుబాటు", "డిప్రెస్సడ్ అండ్ అప్రెస్సడ్", "ఫర్ ఎవర్ ఇన్ ఎగోనీ అండ్ గ్లిమ్మర్ ఇన్ డార్క్‌నెస్" వంటి గ్రంథాలను రచించారు.

సర్దార్ నాగప్ప ప్రముఖ ఆంధ్ర దళిత నేతల్లో ఒకరు. కర్నూలులో చదువుకున్నారు. 1930లో పందొమ్మిదేళ్ల వయసులోనే కాంగ్రెస్ పార్టీలో చేరారు. దళితులను చైతన్య పరిచేందుకు భజనలు నిర్వహించేవారు. అనేక మంది తెలంగాణా ప్రాంత నేతలను ఆయన ప్రభావితం చేశారు. మద్రాస్ రాష్ట్ర శాసన సభకు 1937లో, 1946లో

ఎంపికయ్యారు. 1942లో తన అర్ధాంగి అమరావతీ దేవితో సహా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని సంవత్సరంన్నర పాటు జైలు శిక్ష అనుభవించారు. కొడుకుతో సహా ఆయన అర్ధాంగి కూడా నిర్బంధానికి గురయ్యారు. భార్యా భర్తలిద్దరూ అనేకసార్లు సత్యాగ్రహాల్లో పాల్గొన్నారు. శాసన సభకు ఆయన చేసిన సేవలు ఎనలేనివి. నాగప్ప, అమరావతీ దేవి ఇరువురూ ఆ తదనంతరం స్వాతంత్ర్య సమర యోధులుగా గౌరవించబడ్డారు.

కె.ఆర్. వీరాస్వామి మరో గొప్ప నాయకుడు. హైదరాబాద్ నిజాం కాలేజీలో చదువుకున్న ఆయన 1947లో మద్రాస్ యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. హైదరాబాద్ రాష్ట్రంలో మొట్టమొదటి దళిత పోస్ట్ గ్రాడ్యుయేట్ ఈయనే. మొదట్లో షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్‌లో చేరి అనతికాలంలోనే దాని ఆర్గనైజింగ్ సెక్రటరీ అయ్యారు. ఆ తరువాత ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌లో చేరి 1950లో హైదరాబాద్ రాష్ట్ర శాఖకు అధ్యక్షులయ్యారు. ఆయన రాజకీయ కార్యకలాపాలకు వివిధ దళిత రాజకీయ ప్రణాళికలే ప్రాతిపదికగా వుండేవి. ఆయన గొప్ప దేశభక్తుడు. జాతీయ స్థాయి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. కాలేజీలో చదువుకుంటున్నప్పుడు తన తల మీద గాంధీ టోపీని తీసెయ్యడానికి నిరాకరించినందుకు ఒకసారి కాలేజీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. వందేమాతరం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1948లో లాంఛనంగా కాంగ్రెస్‌లో చేరడానికి ముందే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.

ఇక్కడ మరో జంట గురించి ప్రస్తావించాల్సివుంది. వారు జాలా రంగస్వామి, జాలా మంగమ్మ. వారు 1921నాటి కాకినాడ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్నారు. ఆ తరువాత పశ్చిమ గోదావరి జిల్లాలో 1928లో గాంధీ నెలకొల్పిన ఆంధ్రనికేతన్‌లో ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఖాదీ ప్రచారోద్యమంలో, అంటరానితన వ్యతిరేక ప్రచారోద్యమంలో మూడేళ్లపాటు పనిచేశారు. కాంగ్రెస్ నేతృత్వంలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటున్నందుకు ఇరువురూ తమ ఉపాధ్యాయ ఉద్యోగాల్లోంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. జాలా రంగస్వామి సంచలన రచయిత కూడా.ఆయన మాలశుద్ధి అనే గ్రంథాన్ని రచించారు. దానిని ప్రభుత్వం నిషేధించింది. ఆయన ఇంకా 'అహింస, అస్పృశ్యత, నిరుద్యోగి, అంటరాని వారెవరు?' వంటి చారిత్రక రచనలు, నాటికలు, కవితలు రాశారు.

పైన పేర్కొన్న దళిత ప్రముఖులు ప్రాంతీయ స్థాయిలో జాతీయోద్యమంలో చాలా చురుకైన పాత్ర నిర్వహించినవారు. చారిత్రక డాక్యుమెంట్లు తగినంతగా

లభించడంలేదు కాబట్టి; అంటరానివాళ్ల చరిత్రను తెలుసుకునేందుకుగానీ శోధించేందుకుగానీ పరిశోధకులు, మేధావులు సరైన ప్రయత్నాలు చేయకపోవడం వల్ల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో పాల్గొని ప్రాణాలు సైతం పణంగా పెట్టిన అనేకమంది దళితుల గురించి తెలియడంలేదు.

దళితులు - కమ్యూనిస్టు ఉద్యమం

1930లలో, 1940లలో అంతర్గత ప్రత్యేకతలు ఎలా వున్నప్పటికీ తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నింటినీ ఒకటిగానే విశ్లేషించవచ్చు. ఒక ప్రాంతంలోని అభివృద్ధి ప్రభావం మరో ప్రాంతం మీద పడుతూ ఈ మొత్తం ప్రాంతాలను క్రియాశీలంగా ముందుకు తీసుకుపోయింది. కొన్ని అఖిల భారత స్థాయి పరిణామాలకు కూడా ఈ ప్రాంతం కేంద్రంగా మారింది. 1920లలో కోస్తాంధ్ర జిల్లాల్లో బలమైన రైతు ఉద్యమం తలెత్తి 1930ల నాటికది ఈ ప్రాంత రాజకీయాలకు కేంద్రబిందువైంది. బలమైన రైతు ఉద్యమం, ప్రాంతీయపరమైన, భాషాపరమైన చైతన్యం, మతపరమైన గుర్తింపులు ఆంధ్ర రాజకీయాలను విప్లవాత్మకంగా మార్చాయి.

1932లో సహాయనిరాకరణోద్యమాన్ని నిలిపివేయడంతో అనేకమంది కాంగ్రెస్ యువజన సభ్యులు దిగ్భ్రాంతికి, నిరాశా నిస్పృహలకు గురయ్యారు. 1930–32 మధ్యకాలంలో ఈ ప్రాంతంలో ఒక తరం యావత్తూ రాజకీయరంగంలో అడుగుపెట్టింది. వారికి గాంధేయ పోరాట పద్ధతి, ఆయన నాయకత్వం నచ్చేదికాదు. ఈ కాలంలోనే ఆంధ్రాలో అనేక విప్లవ సంఘాలు ఆవిర్భవించాయి. హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ పార్టీ అలాంటి వాటిలో ఒకటి. విప్లవ పోరాటం ద్వారా స్వరాజ్యాన్ని స్థాపించడం ఆ పార్టీ లక్ష్యం. అందులోంచి వచ్చిన అనేకమంది విప్లవకారులు ఆ తరువత సోషలిస్టులుగా మారారు. సామ్రాజ్యవాదంతో రాజీపడే ధోరణితో సాగుతున్న నాటి కాంగ్రెస్‌ను ఒక పోరాట సాధనంగా తీర్చిదిద్దాలని వారు ప్రయత్నించారు. పార్టీ తమను నిర్లక్ష్యం చేస్తోందన్న భావన నేపథ్యంలో సోషలిస్టు భావాలున్న వాళ్లు కాంగ్రెస్‌ను సామ్యవాదం దిశకు మరల్చే లక్ష్యంతో మే 1934లో పాట్నాలో సమావేశమయ్యారు. అప్పుడే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడింది. అదే క్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడింది. పార్టీ కార్యక్రమాలను ఆంధ్ర అంతటికీ విస్తరించే లక్ష్యంతో ఏలూరు, గుంటూరు, గుడివాడ, బెజవాడ మొదలైన చోట్ల పార్టీ శాఖలను నెలకొల్పారు. మొదట్లో పార్టీ కార్యక్రమం సదస్సులు నిర్వహించడం, సామ్యవాద ప్రచారం కోసం బహిరంగ సభలను ఏర్పాటు చేయడం, వివిధ ప్రాంతాలలో నెహ్రూ

డాంగే వంటి నాయకుల పర్యటనలు ఏర్పాటు చేయడం వంటి వాటికే పరిమితమైంది.

మాస్కోలో శిక్షణ పొందిన బోల్షివిక్ ప్రచారకర్త అమీర్ హైదర్ ఖాన్ 1934లో మద్రాస్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రాంతీయ కమిటీని స్థాపించేందుకు ప్రయత్నించాడు. అయితే అతను తన లక్ష్యాన్ని సాధించకముందే నిర్బంధించబడ్డాడు. ఆతరువాత 1934 జులైలో కేంద్ర కమ్యూనిస్టు పార్టీని ప్రభుత్వం చట్టవ్యతిరేకమైన పార్టీగా ప్రకటించింది. అయినప్పటికీ ఆయన అనుయాయులు కొందరు విజయవాడలో ఆంధ్ర ప్రాంత కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసి గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో దాని శాఖలను నెలకొల్పగలిగారు. మొట్టమొదటి రహస్య కమ్యూనిస్టు సదస్సు కాకినాడలో జరిగింది. అందులోనే పుచ్చలపల్లి సుందరయ్య పార్టీ కార్యదర్శిగా ఎంపికయ్యారు.[20] వలసవాద ప్రభుత్వం భారత కమ్యూనిస్టు పార్టీని చట్టవ్యతిరేకమైనదిగా ప్రకటించడం వల్ల వారు ప్రాదేశిక "యునైటెడ్ ఫ్రంట్" వ్యూహాన్ని అనుసరించారు. మొత్తం పార్టీ ఆంధ్ర ప్రొవిన్షియల్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ (ఎపిసిఎస్‌పి)లో చేరింది. ఆ తదనంతరం 1934లో బెజవాడలో సుందరయ్య నాయకత్వంలో ఏడుగురు సభ్యులతో ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్ట్ ఆర్గనైజింగ్ కమిటీగా ఏర్పడింది.[21] 1934 అక్టోబర్‌లో సిపిఐ సెంట్రల్ కమిటీ సమావేశం బొంబాయిలో జరిగింది. అక్కడ సుందరయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.

సామ్యవాద భావాల ప్రచారం కోసం వామపక్ష నాయకులు రాజకీయ ఆర్థిక వేసవి పాఠశాలలు నిర్వహించేవారు. అక్కడ మార్క్సిజాన్ని బోధించేవారు. 1937లో అలాంటి మొట్టమొదటి భారీ పాఠశాలను రష్యాలో కమ్యూనిస్టు శిక్షణ పొందిన కామేశ్వరరావు ఆధ్వర్యంలో గుంటూరులోని కొత్తపాలెంలో నిర్వహించారు. అక్కడ విప్లవ సామ్యవాదం గురించి ప్రభోదించారు. ఈ పాఠశాలల ప్రధానోద్దేశం స్థానిక క్యాడర్‌ను రిక్రూట్ చేసుకుని పార్టీని విస్తరింపజేయడం. ఆంధ్రలో చాలామంది కమ్యూనిస్టులు కార్మిక సంరక్షణ సమితి వంటి వివిధ కార్మిక సంఘాల్లో పనిచేసేవారు. భారత కమ్యూనిస్టు పార్టీని (సిపిఐని) నిషేధించిన తరువాత వారు వాటిలో చేరి,

---

20. ఈయన అసలు పేరు పుచ్చలపల్లి సుందర రామ రెడ్డి. అగ్రవర్ణ సామాజిక వర్గానికి చిహ్నమైన రెడ్డి అన్న పదాన్ని తొలగించుకుని అయ్య అన్న పదాన్ని చేర్చుకున్నారు. చూ. హారిసన్, 1960.

21. ఆ సభ్యుల పేర్లు పోలిపెద్ది నరసింహ మూర్తి, కొసరాజు శేషయ్య, మద్దుకూరి చంద్రశేఖర రావు, చలసాని వాసుదేవ రావు, తణికెళ్ల వెంకట చలపతి, అల్లూరి సత్యనారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య.

ఎపిసిఎస్‌పిని వేదికగా చేసుకుని తమ కార్యకలాపాలను కొనసాగించేవారు. సామ్రాజ్యవాద వ్యతిరేకదినం, రష్యా దినోత్సవం వంటి ఉత్సవాలను నిర్వహించేవారు. వారి ఒక రహస్య నివేదికలో ఇలా పేర్కొన్నారు: "తెలుగు జిల్లాల్లో పుచ్చలపల్లి సుందరయ్య, ఆయన అనుయాయులు ఆంధ్రలోని సోషలిస్టు పార్టీలను ఆకట్టుకునేందుకు, పార్టీని సమర్థవంతమైన రీతిలో తీర్చిదిద్దేందుకు నిర్విరామంగా కృషిచేస్తున్నారు." 1936లో నెహ్రూ తమిళనాడును సందర్శించిన సందర్భంగా "సోషలిస్టు భావాలకు తమిళనాట చాలా సానుభూతి వున్నట్టు కనిపిస్తోంది; ఆంధ్రలో ఇది మరింత స్పష్టంగా వ్యక్తమవుతోంది" అన్నారు. రైతులు, యువకులు సోషలిస్టు భావాల పట్ల ఎక్కువగా మొగ్గు చూపారు.

ఆంధ్రా అంతటా తమ పార్టీని విస్తరింప జేసుకోవడంలో కమ్యూనిస్టులు విజయం సాధించారనే చెప్పాలి. తత్ఫలితంగానే ఆంధ్రా ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కమిటీల్లో, అఖిల భారత కాంగ్రెస్ కమిటీల్లో సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఎక్కువ సీట్లను సంపాదించుకోగలిగారు. అతి స్వల్ప వ్యవధిలోనే సోషలిస్టు పార్టీలో కమ్యూనిస్టుల ప్రాభవం ఎంతో పెరిగింది. 1937 నాటికి ఎపిసిఎస్‌పికి చెందిన జిల్లా స్థాయి, ప్రాంతీయ స్థాయి కమిటీలు రెండింటిలోనూ కమ్యూనిస్టులు పైచేయి సాధించగలిగారు.[22]

1930 దశకం మధ్యనుంచి మొదలుకుని కమ్యూనిస్టులు ఆంధ్రాలో వ్యవసాయ కూలీల ఉద్యమాన్ని విజయవంతంగా నిర్మించగలిగారు. కమ్యూనిస్టులు గ్రామీణ పేదలను, కార్మికులను, వ్యవసాయ కూలీలను సంఘటితం చేసేవారు. ఈ క్రమంలోనే వారు దళిత వాడల్లో ప్రవేశించారు. భూమిలేని వ్యవసాయ కూలీల్లో అత్యధికులు దళితులు కావడం అందుకో కారణం అని చెప్పవచ్చు కమ్యూనిస్టులు ప్రధానంగా కార్మిక/శ్రామిక వర్గ ఉద్యమ నిర్మాణంలో భాగంగా దళితులతో సంబంధాలు పెట్టుకున్నారు. 1930లలో, 1940లలో ఇతర ఉద్యమాలన్నింటికంటే వారు వీటిని చాలా శక్తివంతంగా నిర్వహించారు. అనేక మంది దళితులు మార్క్సిజం, సోషలిజం భావాలపట్ల ఆకర్షించబడి గుంటూరు, తెనాలి, నెల్లూరు, విజయవాడ వంటి ప్రాంతాల్లో కమ్యూనిస్టులు ఏర్పాటు చేసిన కూలి రక్షణ సమితుల్లో చేరారు. 1935లో పుచ్చలపల్లి

22. 1936లో ఏఐసిసికి ముగ్గురు సోషలిస్టులు, ఎపిసిసికి ఇరవైముగ్గురు సోషలిస్టులు ఎంపికయ్యారు. 1937 కల్లా వీరి సంఖ్య వరుసగా ఏడుకు, నలభైఏడుకు పెరిగింది. 1934లో ఎపిసిఎస్‌పిలో నలుగురు కమ్యూనిస్టులు వుంటే 1937 నాటికి వారి సంఖ్య 11కు పెరిగింది. కాగా అందులో మొత్తం సభ్యుల సంఖ్య 17 మాత్రమే. చూ. సత్యనారాయణ, 1986, పేజి35-36.

సుందరయ్య భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి సమర్పించిన నివేదికలో 'తాము రైతాంగం కంటే ఎక్కువగా వ్యవసాయ కూలీలను ఆర్గనైజ్ చేస్తున్నట్టు' పేర్కొన్నారు. ఆయన నెల్లూరులోని అలగానిపాడులో వ్యవసాయ కూలీల సంఘంతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఆ సంఘం లక్ష్యం చట్టం ద్వారా రోజువారీ కూలీని, వార్షిక వేతనాలను ప్రామాణీకరింపజేయడం, సౌకర్యంగా బతికేందుకు వీలుగా కనీస వేతనాలు చెల్లించబడేట్టు చూడటం.

ఇదిలావుంటే, గుంటూరులో జె. రామలింగయ్య తదితరులు కూడా వ్యవసాయ కూలీల ఉద్యమం కోసం ఒక ఎజెండాతో కృషిచేశారు. అనతికాలంలోనే అది ఇతర జిల్లాలకు విస్తరించింది. అనేక గ్రామాల్లో సంఘాలు ఏర్పడి వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో సంఘటితమయ్యారు. ఆ కార్మిక సంఘాలను కూలి రక్షణ సమితులు అనేవారు. మొదటి కూలి రక్షణ సమితి గుంటూరులో స్థాపించబడింది. ఆ తరువాత నాలుగు నెలలకు 1 జులై 1935న నెల్లోరులో మరో సమితిని స్థాపించారు. దానికి రావి ఆది శేషయ్య ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తదనంతరం పిల్లలమర్రి వెంకటేశ్వర్లు నేతృత్వంలో 10 అక్టోబర్ 1935న బెజవాడలో ఒక కూలి రక్షణ సమితి[23] ఏర్పడగా, తాడి అప్పలస్వామి నేతృత్వంలో4 ఫిబ్రవరి 1936న ఏలూరులో ఒక ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఎర్పడింది.[24] ఇంకా ఈ కూలి రక్షణ సమితులు పోలెపెద్ది నర్సింహమూర్తి, కాకుమాను నారాయణ, తుమ్మల వెంకటరామయ్య, ముక్తేవి నారాయణల నాయకత్వంలో 1 జులై 1935న బందరులో, 19 జులై 1935న మద్రాసులో, ఆగస్ట 1935లో తెనాలిలో ఏర్పాటయ్యాయి. ఈ ప్రాంతీయ స్థాయి జిల్లా స్థాయి సమితులనన్నింటినీ సమన్వయపరిచేందుకు 15 ఆగస్ట 1935న సుందరయ్య నాయకత్వంలో మద్రాస్ రాష్ట్ర కార్మిక పరిరక్షణ సమితి ఏర్పడింది. ఈ సమితుల్లో సభ్యులైనవారెవ్వరూ కూలీల ప్రయోజనాలకు భంగం కలిగించే మరే ఇతర సంస్థలోనూ సభ్యుడు కాకూడదు. రాష్ట్ర స్థాయి సమన్వయ సమితి ఏర్పడేంతవరకు సభ్యత్వానికి పరిమితులుండేవి. అందువల్లనే ఏ కాంగ్రెస్‌వాదీ వీటిలో సభ్యుడు కాలేదు. ఆ పరిమితుల కారణంగానే వారు గోదావరి జిల్లాల్లో వాటి శాఖలను నెలకొల్పలేకపోయిరు. 1936 ఫిబ్రవరి వరకు వారు ఏలూరు,

---

23. సమితి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కొసరాజు శేషయ్య, మాద్దుకూరి చంద్రశేఖరరావు, చలసాని వాసుదేవరావు, కె. శ్రీనివాసరావు, ఆల్లూరి సత్యనారాయణ, చాగళ్ల వెంకటేశ్వరరావు, వంద్రాసు సన్నయ్య, కృతివెంటి కుటుంబరావు, సోములు.

24. ఏలూరు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు గారపాటి సత్యనారాయణ, బనిసెట్టి అప్పారావు, కరణం సింహాచలం, కడుగు రాములు, రంభా వెంకటప్పయ్య, వంకినేని సత్యం, మధుసూధన్ రావు.

భీమవరం లలో కూడా శాఖలను నెలకొల్పలేదు. అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ 1935 నవంబర్లో ఆంధ్రలో పర్యటించినప్పుడు కూలి సంరక్షణ సమితుల సభ్యులు వివిధ ప్రాంతాలలో- తెనాలి, గుంటూరులలో 12 నవంబర్ 1935న, బెజవాడలో 13న, ఏలూరు, నిడదవోలుల్లో 15న నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.[25] అయితే ఆ తదనంతరం కమ్యూనిస్టు ఉద్యమం మీద ఆంక్షలు తొలగడంతో ఈ కూలీ రక్షణ సమితుల ద్వారా వారు ఎంతో ప్రయోజనాన్ని పొందారు.

1935-37 మధ్యకాలంలో వ్యవసాయ కూలీలు తమ వేతనాలను క్రమ పద్ధతిలో, సాధికారికంగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐదు సార్లు సమ్మెలు చేశారు. నెల్లూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో వేలాదిమంది కూలీలు "సరైన వేతనాలను సాధికార పద్ధతిలో చెల్లించాలి, వడ్డీలు లేకుండా రుణాలు ఇవ్వాలి, రెండు గంటలపాటు మధ్యహ్న భోజనానికి పనిలో విరామం వుండాలి, ఏడాదికి 20 రోజుల పాటు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలి, సిక్‌లీవులుండాలి, జబ్బుపడ్డ సమయంలో వేతనాలు కట్‌చేసే విధానం రద్దు చేయాలి, ప్రస్తుత రుణాలపై చక్రవడ్డీని మాఫీ చేయాలి అని డిమాండ్ చేస్తూ సమ్మె చేశారు. అయితే సమ్మె వల్ల వేతనాల పెరుగుదల తప్ప ఇతర డిమాండ్లేవీ నెరవేరలేదు. ఎన్.జి. రంగా ఇలా అన్నారు: "తమ యజమానుల వైఖరికి వ్యతిరేకంగా సమిష్టి పోరాట సాధ్యాసాధ్యాలు, శక్తి సామర్థ్యాలు ఎలా వుంటాయోనన్న విషయంలో ఈ సమ్మెలు అనేక జిల్లాల్లోని కార్మికుల కళ్లను నాటకీయంగా తెరిపించాయి." ధనిక రైతులు గ్రామీణ పేదల ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నించారు. అప్పుడప్పుడు వారు శ్రామిక సంఘాల ఏర్పాటుకు మూలకారకులైన వారిమీద, సామాజిక కార్యకర్తలమీద దాడులు చేయించి బీభత్సం సృష్టించారు. పెరుగుతున్న వ్యవసాయ కార్మికోద్యమం అనేక కాంగ్రెస్‌వాదుల మధ్య చ్చిచ్చు పెట్టింది. గ్రామీణ శ్రామిక పోరాటాలకు స్థానిక రాజకీయాలే కారణమంటూ వారు ఆరోపణలు చేసుకున్నారు.

అయితే కాంగ్రెస్ నుంచీ, ధనిక రైతాంగం నుంచీ ఎంత వ్యతిరేకత వచ్చినా కమ్యూనిస్టులు మాత్రం గ్రామీణ పేదలను సంఘటితపరచడం కొనసాగించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఇది మరింత ఎక్కువయింది. ఆహార ధాన్యాలు, ఇతర వినియోగ వస్తువుల ధరలు 1939-44 మధ్యకాలంలో విపరీతంగా పెరగడంతో గ్రామీణ పేదలు విలవిలలాడారు. ఆ పరిస్థితిని సొమ్ముచేసుకునేందుకు వ్యాపారులు, దళారులు, గ్రామీణ ధనికులు ఆహార ధాన్యాలను, వస్తువులను రహస్యంగా నిల్వచేయడం

---

25. జొన్నలగడ్డ రామలింగయ్య, కంభంపాటి సత్యనారాయణ, ప్రతాప రామసుబ్బయ్య, పోలెపెద్ది నరసింహామూర్తి ఎగ్జిక్యూటివ్ సభ్యులు.

మొదలుపెట్టారు. అత్యవసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు పెరిగిన ధరలను పేదలు చెల్లించలేక అనేక బాధలు పడ్డారు. దాంతో అశాంతి పెరిగిపోయింది. చివరికి ఆ పరిస్థితి గుంటూరు, నెల్లూరు తదితర అనేక ప్రాంతాలలో బియ్యం మిల్లుల, బట్టల షాపుల లూటీకి దారితీసింది. పేదలు గుంపులుగా వెళ్లి లూటీలు చేసినట్టు వార్తలు వచ్చాయి.[26] ఆ గొడవల వెనుక వామపక్ష శక్తుల ప్రమేయం గణనీయంగా వుందని మద్రాసు ప్రభుత్వం భావించింది. శ్రామికులను ఎగదోసింది కమ్యూనిస్టులేనని వార్తలు వచ్చాయి. స్థానిక కమ్యూనిస్టులే లూటీలకు మూలకారకులని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దరిమిలా అనేకమంది కమ్యూనిస్టులను, కార్మిక నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. వ్యవసాయ కూలి సంఘాలను నిషేధించింది.

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఆంధ్ర అంతటా కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున ఆకలి యాత్రలు నిర్వహించారు. వాటిలో వేలాది మంది వ్యవసాయ కూలీలు పాల్గొని భూస్వాములు తమకు తిండి పెట్టాలని, పనికల్పించాలని డిమాండ్ చేశారు. మొట్టమొదటి ఆకలి సమ్మెయాత్ర 1939మేలో తూర్పు గోదావరి జాల్లాలోని రాజోలు తాలూకాలో జరిగింది. అందులో సుమారు ఐదువేలమంది కూలీలు పాల్గొన్నారని అంచనా. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం తాలూకాలో పని కల్పించాలని కోరుతూ పదివేలమంది కూలీలు డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి ఆకలి యాత్ర నిర్వహించారు. భీమవరంలో అదే డిమాండ్‌తో మరో పదివేలమంది ప్రభుత్వ కార్యాలయాలకు కదం తొక్కారు. కృష్ణా జిల్లాలో రెండు నుంచి ఆరు వేలమంది కూలీలు ఆరు తాలూకాల నుంచి వచ్చి తాలూకా కార్యాలయం ముందు పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగం, ఇళ్ల స్థలాలు, వ్యవసాయం చేసుకునేందుకు ప్రభుత్వ భూములు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల ప్రభావంతో కృష్ణా జిల్లాలోని కూలీలు ఎంతో రాటుదేలారు. గుంటూరు జిల్లాలోని రేపల్లె, తెనాలి తాలూకాలలో రెండుమూడు వేల మంది కూలీలు రెవెన్యూ డివిజనల్ అధికారుల ముందు ప్రదర్శనలు నిర్వహించారు. వ్యవసాయ కార్మికోద్యమంపై వ్యాఖ్యానిస్తూ అప్పటి ప్రభుత్వం అకలి యాత్రలు జరుగుతున్నాయని, వివిధ సంస్కరణలను, సౌకర్యాలను ప్రజలు డిమాండ్ చేస్తున్నారని – ఆ ఉద్యమాన్ని కమ్యూనిస్టులే ఎగదోస్తున్నారని పేర్కొంది.

మద్రాసు ప్రభుత్వం వ్యవసాయ కూలీల కోర్కెలు ఆచరణసాధ్యమైనవి కావంటూ

26.గవర్నర్‌గారి పరిస్థితి నివేదిక 1942 డిసెంబర్ మొదటి పక్షం, ఎల్‌పిజె/5/205, ఇండియన్ ఆఫీస్ లైబ్రరీ, లండన్, సత్యనారాయణ పుస్తకంలో పేర్కొనబడింది.

కమ్యూనిస్టు ఆందోళనకారుల మాటలకు పక్కదారి పట్టవద్దంటూ హెచ్చరికలు జారీ చేసింది. ఉద్యమం ఊపందుకోవడంతో ప్రభుత్వం అణిచివేతకు దిగింది. అయితే ప్రభుత్వ అణిచివేత, భూస్వాముల వ్యతిరేకత ఎంతగా వున్నప్పటికీ కమ్యూనిస్టులు మాత్రం వ్యవసాయ కూలీల్లో సంఘటిత శక్తిని పెంపొందించగలిగారు. కాంగ్రెస్‌వాదుల్లా కాకుండా కమ్యూనిస్టులు గ్రామీణ ప్రాంతాల్లో శ్రామికోద్యమాన్ని నిర్మించి చాలా కాలం పాటు దానిని కొనసాగించారు. దళిత వాడలపై తమ పట్టును నెలకొల్పుకున్నారు. ఆంధ్ర గ్రామీణ సామాజిక వ్యవస్థలో రైతాంగ పెత్తందారీ దొంతరలు శ్రామికోద్యమ పెరుగుదలకు దోహదపడ్డాయి.

ఆంధ్రలో కమ్యూనిస్టు ఉద్యమం దళిత కూలీల వేతనాలు పెరిగేందుకు, చెల్లా చెదురుగా వున్న దళితులను సంఘటిత శ్రామికులుగా కార్మిక యూనియన్స్ పరిధిలోకి తెచ్చేందుకు, వారికి సోషలిజం, మార్క్సిజం పరిచయం చేసేందుకు దోహదం చేసింది. కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం వల్ల దళితలకు ఒక సమైక్యభావన, హక్కుల కోసం పోరాడాలన్న స్పృహ పెరిగాయి. రాజకీయ స్థాయిలో కనీస వేతనాల చట్టం తెచ్చింది తామేనని కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంది.[27] కానీ నిజానికి దళితులను నిరంతరం వెన్నంటి ప్రోత్సహిస్తూ కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాటాల వల్లనే కనీస వేతనాలు ఎప్పటికప్పుడు పెరుగుతూ వచ్చాయి.[28]

పార్టీ విజయాన్ని ఆంధ్రా వెలుపలి కమ్యూనిస్టు నాయకులందరూ మెచ్చుకున్నారు. ఆంధ్రా వ్యవసాయ కార్మికుల సంఘటిత శక్తి ఇతర ప్రాంతాల్లోని సంఘటిత శక్తి కంటే ఎంతో పటిష్టమైనదని వారు పేర్కొన్నారు. డెల్టా పంట కాలువల వెంబడి దళిత వలస కూలీలు పెద్ద సంఖ్యలో వుండేవారు. కృష్ణా జిల్లాలోని తెనాలి, బాపట్ల, గుడివాడ, బందరు తాలూకాల్లో అలాంటివారి మద్దతును కమ్యూనిస్టులు విశేషంగా పొందారు. ఈ ప్రాంతాల్లో కమ్యూనిస్టులు వ్యవసాయ కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి వారికి తమ హక్కుల పట్ల అవగాహన పెంచేందుకు కృషి చేశారు. ఆంధ్రాలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఈ వ్యవసాయ కూలీలే బలమైన పునాది.

---

27. ఈ చట్టం ప్రకారం వ్యవసాయ కూలీలు నైపుణ్యం లేని కార్మికులుగా (అన్‌స్కిల్డ్ లేబర్) వర్గీకరించబడ్డారు. అయితే ఇటీవలి కార్మిక చైతన్య విశ్లేషణలో వారిని వ్యవసాయ వృత్తిదార్లకింద చేర్చారు. వివరాలకు వ్యవసాయ వృత్తిదారుల యూనియన్, చిత్తూరు వారి కరపత్రాలు, చిరుపుస్తకాలు చూడవచ్చు.

28. ఇది కేవలం పట్టణ ప్రాంత సంఘటిత రంగ కార్మికులకు మాత్రమే పరిమితమైంది.

ఆంధ్రా కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వం ప్రధానంగా బ్రాహ్మణేతర కులాల్లోంచి వచ్చింది.[29] ఆ నాయకత్వం ప్రత్యేకించి కమ్మ, రెడ్డి కులాల నుంచి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో భూములున్న తత్సమాన స్థాయి కులాల నుంచి వచ్చింది. కమ్యూనిస్టు నాయకులంతా సంపన్న రైతు కుటుంబాలనుంచి, కమ్మ లేదా రెడ్డి రైతాంగ యజమానుల నుంచి వచ్చినవారే. కమ్యూనిస్టు పార్టీకి ఆంధ్రా డెల్టా ప్రాంతంలో కమ్మ భూస్వాములు; రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లో రెడ్డి కులస్తులు పునాదిని నిర్మించారు. వాళ్లు పార్టీకి నిధులను, కార్యకర్తలను సమకూర్చారు. అందుబాటులో వున్న ఆధారాలను బట్టి స్పష్టమవుతున్నదేమిటంటే స్వాతంత్ర్యానికి ముందరి రైతులు, కార్మికులు, కార్మికోద్యమం తన కమ్యూనిస్టు నాయకత్వంతో సహా గ్రామీణ పేదల ప్రయోజనాలను మొత్తంగా పెత్తందారీ కులాలకు, ధనిక రైతులకు తాకట్టు పెట్టారు.

1930 దశకం చివర్లో కమ్యూనిస్టులు రైతు ఉద్యమ నిర్మాణంలో, వ్యవసాయ కూలీలను, దళితులను సంఘటితపరచడంలో కిసాన్ సభవంటి సంఘాలతో పోటీపడ్డారు. 1920-21లో గుంటూరు ప్రాంతంలో వెల్లువెత్తిన రైతు ఉద్యమం అనంతరం గుంటూరు జిల్లాకు చెందిన రంగా అనే కమ్మ కులస్తుడు 1923లో స్థానికంగా ఒక రైతు సంఘాన్ని స్థాపించారు. భూమి శిస్తు పెంచాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా 1920లలో చాలా పెద్ద ఎత్తున ప్రతిఘటన చెలరేగింది. అది గ్రామీణ పునర్నిర్మాణం, శాస్త్రీయ వ్యవసాయం ప్రాతిపదికగా తక్షణ ఆర్థిక సమస్యలను చేపట్టి ఉద్యమించింది. 1926లో జమిందారీ రైతుల (కౌలుదార్ల) సంఘం ఏర్పడ్డాక రంగాతో కూడిన కొత్త నాయకత్వం భారీ పోరాటాలను నిర్వహించింది. అందులో 1931లో నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి జమిందారీ వ్యతిరేక పోరాటం ఒకటి. ఆనాటి నుంచి జమిందారీ విధానం రద్దు చేయాలనే డిమాండ్ ఎక్కువయింది. ఆ రైతు ఉద్యమాలు ప్రధానంగా కమ్మ కులస్తులతో ఏర్పడ్డాయి. వారు రాజకీయంగా కాంగ్రెస్‌తోనూ ఇతర ప్రత్యర్థి రెడ్డి, వెలమ కులాలకు చెందిన భూస్వాములతోనూ పోరాడారు.

---

29. 1930 - 40 ల నాటి ఆంధ్ర, తెలంగాణ ప్రాంత నాయకులు - పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, బద్దం యెల్లారెడ్డి (అందరూ రెడ్డి కులస్థులే); మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు, సి. వాసుదేవరావు, ఎన్. ప్రసాదరావు (అందరూ కమ్మ కులస్థులే) ! 1960-70లలో కూడా అదే ధోరణి కొనసాగింది - తరిమెల నాగిరెడ్డి, చండ్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు (ఈయన ఒక్కరు మాత్రం బ్రాహ్మణకులస్థులు). చూ. హారిసన్, 1956, పే. 378-404; ఇలియట్, 1986, పే. 129-171; పద్మారావు, క్యాస్ట్ అండ్ ఆల్టర్‌నేటివ్ కల్చర్, 1995, పే. 23-37.

1930ల చివరినాటికి కమ్యూనిస్టులు కిసాన్ సభను, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని సవాలు చేసే స్థితికి చేరుకున్నారు. 1938–42 మధ్య కాలంలో కమ్యూనిస్టులకు–కమ్యూనిస్టేతరులకు మధ్య ముఠాకక్షలు చెలరేగాయి. రంగా రైతు సంస్థలోంచి బయటకు వచ్చిన అత్యధిక శాతం క్యాడర్‌ను కూడా కమ్యూనిస్టులు తమ వైపునకు ఆకర్షించుకోగలిగారు. సైద్ధాంతికంగా జరిగిన పోరాటంలో మొదట్లో రైతు రాజ్యం గురించి మాట్లాడినా ఆతరువాత కమ్యూనిస్టులు కార్మిక రాజ్యం గురించి ప్రబోధించారు. అందుకు ప్రతిగా రంగా కార్మిక రైతాంగ రాజ్యం గురించి ప్రచారం చేశారు. అయితే కిసాన్ సభలు, రైతు కూలీ సంఘాలు, రైతు సమితులు ఏవీ కూడా కులం పాత్రను పట్టించుకోలేదు. దళిత ప్రజానీకం ఎదుర్కొంటున్న కుల దోపిడీ సమస్యను కనీసం నామమాత్రంగానైనా ఎక్కడా ప్రస్తావించలేదు. బంజరు భూములు, పోరంబోకు భూములు, అటవీ భూముల పంపిణీకి కిసాన్ సభ నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా కులానికి ఎలాంటి ప్రాధాన్యతా యివ్వలేదు. వెత్‌బెగెర్ అన్నట్టు కమ్యూనిస్టులు కులాల స్వరూపాన్ని గుర్తించలేకపోయారు. కూలీ జనులను కులదోపిడీకి గురిచేస్తున్న సాంప్రదాయిక భూస్వామ్య విధానాన్ని కూడా వారు గమనించలేకపోయారు. కులం తాలూకు ఆర్థిక కోణాలతో వ్యవహరించడంలో వామపక్షం విఫలమైనా స్వతంత్ర దళిత ఉద్యమం మాత్రం ఈ అంశాన్ని చేపట్టింది.

1930 దశకం మధ్య అటు గ్రామీణ సంపన్న వర్గం నుంచీ ఇటు కాంగ్రెస్ పార్టీ నుంచీ తీవ్రమైన వ్యతిరేకత ఎదురైనా ఆంధ్రాలో కమ్యూనిస్టులు వ్యవసాయ కూలీల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లగలిగారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఆ పోరాటాలని మరింత ఉధృతం చేశారు. రాజకీయ కార్యాచరణ కోసం రైతులను, కార్మిక వర్గాన్ని చైతన్యపరచడంలో కమ్యూనిస్టుల విశిష్ట కృషిని కాంగ్రెస్ నాయకత్వం గుర్తించలేదు. కమ్యూనిస్టులు పీడితవర్గాలకు చెందిన సంఘటిత బియ్యం మిల్లుల కార్మికుల్లోకి, జట్కాలూ బండ్లను నడిపే కార్మికులలోకి చొచ్చుకుపోయింది.

అయితే కమ్యూనిస్టులు ఎంతసేపూ మార్క్సిస్టు ఆర్థిక కోణంలో ఆలోచించారే తప్ప దోపిడీ వ్యవస్థలో కులం పాత్రను అంచనావేయలేకపోయారు. దళితుల హీన స్థితిని నిర్మూలించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను కమ్యూనిస్టు ఉద్యమం కనుగొనలేకపోయింది. 1980ల నాటి వరకు వచ్చిన కమ్యూనిస్టు సాహిత్యాన్ని గనక జాగ్రత్తగా పరిశీలిస్తే అది దళితులను హరిజనులుగా ప్రస్తావించిందే తప్ప–హిందూవాద సంస్కరణోద్యమం ద్వారా దళితులను లోబరచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాలకు ప్రత్యామ్నాయాన్ని ఎప్పుడూ చూపలేదని స్పష్టమవుతుంది.

సార్వజనీనంగా ప్రచారంలోకి తెచ్చిన హరిజన్ అన్న పదప్రయోగాన్ని అంబేద్కర్ ఒక్కరే కాదు దేశ వ్యాప్తంగా వున్న సంఘటిత దళితులందరూ గట్టిగా వ్యతిరేకించారు. దళిత స్వయం ప్రతిపత్తిని వ్యవస్థాపర స్థాయిలో ఆమోదించేందుకు ఎవరూ సిద్ధంగా వున్నట్టు కనిపించదు. ఇక సంస్కృతి, గుర్తింపు విషయాలకు వస్తే బ్రాహ్మణీయ హిందూ దృక్పథంతో రాసిన భారత దేశ చరిత్రకు ప్రత్యామ్నాయాన్ని అందించడంలోనూ కమ్యూనిస్టులు విఫలమయ్యారు.

అంబేద్కర్, ఇతర దళిత నాయకులకు హరిజనీకరణపట్ల వున్న వ్యతిరేకత గురించి కమ్యూనిస్టులకు సరైన అవగాహన లేదు. హరిజనీకరణ అంటే దళితుల అంటరానితనం సమస్యను గందరగోళం చేయడమే. కమ్యూనిస్టులు గతితార్కిక భౌతికవాదాన్ని యాంత్రికంగా అనుసరించారు. బ్రాహ్మణీయ గతం అంతా కేవలం వేతనాలు, భూమి కోసం చేసే పోరాటాలతో తుడిచిపెట్టుకుపోతుందని భావించారు. అందుకే కమ్యూనిస్టు సిద్ధాంత వ్యక్తీకరణల్లో ఎక్కడా బ్రాహ్మణీయ సాంప్రదాయాలపై విమర్శ మచ్చుకు కూడా కనిపించదు. పునాది ఉపరితల సిద్ధాంతం (శాస్త్రీయ కమ్యూనిజానికి మూలాధారమైన బేస్ సూపర్‌స్ట్రక్చర్ థియరీ) కారణంగానూ, కొంతవరకు నాయకుల, కార్యకర్తల బ్రాహ్మణీయ విలువలతో కూడిన నేపథ్యం కారణంగానూ వారు ఈ సమస్యపై అంటీఅంటనట్టు వుండిపోయారు.

అయినప్పటికీ దళితుల వేతనాలను పెంచడంలో కమ్యూనిస్టు ఉద్యమం కచ్చితంగా గణనీయమైన పాత్రను నిర్వహించింది. ఆంధ్రలో దళితులను, ముఖ్యంగా మాల మాదిగలను కమ్యూనిస్టు ఉద్యమం అమితంగా ఆకర్షించింది. అయితే వారు తమలో ఒక మేథోవర్గాన్ని, నాయకత్వాన్ని సృష్టించుకోలేకపోయారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అలాంటి ప్రయత్నమే జరుగలేదు.

ధనికరైతులు (భూస్వాములు)... ప్రధానంగా కమ్మ, రెడ్డి కులస్థులే ఆంధ్ర రైతాంగ ఉద్యామాన్ని, కమ్యూనిస్టు ఉద్యమాన్ని నడిపారు. మరెక్కడా లేనివిధంగా ఆంధ్ర ప్రాంతంలో వ్యవసాయ కూలీలను వాళ్లే సంఘటితపరిచారు. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో వ్యవసాయ కూలీ సంఘాన్ని ఏర్పాటు చేశాక 1945–46లో అందులో చేరిన సభ్యుల సంఖ్య 60,000కు పెరిగిపోయింది. అదే ఇతర ప్రాంతాలలో మాత్రం సంఘ సభ్యత్వం 5,000 నుంచి 15,000 దాటలేదు.[30] తమ కుల హీనత, అసమానత వంటి సమస్యల నుంచి బయటపడతామన్న ఆశతో అనేకమంది దళితులు “కార్మిక రాజ్యం” (మజ్దూర్ రాజ్) నినాదానికి ఆకర్షితులై కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు.

---

30. ఒక్క ఆంధ్ర ప్రాదేశిక కిసాన్ సభలోనే 1,75,000 మంది సభ్యులుండేవారు.

సంఘటిత కూలీ సంఘాలు దళితుల సమస్యలను పరిష్కరిస్తాయనే ఆకాంక్షను రగిలించి కూలీలను ఏకం చేసేందుకు ప్రయత్నించాయి. స్థానిక కమ్మ కమ్యూనిస్టు నాయకుడు మొక్కపాటి వెంకటరత్నం వంటి వారు అలాంటి ఆశలను రేకెత్తించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కొన్ని చర్యలు చేపట్టారు. కానీ తమ కుల పక్షపాతధోరణి కారణంగా వాటిని విజయవంతంగా కొనసాగించలేకపోయారు. కమ్యూనిస్టుల కుల వ్యతిరేకత కేవలం ఉపన్యాసాలకే పరిమితమైంది. వాళ్లు ఎంతసేపూ పెద్ద భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడండి, తిరగబడండి అన్నారే తప్ప కులానికి వ్యతిరేకంగా తిరుగబడమని ఎప్పుడూ చెప్పలేదు.

స్థానిక స్థాయిలో వేతనాల కోసం పలు సంఘటిత పోరాటాలు నిర్వహించారు. అవి చాలావరకు మిలిటెంటుగా సాగాయి. 1945 నుండి 1948 వరకు దళితులు ప్రధానంగా కూలీ సంఘాల నీడలో వేతనాల పెరుగుదల కోసమే సమ్మెలు చేశారు. క్రమేణా ఆ వేతనాల కోసం జరిగే సమ్మెలే రాజకీయ సమ్మెలుగా (1948) మారాయి. దళితులు[31]నల్ల బ్యాడ్జీలు ధరించి 5 ఆగస్టు 1948న "ఇది స్వాతంత్ర్యం కానేకాదు. మాకింకా స్వాతంత్ర్యం రానేరాలేదు" ఎర్ర జెండా వర్థిల్లాలి" అంటూ నినదించారు.[32] దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తమ బతుకులు మారలేదనీ ... తెల్ల దొరలు పోయి నల్ల దొరలు రావడం తప్ప మరే మార్పు జరుగలేదని వారు భావించారు.[33] ఆరోజు (5-8-1948) కాంగ్రెస్ పార్టీకి చెందిన కమ్మ భూస్వాములు దళితుల మీద- వారు కమ్యూనిస్టులకు వంతపాడుతున్నారన్న అక్కసుతో భౌతికంగా దాడి చేశారు.[34] అయితే

31. వీరిలో అత్యధికులు మాదిగలే. వారే ఈ ఉద్యమాన్ని నడిపారు ఇతర అణగారిన వర్గాలు ఉద్యమంలోకి వచ్చేట్టు చేశారు.

32. ఈ పరిశోధనకోసం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అనేకమందిని ఇంటర్వ్యూ చేసినప్పుడు వారిలో ఒక్కరైనా తమకు స్వాతంత్ర్యం వచ్చినట్టు ససేమిరా ఒప్పుకోలేదు. తమ స్వాతంత్ర్యం గ్రామ సర్పంచ్ చేతిలోనో లేక స్థానిక భూస్వాముల చేతుల్లోనో వుంటుందన్నారు. ఇదే విషయాన్ని దళిత ఆధునిక మేధావులు కూడా 1980 లలో, 1990లలో తిరిగి ప్రస్తావించారు. ఉదాహరణకు దళితుల మీద జరుగుతున్న తీవ్రమైన దాడులకు నిరసనగా 15 ఆగస్టు 1991ని వారు "బ్లాక్ డే"గా పాటించడం తెలిసిందే. చూ. ఆం.ప్ర. పౌరహక్కుల సంఘం నివేదిక 1991.

33. సాపాటి శాంసన్‌తో, కమ్యూనిస్టు శ్రీరాములుగా పేరుగాంచిన కర్రు శ్రీరాములుతో జరిపిన ఇంటర్వ్యూలు.

34. గుంటూరు జిల్లాలోని బ్రాహ్మణ కోడూరు గ్రామం. ఈ శతాబ్ది ప్రారంభంలో గుంటూరు జిల్లా రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా వుండేది. సాహిత్య చరిత్ర విషయానికి వస్తే ఈ జిల్లా సాహిత్యకారులు ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి', విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగలు', ఎన్.జి. రంగా 'హరిజన నాయకుడు', గుర్రం జాషువా 'గబ్బిలం' వంటి రచనలు చేశారు.

వారి దాడిని ముందే పసిగట్టిన దళితులు దీటైన రీతిలో హింసాత్మకంగానే ప్రతిఘటించారు. దళిత స్త్రీలు కూడా కారంపొడి, వేడినీళ్లతో ఆ ప్రతిఘటనలో పాల్గొన్నారు. ఆనాటి హింసాత్మక సంఘటన సందర్భంగా కమ్మ కులానికి చెందిన కమ్యూనిస్టు నాయకులు నిర్వహించిన పాత్ర, వారు కనబరచిన వైఖరి పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కమ్మ భూస్వాములు దళితులతో రాజీ కుదుర్చుకోడానికి వచ్చినప్పుడు మొక్కపాటి వెంకటరత్నం, యెల్లాపల్లి లక్ష్మీనారాయణ వంటి కమ్మ కమ్యూనిస్టు నేతలు పత్తాలేకుండా పోయారు. ఆ పోరాటంలో గానీ తదనంతరపు పరిణామాల్లో గానీ అసలు పాలుపంచుకోలేదు. దళిత కమ్యూనిస్టులకు ఏమాత్రం సహకారాన్ని అందించలేదు. ఆ సంఘటన వల్ల రెండు అంశాలు స్పష్టమయ్యాయి. ఆ వైరుధ్యం కమ్మ భూస్వాములకు మాల మాదిగ కులాలకు చెందిన కూలీలకు మధ్య ఏర్పడింది. రాజకీయ పద్ధతులతో కార్మిక పోరాటాలను నిర్వహిస్తారని పేరున్న కమ్యూనిస్టులు తమ కుల పక్షపాత దృక్పథం నుంచి బయటపడలేకపోయారు. విస్తృత రాజకీయ సిద్ధాంతపర స్థాయిలో వారి దృక్పథం మారలేదు. తమ కులానికి చెందిన వారు కావడం వల్లనే కాంగ్రెస్ భూస్వాములతో వారు సానుకూలంగా వ్యవహరించారు. ఇది చారిత్రక సత్యం. పార్టీలతో నిమిత్తం లేకుండా కుల దురహంకారం గానీ, కుల అణచివేతగానీ ఏమాత్రం మారలేదు.

ఆంధ్ర కమ్యూనిస్టులు పార్టీ పరిధిలో తమ సంపన్న రైతాంగ వివాదాస్పద విధానాన్ని ఏమీ దాచుకోలేదు. 1948 నాటి కార్యక్రమంపై భారత కమ్యూనిస్టు పోలిట్ బ్యూరోకు సమర్పించిన ఒక నివేదికలో వారు తమకు తాముగా స్పష్టంగా రెండు ప్రధాన వ్యూహాత్మక నియమాలను ప్రస్తావించారు.

1. డెల్టా ప్రాంతాల్లో జనం ఒత్తిడి తీవ్రంగా వుంటుంది. కాబట్టి సంపన్న రైతులకు చెందిన భూములను పేద రైతులకు కూలీలకు పంచిపెట్టాలనే నినాదాలు ఇవ్వాలి.
2. శ్రామికుల న్యాయమైన డిమాండ్ల విషయమై రైతులను ఒప్పించేందుకు ప్రచార కార్యక్రమం చేపట్టాలి. మనల్ని అనుసరించి వచ్చే రైతులతో రాజీ కుదుర్చుకునేందుకు ప్రయత్నించాలి. సంపన్న రైతుల భూముల జోలికిరామనే భరోసాని వారికి కలిగించాలి.

చదువుకుని ఇంతో అంతో భూమి వుండి తమ పేరును రిజిష్టరు చేసుకున్న వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించడం వల్ల 1946 ఎన్నికలలో కమ్యూనిస్టులకు దళితుల సంఖ్యాబలం వల్ల పెద్దగా లబ్ది చేకూరలేదు. నిరక్షరాస్యులు, భూమిలేని

పేదలు, వ్యవసాయ కూలీలు తదితర దళితులు ఎంత పెద్ద సంఖ్యలో వున్నా అనేక కారణాల వల్ల వారు ఏ ఎన్నికలలోనూ పాల్గొనలేకపోయారు. స్వాతంత్ర్యానంతరం, నెహ్రూ ప్రభుత్వం ఏర్పడిన తరువాతే వారికి ఓటుహక్కు లభించి ఎన్నికలలో సజావుగా పాలుపంచుకోగలుగుతున్నారు.

ఆంధ్ర ప్రాంతం మొదటినుంచీ తన విశిష్టతను కాపాడుకుంటూ వచ్చింది. పొరుగున వున్న తెలంగాణాలో కమ్యూనిస్టు ఉద్యమం విప్లవ పంథాలో ముందుకు సాగింది. కమ్మ, రెడ్డి కులాలకు చెందిన నాయకుల సారథ్యంలో తెలంగాణా సాయుధ పోరాటం ప్రామాణిక కమ్యూనిస్టు గెరిల్లా పద్ధతిని అనుసరించింది. గ్రామీణ ప్రాంతాలలో వారు సమాంతర ప్రభుత్వాలను నడిపారు. తదనంతర పరిణామాలు వేరుగా వున్నాయి. హైదరాబాద్ నిజాంకు వ్యతిరేకంగా 1948లో భారత సైన్యం పోలీస్ యాక్షన్ పేరుతో రంగప్రవేశం చేసింది. 1951 చివరి నాటి వరకూ భారత ప్రభుత్వం ఈ ప్రాంతంలో సాధారణ పరిపాలనను ఏర్పాటు చేయలేకపోయింది. ఏదిఏమైనా ఈ ప్రాంతంలో ఏర్పడ్డ సంక్షోభం నుంచి కమ్మ, రెడ్డి కులాలకు చెందిన వారు తమ విలువైన భూసంపదను, పంటలను, ఆస్తులను కాపాడుకుంటూ చెక్కుచెదరకుండా బయటపడగలిగారు.

కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రధాన నాయకులు తమ కుల పక్షపాత ధోరణి నుంచి బయటపడలేకపోయారు. మధ్యతరహా సంపన్న రైతాంగం నుంచి వచ్చిన వాళ్లు పోరాటానికి దూరంగా– కమ్యూనిస్టు పరిభాషలో చెప్పాలంటే తటస్థులుగా వుండిపోయారు.[35] ముఖ్యంగా మధ్య తరగతి రైతుల కుమారులు గ్రామీణ మేధావులుగా కీలక స్థానాలను ఆక్రమించారు. పార్టీ తనకు తానుగా మధ్యతరగతి రైతులతో ఊగిసలాట రాజకీయాలకు వేదికగా మారింది. సంపన్న రైతాంగ సిద్ధాంతాల ప్రభావానికి లొంగిపోయింది. బి.టి. రణదివే అన్నట్టు 'తమిళనాడులో శ్రామికవర్గ పునాది వున్నట్టు, కేరళలో పేద రైతాంగ పునాది వున్నట్టు కాకుండా ఇదొక తప్పుడు సామాజిక పునాది'. దళితులలోంచి ఒక్క నాయకుడిని కూడా కమ్యూనిస్టులు సృష్టించలేకపోయారు. దళితులంతా కేవలం కింది స్థాయి కార్యకర్తలుగా లేదా గ్రామీణ స్థాయి ప్రతినిధులగా వుండిపోయారు. రాష్ట్ర స్థాయి. జాతీయ స్థాయి రాజకీయాలలో రాణించగల విద్యార్హతలున్న వాళ్లు కూడా పార్టీలో ఎదగలేకపోయారు. ఈ విషయంలో ఒకే ఒక్క మినహాయింపు కోనాడ సూర్యప్రకాశరావు. ఈయన 1941 నుంచి 1943 వరకు

35. అందరు భూస్వాములూ ప్రతిఘాతకులే అన్న ఒక్క రణదివే మార్గం నుంచి మాత్రమే కాదు ఆసియా అంతటా మాస్కో మార్గం నుంచి కూడా పక్కదారిపట్టడమే అవుతుందిది.

వ్యవసాయ కూలీ సంఘం (ఎఎల్‌యు)అధ్యక్షులుగా పనిచేశారు. అయితే కమ్యూనిస్టులలో రోజురోజుకు పెరిగిపోయిన అంబేద్కర్ వ్యతిరేక, దళిత వ్యతిరేక ధోరణి కారణంగా ఆయన కూడా 1944లోనే పార్టీనుంచి బయటకు వెళ్లిపోయారు. తన తీర్మానాల ద్వారా వ్యవసాయ కూలీ సంఘం ముస్లిం లీగ్‌ని రాజకీయ పార్టీగా గుర్తించింది కానీ షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్‌ని మాత్రం ఒక కమ్యూనల్ సంస్థగా పరిగణించింది. దీనిని బట్టే పార్టీ వైఖరెలావుందో అర్థమవుతుంది. ఆయన ఈ విషయం మీదనే తన అసమ్మతి పత్రం వెలువరించారు. దళితుల సామాజిక హీన స్థితి, ఆర్థిక పరిస్థితిని ప్రస్తావిస్తూ అణగారిన వర్గాల ప్రజలకు ఇవాళ ఆర్థిక ప్రగతి కంటే ముందు సామాజిక ప్రగతి చాలా ముఖ్యం అని వాదించారు. మన సమాజంలో దళిత కులానికి చెందిన లక్షాధికారి సైతం బ్రాహ్మణ బిచ్చగాడికంటే లేదా కమ్మ/కాపు/రెడ్డి కులానికి చెందిన దరిద్రుడికంటే కూడా తక్కువ వాడిగా పరిగణింపబడతాడు. ఇది అతిశయోక్తో, గతకాలపు దృశ్యమో కాదు. చారిత్రక సత్యం. మన గ్రామీణ సమాజంలో అనేకానేమంది దళితుల దుస్థితి ఇది.[36]

భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యం కావాలని డిమాండ్ చేసింది కమ్యూనిస్టుపార్టీయే. కానీ జాతీయోద్యమం నుంచి కాంగ్రెస్ పార్టీని అది పక్కకు తప్పించలేకపోయింది. అందుకు పార్టీ తన వర్గస్వభావాన్ని విశ్లేషించుకోలేకపోవడం, పార్టీ నాయకత్వం కేవలం అగ్రవర్ణాలకు పరిమితం కావడం, ప్రధాన కారణాలని చెప్పవచ్చు. ఆంధ్రాలో 1934లో పార్టీ స్థాపించబడినప్పటినుంచీ పార్టీ నాయకత్వం కోస్తా ప్రాంత కమ్మ భూస్వాములకు, రాయలసీమ, హైదరాబాద్ ప్రాంత వెలమ/రెడ్డి కులాల వారికే పరిమితమైపోయింది. సంపన్న కమ్మ కులానికి చెందిన ముగ్గురు ముఖ్య నాయకులు చంద్రశేఖరరావు, రాజేశ్వరరావు, బసవపున్నయ్య 1950ల వరకూ కమ్యూనిస్టుపార్టీపై తమ ఆధిపత్యాన్ని నిలుపుకున్నారు. 1954లో ఆంధ్రా కమ్యూనిస్టు కమిటీకి కొత్త కార్యదర్శివర్గాన్ని ప్రకటించినప్పుడు ఈ ముగ్గురు నాయకులకు ఆ కమిటీలో కూడా చోటులభించింది. పైగా వీరికి తోడు మరో ముగ్గురు కమ్మ నాయకులను కమిటీలో చేర్చుకున్నారు.[37] పుచ్చలపల్లి సుందరయ్య లాగా తమ పేరులోని కుల/వర్గ/సామాజిక హోదాను సూచించే "రెడ్డి" లాంటి పదాలను విసర్జించి "అయ్య" అనే

---

36. బొజ్జా అప్పలస్వామి, వజ్రపు సాంబమూర్తి మొదలైనవారితో జరిపిన ఇంటర్వ్యూలు.

37. వీరిలో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు మోటూరి హనుమంతరావు, పార్లమెంటు దిగువ సభ సభ్యులు జి.సత్యనారాయణ, కె. గోపాలరావు, ఇంకా కృష్ణారావు వున్నారు.

సాధారణ పదాన్ని చేర్చుకున్న నేతలు చాలా అరుదనే చెప్పాలి.[38] కమ్యూనిస్టు ఉద్యమ అగ్ర కుల నేతలు దళితుల పట్ల కనబరచిన ద్వంద్వ వైఖరి ఉద్యమాన్ని బలహీనపరచింది. ఆంధ్ర శాసనసభ సీట్లకు జరిగిన ఓటింగ్ సరళిని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. 1951–52 లో కమ్యూనిస్టులకు 22 శాతం ఓట్లు పోలయ్యాయి. 1954–57 వారికి పోలైన ఓట్ల శాతం 29.6కు పెరిగింది. ఆ తరువాత క్రమంగా కమ్యూనిస్టుల ఓట్ల శాతం తగ్గిపోతూ వచ్చింది. 1962లో 19.5 శాతానికి, 1967 లో విడిపోయిన ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు కలిపి కూడా 15.3 శాతానికి (సిపిఐకి 7,5 శాతం, సిపిఎంకి 7.7శాతం) తగ్గిపోయింది. అలాగే 1972లో రెండు పార్టీలకు కలిపిన ఓట్ల శాతం 9.1 పడిపోయింది (సిపిఐకి 5.9 శాతం, సిపిఎంకి 4.8 శాతం). 1978 లో అయితే కమ్యూనిస్టుల ఓట్ల శాతం మరింత దారుణంగా 4.8 శాతానికి కుంచించుకు పోయింది (సిపిఐకి 2.4 శాతం, సిపిఎంకి 2.4 శాతం).

ఆంధ్రలోని కమ్యూనిస్టు కార్యకర్తలు, పరిశోధకులు ఎవ్వరూ ఉద్యమంలో దళితుల పాత్రను గుర్తించినట్టు కనిపించదు. వివిధ సందర్భాలలో కొందరు ఉద్యమ నాయకులు దళితుల గురించి ప్రస్తావించారు.[39]కానీ అది పరిమితంగా, దళితుల స్థితిగతులపట్ల సానుభూతి వ్యక్తంచేసే రీతిలో మాత్రమే జరిగింది. పార్టీ విధానంలో కుల సమస్య గానీ, అంటరానితనం సమస్య గానీ అంతర్భాగంగా లేదు కాబట్టే దళితులకు ప్రత్యామ్నాయాన్ని సిద్ధాంతాన్ని అందించడంలో పార్టీ విఫలమయింది. ఆర్థిక మార్పుల కారణంగా కింది స్థాయికి చెందిన వాళ్లు కొంతమేరకు స్వేచ్ఛాఫలాలు చవి చూడగలిగినప్పటికీ కుల ఆధిపత్య పట్టు నుంచి మాత్రం వాళ్లు బయటపడలేకపోయారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ కులం, అంటరానితనం సమస్యలను సీరియస్‌గా పరిగణనలోకి తీసుకోలేదు. స్వాతంత్ర్యోద్యమానికి ఇది తీరని హాని కలిగించిందనీ, ప్రజల్లో వైరుధ్యాలు ఏర్పడడానికి దారితీసి సంపూర్ణ స్వరాజ్య లక్ష్యం నుంచి కొందరిని హరిజనోద్ధరణ సమస్యవైపునకు మరలించిందని ఇటీవలి పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. సిద్ధాంతపరమైన స్థాయిలో దళితులను చేర్చుకోలేకపోవడం వల్లనే క్రమంగా కమ్యూనిస్టుపార్టీలకు దళితుల మద్దతు తగ్గిపోతూ వచ్చింది. ఏదిఏమైనా పాతతరం దళిత కమ్యూనిస్టులు మాత్రం కమ్యూనిస్టు ఉద్యమం వల్లనే తమ జీవితాలలో మార్పు వచ్చిందనీ ముఖ్యంగా తమ వేతన స్థాయి పెరిగిందనీ ఆమోదిస్తున్నారు.

---

38. చాలా వరకు దళితుల పేర్లన్నీ 'అయ్య' అనే పదంతోనే అంతమవుతుంటాయి. ఉదాహరణకు ఎల్లయ్య, పుల్లయ్య, పోచయ్య, పిచ్చయ్య వగైరా.

39. ఉదాహరణకు తరిమిల నాగిరెడ్డి, 1972; దేవులపల్లి వెంకటేశ్వరరావు, 1988.

బ్రాహ్మణేతర ఉద్యమం - దళితులు

బ్రాహ్మణుల సాంప్రదాయిక ఆధిపత్యాన్ని సవాలు చేసే ఉద్యమం మొదలయ్యాక బ్రాహ్మణేతరుల ముందు మరొక లక్ష్యం ఏర్పడింది. అది బ్రాహ్మణీకరణకు గురైవున్న ప్రభుత్వాధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయడం. అధికారమంతా ప్రభుత్వ ఉద్యోగస్వామ్యం చేతిలో కేంద్రీకృతమై వున్న ప్రపంచంలో అలాంటి లక్ష్యం సులభసాధ్యం కాదు. కాంగ్రెస్ పార్టీ బ్రాహ్మణాధిపత్యం వున్న పార్టీ కాబట్టి బ్రాహ్మణేతరులకు దానిమీద నమ్మకం పోయింది. భారత జాతీయ కాంగ్రెస్ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం వహిస్తూ వారి ప్రయోజనాలకే పాటుపడుతోందంటూ తీవ్రంగా విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఒక కరపత్రంలో నైతే "మాకు బ్రిటిష్‌వారికంటే బ్రాహ్మణులే ఎక్కువ పరాయి వాళ్లుగా అనిపిస్తారు" అని ఘాటుగా రాశారు.

దక్షిణ భారత ఉదారవాద సమాఖ్య [40] లేదా జస్టిస్ పార్టీకి చెందిన బ్రాహ్మణేతర నాయకులు దక్షిణ భారతదేశానికి చెందిన బ్రాహ్మణేతరులందరికీ తామే ఏకైక ప్రతినిధులుగా చాటుకునేందుకు దళితుల మద్దతును కోరారు, వారితో పొత్తుకు సిద్ధమయ్యారు. ఆ ఉద్యమంలో ఆంధ్రా ప్రాంతంనుంచి త్రిపురనేని రామస్వామి చౌదరి వంటి అనేక మంది కమ్మ నాయకులు పాల్గొన్నారు. బ్రాహ్మణేతర నేత టి.ఎం. నాయర్ జస్టిస్ పార్టీకి సలహాలిచ్చేందుకు, స్నేహం నెరపేందుకు దళితుల కార్యకలాపాలను సమన్వయపరిచేందుకు ఒక కమిటీని నియమించాలని సూచించినప్పుడు దళితులు ఒప్పుకోలేదు. హోం రూలు గనక మంజూరైతే అధికార పీఠంమీద బ్రాహ్మణులున్నా, బ్రాహ్మణేతరులున్నా దళితులపై అణచివేత మరింత పెరుగుతుందన్నారు. బ్రాహ్మణేతరులు కూడా అగ్రవర్ణ హిందువులు కాబట్టి దళితులకేం ఒరగదన్నదే ఈ భావన వెనకున్న చేదు నిజం.

ఆంధ్ర కమ్మ కులస్థుల ఆధిపత్యంలోని జస్టిస్ పార్టీ కొద్దికాలం మాత్రమే బతికి బట్టకట్టకలిగింది. కొత్త రాజకీయ వ్యవస్థలో అంతకంతకూ దళితులకు ప్రాధాన్యత పెరిగిపోతుండటం గమనించి కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మాదిరిగానే జస్టిస్ పార్టీ కూడా దళిత చైతన్యం కోసం ప్రయత్నించింది. మద్రాస్ ప్రెసిడెన్సీలోని అన్ని భాషలకు చెందిన దళితులకోసం వేరువేరు సదస్సులను నిర్వహించేందుకు అది ఆర్థిక సహాయాన్ని

---

40. దక్షిణ భారత ప్రజా సంఘం తో కలిసి మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన దళితేతరులు సౌత్ ఇండియన్ లిబరల్ ఫెడరేషన్‌ను 1916లో స్థాపించారు. వివరాలకు జాయింట్ సెలెక్ట్ కమిటీ ఆన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బిల్, వాల్యూమ్ 3 చూడవచ్చు.

కూడా అందించింది. ఆ సమావేశాలలో ఎన్నికైన దళిత ప్రతినిధులను భారత కార్యదర్శి అయిన మాంటేగ్ మద్రాస్ పర్యటనకు వస్తున్నపుడు ప్రాదేశిక సదస్సులలో పాల్గొనేందుకు ఆహ్వానించింది. ఈవిధంగా దళితులను కాంగ్రెస్ పార్టీ నుంచి దూరం చేసి తమ వైపు తిప్పుకునేందుకు జస్టిస్ పార్టీ తీవ్రంగా ప్రయత్నించింది. దళితుల దయనీయ పరిస్థితిపై వారికి హఠాత్తుగా జాలిపెరగడం, దళితుల డిమాండ్లకు ఎనలేని ప్రాధాన్యత యివ్వడం వెనకున్న కారణాలు సర్వవిదితమే. బ్రాహ్మణుల పట్ల వున్న తమ అక్కసును తీర్చుకోవడం, తమ మతపరమైన ప్రాతినిధ్యాన్ని పెంచుకోవడం కోసమే బ్రాహ్మణ వ్యతిరేకోద్యమం... ముఖ్యంగా కొద్దికాలమే బతికిన జస్టిస్ పార్టీ ఆరాటపడిందనడంలో ఎలాంటి సందేహం లేదు. వాళ్లు చివరికి దళితుల ఐకమత్యాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కూడా ప్రయత్నించారు.[41]

బ్రాహ్మణేతరుల ఈ బూటకపు ప్రేమ 1921లో వాళ్లు అధికారంలోకి వచ్చిన తరువాత బట్టబయలయింది. దళితుల దైన్యస్థితి పట్ల అపార సానుభూతిని ప్రదర్శించిన ఆ పార్టీ ఒక్కసారిగా దళితులను నట్టేట వదిలేసింది. ఈ కారణంగానే దళితులు తమ సమస్యలను పట్టించుకోని ఆ పార్టీకి దూరమై దానికి వ్యతిరేకంగా నినదించారు. స్థానిక బోర్డులలో, శాసన సభల్లో ప్రభుత్వోద్యోగాల్లో తమకు వాళ్లు అన్యాయం చేస్తున్నారంటూ దళితులు మద్రాసు గవర్నరుకు మహజర్లు సమర్పించుకున్నారు.

బడుగువర్గాల సముద్ధరణే బ్రాహ్మణేతర ఉద్యమ లక్ష్యంగా చాటుకోవడం పచ్చి బూటకమని, వారి అసలు ఉద్దేశం బడుగువర్గాలపై బ్రాహ్మణేతర అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని శాశ్వతం చేసుకోవడమేనని స్పష్టమయింది. స్వపరిపాలన రావడం తథ్యమని 1930లలో స్పష్టమవడంతో దళిత నాయకత్వం తమ రాజకీయ విధానాన్ని నిర్వచించుకోవలసిన అవసరం గురించి ఆలోచించడం మొదలుపెట్టింది. మద్రాసు ప్రెసిడెన్సీకి చెందిన ప్రముఖ దళిత నేత యం.సి.రాజయ్య భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వమే కొనసాగాలని అణగారిన వర్గాలు కోరుకోడానికి తమ ఉనికిని, నిలువ నీడను కాపాడుకోవాలన్న తపనే ప్రధాన కారణం అన్నారు.

దళితులు మొదట్లో బ్రాహ్మణేతర ఉద్యమాన్ని గొప్ప ప్రజాస్వామిక ఉద్యమంగా భావించి ఆహ్వానించారు. కానీ ఆ తరువాత ఆ ఉద్యమం వల్ల తమ స్థితిగతుల్లో

41. యం.సి.రాజయ్య మద్రాస్ ప్రెసిడెన్సీలో 'మద్రాస్ ఆది ద్రావిడ మహాజన సభ' పక్షాన దళిత ప్రతినిధి. ఆ తదనంతరం అది ఆల్ ఇండియా ఆది ద్రావిడ మహాజన సభ గా మారింది. 26 ఫిబ్రవరి1929లో స్టాట్యుటరీ కమిషన్ ముందు సమర్పించిన మౌఖిక వాంగ్మూలం. చూ. ఇండియన్ స్టాట్యుటరీ కమిషన్, 1930బి, పార్ట్ 2.

ఆవగింజంత మార్పుకూడా రాకపోవడం, బ్రాహ్మణ ఆధిపత్య పీఠాలపై బ్రాహ్మణేతర అగ్రవర్ణాల వారే తిష్టవేస్తుండటం గమనించి ఆ ఉద్యమానికి దూరమయ్యారు. బ్రాహ్మణేతరుల పాలనలో కూడా తమ బతుకులు బాగుపడవని వారికి స్పష్టంగా తెలిసిపోయింది. లేబర్ డిపార్ట్‌మెంట్‌ని రద్దుచేయడం, 1922లో అంటరానితన వ్యతిరేక చట్టానికి పి.టి. చెట్టియార్ మద్దతు యిచ్చేందుకు నిరాకరించడం వంటి చర్యలు బ్రాహ్మణేతర ఉద్యమం దళితులను రక్షించదని, వారికి ఎలాంటి ప్రయోజనాలు కల్పించదని నిరూపించాయి. తిరునల్వేలిలో జరిగిన ఒక దళిత సదస్సులో శెట్టి, పిళ్లయ్, నాయుడు, రెడ్డి, చౌదరిలకు అవకాశాలు కల్పించేందుకే బ్రాహ్మణులను పక్కకు నెట్టారంటూ తీర్మానం చేశారు. గంజామ్‌కు చెందిన ఒక బ్రాహ్మణేతరుడు జస్టిస్ పార్టీని "ఇన్ జస్టిస్ పార్టీ"గా, పి.టి.చెట్టియార్‌ని 'అసమర్థ నేత'గా అభివర్ణించాడు.

1920ల నుంచీ బ్రాహ్మణేతరులకు రాజ్యాంగ పరమైన గుర్తింపు, పరిపాలనాపరమైన రాయితీలు లభించాయి. శాసన సభల్లో, ప్రభుత్వోద్యోగాల్లో అన్ని రకాల అవకాశాలను పిళ్లయ్, మొదలియార్, రెడ్డి, చెట్టియార్ వంటి హిందూమత దొంతరలో బ్రాహ్మణుల తరువాత స్థానంలో వున్న అగ్ర కులాల వాళ్లే అందిపుచ్చుకున్నారు. బ్రాహ్మణేతర బడుగువర్గాలు మాత్రం అలాగే వెనుకబాటుతనంలో కూరుకుని వుండిపోయాయి. వెనుకబడిన వర్గాల ఈ సమాన వెనుకబాటుతనం కారణంగానే బ్రాహ్మణేతర బడుగువర్గాలలో అసంతృప్తి రాజుకుంది. అది 1932లో వెనుకబడిన కులాల వారిని ఏకం చేసేందుకు బ్యాక్‌వర్డ్ క్లాసెస్ లీగ్ ఏర్పాటునకు దారితీసింది. ఈ నేపథ్యంలో బ్రాహ్మణేతర ఉద్యమం వల్ల దళితప్రజలకు ఎలాంటి ప్రయోజనమైనా లభిస్తుందని ఎవరు ఆశించగలరు?

దళితులుపట్ల సానుభూతిలేని రీతిలో వ్యవహరిస్తున్న జస్టిస్ పార్టీ నాయకత్వ తీరు గురించి ప్రస్తావిస్తూ యం.సి.రాజయ్య [42] ఇలా అన్నారు: "జస్టిస్ పార్టీ మొదట్లో బాగానే పనిచేసిందని అణగారిన వర్గాలు భావించాయి. కానీ ఆ తరువాత దాని నాయకుల స్వార్థ ప్రయోజనాల మూలంగా అది తిరోగమన బాటపట్టింది. న్యాయ సూత్రాలను, ప్రజాస్వామిక ప్రగతి విధానాలను పాటించకుండా రాచరికపు నటనను అది కొనసాగిస్తోంది."

---

42. మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో అణగారిన వర్గాల నేత యం.సి.రాజయ్య (1883–1943) ఆతరువాత ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ అసోసియేషన్‌కు అధ్యక్షులుగా కూడా ఎంపికయ్యారు.

దళితులను కాంగ్రెస్, కమ్యూనిస్టు, బ్రాహ్మణేతర రాజకీయ పార్టీలన్నీ ఉపయోగించుకున్నాయి, కించపరిచాయి, రాజకీయం చేశాయి. తమ ప్రత్యర్థులపై పైచేయి సాధించాలంటే సంఖ్యాబలం వున్న దళితుల మద్దతు కావాలని ఆ పార్టీలు భావించాయి. తమ ప్రయోజనాలకోసమే అవి దళితులను కదిలించాయి. అట్టి ప్రయత్నాలన్నీ దళితులు తమ చైతన్యాన్ని పెంపొందించుకునేందుకు దోహదం చేశాయి. అగ్రవర్ణ హిందూ రాజకీయ పార్టీలు కల్పించిన భ్రమల్లోంచి బయటపడేందుకు తోడ్పడ్డాయి. అందుకే వారు ఏ అగ్రవర్ణ హిందూ పార్టీలోనూ కలవలేదు. తమకు ఒక ప్రత్యేక రాజకీయ గుర్తింపు కోసం వారు పాటుపడ్డారు. అదే ఆంధ్రాలో స్వతంత్ర దళితోద్యమానికి బాటలు వేసింది.

5

దళితోద్యమం

ఆంధ్రాలో అంటే...మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన కోస్తా ఆంధ్ర ప్రాంతం (సర్కారు జిల్లాలు), రాయలసీమ[1]; అలాగే నిజాం రాష్ట్రంలోని తెలుగు మాట్లాడేవారి ప్రాంతమైన తెలంగాణా[2]లో ఇరవైయవ శతాబ్దపు తొలి దశాబ్దాలలోనే దళిత ఉద్యమం తలెత్తింది. ఈ రెండు ప్రాంతాల్లో రెండు విభిన్న ధోరణులతో ఉద్యమం సాగింది. కోస్తా ఆంధ్రాలో స్వయం ప్రపత్తి, సమైక్యతా దృక్పథంతో సాగితే హైదరాబాద్‌లో మొదట రాడికల్, స్వయంప్రపత్తి దృక్పథంతో సాగి ఆ తరువాత ముతాతత్వంవైపునకు మళ్లింది. ఈ ఉద్యమాలు ఒకదాని నుంచి మరొకటి స్ఫూర్తిని, శక్తిని పొందాయి. కోస్తా ప్రాంత దళిత ఉద్యమానికి సువిశాలమైన గ్రామీణ పునాదివుంటే హైదరాబాద్ దళిత ఉద్యమం ముతాతత్వంతో హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి పట్టణ ప్రాంతాలకే పరిమితమయింది. 1906–1939 ఉద్యమకాలంలో దళిత నేతలు భూస్వామ్య వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థలో తమ సేవక స్థాయికి వ్యతిరకేకంగా తిరుగుబాటు చేశారు. అగ్రవర్ణ హిందువులు, కుల వ్యవస్థ– దళితులకు సామాజిక, పౌర సౌకర్యాలు

1. *ఈనాటి ఆంధ్రప్రదేశ్‌లో భౌగోళికంగా మూడు ప్రాంతాలున్నాయి. అవి కోస్తా ఆంధ్ర (మాగాణి భూముల ప్రాంతం), రాయలసీమ (తక్కువ మాగాణి భూముల ప్రాంతం), తెలంగాణ (అలనాటి నిజాం రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే వారి ప్రాంతం). కోస్తా ఆంధ్రలోని తొమ్మిది జిల్లాలు: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం. రాయలసీమ లోని నాలుగు జిల్లాలు: కడప, కర్నూలు, అనంతపూరు, చిత్తూరు.*
   కోస్తా ఆంధ్ర, రాయలసీమ రెండూ వలసవాదపాలనలోని మద్రాస్ ప్రెసిడెన్సీలో అంతర్భాగాలుగా వుండేవి.
2. *తెలంగాణాలో పది జిల్లాలున్నాయి. అవి: ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, నల్గొండ, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, ఖమ్మం, నిజామాబాద్. అలనాటి నిజాం రాష్ట్రంలో లేదా హైదరాబాద్ రాష్ట్రంలో ఇవి కాక రెండు ఇతర భాషా ప్రాంతాలు కూడా వుండేవి. అవి మరఠ్వాడాకు చెందిన 5 జిల్లాలు, కర్ణాటకకు చెందిన 3 జిల్లాలు.*

అందుబాటులోకి రాకుండాచేసి, వారికి ఒక అమానవీయ దుస్థితిని కల్పించాయి.

దళిత చైతన్యం తాలూకు చారిత్రక పరిణామ క్రమాన్ని, దళిత ప్రజాస్వామిక విప్లవప ప్రగతిని, దళిత ఉద్యమ భాగస్వామిక గుర్తింపును విశ్లేషించినప్పుడు దళిత ఉద్యమం అటు సిద్ధాంతపరంగానూ ఇటు నిర్వహణాపరంగానూ గత సంస్కరణోద్యమాల కంటే ఎంతో భిన్నమైనదని స్పష్టమవుతుంది. ఒకవిధంగా ఆది-ఆంధ్ర మహాసభ ఎదుగుదల వలసవాద ఆంధ్ర ప్రాంతంలో బ్రాహ్మణేతర/బ్రాహ్మణ వ్యతిరేక సిద్ధాంత విస్తరణనూ, సామాజిక తీవ్రవాదాన్నీ సూచిస్తుంది. ఆది ఆంధ్ర మహాసభ కుల ఆధిపత్య దొంతరపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. హేతువాదం, మానవతావాదం ప్రాతిపదికగా ప్రజా ఐక్యతకోసం కృషి చేసింది. దళిత ఉద్యమం కింది కులాల్లో రూపుదిద్దుడుంటున్న సంఘీభావాన్నీ, తరతరాల సాంప్రదాయిక నిర్బంధ కులవృత్తుల పట్ల పెరుగుతున్న వ్యతిరేకతనీ, నూతన అధికార వ్యవస్థల ఆవిర్భావాన్నీ సూచిస్తుంది. కమ్మ, రెడ్డి మహా జనసభల వంటి అగ్రవర్ణ హిందువుల ఉద్యమాలు వ్యవస్థలో అంతర్భాగంగా పైపై మార్పుల కోసం మాత్రమే పోరాడితే - దళితోద్యమం సిద్ధాంతపరంగా సమాజంలో సమూలమైన, వ్యవస్థాపరమైన మార్పుకోసం పోరాడింది. మరోవిధంగా చెప్పాలంటే ఏదో కొద్దిపాటి సర్దుబాట్లకు ఉద్దేశించిన అగ్రవర్ణాల సంఘ సంస్కరణోద్యమాలు, కుల సంస్కరణోద్యమాల మాదిరిగా కాకుండా దళిత ఉద్యమం బాగా పాతుకుపోయిన సామాజిక అవ్యవస్థను, విలువల విధానాన్ని, దుర్మార్గమైన పెత్తందారీ కులవ్యవస్థను మొత్తంగా సవాలు చేసింది. వలసవాద ఆంధ్రాలో దళిత మేధావులు రూపొందించిన విముక్తి సిద్ధాంతం హెచ్చుతగ్గులతో కూడిన కుల వ్యవస్థను, వివక్షను, అణచివేతను సమూలంగా నిర్మూలించేందుకు ఉద్దేశించబడింది.

దళిత ఉద్యమం ప్రధాన లక్ష్యం బ్రాహ్మణీయ హిందూత్వ భావజాలాన్ని చీల్చి చెండాడటం, ప్రత్యామ్నాయాల ద్వారా అగ్రవర్ణ సాంస్కృతిక ఆధిపత్య విధానాలను ఎదురించడం. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వ సాధనకోసం దళిత ప్రజలను సంఘటితపరిచేందుకు కూడా అది పాటుపడింది.

ప్రజాస్వామికీకరణ అనేది పెరిగినాకొద్దీ వివిధ రాజకీయ రంగాలలో దళితుల ప్రాధాన్యత, వారి ప్రమేయం కూడా పెరుగుతూ వచ్చాయి. తమ అభివృద్ధి కోసం, రాజకీయాధికార సాధనకోసం దళితులు సహజంగానే తమ వ్యవస్థీకృత శక్తిని ప్రోదిచేసుకున్నారు. తమ రాజకీయ డిమాండ్లను సాధించుకునేందుకు వారు సొంత సంఘాలను నెలకొల్పుకున్నారు. సమాజంలోని వివిధ సామాజిక-వ్యవస్థాపరమైన పరిస్థితుల పరస్పర చర్యల చారిత్రక ప్రక్రియలోంచి దళిత ఉద్యమం ఆవిర్భవించింది.

ఏ సామాజిక ఉద్యమమైనా అప్పటి పరిస్థితుల పట్ల అవగాహన, ఆ పరిస్థితులను సమూలంగానో పాక్షికంగానో మార్చాలన్న ప్రబలమైన కోరిక, సామాజిక చైతన్యం వున్న భాగస్వాముల సంఖ్య మీద ఆధారపడివుంటుంది. సిద్ధాంతం, నాయకత్వం, నిర్దిష్ట లక్ష్యాలు, ఆ లక్ష్యాల సాధనకు అవసరమైన వ్యూహాలు, సంఘటిత వ్యవస్థ మొదలైనవి ఆ సామాజిక ఉద్యమానికి స్పష్టమైన రూపునిస్తాయి. ఒక సంఘం ప్రజానీకాన్ని చైతన్యపరిచే విధానం, తన కార్యకలాపాలను సమన్వయపరచుకునే తీరును బట్టి సామాజిక ఉద్యమంలో ఆ సంఘానికి ప్రమేయం వుంటుంది. అందుకే ఆంధ్రాలో దళిత విమోచనోద్యమం అనేక సంఘాల ఆవిర్భావానికి నాంది అయింది. ఆ సంఘాల ద్వారా హేయమైన అంటరానితనమనే దురాచారం మీద నలువైపులా దాడి చేసేందుకు దళితులను సంఘటితపరచే కృషి కొనసాగింది.

ఈ అధ్యాయంలో ప్రధానంగా – ఉద్యమ స్వభావం, దాని సిద్ధాంతం, దృక్పథం, నిర్మాణ ప్రాతిపదికత, స్వరూపం, వివిధ దళిత సంఘాలు చేపట్టిన విభిన్న కార్యక్రమాలు, జన చైతన్యంకోసం అనుసరించిన పద్ధతులు, ఉద్యమ రీతులు వంటి అంశాలను చర్చించడం జరిగింది.

తొలి స్ఫూర్తి : హైదరాబాద్‌లో అంకురార్పణ దశ

వలసవాద పాలన చివరి దశలో నిజాం ప్రాంతంలో ఒక సరికొత్త శక్తి ఆవిర్భవించింది. అణగారిన బహిష్కృత వర్గాలలో చైతన్యం పెరిగి ఈ ప్రాంతమంతటా అనేక సంఘాలు ఆవిర్భవించాయి. ఆ కాలంలో ఏర్పడిన ప్రాథమిక పరిణామాలలో అణగారిన కులాల నుంచి చైతన్యం, రాజకీయ స్పృహ వున్న ఒక నవీన వర్గం తెరమీదకు వచ్చింది. ఇరవైయవ శతాబ్ది ప్రారంభం నుంచీ అణగారిన కులాల్లోని ఆక్రోశం, అసహనాలను వ్యక్తీకరించే అనేక సామాజిక సంస్థలు ఏర్పడ్డాయి. ఈ దశలో కనిపించే మరో ముఖ్య లక్షణం ఏమిటంటే అణగారిన కులాలలోని మేధో వర్గానికి ప్రతిగా సమస్యల తీవ్రతను తగ్గించే లక్ష్యంతో ఆర్య సమాజ్, బ్రహ్మ సమాజ్ సిద్ధాంతాలు చొచ్చుకురావడం. భాగ్యరెడ్డి వర్మ (1888–1939) ఈ ప్రాంత దళితోద్యమానికి పునాది వేశారు.[3] ఆయన అగ్రవర్ణ హిందూ సంస్థలతో ప్రత్యేకించి

3. భాగ్యరెడ్డి వర్మ అసలు పేరు మాదారి భాగయ్య. ఆయన మాదారి వెంకయ్య, రంగమాంబ దంపతులకు రెండో సంతానంగా 22 మే 1888న జన్మించారు. మొదట్లో ఒక గోవా కాథలిక్ కుటుంబానికి సేవకుడిగా పనిచేశారు. ఆ తరువాత విద్యుత్ శాఖలో ఎలక్ట్రీషియన్‌గా కొంతకాలం పని చేశారు. ఆ పిదప లాల్‌జీ మేగ్జీ స్థాపించిన జీవరక్షామండలిలో ఒక ప్రబోధకుడిగా సేవలందించారు. వారి కుటుంబ గురువు

బ్రహ్మ సమాజంకతో కలిసి పనిచేశారు. ఆయన సిద్ధాంతాలపై, కార్యాచరణపై బ్రహ్మసమాజ ప్రభావం తీవ్రంగా వుండేది. అయినప్పటికీ ఆయన స్థాపించిన సంస్థలకు అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలన్న గుర్తింపు వుంది. అణగారిన కులాలలను తమ ప్రాబల్యం కిందనే కొనసాగేట్టు చూసుకోవాలనే అగ్రవర్ణ హిందూ సంస్థలకు అవి సన్నిహితంగా కూడా వుండేవి.

హైదరాబాద్‌లో దళిత ఉద్యమం మాదారి భాగ్యరెడ్డి వర్మ 1906లో "జగన్ మిత్ర మండలి"[4] ని ఏర్పాటు చేయడంతో అంకురార్పణ జరిగింది. అంటరానివాళ్లుగా పరిగణింపబడే జనంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఆ సంస్థ పాటుపడింది. ఆయన క్రమబద్ధంగా హరికథా కాలక్షేపాలు ఏర్పటుచేసేవారు. వాటికి ప్రారంభంలోనో, ముగింపు సమయంలోనో ఆయన దళితులనుద్దేశించి అనర్ఘళంగా మాట్లాడేవారు. దళితులే ఈ దేశపు మూలవాసులు, మిగతావాళ్లంతా పొట్ట చేతపట్టుకుని మధ్య ఆసియానుంచి వలస వచ్చిన వాళ్లు, అజ్ఞానం అవిద్య కారణంగానే దళితులు వెనుకబాటుతనానికి గురయ్యారు అంటూ ఉద్భోధించేవారు. ఆ సంస్థ మత్తుపదార్థాలకు దూరంగా వుండేవారికే పరిమితమయింది. జగన్ మిత్ర మండలి కార్యకలాపాలు దాని పేరుకు తగినట్టుగా వుండేవి. నిరుపేదలకు నిరక్షరాస్యులకు అది నిజమైన మిత్రుడిగా వ్యవహరించేది. అంటరానివాళ్లకు వారిని చుట్టుముట్టి వున్న సామాజిక రుగ్మతల పట్ల అవగాహన కలిగించేందుకు కృషి చేసేది. ఆ సంస్థ సభ్యులు బుద్ధుడిని నమ్మేవారు. వైదిక ధర్మానికి, వర్ణ వ్యవస్థకు, జంతుబలులకు వ్యతిరేకంగా సాగిన బౌద్ధ ధర్మాన్ని వారు ఆరాధించేవారు. శాకాహారాన్ని ప్రచారం చేసేవారు. 1913 నుంచి 1938 వరకు వారు వైశాఖ పౌర్ణమి నాడు బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహిస్తూ వచ్చారు.[5] తమ హరికథా కాలక్షేపాల ద్వారా వాళ్లు అంటరాని వాళ్ల దుర్భర స్థితి

ఒక శైవమతస్థుడైన మేధావి. ఆర్యులు బతుకుదెరువుకోసం భారతదేశానికి రాకముందు నేటి అంటరానివాళ్లు పాలకులుగా వుండేవారన్న చారిత్రక సత్యాన్ని వారినుంచే గ్రహించారు. (ఈ వాస్తవం నుంచే దళితులు ఈ దేశ మూలవాసులన్న భావన రూపుదిద్దుకుంది.) రెడ్డి అన్న పదం రేడు అంటే పాలకుడు అన్న పదంలోంచి వచ్చింది. ఈ కారణంగానే తన పేరు చివరన రెడ్డి అన్న పదం వుండటం సముచితమని భావించారు. ఆవిధంగా భాగ్యరెడ్డి గా మారారు. ఆతరువాత 1913లో ఆర్య సమాజ్ వార్షిక సదస్సులో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ప్రదానం చేశారు. దాంతో ఆయన పేరు భాగ్యరెడ్డి వర్మగా మారింది.

4. *భాగ్యరెడ్డి వర్మ వ్యవస్థాపక అధ్యక్షులుగా జగన్ మిత్రమండలి ఏర్పడిందనే అంశంపై వివాదం వుంది.*
5. *భాగ్యరెడ్డి వర్మ కుమారుడు యం.బి.గౌతమ్‌తో జరిపిన ఇంటర్వ్యూ.*

గురించి, హిందూమతంలోని వంచనాత్మకతే సమస్త సామాజిక రుగ్మతలకు మూలకారణమనే విషయం గురించి ప్రబోధించేవారు. అంటరానివాళ్లందరితో తరచూ ప్రీతి భోజనం అనే సహపంక్తి భోజనాలను ఏర్పాటుచేస్తుండేవారు. ఆ కార్యక్రమం అందరం ఒకటే, అందరూ సమానులే అన్న భావనను పెంపొందించేది. తమ సహోదరుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు పోరాడాలన్న స్పృహను కలిగించేది.

భాగ్యరెడ్డి వర్మ 1911లో "మన్య సంఘం"ను స్థాపించారు. దాని ద్వారా మద్యపాన వ్యసనం, జంతుబలులు, దేవాలయాలలో దురాచారాలు, బాల్య వివాహాలు మొదలైనవాటి నిర్మూలనకు కృషి చేశారు. మన్య సంఘం ప్రధాన లక్ష్యాలు ఇలా వుండేవి:

1. అంటరాని కులాలలకు చెందిన పిల్లలకు చదువు చెప్పించడం.
2. బాల్య వివాహాలను నిరసించడం.
3. వివాహాది శుభకార్యాలలో మాంసాహారం, మత్తుపానీయాలు నిషేధించడం.
4. ఆయా కులాల్లో జోగినీ, ముర్లి, బసివి వంటి పేర్లతో పిలువబడే దేవదాసీ దురాచార నిర్మూలన.

1913 జనవరి 13న జరిగిన జనరల్ కమిటీ సమావేశంలో తమ లక్ష్య సాధనకు కృషిచేసేందుకు గాను ఆ సంఘం ఒక కార్యనిరాహక వర్గాన్ని ఎన్నుకుంది.[6] మన్య సంఘం వెల్లటి శేషయ్య అనే బిల్డింగ్ కాంట్రాక్టర్‌తో పాటు జక్కుల ముత్తయ్య అనే బేకరీ యజమాని, సూపరింటెండెంట్ వెంకటరత్నం, ప్రజా పనుల విభాగంలో పనిచేసే ఎం.ఎల్. ఆదయ్య, తదితర హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ ఉద్యోగులతో ఏర్పడింది. భాగ్యరెడ్డి వర్మ కార్యకలాపాల ప్రభావం హైదరాబాద్ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై చాలా బలంగా వుండేది. ఆయన స్ఫూర్తితో, ఆ సంఘ లక్ష్యాలతో వివిధ ప్రాంతాల్లో మరెన్నో సంఘాలు ఆవిర్భవించాయి.[7] వారిదొ విలక్షణమైన బృందమని చెప్పవచ్చు. అందులోని సభ్యులు ప్రధానంగా మాల కులానికి చెందినవారు. కొత్తగా రూపుదిద్దుకుంటున్న దళిత మధ్య తరగతికి అది ప్రతీకగా వుండేది. వారు పెద్దగా

---

6. *ఎగ్జిక్యూటివ్ కమిటీలో వెల్లటి శేషయ్య అధ్యక్షులుగా, హెచ్.ఎస్.వెంకటరామ్ ఉపాధ్యక్షులుగా, జె.ఎస్. ముత్తయ్య కార్యదర్శిగా, హెచ్.ఎస్. శివరామ్ కోశాధికారిగా, యం. భాగ్యరెడ్డి వర్మ కార్యనిర్వాహక కార్యదర్శిగా వుండేవారు.*
7. *ఘాస్‌మండిలో మన్య సంఘం గా పిలువబడే సంఘాన్ని మాదారి ఆదెయ్య నెలకొల్పినట్టు వెంకటస్వామి పేర్కొన్నారు.*

చదువుకున్న వారు కాకపోయినా ఆ సంఘంలోని చైతన్యవంతులైన యువతరం సంఘ సంస్కరణకు నడుం బిగించింది.

అదేకాలంలో భాగ్యరెడ్డి వర్మతో పాటు అరిగే రామస్వామి అనే మరో నాయకుడు కనిపిస్తారు.[8] ఘాస్‌మండిలో మాదారి ఆదెయ్య అనే ఓ వంటమనిషి కొడుకు ఇంకో మన్య సంఘాన్ని ఏర్పాటుచేశాడు. అరిగే రామస్వామి తానుండే సికింద్రాబాద్‌లోని కుమ్మనగూడలో "సునీత బాల సమాజం"ను స్థాపించి తమ కార్యకలాపాలకను కొనసాగించారు. ఆయన మద్యపాన వ్యసనం, జోగినీ వ్యవస్థ ల నిర్మూలన గురించి కృషి చేశారు. జంతుబలికి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. రామస్వామి అచల సిద్ధాంతం, బ్రహ్మసమాజ సిద్ధాంతంను నమ్మినప్పటికీ దళితులు వేరు- హిందువులు వేరు అని భావించేవారు. 1922లో ఆయనే "ఆది హిందూ జాతీయోన్నతి సభ" ను స్థాపించారు. దానికి కొండా వెంకటస్వామి అధ్యక్షులుగా, జె.పాపయ్య, అరిగే రామస్వామి ఉపాధ్యక్ష కార్యదర్శులుగా వుండేవారు. ప్రారంభం నుంచే దానికి ఎంతో ప్రజా మద్దతు లభించింది. ఆది హిందూ సామాజిక సేవా సంస్థకు ప్రత్యామ్నాయ సంస్థగా పేరు సంపాదించుకుంది. ఆ తరువాత ఎంఎల్ ఆదెయ్య "సంఘాభివృద్ధి సమాజం" అనే మరో సంస్కరణవాద సంఘాన్ని ఏర్పాటుచేశారు. అది సంఘ సంస్కరణను ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ వారు ప్రజలకు అన్ని విషయాలలో చేదోడువాదోడుగా వుంటూ, వివాహాది సాంప్రదాయిక ఉత్సవాలలో వారికి సహాయ సహకారాలు అందిస్తూ వారిలో సామాజిక స్పృహను పెంపొందించేందుకు కృషిచేసేవారు.

భాగ్యరెడ్డి వర్మ 1932లో 35 మంది దళిత కార్యకర్తలతో ఒక స్వస్తిదళ్‌ను ఏర్పాటు చేశారు. స్వస్తిదళ్ ప్రధాన లక్ష్యం జంతువుల పట్ల క్రౌర్యాన్ని రూపుమాపడం. ఆయన దానికి పూర్తికాల ప్రభోధకుడిగా వుండేవారు. అది మానవతా సామాజిక సూత్రాలతో తన కార్యకలాపాలను కొనసాగించింది. ఒకవిధంగా రెడ్‌క్రాస్ సొసైటీ మాదిరిగా పనిచేసింది. బౌద్ధ ప్రతీక అయిన పసుపురంగు స్వస్తిక్ ఆ దళ్‌కు చిహ్నంగా వుండేది.

---

8. అరిగే రామస్వామి (1885-1973) రంగారెడ్డి జిల్లా రామన్‌కోలలో జన్మించారు. ఆయన తండ్రి సికిందరాబాద్‌లో టాంగా నడిపేవారు. రామస్వామిని సికిందరాబాద్ బాప్టిస్ట్ మిషన్ స్కూల్లో చేర్పించారు కానీ పేదరికం వల్ల చదువును కొనసాగించ లేకపోయారు. ఆయన తన సహోదరులతో కలిసి సంఘ సంస్కరణ కార్యక్రమాల్లో పాల్గొనడం మొదలు పెట్టక ముందు ఆఫీస్ బాయ్‌గా, వడ్రంగి పనివాడుగా, బొలారం రైల్‌రోడ్‌లపై టికెట్ కలెక్టర్‌గా పనిచేశారు.

హైదరాబాద్‌లోనూ చుట్టుపక్కలి ప్రాంతాలలోనూ ప్లేగ్, కలరా వ్యాధులు ప్రబలినప్పుడు ఉత్సాహవంతులైన దళ్ కార్యకర్తలు త్యాగనిరతితో గణనీయమైన సేవలు అందించారు. 1925లో మరోసారి హైదరాబాద్‌లో ప్లేగ్ మహమ్మారి విజృంభించింది. కుటుంబసభ్యులు వదిలేయడంతో ఏకాకులైపోయిన అనేకమంది రోగులకు స్వస్తిదళ్ కార్యకర్తలు ఎంతో ఉదారంగా సేవలు అందించారు. అనాథ శవాలకు దహన సంస్కారాలు నిర్వహించారు. వారి కృషికి, మానవత్వంతో సకాలంలో స్పందించిన తీరుకు సర్వత్రా ప్రశంసలు లభించాయి.[9] ఆ సంస్థ కార్యకర్తలు ఇతర సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు కూడా తమ సేవలు అందించేవారు. భారత జాతీయ కాంగ్రెస్ కాకినాడలో నిర్వహించిన సదస్సులోనూ, గుడివాడలో జరిగిన గోసభలోనూ వారు ఆవిధంగా తమ సేవలు అందించారు.

పై సంఘాల కార్యకలాపాల ద్వారా తొలినాళ్లలో దళితులలో రూపుదిద్దుకున్న చైతన్యం, వారి స్ఫూర్తిదాయకమైన కృషి స్పష్టమవుతుంది. 1906-1916 మధ్యకాలంలో దళిత సాంస్కృతిక కార్యకలాపాలు ముఖ్యంగా భజన మండలి, హరికథలు హైదరాబాద్ అంతటికీ విస్తరించాయి. భాగ్యరెడ్డి వర్మ తెలంగాణ ప్రాంతమంతటా తిరుగుతూ అనేక సభల్లో ప్రసంగిస్తూ అంటరానివాళ్ల మనసుల్లో తిరుగుబాటు బీజాలు నాటారు. అనేక భజనమండలి కార్యక్రమాలా ద్వారా, ఆదిహిందూ స్వచ్ఛంద సంస్థ (స్వస్తిదళ్) కార్యకలాపాల ద్వారా, అగ్రవర్ణ హిందూ మానవతావాదులతో సన్నిహిత సంబంధాల ద్వారా దళితులు దేవదాసీ/బసివి/జోగినీ వంటి సామాజిక దురాచారాల నిర్మూలన, మద్యపాన వ్యసనం వంటి విషయాల్లో చాలా వరకు విజయం సాధించగలిగారు.

ఈ నాయకుల సామాజిక సేవా స్ఫూర్తి, నాయకుల ఒప్పించి మెప్పించే మాటకారి తనం రాష్ట్రంలోని ఆది హిందూ సామాజిక సేవా సంస్థతో[10] పనిచేసే అగ్రవర్ణ హిందువులను ఆకట్టుకుంది. ఆ సేవా సంస్థలో హైకోర్టు న్యాయమూర్తి సి.బాలకుముద్, జైనుడైన సేఠ్ ఘన్‌శ్యామ్‌జీ, జాగిర్దారూ మానవతామూర్తీ అయిన ధరమ్ వీర్, వామన్ నాయక్ వంటి ప్రముఖులు వుండేవారు. అనతికాలంలోనే భజన మండలులు నగరంలో

---

9. స్వస్తిదళ్ కార్యకలాపాలను అభినందిస్తూ నిజాం ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అధ్యక్షులు సర్ అలీ ఇమామ్, ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. దక్కన్ హ్యూమనిటేరియన్ లీగ్ వారు భాగ్యరెడ్డి వర్మకు ఆయన చేస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా బంగారు పతకాన్ని, మిగతా కార్యకర్తలకు రజిత పతకాలని ప్రదానం చేశారు.

10. ఇక్కడ ప్రత్యేకంగా గమనించాల్సింది– ఈ లీగ్ సలహా మండలిలో అందరూ అగ్రవర్ణ హిందువులే సభ్యులుగా వుండటం.

వాడవాడలకు విస్తరించాయి. కరపత్రాలు, ఉపన్యాసాల ద్వారా నాయకులు భజనమండలి కార్య కలాపాలను విస్తృతంగా ప్రచారం చేశారు. వారు తమ సభ్యుల సౌకర్యం కోసం పఠనాలయాలను ఏర్పాటు చేసి వాటిలో దినపత్రికలను అందుబాటులో వుంచేవారు. ప్రతి యేటా బుద్ధ జయంతిని పెద్ద ఎత్తున నిర్వహించేవారు. అదేవిధంగా నందనార్, చోకమేళా, నర్సిమెహతా మొదలైన ఇతర మహనీయుల జయంతులను కూడా నిర్వహించేవారు. దళిత ప్రజానీకంలో సాంస్కృతిక, ఆర్థిక మార్పును తెచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని వారు భావించారు. దళితుల మధ్య వున్న అనైక్యత, బేధభావాలను రూపుమాపి అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చేందుకు, సహజీవనంతో ముందుకు సాగేందుకు కూడా ఈ కార్యక్రమాలు దోహదపడతాయని విశ్వసించేవారు. కొత్త ఆలోచనలను, విలువలను జనానికి అలవడేట్టు చేస్తాయని కూడా భావించేవారు. సామాజికీకరణ కేవలం సంఘాల ద్వారానే సాధ్యమవుతుందనే అంశాన్ని గ్రహించి వారు తమ కార్యకలాపాలను ఒక్క హైదరాబాద్ నగరానికే పరిమితం చేయకుండా కోస్తా ఆంధ్ర ప్రాంతానికి కూడా విస్తరించారు.

1920,1930లలో ఆది ఆంధ్ర ఉద్యమం

ఆది ఆంధ్ర అన్న పదం 1917కు ముందే వాడుకలోకి వచ్చింది. ద్రావిడోద్యమ, ఆర్యేతర ఉద్యమాల ప్రభావంతో దళితులు తమను తాము ఆది-ద్రావిడ, ఆది-ఆంధ్ర, ఆది-కర్ణాటక అని పరిగణించుకుంటూ ఈ ప్రాంతపు అసలు మూలవాసులుగా చాటుకోవడం ప్రారంభించారు. హైదరాబాద్‌లో పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తుంది. ఇక్కడి సంఘాలు ఆది హిందూ అన్న భావనను స్వీకరించాయి. 1911లో భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్‌లో ఆది హిందూ సామాజిక సేవా సమాఖ్యను ఏర్పాటు చేశారు. అయితే 1921 వరకు అది మన్య సంఘంగా వ్యవహరించమడింది. ఆది హిందూ మహాసభ మొదట్లో ఆది హిందూ జాతీయోన్నతి సభగా 1922లో ఉనికిలోకి వచ్చింది. ఆది ద్రావిడ మహాసభ 1890లో ఏర్పడింది. అయితే అప్పుడు దానిని పరయ మహాజనసభ అనేవారు. ఆకాలంలోనే మద్రాస్‌లోని అంటరానివాళ్లు తమను కొత్త పేరుతో గుర్తించాలంటూ ప్రభుత్వానికి మహజర్లు సమర్పించారు. మద్రాస్‌లో రాజ్యాంగ సమావేశాలు జరిగినప్పుడు మాంటేగ్‌కు సమర్పించిన తమ డిమాండ్లను వారు ప్రస్తావించారు: “మమ్మల్ని ఆది ద్రావిడులుగా లేక అసలు ద్రావిడులుగా గుర్తించాలి. తద్వారా ద్రావిడులుగా పిలువబడుతున్న బ్రాహ్మణేతరులతో సమానులుగా

పరిగణించాలి".[11] ఆ తదనంతరం దక్షిణ భారతదేశంలో పంచములుగా లేదా పరయాలుగా వ్యవహరించబడుతున్న ప్రాచీన ద్రావిడ సమాజాన్ని ఇకనుంచీ తమిళ ప్రాంతంలో ఆది ద్రావిడులుగా, తెలుగు జిల్లాల్లో ఆది ఆంధ్రులుగా వ్యవహరించాలనీ ప్రభుత్వ రికార్డులనుంచి పంచములు, పరయాలు అన్న పదాలు తొలగించాలనీ లెజిస్లేటివ్ కౌన్సిల్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది.[12] ఈ ఆది సిద్ధాంత ప్రభావం ఉత్తర భారతదేశంలోని చమర్లమీద కూడా పనిచేసింది. వారు తమను చర్మకార్‌లుగా పరిగణించాలంటూ అదే కాలంలో కోరారు. తమను పీడిత వర్గంగా, ఓడించబడిన అసలు మూలవాసులుగా అభివర్ణించుకున్నారు. కొంతవరకైనా చదువుకున్న దళితుల మూలంగా, దక్షిణాది అంతటా పెల్లుబికిన రాడికల్ దళితోద్యమాల వల్ల ఆది సిద్ధాంతానికి బాగా ప్రాచుర్యం లభించింది. పెద్ద సంఖ్యలో అంటరానివాళ్లు తమను తాము ఆది ద్రావిడులుగా, ఆది ఆంధ్రులుగా సంబోధించుకోవడం, పేరు మార్చుకోవడం కనిపిస్తుంది. 1921-1931 మధ్యకాలంలో అంటరానివాళ్ల సంఖ్యలో ఆశ్చర్యకరమైన తేడాలు కనిపిస్తాయి. 1921లో 14,93,000 గా వున్న మాలల సంఖ్య 1931 జనాభా లెక్కల నాటికి 8,39,000కు పడిపోయింది. అదేవిధంగా 1921లో 7,37,000గా వున్న మాదిగల సంఖ్య 1931 నాటికి 6,12,000కు తగ్గిపోయింది. అంటే 6,65,000కు పైగా మాల మాదిగలు ఆది ఆంధ్రుల అన్న కొత్త గుర్తింపును పొందారన్నమాట.[13]

కోస్తా ఆంధ్రాకు సంబంధించినంతవరకు 1917 నిర్ణాయాత్మక సంవత్సరం. ఆయేడు అగ్రవర్ణ హిందూ సంస్కరణవాది గూడూరు రామచంద్రరావు[14] బెజవాడలో ఒక సభను నిర్వహించారు. అది మొట్టమొదటి ప్రాదేశిక పంచమ సదస్సుగా పేరుపొందింది. సువిశాలమైన మైలవరం రాజయ్య నాటక మందిరంలో 1917 నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు ఆ సదస్సు జరిగింది. భాగ్యరెడ్డి వర్మ ఆ సభను నిర్వహించారు. సుంద్రు వెంకయ్య ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా వ్యవహరించారు. సదస్సు మొదటి రోజునాడే తన అధ్యక్షోపన్యాసంలో భాగ్యరెడ్డి వర్మ అంటరానివాల్లపై అగ్రవర్ణ హిందువుల

---

11. మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ప్రొసీడింగ్స్, 4వ భాగం (20 జనవరి1922).

12. మద్రాస్ ప్రభుత్వ న్యాయ (సాధారణ) శాఖ ప్రొసీడింగ్స్‌ను జి.ఓ.నెం. 817 తేదీ :25 మార్చి 1922.

13. భారత జనాభా లెక్కలు 1931, 14వ సంపుటి, మద్రాస్ 1వ భాగం.

14. అయ్యదేవర కాళేశ్వర రావు, వేమూరి రాంజీరావు, మాడపాటి హనుమంతరావు, వెల్లంకి కృష్ణారావు వంటి అగ్రవర్ణ హిందువులతో కలిసి గూడూరు రామచంద్రరావు అంటరానివాళ్ల అభివృద్ధికోసం పాటుపడ్డారు.

దురాగతాలను ప్రస్తావించారు. అనంతరం అసలు అంటరానివాళ్లే ఈ దేశపు మూలవాసులనీ వారిని పంచములుగా పేర్కొనేందుకు వీలు లేదనీ, ఇకనుంచి వాళ్లని ఆది ఆంధ్రులగా పరిగణించాలనీ ఉద్ఘాటించారు. ఆనాటి నుంచే కోస్తా ఆంధ్ర ప్రాంతంలో సాగిన దళిత ఉద్యమం ఆది ఆంధ్ర ఉద్యమంగా పరిగణించబడుతూ వచ్చింది. పంచమ అనే పదం పురాణాల్లోగానీ మరే ఇతర హిందూ ధర్మ శాస్త్రాల్లో గానీ కనిపించదనీ, అంటరానివాళ్లే ఈ దేశ మూలవాసలనీ, వాళ్లే ఒకప్పటి ఈ దేశ పాలకులనీ భాగ్యారెడ్డి వర్మ సదస్సులో గట్టిగా వాదించారు. దాంతో ఆ మరుసటిరోజే సభా ప్రాంగణంలోని బ్యానర్లన్నీ "ఆంధ్రదేశ తొలి ఆది ఆంధ్ర సదస్సు"గా మారిపోయాయి. ప్రతినిధులంతా పంచమ పదాన్ని ముక్తకంఠంతో తిరస్కరించారు.

ఆ సదస్సులో మొత్తం 18 తీర్మానాలు ఆమోదించారు. వాటిలో ప్రభుత్వ బావులను, పాఠశాలలను, సత్రాలను వాడుకునేందుకు అనుమతించడం, స్థానిక సంస్థలకు, శాసన మండళ్లకు ఆది ఆంధ్రులను నామినేట్ చేయడం, ఆది ఆంధ్ర పిల్లల చదువుకోసం స్థానికంగా ఉచిత పాఠశాలలు తెరవడం వంటివి వున్నాయి. ఆ తీర్మానాలేమీ వివాదాస్పదమైనవి కాకపోయినా కులపరమైన ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ప్రతినిధులకు పట్టణంలో వసతి దొరకడమే కష్టమైపోయింది.[15] సదస్సు జరిగిన మూడు రోజులు ఆది ఆంధ్రులు ఎక్కడ చొచ్చుకు వస్తారో అని సుప్రసిద్ధ కనకదుర్గ దేవాలయాన్ని మూసివేశారు. ఆ సదస్సులో పాల్గొనేందుకు అన్ని ప్రాంతాలనుంచీ ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణాల నుంచి వేల సంఖ్యలో ప్రతినిధులు వచ్చారు. సదస్సులో సంఘ నియమావళిని రూపొందించారు. జిల్లా, తాలూకా, ప్రాంత స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ తదనంతరం ప్రతి సంవత్సరం వార్షిక సదస్సులను నిర్వహిస్తూ వచ్చారు.

ఆది ఆంధ్ర ఉద్యమం 1917-47 మధ్యకాలంలో దళిత వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి మీదా వారి భూ, విద్యా, ఉపాధి, చట్ట సభల్లో ప్రాతినిధ్య సమస్యల మీద దృష్టిని కేంద్రీకరించింది. ఆంధ్ర ప్రాంత దళిత ఉద్యమాన్ని రెండు దశలుగా చూడవచ్చు. 1917-1932 మొదటి దశ కాగా 1932-1950 రెండో దశ. మొదటి దశలో దళితులు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలకూ సిద్ధాంతాలకూ అతీతంగా తమకు తాము సంఘటితమయ్యేందుకు జరిగిన ప్రయత్నాలు కనిపిస్తాయి. తొలిదశలో అగ్రవర్ణ హిందూ ఉదార వాద వ్యక్తుల నుంచి వారికి సానుభూతి, సానుకూల స్పందన

15. గూడూరు రామచంద్రరావు వంటి అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తలు ప్రతినిధుల వసతి కోసం అదే రోజు సాయంత్రం పట్టుబట్టి టౌన్‌హాల్ తలుపులు తెరిపించారు.

లభించింది. రెండో దశలో దళిత ఉద్యమానికీ జాతీయవాద, వామపక్ష ఉద్యమానికి మధ్య పరస్పర సంబంధాలు చోటుచేసుకున్నాయి. ఈ దశలో దళిత వర్గాలలో తమ హక్కుల గురించిన చైతన్యం, అంటరానితనం, వివక్షల పట్ల ఆగ్రహం రూపుదిద్దుకున్నాయి. రాజకీయ హక్కుల కోసం, కనీస మానవ హక్కుల కోసం గట్టిగా డిమాండ్ చేయడం కనిపిస్తుంది.

ఆది ఆంధ్రమహాసభ సదస్సుల్లో[16] ఉచిత విద్యను డిమాండ్ చేస్తూ; పుస్తకాలూ, తిండి, బట్టల ఖర్చును తట్టుకునేందుకు ఉపకార వేతనాల మంజూరును కోరుతూ; ఆడపిల్లలకూ మగపిల్లలకూ వేరువేరు వసతి గృహాలను నిర్మించాలంటూ; దళిత విద్యార్థులను చేర్చుకోడానికి నిరాకరించే విద్యాలయాలకు ప్రభుత్వ నిధుల మంజూరును నిలిపివేయాలనీ వాటి గుర్తింపును రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ;[17] దళిత యువతకు ఉపాధి కల్పించాలని కోరుతూ; దళిత వర్గాల ప్రయోజనంకోసం వృత్తి విద్యా సంస్థలనూ కుటీర పరిశ్రమలనూ తెరవాలంటూ; దళితులకు ప్రభుత్వ బంజరు భూములను పంచాలంటూ; దళితులను ప్రభుత్వ బావులు, చెరువులనుంచి నీళ్లు తీసుకోకుండా దేవలయాలూ సత్రాలూ హోటళ్లూ మొదలైనవాటిలో అడుగు పెట్టనివ్వకుండా ఆటంకపరిచే అగ్రవర్ణ హిందువులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అనేక తీర్మానాలను చేశారు. వివిధ దళిత వర్గాలన్నీ కలిసి మెలిసి ఐకమత్యంగా వుండాలంటూ కూడా ఆంధ్ర మహాసభ పిలుపు నిచ్చింది.

1917-1937 మధ్యకాలంలో దళితుల కోరికలను చాటుతూ వివిధ ఆంధ్ర ప్రాంత జిల్లాల్లో దాదాపు పదిహేను సదస్సులు జరిగాయి. ఆ సదస్సులు జరిగిన ప్రాంతాలను (ప్రాదేశిక, తాలూకా, పట్టణ, గ్రామ స్థాయి సదస్సులు) దృష్టిలోపెట్టుకుని చూస్తే ఆంధ్ర మహాసభ గ్రామీణ ప్రాంతాలలోని దళితులను కూడా చేరిందనేది స్పష్టమవుతుంది. ఆది ఆంధ్ర మహాసభ సదస్సుల్లో చేసిన తీర్మానాల్లోని అంశాలను విశ్లేషిస్తే అగ్రవర్ణ హిందువులే అన్ని సామాజిక ఆర్థిక వనరులను తమ గుప్పిట్లో పెట్టుకున్న తీరుపై ఎంత ఆగ్రహంగా వున్నారో స్పష్టమవుతుంది.

ఆంధ్ర దళితుల్లో చైతన్యం తీసుకురావడానికీ, సమకాలీన, సామాజిక, రాజకీయ పోరాటాలలో వారు పాల్గొనేట్టు చేయడానికీ ప్రత్యేకించి 1920, 1930లలో వెల్లువెత్తిన అనేక ఉద్యమాలు దోహదం చేశాయి. అప్పటికే క్రైస్తవ మిషనరీ సంస్థలు దళిత

---

16. ఈ సదస్సుల వివరాలు ఇదే భాగంలోని తరువాతి పేజీల్లో చూడవచ్చు.

17. కృష్ణా పత్రిక 15 జూన్ 1921; వెంకటస్వామి, 1955.

ప్రాంతాలలోకి చొచ్చుకు వచ్చేశాయి. అవి ఒక పక్క విద్యా సంస్థలను నెలకొల్పుతూ, మత మార్పిడులకు పాల్పడుతూనే దళిత అభ్యున్నతికి చర్యలు చేపట్టాయి. మద్రాసు ప్రభుత్వం కూడా తన ఏలుబడిలోని దళితుల ప్రగతికోసం లేబర్ డిపార్ట్‌మెంట్‌ని ఏర్పాటుచేసింది. వ్యవసాయ వ్యాపారీకరణ, కృష్ణా గోదావరీ నదులపై భారీ నీటిపారుదల ప్రాజెక్టులు మొదలైన వాటివల్ల అంతవరకు దళిత కార్మికులను అణిచివేస్తూ వచ్చిన సాంప్రదాయిక 'జజమాని' బంధాలు తొలిగిపోయాయి. కూలీలు ఒకచోటు నుంచి మరో చోటుకి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడడంతో మాల మాదిగల అభివృద్ధి అవకాశాపెరిగాయి. ఆ తరువాత బర్మా వలసలు కూడా దళిత ఉద్యమ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేశాయి. పందొమ్మిదో శతాబ్దం చివరి నుంచీ వేల సంఖ్యలో దళితులు ముఖ్యంగా మాల మాదిగలు రంగూన్ ఓడ రేవులో పనిచేసేందుకు వలస వెళ్లడం మొదలయింది. వారిలో కొందరు తమ కాంట్రాక్టు కాలపరిమితి పూర్తయిన తరువాత కూడా అక్కడే ఇతర వ్యాపారాలు చేసుకుంటూ వుండిపోయారు. బర్మాలోవుంటూనే వాళ్లు చదువు నేర్చుకున్నారు. డబ్బు సంపాదించుకున్నారు. స్వదేశం తిరిగి వచ్చిన తరువాత ఉద్యమంలో భాగస్వాములయ్యారు. మరికొందరు ఎంతో ఉదారంగా ఉద్యమానికి ఆర్థిక సహాయం అందించారు.[18] ఆ తరువాత ఎందరో దళిత నాయకులు తమ ఉద్యమానికి నిధుల సమీకరణ కోసం బర్మాకు వెళ్లడం మొదలయింది.[19] 1920లలోని దళిత నాయకులలో చాలామంది గూడూరు రామచంద్ర రావు అనే బ్రాహ్మణ సంస్కరణవాది నెలకొల్పిన "సేవాశ్రమం" నుంచి వచ్చిన వారే

---

18. ఇందుకు బి.ఎస్. మూర్తి బిఎ, బిఇడి ఒక చక్కని ఉదాహరణ. ఆయన రాజమండ్రి, మద్రాసుల్లో విద్యాభ్యాసం చేశారు. 1940-49 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ హరిజన్ సేవక్ సంఘ్ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. 1937లో మద్రాస్ శాసన సభకు ఎలక్టోరల్ మెంబర్‌గా వున్నారు. పరిశ్రమల మంత్రిగా, కార్మికమంత్రిగా పనిచేశారు. ఆ తరువాత నెహ్రూ మంత్రివర్గంలో కూడా డిప్యూటీ మంత్రిగా పనిచేశారు. జాతీయోద్యమంలో సైతం పాల్గొన్నారు.

19. బర్మా అనే పదం కంటే "రంగం" (రంగూన్) అన్న పదమే ఎక్కువ వాడుకలో వుండేది. అనేక దళిత కథల్లో రంగం అన్న అంశం ప్రధానంగా కనిపిస్తుంది. చాలా మంది దళితులు తీసుకున్న అప్పులు చెల్లించలేకో లేదా భూస్వాముల దోపిడీపై ధిక్కారంతోనో రంగూన్ వెళ్లిపోయేవారు. ఈ రచయిత తూర్పు గోదావరికి చెందిన బొజ్జా అప్పలస్వామి, వజ్రపు సాంబమూర్తి; హైదరాబాదుకు చెందిన బి. హెచ్. తిరుపతి, విజయవాడకు చెందిన కోనాడ సూర్యప్రకాశరావు మొదలైన వారితో జరిపిన ఇంటర్వ్యూల ఆధారంగా ఈ వివరాలు పొందుపరచడం జరిగింది. రామమూర్తి తన "రాష్ట్ర హరిజన నాయకుల జీవిత చరిత్ర"(1976) షనే పుస్తకంలో కూడా ఈ వివరాలను పొందుపరిచారు.

కావడం విశేషం. ఆయన కృష్ణా జిల్లా గుడివాడలో 1912లో సేవాశ్రమాన్ని స్థాపించారు. సాటి అంటరాని వాళ్లకు వివిధ అంశాల్లో శిక్షణ యిచ్చేందుకు ముందుకొచ్చి సేవాశ్రమంలో చేరవలసిందిగా ఆయన దళిత కార్యకర్తలను ఆహ్వానించారు. వాళ్లే ఆ తరువాత గ్రామీణ ప్రాంతాలలో పనిచేశారు. అలాంటి వాళ్లలో సుంద్రు వెంకయ్య, కుసుమ వెంకట్రామయ్య, నరాలశెట్టి దేవేంద్రుడు, కుసమ ధర్మన్న వంటి వాళ్లు ఎందరో వున్నారు.

1917లో మొదటి ఆది ఆంధ్ర సదస్సు జరిగిన తరువాత దళిత కార్యకర్తలు గణనీయంగా పెరిగారు. వారి నిర్వహణా పరిధి కూడా చాలా పెరిగింది. అనేక సంఘాలు, సంస్థలు ఏర్పడి జిల్లా, తాలూకా, గ్రామ స్థాయిలో ఎన్నో సమావేశాలు నిర్వహించడం మొదలయింది. వాళ్లు వ్యవసాయ కూలీ సంఘాలని, క్షేత్రీయ కార్మిక పొదుపు సంఘాలని ఏర్పాటు చేశారు. దళిత ప్రజానీకం కోసం విద్యా సంస్థలను, వసతి గృహాలని ఏర్పాటు చేశారు. తొలి ఆది ఆంధ్ర సదస్సు జరిగిన తరువాత కృష్ణా జిల్లా ఆది ఆంధ్ర సదస్సు 1919లో మచిలీపట్టణంలో జరిగింది. దానిని భాగ్యరెడ్డి వర్మ నిర్వహించారు. చిలుకూరి వెంకటస్వామి దానికి ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా వ్యవహరించారు.

ప్రాదేశిక స్థాయి సదస్సులు

1920వ దశాబ్ది చైతన్యాభివృద్ధికి ప్రతీకగా మారింది. ఆ దశాబ్దంలో జరిగిన అనేక ప్రాదేశిక, జిల్లా స్థాయి సదస్సులు దళిత యువతను చైతన్యవంతుల్ని చేస్తూ, వారు తమ సామాజిక ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించేట్టు చేశాయి. ఆ తదనంతరం యువత సామాజిక వ్యవస్థపై అవిశ్రాంత పోరాటానికి ఉద్యుక్తులయ్యారు. సదస్సులను క్రమబద్ధంగా నిర్వహించారు. 1920లో భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షులుగా,సుంద్రు వెంకయ్య ఆహ్వాన సంఘం చైర్మన్‌గా గుడివాడలోనూ; 1922లో భాగ్యరెడ్డి వర్మ, నరాలసెట్టి దేవేంద్రుడు ఆధ్వర్యంలో ఏలూరులోనూ; 1924లో కుసుమ వెంకట్రామయ్య, నూటక్కి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గుంటూరులోనూ; 1925లో భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షతన అనంతపురంలోనూ సదస్సులు జరిగాయి. వాటిలో మొత్తం 14 తీర్మానాలు చేశారు. ఉమ్మడి బావులను వినియోగించుకునేందుకు అంటరానివాళ్లకు అనుమతినివ్వాలనే తీర్మానం కూడా వాటిలో వుంది. చాలా తీర్మానాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసే రీతిలో –అంటే ప్రతిజిల్లాలో ఒక లేబర్ కమిషనర్‌ను నియమించాలి, బడుగువర్గాల పిల్లలకు ఉచిత విద్య అందించాలి, బడుగువర్గాల ప్రయోజనం కోసం కేటాయించిన పోరంబోకు

భూములను మూడేళ్ల పాటు సంతృప్తికరమైన పంటలు పండేవరకు మదింపు చేయకూడదు, ఉపకార వేతనాలు మంజూరు చేసేందుకు విధించిన 16 సంవత్సరాల కనీస వయఃపరిమితి నిబంధనను తొలగించాలి; వివిధ ప్రభుత్వ శాఖల్లో మునుముందు ఏర్పడే ఖాళీల్లో ఆది ఆంధ్రులను నియమించాలి అనే ధోరణితో వున్నాయి. సాంప్రదాయం పేరిట ఆడవాళ్లని దేవదాసి, జోగిని అంటూ దేవుడికి అంకితం చేసే దురాచారాన్ని రద్దుచేయాలి అని కూడా సదస్సులు తీర్మానించాయి. అదేవిధంగా దళితుల పేర్లకు ముందు వెనకల ఉపయోగించే "ఒరే..ఒసే..వొలే..గాడు.." వంటి అగౌరవ వాచకాలను సదస్సులు తీవ్రంగా ఖండించాయి.[20] దళితులను కించపరిచేందుకు, వారి దిగువ స్థాయిని ఎత్తిచూపేందుకు అగ్రవర్ణాల వాళ్లు ఈ పదాలు వాడేవారు. గ్రామాల్లో ప్రముఖ ఆది ఆంధ్రులతో కార్యాచరణ కమిటీలను ఏర్పాటు చేయాలని కూడా సదస్సులు ప్రభుత్వానికి సిఫారసు చేశాయి.

1926లో ఆరవ ఆది ఆంధ్ర సదస్సు నరాలశెట్టి దేవేంద్రుడు అధ్యక్షులుగా కమతం షణ్ముగం ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా నెల్లూరు జిల్లాలోని వెంకటగిరిలో జరిగింది. ఆ తరువాత 1929లో ప్రత్తిపాటి ఆదినారాయణ, వేముల కూర్మయ్య ఆధ్వర్యంలో బెజవాడలోనూ; 1939లో నరాలశెట్టి దేవేంద్రుడు అధ్యక్షతన అనంతపురంలోనూ సదస్సులు జరిగాయి.

మద్రాస్ జస్టిస్ పార్టీ ప్రభుత్వం ఆది ఆంధ్ర మహాసభ చేసిన కొన్ని డిమాండ్ల పట్ల – ముఖ్యంగా విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై సానుకూలంగా స్పందించింది.[21] అణగారిన దళిత వర్గానికి సామాజిక న్యాయం

---

20. సాధారణంగా అగ్రవర్ణ హిందువులు అహంభావంతో తక్కువ కులానికి చెందిన వ్యక్తుల పేర్లకు ఇలాటి పదాలను తగిలించి సంబోధిస్తుంటారు. ఉదాహరణకి పోలయ్య, ముత్తయ్య అనే పేర్లను వారు పోలిగాడు, ముత్తగాడు అని మార్చేస్తారు. తక్కువ కులంవాళ్లని పిలిచేటప్పుడు వాళ్ల పేర్లకు ముందు వారి కులాన్ని కూడా చేర్చేపద్ధతికూడా వుంది. ఉదాహరణకు మాదిగోళ్ల పోతయ్య, మాలోళ్ల గవరయ్య. ఈ పద్ధతి ఈనాటికి కూడా ఇంకా కొనసాగుతోంది.

21. ఇందుకు ప్రధాన కారణం కోస్తా ఆంధ్ర జమీందార్లు చాలామంది జస్టిస్ పార్టీకి అనుకూలురు అయివుండటమే. ఉదాహరణకి పిఠాపురం రాజావారు (రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దర్, డి.లిట్.). ఆయన గొప్ప మానవతావాది. దళితులకు అనేక విద్యాలయాలను, వసతి గృహాలను నిర్మింపజేయడంలో ఎంతో ఉదారంగా వ్యవహరించారు. ఇతర జస్టిస్ పార్టీ అనుకూలురులలో గొల్లపల్లి జమీందార్, మీర్జాపూర్ జమీందార్ వంటి వారు వున్నారు. వారిలో కొందరు ఆది ఆంధ్ర సదస్సుల ప్రారంభోత్సవాలలో కూడా పాల్గొన్నారు. చూ. కృష్ణా పత్రిక 31 అక్టోబర్ 1936.

అందించాలన్న లక్ష్యంతో జస్టిస్ పార్టీ ప్రభుత్వం వలసవాద పాలకుల సహకారంతో స్థానిక బోర్డు పాఠశాలలో దళిత విద్యార్థులకు ఉచిత విద్యా సౌకర్యం, వారికోసం లేబర్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో ప్రత్యేక పాఠశాలల నిర్మాణం వంటి చర్యలను చేపట్టింది.[22] ఆది ఆంధ్రమహాసభ లేవనెత్తిన భూసమస్యపై కూడా సానుకూలంగా స్పందించి దళిత కూలీలకు, గ్రామీణ పేదలకు ప్రభుత్వ అసైన్డ్ భూములను కేటాయించాలని నిర్ణయించింది. జస్టిస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు పరిమిత స్థాయిలో వున్నప్పటికీ దళితులలో గొప్ప ఉపశమనాన్ని కలిగించాయి. దళితుల రాజకీయ ప్రాతినిధ్యం విషయానికి వస్తే మద్రాసు ప్రభుత్వం దళిత నాయకులలో కొందరిని శాసన సభకు నామినేట్‌చేసి నిర్ణయాలు తీసుకునే శాఖల్లో దళితులకు చోటు కల్పించింది. బ్రాహ్మణీయ ఆధిపత్య కోణంలోంచి చూస్తే బ్రాహ్మణేతర ఉద్యమానికీ, దళిత ఉద్యమానికి మధ్య సామీప్యత కనిపిస్తుంది. కానీ దళితుల సంపూర్ణ మద్దతుతో కూడిన విశాల ఉద్యమాన్ని జస్టిస్ పార్టీకి చెందిన బ్రాహ్మణేతర నాయకత్వం నిర్మించలేకపోవడం, వారిమధ్య సమన్వయం లేకపోవడం వల్ల వారు విఫలమయ్యారు. ఏది ఏమైనా జస్టిస్ పార్టీకి చెందిన ఆంధ్ర జమీందార్లు కొందరు ఆది ఆంధ్ర ఉద్యమ నేతలతో వ్యక్తిగతంగా సన్నిహితంగా వుండేవారు.

అయితే 1920లలో ఆది ఆంధ్ర ఉద్యమం ఏకాకి అయింది. ప్రధాన రాజకీయ వ్యవస్థతో, దాని విస్తృత గ్రామీణ నేపథ్యంతో వేరుపడింది. ప్రాంతీయ ఉద్యమం (భాషా ప్రయుక్త ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం)[23]గానీ, కాంగ్రెస్ నాయకత్వంలో సహాయ నిరాకరణ వంటి జాతీయోద్యమంగానీ, ఇతర అనుబంధ ఉద్యమాలు గానీ దళిత వర్గాలను పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. ఆది ఆంధ్ర ఉద్యమం మీద అగ్రవర్ణ హిందూ జాతీయ నాయకుల ప్రభావం అపరిమితంగా వున్నప్పటికీ 1930ల వరకూ దళితులకు ప్రధాన జాతీయ ఉద్యమాలతో అంతంతమాత్రంగానే సంబంధాలుండేవి.[24] ఆది ఆంధ్ర ఉద్యమానికి ఇతర ఉద్యమాలతో అనుబంధం చెప్పుకోదగిన స్థాయిలో వుండేది కాదు. ఉదాహరణకు1920లలో ఆంధ్ర జిల్లాల్లో సాగిన జాతీయోద్యమంలో

---

22. దళిత విద్యకు సంబంధించిన అనేక అంశాలను, అందులో లేబర్ డిపార్ట్‌మెంట్ పాత్రను 3వ అధ్యాయంలోనే విశ్లేషించడం జరిగింది.

23. ప్రాంతీయ, రాజకీయ చైతన్యం, ఆంధ్ర ఉద్యమం పెరుగుదలకూ సమకాలీన దళిత చైతన్యం పెరుగుదలకూ మధ్య అవినాభావ సంబంధం వుంది. ఆంధ్ర ఉద్యమ పూర్తి వివరాలకు చూ.నారాయణ రావు, 1973.

24. ఉదాహరణకు కె. నాగేశ్వరరావు, అయ్యదేవర కాళేశ్వరరావు లతో సహా ఆంధ్రాలోని సుప్రసిద్ధ జాతీయ నాయకులకు ఆది ఆంధ్ర నాయకులతో సన్నిహిత సంబంధాలుండేవి.

పాల్గొన్న దళితుల సంఖ్య నామమాత్రమే. కానీ, 1930–40 మధ్యకాలంలో మాత్రం అది గణనీయమైన స్థాయికి పెరిగింది.[25] అత్యధిక దళిత ప్రజానీకం జాతీయోద్యమం పట్ల నిరాసక్తంగా వుండటానికి లేదా వ్యతిరేకంగా వుండటానికి కారణం ఆ ఉద్యమానికి అగ్రవర్ణ హిందువులు నేతృత్వం వహించడం, దాని సిద్ధాంతం కమ్యూనిజంలాగా వారిని ఆకర్షించలేకపోవడం, దళితుల ఆకాంక్షలను అది నెరవేరుస్తుందన్న ఆశను కల్పించలేకపోవడం ప్రధాన కారణం. పెరుగుతున్న రాజకీయ వైరుధ్యాలు, దళిత ప్రజలకు సంబంధంలేని జాతీయ సమస్యల మూలంగా దళిత నాయకత్వం ఆ ఉద్యమంలో చురుకుగా పాలుపంచుకునేందుకు ఉత్సాహం చూపలేదు. అయితే ఆ తదనంతర కాలంలో దళితనేతలు నాటి ప్రధాన రాజకీయ పక్షాలైన జాతీయ కాంగ్రెస్‌లో, కమ్యూనిస్టు పార్టీలో పెద్దఎత్తున చేరడం ఒక ఆశ్చర్యకరమైన పరిణామం.

ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటు చుట్టూ రాజకీయ పరిణామాలు కేంద్రీకృతం కావడంతో ఈ ప్రాంతం తీవ్రమైన ప్రభావానికి గురైంది. 1920లలో స్వయం ప్రపత్తితో, రాడికల్ స్వభావంతో సాగిన ఆది ఆంధ్ర ఉద్యమం 1930లలో డోలాయమాన స్థితిలో పడిపోయింది.అదే సమయంలో 1930లలో ప్రారంభించబడిన గాంధేయ హరిజనోద్ధరణ కార్యక్రమాలు దళితులకూ కాంగ్రెస్‌కూ మధ్య సన్నిహిత సంబంధం పెరిగేందుకు దోహదం చేశాయి. హరిజన్ సేవక్ సంఘ్ యొక్క ఆంధ్ర శాఖలను 1932లో విజయవాడలో, హైదరాబాద్‌లో నెలకొల్పడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు వలసవాద ఆంధ్రాలో దళిత సంక్షేమ చర్యలు చేపట్టేందుకు వీలేర్పడింది. ఆ క్రమంలో 1920లనాటి దళిత కార్యకర్తలను సంఘ్‌లో చేర్చుకున్నారు. ఆ సంఘ్‌కు ఇద్దరు హిందూ గాంధేయ సంఘ సంస్కర్తలు కె. నాగేశ్వరరావు, యం. బాపినీడు అధ్యక్ష కార్యదర్శులుగా, ఇద్దరు దళిత నేతలు ఎన్. దేవేంద్రుడు, వి. కూర్మయ్య సంయుక్త కార్యదర్శులుగా పనిచేశారు. ఆ ఇద్దరు దళిత నేతలు 1920లలో ఆది ఆంధ్ర ఉద్యమంలో ఎంతో చురుకుగా పనిచేసినవాళ్లే.[26] ఆంధ్ర రాష్ట్రీయ హరిజన సేవక్ సంఘ్ మద్రాస్

25. అనేక మంది దళితులు గాంధీ 1932–33లో ఆంధ్రాలో జరిపిన పర్యటన, హరిజన సేవక్ సంఘ్ ఆంధ్ర శాఖ ఏర్పాటు అనంతరమే జాతీయోద్యమంలో చేరారు. ఆ అంశాన్ని ఇంతకు ముందరి అధ్యాయంలోనే చర్చించడం జరిగింది.

26. నరాలశెట్టి దేవేంద్రుడు 3వ ఆధి ఆంధ్ర సదస్సు (1920) కు ఆహ్వాన సంఘం అధ్యక్షుడుగా, ఆరవ సదస్సుకు సభాధ్యక్షుడిగా వున్నారు. ఆతరువాత మద్రాస్ శాసన సభకు నామినేట్ చేయబడ్డారు. వేముల కురమయ్య విజయవాడలో జరిగిన ఆదిఆంధ్ర 8వ సదస్సుకు ఆహ్వాన సంఘం కమిటీ అధ్యక్షులుగా వున్నారు. తరువాత 1937లో, 1946లో మద్రాస్ శాసన సభకు ఎన్నికయ్యారు. 1946 నుంచి 1949 వరకు ప్రకాశం మంత్రివర్గంలో హరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు

ప్రెసిడెన్సీలోని తెలుగువారి జిల్లాలన్నింటిలో తన శాఖలను నెలకొల్పింది. దానికి సంఘ్ కేంద్ర కార్యాలయం నుంచి నిధులు అందేవి. సంఘ్‌లో చేరిన దళిత నాయకులు అగ్రవర్ణ హిందూ అధినేతల కింద దళిత వీధులను శుభ్రం చేయడం, దళిత పిల్లలకోసం ప్రత్యేక పాఠశాలలు, వసతి గృహాలను[27] ఏర్పాటు చేయడం, దళితులకోసం తాగునీటి బావులను తవ్వించడం వంటి కార్యక్రమాలలో పాల్గొనేవారు. 1932-33లో గాంధీ ఆంధ్ర ప్రాంతంలో జరిపిన పర్యటన స్థానిక సంఘ్ కార్యకలాపాలకు ఎంతో నైతిక బలాన్నిచ్చింది. గాంధీ పర్యటన సందర్భంగా "హరిజన భిక్ష" పేరిట ప్రజల నుంచి పెద్దఎత్తున నిధులను సేకరించారు. ఆ నిధులను ఆయన ప్రాదేశిక అవసరాలకోసం, జిల్లా శాఖలను ఏర్పాటుచేసేందుకు కేటాయించారు.

1932-33లో గాంధీ ఆంధ్ర ప్రాంత పర్యటన వెనకవున్న ముఖ్యోద్దేశం అంటరానితనమనే దురాచారానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం, హరిజనులకు దేవాలయంలో ప్రవేశం కల్పించడం. నిజానికి ఆ సమయంలో దళితుల దేవాలయ ప్రవేశంపై మద్రాస్ అసెంబ్లీలో చర్చ జరుగుతోంది. మద్రాస్ ముఖ్యమంత్రి డా. పి. సుబ్బరాయన్ 1 నవంబర్ 1932న మద్రాస్ శాసన సభలో హరిజనులకు హిందూ దేవాలయాల్లో ప్రవేశించే హక్కు తాలూకు తీర్మానాన్ని ప్రతిపాదించారు. దానికి టి.ఎ.రామలింగం చెట్టియార్ బలపరిచారు.[28] కానీ వర్ణాశ్రమ స్వరాజ్య సంఘం వంటి హిందూ సాంప్రదాయిక సంస్థలు ప్రభుత్వం మత సంబంధ విషయాల్లో అనవసర జోక్యం చేసుకుంటోందంటూ ఆరోపణలు చేశారు.[29] దేవాలయ ప్రవేశమనేది బడుగు వర్గాల అభ్యున్నతికి దోహదం చేసే అంశం కాదనీ, శాసన మండలికి ఈ విషయంలో చర్యతీసుకునే అధికారం లేదనీ వాదించారు.[30] దాంతో చివరికి గవర్నర్ జనరల్ ఆ బిల్లును ఆమోదించకుండా తిప్పిపంపారు.

---

27. ఆంధ్ర ప్రాంతంలోని జిల్లాల్లో దళితులకోసం 41 రాత్రి పాఠశాలలు, 11 పగటి పాఠశాలలు తెరిచారు. వాటికోసం రూ. 8,637/-లు ఖర్చు చేశారు. చూ. కృష్ణా పత్రిక 11 జులై 1936.

28. తీర్మానానికి అనుకూలంగా 56 మంది ఓటు చేస్తే 19 మంది తటస్థులుగా వుండిపోయారు. చూ. మద్రాస్ ప్రభుత్వం పబ్లిక్ డిపార్ట్‌మెంట్ జిఒ నెం. 114, పబ్లిక్ (జనరల్) తేది 31 మార్చి 1933.

29. చూ. వర్ణాశ్రమ స్వరాజ్య సంఘం అభ్యర్థన, మద్రాస్ ప్రభుత్వ పబ్లిక్ డిపార్ట్‌మెంట్ జిఒ నెం. 140, పబ్లిక్ (జనరల్) తేది 7 ఫిబ్రవరి 1933.

30. పై అభ్యర్థనతో ఆగకుండా అగ్రవర్ణ హిందువులు మతంలో ప్రభుత్వ జోక్యాన్ని నిరసిస్తూ తీర్మానానికి వ్యతిరేకంగా ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించారు. మద్రాస్ ట్రిప్లికేన్ ప్రాంతంలో దేవాలయ పరిరక్షణ దినాన్ని కూడా పాటించారు. చూ. హిందూ 7 మే 1934.

దేవాలయ ప్రవేశం మీద జరిగిన ఈ రాద్ధాంతం గురించి తెలుసుకున్న గాంధీ అంటరానితనం గనక ఇలాగే కొనసాగితే హిందూ మతం నామరూపాలు లేకుండా పోతుందనీ, ఈ వివాదంలో దళితులు తాముగా జోక్యం చేసుకోలేదనీ వాదించారు.[31] తిరుపతి దేవాలయం గురించి ప్రస్తావిస్తూ "ఐరోపా వాళ్లను కొండకు అనుమతిస్తున్నప్పుడు హరిజనులను ఎందుకు అనుమతించరు?" అంటూ నిలదీశారు. దానిపై దేవాలయ అధికారులు "అసలు దేవాలయ ప్రవేశం కోరుతూ ఏ హరిజనులూ తమను సంప్రదించలేదు" అంటూ స్పందించారు. 17 డిసెంబర్ 1933న కృష్ణా జిల్లా, గుడివాడ తాలూకా సిద్ధాంతం గ్రామంలో రెండు దేవాలయాల్లో హరిజనుల ప్రవేశానికి గాంధీ స్వయంగా తనే నాయకత్వం వహించారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ " నా చర్యకు దోహదం చేసిన వాళ్లంతా పుణ్యాత్ములు, అసలు పుణ్యాత్ములకైనా పాపాత్ములకైనా దేవుడు ఒక్కడే. హరిజనుల్లో నైనా సవర్ణుల్లోనైనా ఎవరు పుణ్యాత్ములో ఎవరు పాపాత్ములో ఎవరు చెప్పగలరు?" అన్నారు.

హరిజనోద్ధరణ కార్యక్రమం ఆంధ్ర జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో కొనసాగింది. హరిజన సేవక్ సంఘ కార్య కర్తలు అనేక గ్రామాలను సందర్శించి ఉమ్మడి బావులను ఉపయోగించుకునేందుకు హరిజనులకు అనుమతినివ్వాలంటూ అగ్రవర్ణ హిందువులను ఒప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. నిర్దిష్ట దేవాలయాల్లో దళితుల ప్రవేశానికీ, బావులూ చెరువుల నుంచి దళితులు నీళ్లు తీసుకెళ్లడానికీ సంబంధించిన వార్తలు స్థానిక పత్రికలలో వెలువడుతుండేవి. అయితే ఈ గాంధీ కార్యక్రమం వాస్తవిక రీతిలోకంటే ప్రతీకాత్మక రీతిలోనే ఎక్కువగా కొనసాగిందని చెప్పాలి. తత్ఫలితంగా కాంగ్రెస్ పార్టీ దళితులను ఆకర్షించి తనలో చేర్చుకోగలిగిందే తప్ప అగ్రవర్ణ హిందువులలో పరివర్తననుతెచ్చి వారు సామాజిక సమానత్వంకోసం చిత్తశుద్ధితో కృషి చేసేట్టు చేయలేకపోయింది. గాంధీ ప్రబోధించిన సహనం, సహోదరభావం ఎక్కువకాలం బతికిబట్టకట్టలేకపోయింది. అగ్రవర్ణ ఆధిపత్యం కారణంగా సంఘ్ పరివారం తమ సహోదరులు గాంధీ సిద్ధాంతాన్ని నిజమైన స్ఫూర్తితో అనుసరించేట్టు చేయలేకపోయారు. గాంధీ సిద్ధాంతాలను అమలుపరిచేక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు దిగువ స్థాయిలో అనేక ప్రాథమిక సమస్యలను ఎదుర్కొన్నారు. సాంప్రదాయిక భావజాలం సమాజంలో వేళ్లూనుకుని వుండిపోయింది. అనేకమంది బడుగువర్గాల

31. నిజానికి దేవాలయంలో ప్రవేశాన్ని దళిత నాయకత్వం కానీ, దళితులు కానీ కోరలేదు. కనీసం తెలుగుదేశానికి సంబంధించినంత వరకు ఇది వాస్తవం.

ప్రజలకు అగ్రవర్ణ హిందువుల, కాంగ్రెస్ కార్యకర్తల మాటలమీద నమ్మకంలేకపోవడం వల్ల వారికి దూరంగా వుండిపోయారని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని స్థానిక రెవెన్యూ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లాలోని ఒక స్థానిక దళిత సంఘం నాయకుడు మాట్లాడుతూ "దళితులను నిజంగా ఉద్ధరించాలని గాంధీ మనసులో వుండొచ్చునేమో గానీ అగ్రవర్ణ హిందువులందరూ గాంధీలు కారు కదా" అన్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా లేబర్ ఆఫీసర్ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ దేవాలయాలను మూసివేసి దళితుల ప్రవేశాన్ని అడ్డుకుంటుండడం వల్ల కొద్ది మంది దళితులు రాజమండ్రిలోని కొన్ని దేవాలయాల గేట్ల అవతల భజనలు చేశారనీ, దేవాలయం లోపలికి వెళ్లి భజనచేయగలిగింది ఏదైనా వుందంటే అది ఒక్క ఆంజనేయస్వామి దేవాలయంలో మాత్రమేననీ అన్నారు. ఎందుకంటే ఆ దేవాలయ నిర్వాహకుడు ఒక బ్రాహ్మణేతరుడు. రోడ్డు మీద వెళ్లేవాళ్లెవరైనా లోపలికి వచ్చి పూజలు చేసేందుకు వీలుగా ఆ దేవాలయానికి నలువైపులా వున్న ద్వారాలను ఆయన ఎప్పుడూ తెరిచే వుంచేవాడు. బందరులో 26 డిసెంబర్ 1932న దాదాపు 32 మంది అగ్రవర్ణ హిందువులు స్థానిక దళితులను దేవాలయంలో ప్రవేశింపజేసేందుకు ప్రయత్నించారని కృష్ణా జిల్లా మెజిస్ట్రేటు పేర్కొన్నారు. అయితే ఆలయ పూజారులు వారి మొహంమీదే దేవాలయ తలుపులను మూసివేశారు. ఇలాంటి విఫల ప్రయత్నాలు బెజవాడలో కూడా కొన్ని జరిగాయి. దళితులు అడుగుపెట్టిన ఆలయాలను ఆ తరువాత తిరిగి శుద్ధి చేసిన సందర్భాలపై కూడా వార్తలు వెలువడ్డాయి. దేవాలయాల తాలూకు ఛాందస ధర్మకర్తల మూలంగా దళితుల దేవేలయ ప్రవేశం అప్పటికి ఇంకా కలగానే మిగిలిపోయింది. దళిత ప్రజానీకానికి ప్రభుత్వం ఎలాంటి రాయితీ సౌకర్యాలను కల్పించినా ఆంధ్ర రాష్ట్రమంతటా గగ్గోలు చేసేవారు. ఈ కారణాల వల్లనే దళితులు అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తలను ఎప్పుడూ అనుమానంగా చూశారు.

ఆది-ఆంధ్ర ఉద్యమంలోని చైతన్యవంతులైన నాయకులకు గాంధీ తలపెట్టిన కార్యక్రమంలోని లొసుగులు, అసమగ్రత స్పష్టంగా తెలుసు. ఆయన ప్రవచించే దళిత విముక్తి కార్యక్రమంలోని డొల్లతనాన్ని వారు ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతుండేవారు. గాంధీ, ఆయన శిష్యగణం అంటరానితనం, వివక్షల నిర్మూలన, దేవాలయాలలో వారి ప్రవేశం గురించి చేసే ప్రబోధాల పట్ల మహాసభలోని మిలిటెంట్ వర్గాలకు సదభిప్రాయం వుండేదికాదు. సంఘ్‌కు చెందిన అగ్రనేతల్లో కూడా గాంధీ సిద్ధాంతాల పట్ల అవగాహనాలోపం, అస్పష్టత వుండేవి. స్థానిక కాంగ్రెస్ నేతల, అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తల నయవంచనను విద్యావంతులైన దళితులు బట్టబయలు చేసేవారు.

కృష్ణా జిల్లాలో జరిగిన ఒక సంఘటనను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

సుప్రసిద్ధ బ్రాహ్మణ రాజకీయవేత్త, స్థానిక కాంగ్రెస్ నేత, హరిజన సేవక్ సంఘ్ ప్రాంతీయ అధ్యక్షుడు అయిన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు తన సొంత గ్రామంలోని దేవాలయంలో దళితుల ప్రవేశానికి అనుమతించలేదు. దాంతో ఆ దేవాలయంలోకి దళితులను వెంటనే అనుమతించాలనీ లేదా దళితుల దేవాలయ ప్రవేశంపై తన మనసులోని అసలు ఉద్దేశాలను బహిర్గతం చేయాలనీ ఆయనపై దళితులు ఆందోళనకు దిగారు. ఒక సీనియర్ జాతీయ స్థాయి నాయకుడికి అది నిజంగా అవమానకరమైన విషయం. ఏలూరు పట్టణంలో కూడా ఇలాంటిదే మరో సంఘటన జరిగింది. మద్రాస్ శాసన సభలో దళితుల దేవాలయ ప్రవేశ తీర్మానానికి అనుకూలంగా ఓటువేసి వచ్చిన ప్రముఖ అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్త మాతె గంగరాజు తన స్వంత గ్రామంలో ఏకాదశి పర్వదినాన దళితులు దేవాలయ ప్రవేశానికి సన్నద్ధులవుతున్నారని తెలిసి వారిని గట్టిగా వారించాడు. హిందూ సంఘ ధర్మాన్ని కాపాడాలంటూ ఆయన స్థానిక పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. దాంతో దళితులు తమ మతపరమైన కార్యక్రమాలను ఉదయం 9 గంటల లోపే పూర్తి చేసుకుని ఆ వీధినుంచి వెళ్లిపోవాలని సబ్ మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశాడు. అగ్రవర్ణ హిందువుల ఊరేగింపులకు ఎలాంటి ఆటంకాలు కల్పించకూడదని హెచ్చరించాడు. పండుగ సమయంలో దళితులెవరూ ప్రధాన వీధుల్లోకి రాకుండా తమ వాడల్లోనే వుండిపోయేట్టు చేసే ఆదేశాలవి. నాటి సంఘటన అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తల నిజాయితీపై దళితుల్లో మరింత అపనమ్మకాన్ని కలిగించింది.

మచిలీపట్నంలో మరో సంఘటన జరిగింది. అక్కడ ఒక హరికథా కాలక్షేప కార్యక్రమాన్ని అగ్రవర్ణ హిందువులతో కలిసి వినేందుకు వీల్లేదంటూ దళితులను అడ్డుకున్నారు. దళితులు అందుకు నిరసన వ్యక్తంచేస్తే వాళ్లు మరింత రెచ్చిపోయారు. అక్కడే ఇంకో ఉదంతం కూడా వెలుగు చూసింది. అగ్రవర్ణ హిందువుల ఆధీనంలో వున్న ఒక ప్రముఖ విద్యాసంస్థలో కులం కారణంగా పట్టభద్రుడైన దళితుడికి ఉద్యోగమిచ్చేందుకు నిరాకరించారు. అదేవిధంగా అనంతపురం పట్టణంలో ప్రభుత్వ చెరువులనుంచి దళితులు నీళ్లు తీసుకోకూడదంటూ అగ్రవర్ణ హిందువులు ఆంక్షలు విధించారు. ఎవరైనా తమ ఆదేశాలను అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా వుంటాయని హెచ్చరికలు జారీ చేశారు.[32] హరిజన్ సేవక్ సంఘ్ ద్వారా దళితులను ఆకర్షించి కాంగ్రెస్ పార్టీ దళితులను పెద్ద సంఖ్యలో తనలో చేర్చుకుంది కానీ కుల సంబంధాలలో మాత్రం ఎలాంటి చెప్పుకోదగ్గ

---

32. ఈ సంఘటనను సుప్రసిద్ధ తెలుగు చలన చిత్రం "మాలపిల్ల" లో చిత్రీకరించారు. చూ. కృష్ణాపత్రిక 4 మే 1938.

మార్పునూ అది తీసుకురాలేకపోయింది. గాంధీ ఎంతగా విజ్ఞప్తులు చేసినప్పటికీ దళితులపై వేధింపులు, వివక్ష, దాడులు ఆగలేదు.

1930లలో ఒకపక్క కాంగ్రెస్ సర్దుబాటు, దిద్దుబాటు రాజకీయాలు, మరో పక్క కమ్యూనిస్టు ఉద్యమం దళిత ప్రజానీకాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. కానీ, 1935లో అంబేద్కర్ హిందూ మతాన్ని విసర్జిస్తున్నట్టు చేసిన ప్రకటన కొంతమంది దళితులను ఆది ఆంధ్ర ఉద్యమాన్ని పునరుజ్జీవింపజేసేలా ఉత్తేజపరిచింది.

1935లో కుసుమ వెంకటరామయ్య అధ్యక్షులుగా, కుసుమ ధర్మన్న ఆహ్వాన సంఘం చైర్మన్‌గా పదవ మహాసభ జరిగింది. మద్రాస్ ప్రెసిడెన్సీలో దళితోద్యమ నాయకుడిగా పేరుగాంచిన యం.సి.రాజయ్య ఆ సదస్సును ప్రారంభించారు. పదకొండో మహాసభ 1936లో జరిగింది. పన్నెండో మహాసభ తిరిగి భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షులుగా, వుంద్రు సుబ్బారావు ఆహ్వాన సంఘం చైర్మన్‌గా తూర్పు గోదావరి జిల్లాలోని తాళ్ల రేవులో 1938లో జరిగింది. పంచాయితీ స్థాయి నుంచి మొదలుకుని శాసన సభ స్థాయి వరకు అన్నింటా ఆది ఆంధ్రులకు కొన్ని స్థానాలు రిజర్వుచేయాలనీ, అంటరానివాళ్ల పిల్లల్ని చేర్చుకోవటానికి నిరాకరించే విద్యాసంస్థలకు నిధులు మంజూరు చేయకూడదనీ, ఉద్యోగాలలో రిజర్వేషన్లు వుండాలనీ, కార్మిక సహకార సంఘాలను ఏర్పాటు చేయాలనీ, బ్యాంకు రుణాలు అందజేయాలనీ, దళితులకు ప్రభుత్వ బంజరు భూములు పంపిణీ చేయాలనీ ఆ మహాసభల్లో వివిధ తీర్మానాలు ఆమోదించారు.

జిల్లా స్థాయి సదస్సులు

రాష్ట్రస్థాయి ఆది ఆంధ్ర మహాసభలు ఆమోదించిన తీర్మానాల స్ఫూర్తితో అనేక జిల్లా స్థాయి సదస్సులు జరిగాయి. మొట్టమొదటి జిల్లాస్థాయి ఆది ఆంధ్ర సదస్సు 1921లో వుంద్రు తాతయ్య (1850–1930) [33] నేతృత్వంలో తూర్పు గోదావరి జిల్లా లేబర్ కమిషనర్ తళారి గోపాలరావు నాయుడు సహకారంతో అమలాపురంలో జరిగింది. ఆ సదస్సుకు దళిత ప్రజానీకం, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేట్టు

33. వుంద్రు తాతయ్య 1850లో తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకా, పొన్నమండలో జన్మించారు. బర్మాకు వెళ్లి బాగుపడ్డ తరంలో ఆయన ఒకరు. బర్మాలో వుంటున్నప్పుడు ఆయన అక్కడ 330 ఎకరాల భూమిని పొన్నమండలో 150 ఎకరాల భూమిని కొన్నారు. ఆది ఆంధ్ర ఉద్యమానికి ఇతోధికంగా ఆర్థిక సహాయం అందించినవారిలో ఆయన ముఖ్యులు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి తాలూకా బోర్డులో ఆయన నామినేటెడ్ సభ్యులుగా వుండేవారు. 19 మే 1930న చనిపోయారు.

చేసేందుకు నక్కా వెంకటరెడ్డి[34], తాడేపల్లి తాతయ్య[35] వంటి వారు విశేషంగా శ్రమించారు. తమ తమ ప్రాంతాల్లో జరిగిన సదస్సుల వల్ల చుట్టగుల్ల వెంకయ్య[36] దిడ్ల పుల్లయ్య[37], అంబటి గంగిశెట్టి[38] వంటి అనేకమంది యువ దళిత నేతలు ప్రభావితులయ్యారు.

కోస్తా ఆంధ్ర ప్రాంతంలోని జిల్లాల్లో తూర్పుగోదావరి జిల్లా అగ్రగామిగావుందని చెప్పాలి. 1921 - 1940 సంవత్సరాల మధ్య ఆ జిల్లాలో క్రమబద్ధంగా జిల్లా సదస్సులు జరిగాయి. మొట్ట మొదటి జిల్లా సదస్సు 1921లో అమలాపురంలో జరిగింది. దాని నిర్వహణ కోసం గొల్ల చంద్రయ్య (1888-1972)[39] నిధులను సమీకరించేందుకు తన పరిచయాలను పురస్కరించుకుని రంగూన్ వెళ్లి వచ్చారు. 1926లో కుసుమ వీరాస్వామి (1885-1964) అధ్యక్షతన అమలాపురం తాలూకాలోని చెయ్యేరులో జరిగిన సదస్సు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. అందులో వీరాస్వామి అధ్యక్షుడిగా, పందు లక్ష్మణస్వామి (1892-1960) ఉపాధ్యక్షుడిగా, తాడేపల్లి తాతయ్య

---

34. నక్కా వెంకటరెడ్డి (1892-1970) ఆది ఆంధ్ర ఉద్యమంలో 1917 నుంచీ చురుకైన పాత్ర నిర్వహించారు. ఆయన పాము రామమూర్తి, గెద్దాడ బ్రహ్మయ్య, ఈలివాడపల్లి వంటి అనేక మంది దళిత కార్యకర్తలకు శిక్షణ యిచ్చారు. ప్రోత్సాహం అందించారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా ఆది ఆంధ్ర మహాజన సంఘానికి 1937 నుంచి 1942 వరకు కార్యనిర్వాహక సభ్యులుగా వున్నారు.

35. తాడేపల్లి తాతయ్య (1875-1952) పిఠాపురం రాజావారు స్థాపించిన ఆది ఆంధ్ర వసతి గృహంలో వార్డెన్‌గా వుండేవారు(1922). ఆ తరువాత పిఠాపురం రాజావారే నెలకొల్పిన రాత్రి పాఠశాలకు హెడ్ మాస్టర్‌గా పనిచేశారు.

36. చుట్టుగుళ్ల వెంకయ్య మాదిగ కులానికి చెందిన వారు. 26 మే 1896న జన్మించారు. ఆయన జిల్లా అరుంధతీయ సంఘాన్ని స్థాపించారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో దళితులను పెద్ద సంఖ్యలో సైన్యంలో చేరేలా చైతన్యపరిచినందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఆయన సేవలకు గుర్తింపుగా 'గుడ్ రిక్రూటర్' బిరుదుతో సత్కరించింది. ఆయన 1965లో చనిపోయారు.

37. దిడ్ల పుల్లయ్య (1894-1958) రాజమండ్రికి చెందిన ఉపాధ్యాయులు. దళితులలో చైతన్యం తెచ్చేందుకు ఆయన 'ఆదిమాంధ్ర' అనే పత్రికను వెలువరించారు. మొదట్లో ఆయన జస్టిస్ పార్టీకి మద్దతుదారుగా వుండేవారు కానీ ఆ తరువాత కాంగ్రెస్ వాదిగా మారారు.

38. అంబటి గంగి శెట్టి (జననం1902-) తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం తాలూకాలోని అనేక గ్రామాల్లో క్షేత్రీయ కార్మిక సహకార సంఘాల స్థాపనల్లో ప్రముఖ పాత్ర వహించారు. గొప్ప వక్త. మొదటి నుంచీ కాంగ్రెస్ వాదిగా వున్నారు.

39. గొల్ల చంద్రయ్య (1888-1972) కొడాలి పంచమ పాఠశాలలో ఉపాధ్యాయులుగా 1908లో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. క్షేత్రీయ కార్మిక సహకార సంఘాల స్థాపనలో ముఖ్య పాత్రను నిర్వహించారు. దళితులకోసం పలు వసతి గృహాలను నెలకొల్పారు.

(1895–1952) కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత వారు దానిని తూర్పు గోదావరి జిల్లా ఆది ఆంధ్ర సంఘంగా రిజిష్టరు చేయించారు. 1926 లోనే కె.పెద వీరాస్వామి అధ్యక్షతన నర్సాపురం తాలూకా నీరుల్లిపాలెం లో మరో సదస్సు జరిగింది. అందులో కె.ఎస్.డానియల్ స్మిత్ అధ్యక్షోపన్యాసం చేశారు.

ఆతరువాత పాము రామమూర్తి అధ్యక్షతన 1930లో రామచంద్రాపురంలో, 1933లో రాజోలులో, కుసుమ ధర్మన్న అధ్యక్షతన 1936లో విజయవాడలో, మళ్లీ పాము రామమూర్తి అధ్యక్షతన 1937లో రామచంద్రాపురంలో, గొట్టిమల్ల వెంకన్న, భాగ్యరెడ్డి వర్మల నిర్వహణలో తాళ్లరేవులో, వుంద్రు సుబ్బారావు అధ్యక్షతన 1938లో ఏలూరులో (ప్రారంభకులు వి.టి. మునుస్వామి పిళ్ళయ్),ఈలివాడపల్లి అధ్యక్షతన 1940లో కాకినాడలో, అదే సంవత్సరం ఓపట కోరంగిలో, ప్రముఖ దళిత నేత ఎన్.శివరాజ్ అధ్యక్షతన కాకినాడలో సదస్సులు జరిగాయి.

తాలూకా, ఫిర్కా స్థాయిలో కూడా మరెన్నో సదస్సులు నిర్వహించబడ్డాయి. 1933లో కోరుకొండలో, 1938లో కొరంగిలో జానిపెల్లి వెంకటరావు అధ్యక్షతన సదస్సులు జరిగితే, 1938లోనే గెద్దాడ బ్రహ్మయ్య అధ్యక్షతన చల్లపల్లిలో, జాలా రంగస్వామి అధ్యక్షతన 1940లో తాండవపల్లిలో సదస్సులు జరిగాయి. ఇంకా పడ్డపాలెం, రాజోలు, చంద్రాపురంవంటి చోట్ల తాలూకా స్థాయిలోనూ; తణుకు, రేలంగి, కంతేరు, వోలమూరు, మార్టూరు మొదలైన చోట్ల గ్రామ స్థాయిలోనూ సదస్సులు జరిగాయి.

ఈ అన్ని గ్రామ స్థాయి, తాలూకా స్థాయి సంఘాలకు కార్యనిర్వాహక వర్గాలుండేవి. వారు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక వర్గాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతుండేవారు. అన్ని సంఘాలకు ఉమ్మడి లక్ష్యాలుండేవి, అన్నీ ఒకే రకం డిమాండ్లు చేస్తుండేవి. అయితే అన్ని సంఘాలకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళులుండేవి.[40]

హైదరాబాద్ రాష్ట్రంలోని దళితుల చరిత్ర మాదిరిగా కాకుండా కోస్తా ఆంధ్రాలో ఇరవైయవ శతాబ్ది తొలినాళ్లలోని చరిత్రకు లిఖిత డాక్యుమెంట్లు లేవు. అందువల్ల కోస్తా ఆంధ్ర దళిత ఉద్యమానికి ఆ కాలం పెద్ద శూన్యాన్ని మిగిల్చింది. అయితే ఈ సదస్సులు ఆంధ్రా అంతటా జిల్లా, తాలూకా, గ్రామ స్థాయిలకు విస్తరించడం వల్ల దళితోద్యమానికి విశాల గ్రామీణ ప్రాతిపదికను సమకూర్చాయి.

---

40. ఉదాహరణకు చూడండి తూర్పు గోదావరి జిల్లా ఆది ఆంధ్ర స్థాయీ సంఘం (రాజోలు:1936) (1860 నాటి 21 యాక్ట్‌ప్రకారం రిజిష్టర్ చేయబడింది.)

ఆది ఆంధ్ర పరపతి సంఘాలు

మద్రాస్ ప్రెసిడెన్సీలో 1920లో లేబర్ డిపార్ట్‌మెంట్‌ని ఏర్పాటు చేసిన తరువాత దళితులలో చైతన్యం విస్తృతంగా పెరుగుతూ వచ్చింది.. 1920లలో, 1930లలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రీయ కార్మిక పరపతి సంఘాలను, పాఠశాలలను, వసతి గృహాలను నెలకొల్పారు.

అప్పటి జిల్లా సహాయక లేబర్ కమిషనర్ తళారి గోపాలరావు నాయుడు సహాయ సహకారాలతో వుండ్రు తాతయ్య మొట్టమొదటి ఆది ఆంధ్ర పరపతి సంఘాన్ని 1922లో స్థాపించారు. దానికి తను అధ్యక్షులుగా, గొల్ల చంద్రయ్య కార్యదర్శిగా వున్నారు. వుండ్రు తాతయ్య స్వయంగా భూస్వామి. రంగూన్ వెళ్లి రెండుచేతులా సంపాదించిన వ్యక్తి. ఆ పరపతి సంఘానికి ఆయనే పెద్ద ఆర్థిక వనరుగా వుండేవారు.[41] గొల్ల చంద్రయ్య పరపతి సంఘానికి ఆర్థిక సహాయాన్ని సమీకరించేందుకు పలుమార్లు బర్మా వెళ్లి వచ్చారు. పరపతి సంఘాలు దళితులకు, సన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు పనులు లేని రోజుల్లో రుణాలిచ్చి ఆదుకునేవి. రుణాల మీద వచ్చే వడ్డీ డబ్బును దళిత పిల్లలకు ఉపకారవేతనాలు, ఇతరత్రా ఆర్థిక సహాయం అందించేందుకు వినియోగించేవారు. అనతికాలంలోనే పరపతి సంఘాలు ఆంధ్ర రాష్ట్ర మంతటికీ విస్తరించాయి.[42]

అమలాపురంలో మొట్టమొదటి తూర్పుగోదావరి జిల్లా ఆది ఆంధ్ర మహాజన సభను నిర్వహించిన గొల్ల చంద్రయ్య 1922లో లేబర్ డిపార్ట్‌మెంట్ సహకారంతో అప్పనివానిలంక ఆది ఆంధ్ర పరపతి సంఘానికి 200 ఎకరాల పొలాన్ని, ఇళ్ల నిర్మాణంకోసం ఐదు ఎకరాల స్థలాన్ని సమకూర్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకాలోని దాదాపు అన్ని దళిత వాడల్లోనూ ఆయన పరపతి సంఘాలను ప్రారంభించారు.

చల్లపల్లిలో 1922లో గోద వెంకన్న ఆది ఆంధ్ర క్షేత్రీయ కార్మిక పరపతి సంగాన్ని నెలకొల్పారు. దాని ద్వారా ఆది ఆంధ్రులకు రుణ సౌకర్యాన్ని కల్పించారు. పిఠాపురం మహారాజావారితో తనకున్న స్నేహాన్ని పురస్కరించుకుని ఆయన పరపతి సంఘానికి 100 ఎకరాల ఎస్టేట్ భూమిని సంపాదించిపెట్టారు.[43] ఆయన ఆది ఆంధ్ర ఉద్యమంలో

---

41. బొజ్జా అప్పలస్వామితో జరిపిన ఇంటర్వ్యూ ఆధారంగా.

42. బోయి భీమన్నతో జరిపిన ఇంటర్వ్యూ ఆధారంగా.

43. గోద వెంకన్న 15 జూన్ 1898న చల్లపల్లిలో జన్మించారు. ఉన్నత శిక్షణ అనంతరం చల్లపల్లి ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు.

కీలక సభ్యులుగా వున్నారు. 1937 నుంచి 1942 వరకు తూర్పు గోదావరి జిల్లా ఆది ఆంధ్ర సంఘానికి కార్యనిర్వాహక సభ్యుడిగా పనిచేశారు. 1938లో చల్లపల్లి ఫిర్కా ఆది ఆంధ్ర సదస్సును ఆయనే నిర్వహించారు. దానికి గెద్దా బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు.

అమలాపురంలో అంబటి గంగిశెట్టి ఎన్నో పరపతి సంఘాలను నెలకొల్పారు. వాటికోసం భూములను సమకూర్చారు. బొజ్జా అప్పలస్వామి[44] కందికుప్పలో ఒక పరపతి సంఘాన్ని స్థాపించారు. దానికోసం వందలాది ఎకరాల బంజరు భూమిని సేకరించారు. కాకినాడ తాలూకాలోని పొలమూరుపాడులో ఆయన మరో పరపతి సంఘాన్ని నెలకొల్పారు. ఆ సంఘం కోసం దేవాదాయ బోర్డు నుంచి 300 ఎకరాల భూమిని కూడగట్టారు.

విద్యా సంస్థల స్థాపన

దళిత ప్రజానీకం నిరక్షరాస్యతలో కూరుకుపోయివున్న స్థితిని దృష్టిలో పెట్టుకుని దళిత కూలీలకోసం అనేక పగటి, రాత్రి పాఠశాలలను, దళిత మహిళలకోసం వృత్తి విద్యా సంస్థలను, వసతి గృహాలను నెలకొల్పారు. కొత్త పాఠశాలల స్థాపనే కాకుండా క్రైస్తవ మిషనరీలు నెలకొల్పిన పాత పాఠశాలల్నీ, బ్రిటిష్ వాళ్లు స్థాపించిన ప్రత్యేక పాఠశాలల్నీ కూడా ఆది ఆంధ్ర నేతలు పునరుద్ధరించారు.

1920 దశకం తొలినాళ్లనుంచే దళిత నాయకులు పాఠశాలల స్థాపన కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. వాటిలో 1922లో పొన్నమండలో వుంద్రు తాతయ్య నెలకొల్పిన పాఠశాల ముఖ్యమైనది. ఆ పాఠశాలలో దళిత పిల్లలకు పాఠాలు చెప్పేందుకు అగ్రవర్ణ హిందూ ఉపాధ్యాయులు ముందుకు రాకపోతే వుంద్రు తాతయ్య తన పాత పరిచయాలను

---

44. బొజ్జా అప్పలస్వామి తూర్పు గోదావరి జిల్లాలోని కండికుప్ప గ్రామంలో 19 ఆగస్ట్ 1913న జన్మించారు. అనేక పాఠశాలలను స్థాపించారు, దళితుల కడగండ్లను చిత్రించే నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా దళితులను చైతన్యపరిచేవారు. 1942లోఅమలాపురం తాలూకా షెడ్యూల్డ్ కులాల సమాఖ్యకు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అంబేద్కర్ భావాలను రాష్ట్రమంతటా ప్రచారం చేశారు. గొప్ప వక్త. కొంతకాలం జ్యోతి అనే పక్షపత్రికను వెలువరించారు. బోయి భీమన్న రచించిన సుప్రసిద్ధ నాటకం "పాలేరు"లో నటిస్తూ అనేకసార్లు అగ్రవర్ణ హిందువుల దాడులకు గురయ్యారు. హార్మోనియం కూడా వాయించేవారు. వారితో ఈ రచయిత స్వయంగా ఇంటర్వ్యూ జరిపి వివరాలు సేకరించడం జరిగింది.

వినియోగించి బర్మానుంచి దళిత ఉపాధ్యాయులను రప్పించారు.[45] అనంతవరం, అల్లవరం, మొగలకుదురు మొదలైన చోట్ల పాఠశాల భవనాల నిర్మాణానికి ఆయన ఆర్థిక సహాయం అందించారు. 1930 తొలినాళ్లలో బొజ్జా అప్పల స్వామి కందికుప్పలో ఒక పాఠశాలను స్థాపించారు. దానికి ఆయనే నిర్వాహకుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా వుండేవారు. జాలా రంగస్వామి అనే మరో దళిత మేధావి తన భార్య జాలా మంగమ్మతో కలిసి రామదాసుపేట, కొంటమూరు, కోలమూరు, రాయుడుపాకలు, పాలచర్ల మొదలైన చోట్ల అనేక పాఠశాలలను స్థాపించారు. వారు కొలమూరులో ఒక రాత్రిబడిని కూడా ప్రారంభించారు. ఉపాధ్యాయులకు ఆర్థిక సాయం అందించారు. దళితుల్ని విద్యావంతుల్ని చేసేందుకు ఈవిధంగా అనేకమంది వ్యక్తిగత చొరవచూపడం ఆశ్చర్యం కలిగిస్తుంది.[46]

జాలా రంగస్వామి 1928లో దళిత బాలబాలికలకు విడివిడిగా మొట్టమొదటి వసతి గృహాలను నిర్మించారు. ఆ తరువాత ఎన్నో వసతి గృహాలు వచ్చాయి. వాటిలో ఈలివాడపల్లి 1930లో మండపేటలో నిర్మించిన వసతి గృహం కూడా వుంది. ఆయన రామచంద్రాపురంలో లక్ష్మీ పారిశ్రామిక శిక్షణా పాఠశాలను కూడా స్థాపించారు. వసతి గృహ విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించేందుకు జాలా రంగస్వామి బిక్షాటన కూడా చేశారు. ఆయన చేసిన నిరుపమాన సేవలకు గుర్తింపుగా ఆయన అభిమానులు ఆయనకు 'సేవాదురంధర', 'ఆది ఆంధ్ర మహాత్మ' అనే బిరుదులను యిచ్చారు. ఆయన "జైభీమ్" అనే పత్రికను కూడా వెలువరించారు. ఎన్నో పుస్తకాలు రాశారు. వాటిలో "నిమ్న జాతుల చరిత్ర" ప్రముఖమైనది.

ఇంకా చాలామంది వసతి గృహాలు నిర్మించారు. గొల్ల చంద్రయ్య 1936లో రాజోలులో; పాండు లక్ష్మణ స్వామి రాజమండ్రిలో బాపూజీ హరిజన వసతి గృహాన్ని[47]; పచ్చిపాల రామస్వామి రాచర్లపేటలో గాంధీ స్మారక హరిజన బాలుర వసతి గృహాన్ని; మోక మీరయ్య కాకినాడలో ఆది ఆంధ్ర వసతి గృహాన్ని; మెడిది నారాయణ మూర్తి తునిలో హరిజన వసతి గృహాన్ని నిర్మించారు. వాటిలో అనేకం ప్రభుత్వ నిధులతో నిమిత్తం లేకుండా నడిచాయి.[48] దళిత విద్యార్థులను చైతన్య పరిచేందుకు సంఘటితపరిచేందుకు వారు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించేవారు.

45. కొండా సూర్య ప్రకాశరావు, బిహెచ్ తిరుపతి తో జరిపిన ఇంటర్వ్యూ.

46. కట్టా రామక్క అనే విధవరాలు నైజాం లోని కాల్వ బస్తీలో దళిత బాల బాలికలకు ఒక పాఠశాల నెలకొల్పినట్టు పేర్కొన్నారు. వెంకటస్వామి, 1955.

47. బోజ్జా అప్పలస్వామితో జరిపిన ఇంటర్వ్యూ.

48. కొండా సూర్య ప్రకాశరావుతో జరిపిన ఇంటర్వ్యూ.

కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 1930లలో తీవ్రమైన వ్యవసాయ కార్మిక సమ్మెలు జరిగాయి. ముఖ్యంగా ఆంధ్రలో కమ్యూనిస్టు ఉద్యమం మొదలవడంతో దళిత కూలీలు సంఘటితమై పెద్దఎత్తున ఉద్యమించారు.[49] మార్క్సిజం, సోజలిజం సిద్ధాంతాలు దళితులను విపరీతంగా ఆకర్షించాయి. చాలామంది దళితులు కమ్యూనిస్టులు సాగించిన జమీందారీ వ్యతిరేక ఉద్యమాల్లో చేరారు. దళితుల్లో అత్యధికులు వ్యవసాయ కూలీలు కావడం భూస్వాములలో అత్యధికులు కమ్మ, రెడ్డి కులస్థులు కావడం వల్ల వైరుధ్యాలు ఎక్కువయ్యాయి. కమ్యూనిస్టులు దాదాపు అన్ని గ్రామాల్లో రైతు కూలీ సంఘాలను స్థాపించి అనేక పోరాటాలు చేశారు. వాటిలో తూర్పు గూదావరి జిల్లాలో 1938–39లో జరిగిన మిలిటెంట్ పోరాటం చెప్పుకోతగ్గది. పదమూడు గ్రామాల్లో పదివేలమంది కూలీలు పదిహేను రోజులపాటు సమ్మెచేశారు. తత్ఫలితంగా ప్రభుత్వం నుంచి తీవ్రమైన అణిచివేత ఎదురైంది. ఎందరో జైలు పాలయ్యారు. చాలామంది నాయకులు హత్యకు గురయ్యారు. 1942లో నడవపల్లిలో జరిగిన మరో పోరాటంలో భూస్వాములు కూలీలకు వ్యతిరేకంగా ఆయుధాలు ప్రయోగించారు, పోలీసుల జోక్యం తీవ్రమయింది.[50] 1940వ దశకం మధ్య గుంటూరులో పాలేర్ల సమ్మె జరిగింది.[51] కమ్యూనిస్టు పార్టీలో వ్యవసాయ కూలీ సభ్యుల సంఖ్య 1945–41 కల్లా 60,000కు పెరిగింది. అంతకు ముందు కేవలం 5,000 నుంచి 15,000 మధ్యనే వుండేది.

కమ్యూనిస్టులు దళితులను వర్గ దృక్పథంతో సంఘటితపరిచేవారు. దళితులకూ కమ్యూనిస్టులకూ మధ్య సంబంధాలు ఉన్నతంగా వుండేవి. 1938లో టేకిశెట్టిపాలెంలో జరిగిన వ్యవసాయ కూలీల సభకు దళిత నేత వుండ్రు సుబ్బారావు అధ్యక్షత వహించడాన్ని బట్టి ఆ సంబంధాలను అంచనావేయవచ్చు. ఆ సభను సోషలిస్టులు నిర్వహించారు. జాతీయ కమ్యూనిస్టు నాయకులు బి.టి.రణదివే ఆ సభను ప్రారంభించారు. ఏదిఏమైనా కమ్యూనిస్టులు దళితులలోకి అంత లోతుగా చొచ్చుకుపోలేకపోయారనే చెప్పాలి.[52] అందుకు కొద్ది మినహాయింపులను పక్కన పెడితే కులం, భూస్వామ్య నేపథ్యం ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు.

---

49. ఈ అంశాలను చాలా వరకు గత అధ్యాయాల్లోనే చర్చించడం జరిగింది.

50. బొజ్జా అప్పలస్వామి, కొండా సూర్యప్రకాశరావు, బిహెచ్ తిరుపతిలతో జరిపిన ఇంటర్వ్యూలు.

51. సాపాటి శాంసన్, కర్రు శ్రీరాములుతో జరిపిన ఇంటర్వ్యూలు.

52. బొజ్జా అప్పలస్వామితో జరిపిన ఇంటర్వ్యూ.

దళిత చైతన్యం

ఈనాటి వ్యవస్థ మానవ దోపిడీని పెంచి పోషిస్తోందని గుర్తించిన దళిత మేధావులు సాటి దళిత ప్రజానీకాన్ని విద్యావంతులుగా, చైతన్యవంతులుగా తీర్చిదిద్ది సంఘటితపరిచేందుకు అనేక రకాలుగా కృషిచేశారు. వారు ఎన్నో సంఘాలను, పాఠశాలలను, వసతి గృహాలను ఏర్పాటు చేశారు. సదస్సులను నిర్వహించారు. దళితులు తమకు ఆపాదించబడిన నీచస్థాయి సిద్ధాంతంపై తిరుగుబాటు చేయాలంటూ ప్రబోధించారు. వారు ఒక పక్క హరికథా కాలక్షేపాలు, భజన మండలుల వంటి సుప్రసిద్ధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ మరో పక్క వార్తాపత్రికలు, వార, మాస పత్రికలు వెలువరించారు.

1930లలో వెలువడిన దళిత పత్రికలు అగ్రవర్ణ హిందువులు దళితులపై చేస్తున్న అఘాయిత్యాలను వెలుగులోకి తెచ్చి దళితుల్లో చైతన్యం పెంచడానికి విశేషంగా దోహదం చేశాయి. పత్రికలు దళితుల సమస్యల్ని ఎలుగెత్తి చాటుతూ వారిని చైతన్యపరచడంలో విజయం సాధించాయి. అలాంటి దళిత పత్రికల్లో దిడ్ల పుల్లయ్య వెలువరించిన "ఆది ఆంధ్ర", జాలా రంగస్వామి ప్రచురించిన "వీర భారతి"[53], వుండ్రు సుబ్బారావు ప్రచురించిన "నవజీవన"[54], చుట్టుమళ్ల వెంకటరత్నం ప్రచురించిన "జీవన జ్యోతి"[55] చెప్పుకోదగ్గవి. దళిత మేధావుల రచనలు దళితులంతా ఒక్కటే అన్న భావనను, ఆత్మగౌరవాన్ని పెంపొందించడంలో కీలక పాత్రను పోషించాయి. అవి సమసమాజ భావనను, భవిష్యత్తుపై ఆశావహ దృక్పథాన్ని విస్తరింపజేశాయి. దళితులలోని చదువుకున్న వ్యక్తులు ముఖ్యంగా భాగ్యరెడ్డి వర్మ, సుండ్రు వెంకయ్య వంటివారు దళితోద్యమానికి దశాదిశలనూ, నాయకత్వాన్ని అందించారు.[56] ఉద్యమ ఎజెండాలో అంటరానితన నిర్మూలనమనేదే ప్రధాన కార్యక్రమంగా వుండేది. దళిత మేధావులు ప్రచారం చేసిన ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమం, సిద్ధాంతం బ్రాహ్మణీయ హిందూమతాన్ని, అగ్రవర్ణ హిందువుల సాంప్రదాయాలను తీవ్రంగా విమర్శించింది. ఈ అంశాలు దళిత సాహిత్యంలో, దళిత సాంస్కృతిక సాంప్రదాయాల్లో స్పష్టంగా కనిపించేవి. సమాజంలో అంటరానివాళ్లు ఎదుర్కొంటున్న బాధలు, వేదనలు,

---

53. వజ్రపు సాంబ మూర్తితో జరిపిన ఇంటర్వ్యూ.
54. కుసుమ ధర్మన్న సంపాదకత్వంలో 'జయభేరి' పత్రిక రాజమండ్రి నుంచి వెలువడేది. కాగా 1939లో మద్రాసునుంచి బి.ఎస్. మూర్తి సంపాదకత్వంలో 'నవజీవన' పత్రిక వచ్చేది.
55. బోయి భీమన్నతో జరిపిన ఇంటర్వ్యూ.
56. రావూరి ఏకాంబరంతో జరిపిన ఇంటర్వ్యూ.

అసలు ఈ దేశ మూలవాసులు దళితులే అన్న భావన దళిత సాహిత్యంలో బలంగా వ్యక్తమయ్యేది. 1920, 1930లలో తమ రచనలద్వారా దళితుల్లో చైతన్యం తెచ్చేందుకు, దళితులే ఈ దేశపు మూల వాసులు[57] అన్న స్పృహను కలిగించి, హక్కుల కోసం పోరాడేలా దళితుల్ని సమాయత్తం చేసేందుకు కృషి చేసిన దళిత రచయితలలో బోయి భీమన్న[58], కుసుమ ధర్మన్న[59], జాలా రంగస్వామి[60], గుర్రం జాషువా[61], భాగ్య రెడ్డి వర్మ, నక్కా చిన వెంకయ్య[62], మొదలైన వాళ్లున్నారు.

దళితులలో సంఘీభావాన్ని, గుర్తింపును తెచ్చేందుకు బోయి భీమన్న "మామాలు" అనే కొత్త పదాన్ని ఎక్కువగా వాడేవారు. మామాలు అంటే మాల మాదిగలు అని అర్థం. ఒక మ మాలలకు మరొక మ మాదిగలకు ప్రతీక అన్నమాట.[63] దళిత వర్గాలలో ఐక్యతను తెచ్చేందుకు ఆయన ఉద్దేశపూర్వకంగా ఈ పదాన్ని ప్రచారంలోకి తెచ్చారు. దళితులలోని కులాల మధ్య పరస్పర వైరుధ్యాలు, శతృత్వాల పట్ల గుర్రం జాషువా ఆగ్రహం, అవేదన వ్యక్తం చేసేవారు. అజ్ఞానమే ఇందుకు మూలకారణమని పేర్కొనేవారు. అసలు పంచమ వర్ణ సృష్టిని, దళితులను పంచములుగా పరిగణించే అగ్రవర్ణ హిందువుల తెలివిని సవాలు చేసేవారు.

---

57. ఈ వాదనను తిరిగి 1990లలో దళిత మేధావులు ముందుకు తెచ్చారు. పూర్తి వివరాలకు గోపీనాథ్, లాజర్, 1993 చూడవచ్చు.

58. బోయి భీమన్న దళిత మేదావులలో సుప్రసిద్ధులు. ఆయన పి.ఆర్. కాలేజి, కాకినాడలో డిగ్రీ వరకు చదువుకున్నారు (1936), ఆ తరువాత రాజమండ్రిలో (1937) బి.ఇడి. పూర్తిచేశారు. దళిత పత్రిక జయభేరికి సహ సంపాదకులుగా వుండేవారు. దాదాపు 50 గ్రంథాలు రాశారు. వాటిలో పాలేరు (1940), కూలి రాజు (1947), జానపదుని జాబులు (1940) ప్రముఖమైనవి. పూర్తి వివరాలకు హైమవతి, 1982, జ్ఞానేశ్వర్ 1983 చూడవచ్చు.

59. కుసుమ ధర్మన్న (1896–1948) గొప్ప దళిత మేధావి. ఆది ఆంధ్ర ఉద్యమ నేతల్లో ఒకరు. విశిష్ట రచయిత. ఆయన రచనలు నల్ల దొరతనం (1933), హరిజన శతకం (1933), మద్యపాన నిషేధం (1930).

60. జాలా రంగస్వామి 1904లో రాజమండ్రిలోని కంబలపేటలో జన్మించారు. ఉపాధ్యాయులు. దళిత విద్యకోసం పాటుపడ్డారు. తన భార్య జాలా మంగమ్మతో కలిసి అనేక విద్యా సంస్థల్ని నెలకొల్పారు. ఆయన రచనల్లో అంటరానివారెవరు? (1930), మాలశుద్ధి (1930) ముఖ్యమైనవి.

61. గుర్రం జాషువా(1895–1971) ప్రతిభాశాలి అయిన కవిగా పేరుగాంచారు. ఆయనది బలమైన తిరుగుబాటు స్వరం. తన కవితల ద్వారా కులవ్యవస్థమీద, అంటరానితనంమీద సామాజిక ఆర్థిక అసమానతలమీద విరుచుకుపడ్డారు. ఆయన రచనల్లో ఫిరదౌసి (1932), గబ్బిలం (1941) సుప్రసిద్ధమైనవి.

62. నక్కా చినవెంకయ్య రచనల్లో హరిజన కీర్తనలు (1935) చాలా పేరుగాంచింది.

63. బోయి భీమన్నతో జరిపిన ఇంటర్వ్యూ.

"అమ్మా సావిత్రీ!
బ్రహ్మ దేవునికి నలుగురు కొడుకులు అని విన్నాం!
(బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు)
మరి జంతువుల కంటే నికృష్టంగా వున్న ఈ పంచములు
ఎక్కడి నుంచి పుట్టుకొచ్చారు తల్లీ?"

1920,1930లలో హైదరాబాద్‌లో ఆది హిందూ ఉద్యమం

భారత ఉపఖండంలోనే అతిపెద్ద సంస్థానంగా పేరుగాంచిన హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం పాలనాకాలంలో మరో ఉద్యమం తలెత్తింది[64]. ఈ దేశంపై ఆర్యులు దండెత్తి రాకముందు తామే పాలకులం, మూలవాసులం అనే భావనను చాటేందుకు కోస్తా ఆంధ్ర ప్రాంత దళితులు ఆది ఆంధ్ర అన్న పదాన్ని వాడితే హైదరాబాద్ రాష్ట్ర దళుతులు ఆది హిందూ అన్న పదాన్ని ఉపయోగించారు.[65] దేశంలో 1920లలో పెల్లుబికిన సమకాలీన బ్రాహ్మణేతర ఉద్యమాలలో అంటే పంజాబ్‌లోని ఆది ధర్మ ఉద్యమం, ఉత్తర ప్రదేశ్‌లో ఆది హిందూ ఉద్యమం మొదలైనవాటిలో హిందూ వ్యతిరేక ధోరణులు వుండేవి. మహరాష్ట్ర, మద్రాస్ రాష్ట్రాలు ఆర్యేతర భావనలను దేశమంతటికీ విస్తరించేలా గట్టిగా వ్యవహరించాయి. తక్కువ కులం, తక్కువ స్థాయి గుర్తింపులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా తమ తమ ప్రాంతాలలో ఆర్యుల దండయాత్ర, మతం పేరిట బ్రాహ్మణులు సాగిస్తున్న దోపిడీ విధానాలపై దళితులు వాదనలు చేయడం మొదలు పెట్టారు.[66]

హైదరాబాద్ ఉద్యమానికి సంబంధించినంతవరకు 1922 కీలక సంవత్సరం.

---

64. కోస్త ఆంధ్ర ప్రాంతం ప్రారంభించిన ఆది ఆంధ్ర ఉద్యమంతో హైదరాబాద్ స్ఫూర్తిపొందింది. దానికి సిద్ధాంతపరంగా, నాయకత్వపరంగా మద్దతు పలికింది. అయితే వారు ఆది ఆంధ్ర పదానికి బదులు ఆది హిందూ పేరిట తమ ఉద్యమాన్ని సాగించారు.

65. అలహాబాద్‌లో 16 నవంబర్ 1930న జరిగిన అఖిల భారత ఆది హిందూ (బడుగు వర్గాల) 8వ మహాసభ చివర 12 తీర్మానాలను ఆమోదించారు. అందులోని 6వ తీర్మానం ఇలా వుంది: ' కేంద్ర రాష్ట్ర చట్ట సభల్లో ఆది హిందువులకు (బడుగు వర్గాలకు) వారి జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలని మహాహాభ డిమాండ్ చేసింది. అందుకు అవసరమైన రాయితీలు కల్పించి మరీ ప్రాతినిధ్యం సమంగా వుడేలా చూడాలి. ఎందుకంటే ఈ దేశానికి ఆర్యులు దండెత్తి రాకముందు వారే ఇక్కడిదీ మూలవాసులు, పాలకులు. చూ. భాగ్యరెడ్డి వర్మ రచనలు.

తమను ప్రాంతీయ పేర్లతో ఆది అన్న పదాన్ని చేర్చి ఆది ఆంధ్రులు, ఆది ద్రావిడులు మొదలైన పేర్లతో సంబోధించాలంటూ దళితులు సమర్పించుకున్న విజ్ఞప్తులను మద్రాస్ ప్రభుత్వం ఆమోదించిన తరువాత భాగ్యరెడ్డి వర్మ తను 1911లో స్థాపించిన మన్య సంఘానికి 1922లో 'ఆది హిందూ సామాజిక సేవా సమాఖ్య' అని పేరు మార్చారు. ఆయన మొట్ట మొదటి ఆది హిందూ సామాజిక సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించారు. ఆ సదస్సుకు బొంబాయి ప్రెసిడెన్సీలోని బెల్గాంకు చెందిన టి.జె. పాపన్న[67] అధ్యక్షత వహించగా, యం.ఎల్. ఆదెయ్య[68] ఆహ్వాన సంఘం చైర్మన్‌గా వ్యవహరించారు. ఆ సదస్సు మూడు రోజులపాటు (29–31 మార్చి1922) జరిగింది. బొంబాయి, పూనె, కరాచి, అకోలా, అమరావతి, నాగపూర్, రాయపూర్ మొదలైన ప్రాంతాల నుంచి దళితులు సదస్సులో పాల్గొని దానికి అఖిల భారత స్వభావాన్ని నిండుగా సమకూర్చారు. మద్రాస్ ప్రెసిడెన్సీలోని కోస్తా ఆంధ్ర ప్రాంతం నుంచి కూడా అనేకమంది ఆ సదస్సులో పాల్గొన్నారు. మొదటి రెండురోజులు కేవలం దళితులకు మాత్రమే వేదికగా వుండి చివరి రోజు మాత్రం ఆది హిందువులకు, అగ్రవర్ణ హిందువులకు, ఇంకా ఇతర్లందరికీ వేదికయింది. ఆ సందర్భంగా ప్రముఖ అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తలు, మానవశాస్త్రజ్ఞులు అయిన జస్టిస్ రాయ్ సి. బాలముకుంద్, పండిట్ కేశవరావు, సేథ్ లాల్జీ మేఘ్‌జీ జైన్, ప్రొఫెసర్ నారాయన్ గోవింద్ వెల్లింకర్, ఆర్.ఇ.రిపోర్టర్ మొదలైన వాళ్లు సభలో ప్రసంగించారు. దళితులకు సంబంధించి హైదరాబాద్‌లో అదే ప్రధాన సంస్థగా మారింది. 1924లో అరిగే రామస్వామి ఆది హిందూ జాతీయోన్నతి సభను స్థాపించారు. ఆ సంస్థ ప్రధానంగా నీచ జన్మ సిద్ధాంత

---

66. *ఆది అనే సిద్ధాంత భావన లేదా ఈ దేశపు నిజమైన మూలవాసులం అన్న ఆలోచన దేశవ్యాప్తంగా విస్తరించింది. దళితోద్యమంలో ఎక్కువగా కనిపించే పదజాలం ఇలా వుంది: పంజాబ్‌లో ఆది ధర్మ, ఉత్తర ప్రదేశ్, హైదరాబాద్‌లలో ఆది హిందూ; ఆంధ్రలో ఆది ఆంధ్ర; మద్రాస్‌లో ఆది ద్రావిడ. ఇవన్నీ అసలైన మూలవాసులం తామే అన్న భావన నుంచి వచ్చినవే. మహరాష్ట్ర విషయంలో భగవత్, 1980; ఉత్తర్ ప్రదేశ్ విషయంలో ఖారే, 1984 మరియు లించ్, 1969; పంజాబ్ విషయంలో జుర్గన్స్‌మెయర్, 1978; ఓంవెట్, 1995 రచనలు చూడవచ్చు.*

67. *ప్రస్తుతం కర్ణాటకలో వున్న బెల్గాం అప్పట్లో బొంబాయి ప్రెసిడెన్సీలో వుండేది.*

68. *మన్య సంఘం శాఖను ఒకదాన్ని ఆయన 1922లో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేశారు. దానికి ఆయన అధ్యక్షులుగా, పి.ఆర్. వెంకటస్వామి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. బిహెచ్ తిరుపతితో జరిపిన ఇంటర్వ్యూ ఆధారంగా.*

నిర్మూలన, ఆది హిందూ, ఆర్యేతర సర్వమానవ సమానత్వ సాంప్రదాల ప్రచారం లక్ష్యంగా పెట్టుకుని అంతర్గత సంస్కరణకోసం కృషి చేసింది.

1920–1930లలో వారు హైదరాబాద్ రాష్ట్రంలో ఎన్నో సదస్సులను నిర్వహించారు. అయితే అవి కోస్తా ఆంధ్ర ప్రాంతంలో మాదిరిగా గ్రామీణ నేపథ్యంలో మాత్రం జరుగలేదు. 1925లో భాగ్యరెడ్డి వర్మ ఆది హిందూ వర్గాలకు చెందినవారి పెయింటింగ్‌లు, స్కెచ్‌లు, శిల్పాలు మొదలైనవాటితో హైదరాబాద్‌లోని రెసిడెన్సీ బజార్ (దీనిని ఇప్పుడు సుల్తాన్ బజార్ అంటున్నారు)లో ఒక ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. దానిని గోస్వామి రాజా ధనరాజ్ గిరి నర్సింగ్‌జీ ప్రారంభించారు. ఆ ఎగ్జిబిషన్ నిర్వహణ వెనకున్న ముఖ్యోద్దేశం దళితులు తమ నైపుణ్యాలను అభివృద్ధిపరచుకునేందుకు ఎలాంటి సౌకర్యాలకు, అవకాశాలకు నోచుకోకపోయినా చిత్రకళ తదితర కళల్లో ఏమాత్రం వెనుకబడిలేరనీ, వారికీ అద్భుతమైన నైపుణ్యాలున్నాయనీ లోకానికి చాటిచెప్పడమే. 1925లో ప్రేమ్ థియేటర్ మైదానంలో ప్రఖ్యాత భారత మల్లయోధుడైన కోడి రామ్మూర్తి నాయుడు అధ్యక్షతన ఆది హిందూ యూత్ జిమ్నాస్టిక్స్ పోటీలను నిర్వహించారు. ఎంతో క్రమశిక్షణతో జరిగిన ఆ పోటీలపట్ల ప్రసన్నుడైన కోడి రామ్మూర్తి నాయుడు దళిత యువతలో ప్రాచీన ఆయుధవిద్యలో అపారమైన నైపుణ్యం వుందని ప్రశంసించారు. నిజమైన భారత పుత్రులు వీరే అనీ, తమ సర్వస్వాన్ని ధారపోసి ప్రాచీన భారత సంస్కృతిని కాపాడుతున్నారనీ ఆయన మెచ్చుకున్నారు.[69]

1920 నుంచి అత్యధిక అఖిల భారత ఆది హిందూ (బడుగువర్గాల) సదస్సులు ఉత్తర, మధ్య భారతదేశంలోనే అంటే ఢిల్లీ, అలహాబాద్, లక్నో, నాగపూర్‌లలో జరిగాయి. దక్షిణ భారత దళిత నేతలు ఆ సదస్సుల్లో పాల్గొన్నారు. 1927, 1930 లలో అలహాబాద్ లో జరిగిన సదస్సుల్లో భాగ్యరెడ్డి వర్మ స్వయంగా దక్షిణ భారతానికి ప్రాతినిధ్యం వహించారు. ఇతర ప్రాంత దళిత నేతలతో ముఖ్యంగా మద్రాస్‌కు చెందిన యం.సి. రాజయ్య, బొంబాయికి చెందిన బి.ఆర్. అంబేద్కర్, చావన్‌పూర్ (ఉత్తరప్రదేశ్)కు చెందిన స్వామి అచ్యుతానంద్, బెంగాల్‌కు చెందిన బాబు శివప్రసాద్ రజక్, ఢిల్లీకి చెందిన బాబూ విర్రాట్న దేవీ దాస్, పంజాబ్‌కు చెందిన మనీష్ డియో మొదలైన వారితో భాగ్యరెడ్డి వర్మ సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకున్నారు.

రెండవ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ సందర్భంగా 1931లో లక్నోలో తొమ్మిదవ అఖిల భారత ఆది హిందూ సదస్సు తాలూకు ఒక ప్రత్యేక రాజకీయ సమావేశం

---

69. మాదిగలు సాంప్రదాయికంగా చర్మ కార్మికులు. ఉత్తర భారత దేశంలోని చమార్లు, మహారాష్ట్రలోని చంబాలార్లు వీరికి సమానమైన కులాలకు చెందిన వాళ్లు.

జరిగింది. భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించిన ఆ సదస్సునకు భారత దేశం నలుమూలలనుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. భారత దేశంలోని మొత్తం తొమ్మిది కోట్ల ఆది హిందువులకు (అంటరానివాళ్లకు) బి.ఆర్. అంబేద్కర్‌ని ఏకైక ప్రతినిధిగా గుర్తిస్తూ వారి తరఫున ఇకనుంచీ ఆయనే సాధికారికంగా మాట్లాడతారంటూ ఆ సమావేశంలో ఒక విశిష్టమైన తీర్మానాన్ని ఆమోదించారు. ఆది హిందువులకు (అంటరానివాళ్లకు) తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రత్యేక ఎలెక్టొరేట్‌ను ఏర్పాటు చేయాలంటూ మరో తీర్మానాన్ని కూడా ఆ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ సమావేశం సందర్భంగా ఓ ఆసక్తిదాయకమైన సంఘటన జరిగింది. కొందరు ప్రతినిధులు 'వర్మ' అనే పదం ఆర్య హోదాను సూచిస్తోంది కాబట్టి భాగ్యరెడ్డి వర్మ తన పేరు లోంచి ఆ పదాన్ని తొలగించుకుంటే బాగుంటుందని సలహా యిచ్చారు. దాంతో బాగ్యరెడ్డి వర్మ వెంటనే స్పందించి ఎలాంటి వివాదానికి అవకాశం లేకుండా తన పేరులోని వర్మ అనే పదాన్ని విసర్జిస్తున్నట్టు ప్రకటించి అప్పటికప్పుడు పత్రాల మీద భాగ్యరెడ్డి మాత్రమే సంతకం చేశారు.

దేశవ్యాప్తంగా దళితులలో చైతన్యం పెరగడంతో పాటు కుల వ్యతిరేక స్పృహ కూడా పెరగడంతో 1920, 1930లలో సిద్ధాంతపరంగా 'ఆది' ప్రధానాంశంగా మారిపోయింది. ప్రభుత్వ జనాభా లెక్కలు సాంస్కృతిక చర్చకు దోహదం చేశాయి. 1931 హైదరాబాద్ రాష్ట్ర జనాభా లెక్కలు హిందూమతం పట్ల భిన్న దృక్పథాల రీత్యా అంటరానివాళ్లను నిలువునా చీల్చివేశాయి.[70]

అగ్రవర్ణ హిందువులు మౌనంవహించడంతో అసలు ఆది హిందువులు హిందువులా కాదా అన్న వాదన ముందుకొచ్చింది. పరస్పరం విభేదించుకునే రెండు ఆది హిందూ వర్గాలు ఈ చర్చలో పాలుపంచుకున్నాయి. చరిత్ర, తాత్వికదృక్పథం, నాగరికతల రీత్యా ఆది ద్రావిడులది ప్రత్యేక వర్గమనీ, బడుగువర్గ ప్రజలే ఈ దేశపు నిజమైన మూలవాసులనీ, హిందూ మతంగా పరిగణించబడే వైదిక మతానికీ ఆది ద్రావిడుల మతానికీ సంబంధంలేదనీ ఆది ద్రావిడ సమాఖ్య వాదించింది. ఆ సమాఖ్య ఉద్దేశ్యం ప్రకారం హిందూ మతం ఈ దేశ మూలవాసుల మతం కాదు. భారతదేశపు వైదికేతర వర్గాల వారు తమ స్వతసిద్ధ ఉద్యమ సిద్ధాంతాలు, ఆచార వ్యవహారాలు శతాబ్దాలకిందటే తమను అగ్రవర్ణ హిందువుల నుంచి వేరు చేశాయి. ఆర్యులు ఈ

---

70. 1931 నాటి భారత జనాభా లెక్కలు. హైదరాబాద్ రాష్ట్రం సంపుటి 23 పార్ట్ 1 నివేదిక.

దేశంమీద దండెత్తి వచ్చినప్పుడు తమతో పాటు వైదిక మతాన్ని వెంటతెచ్చారు. వైదికేతర మూలవాసుల మీద ఆ మతాన్ని బలవంతంగా రుద్దారు. క్రమేణా హిందువుల ప్రాబల్యానికి గురై ఈ దేశ మూలవాసులు అర్థమనస్కంగానే హిందూ భావజాలాన్ని, ఆచారాలను పాటించడం మొదలుపెట్టారని పేర్కొన్నారు. అయితే ఆది హిందువులలోని మరో వర్గంవారు ఆ వాదనను గట్టిగా వ్యతిరేకించారు. ఆది ద్రావిడ విద్యా సమాఖ్య ఒక విధమైన విద్వేషభావనతో తన ప్రత్యేకతను చాటుకునేందుకు అలాంటి వాదన చేస్తోందంటూ ఎద్దేవా చేశారు. బడుగువర్గాల వారి దైవ భావనలు, పూజించే విధానం, ఆచార వ్యవహారాలు, వేసుకునే దుస్తులు, సామాజిక జీవన విధానం అన్నీ కూడా అచ్చం అగ్రవర్ణ హిందువుల పద్ధతులనే పోలివున్నాయి కాబట్టి ఆది హిందువులు (అంటరానివాళ్లు) హిందువులే అంటూ ప్రతివాదనలు చేశారు.

ఆది ద్రావిడ విద్యా సమాఖ్య ముందుకు తెచ్చిన వాదనలాంటి వాదోపవాదాలు ఉత్తర భారతదేశంలోని ఆగ్రా చమర్ల మధ్య కూడా జరిగాయి. ఆదిహిందువులుగా పరిగణించబడుతున్న అంటరానివాళ్లు అంటే ఉత్తరాదికి చెందిన నెగర్‌లు లేదా దాసులు, దక్షిణాదికి చెందిన ద్రావిడులే ఈ ఉపఖండపు మూలవాసులనీ, నిజమైన భారతదేశపు యజమానులు నిర్ద్వంద్వంగా వారేననీ, ఆర్యులతో సహా ఇతరులంతా కేవలం వలసవాదులనీ వాదించారు. కుట్రలు, కుతంత్రాలు, మోసాలతో వారు ఈ దేశపు మూలవాసులను లొంగదీసుకున్నారనీ అందుకే హిందువులూ అంటరానివాళ్లూ పరస్పర శాశ్వత శత్రువులుగా మిగిలిపోయారనీ పేర్కొన్నారు.

మద్రాస్ ప్రెసిడెన్సీలోని తమిళం మాట్లాడే ప్రాంతాలలోని దళితులు తమను తాము ఆది ద్రావిడులుగా పరిగణించుకుంటే – తెలుగు మాట్లాడే ప్రాంతాలలోని హైదరాబాద్ దళితులు తమను తాము ఆది హిందువులుగా పరిగణించుకున్నారు. అయితే ఇక్కడ ఆది హిందువులు వాడే హిందూ పదం మతాన్ని కాకుండా దేశాన్ని సూచిస్తుంది. ఈ దేశాన్ని విదేశస్తులు హిందూ దేశంగా సంబోధిస్తుండడంనుంచి వచ్చిన పదం అది. ఆది హిందువులు పఠనాలయాలు, భజన మండలులు ద్వారా దళితులలో చైతన్యాన్ని, ఆత్మగౌరవాన్ని, ఈ దేశ మూలవాసులం తామేనన్న స్పృహను పెంపొందించేందుకు కృషి చేశారు. వలస వచ్చిన విదేశీయులు తమను తాము రక్షకులుగా అభివర్ణించుకోవడాన్ని, వారి శాస్త్రాలలోని, పురాణాలలోని పక్షపాత ధోరణులను ఎండగట్టారు.

ఆది హిందూ (బడుగువర్గాల) రాజకీయ సదస్సు బ్రిటిష్ ఆధీనంలో వున్న బొల్లారం (సికింద్రాబాద్)లో జరిగింది. అప్పటి నిజాం ప్రభుత్వం తన పరిధిలో

ఎక్కడా రాజకీయ సభలు, సమావేశాలను జరగనిచ్చేది కాదు. అందుకే వారు బొలారం ప్రాంతాన్ని ఎన్నుకున్నారు. ఆ తరువాత 1933లో బాగ్యరెడ్డి వర్మ అధ్యక్షతన నాగపూర్‌లో రెడ్డి భూమి నవయువక మండలి వారు ఆది హిందూ సదస్సును నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ పాల్గొన్న చిట్ట చివరి సదస్సు అదే. ఆ తరువాత ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది.[71]

1930, 1940లలో దళితుల మధ్య ముఠాల పోరు చోటుచేసుకుంది. బడుగు వర్గాల శ్రేయోభిలాషులమని చెప్పుకునేవాళ్లే అంటరాని వాళ్ల మధ్య లేనిపోని మాటలతో చిచ్చుపెట్టేందుకు, దళిత సదస్సులను విఫలం చేసేందుకు ప్రయత్నించారని చాలామంది దళిత నేతలు చెప్పారు.

1930 దశకం చివరలో హైదరాబాద్ దళిత రాజకీయాలు పోటాపోటీ పోరాటాలుగా మారాయి. ఉద్యమంలో చీలికలు వచ్చాయి. ప్రత్యర్థి ఆది హిందూ సంస్థలు ఏర్పడ్డాయి. కులపంచాయితీల పోటీ సంస్కరణలు తరచూ భౌతిక దాడులకు ప్రతిదాడులకు దారితీశాయి.[72] బి.ఎస్. వెంకటరావుకూ[73] అరిగే రామస్వామికి మధ్య ఆతరువాత సుబ్బయ్యతో విభేధాలు తలెత్తాయి. భాగ్యరెడ్డి వర్మ మాలల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ ప్రత్యర్థి వర్గాలు విమర్శించడం మొదలు పెట్టారు. ఉద్యమంలో చీలిక విధానాలు వెల్లువెత్తాయి. ఆది హిందూ ఉద్యమానికి వచ్చిన ఈ గుర్తింపు స్వతంత్ర మాదిగల సంస్థ ఆవిర్భావానికి దారితీసింది. దానికి అగ్రవర్ణ హిందువుల నుంచి మద్దతు కూడా లభించింది. అరుంధతీయ మాతంగి సభ, అరుంధతీయ మహాసభ మాదిగల సంస్థలుగా ముందుకొచ్చాయి. వారు స్వతంత్రంగా తమ డిమాండ్లను ప్రచారంలో పెట్టారు. ఆతదనంతరకాలంలో హైదరాబాద్

---

71. యం.బి. గౌతమ్‌తో జరిపిన ఇంటర్వ్యూ.

72. వెంకటస్వామి వ్యాఖ్యానాన్ని బట్టే ఈ ప్రాంతంలో ముఠాతత్వం ఎంతగా పెరిగిందో స్పష్టమవుతోంది.

73. ఈయన అసలు పేరు బత్తుల ఆశయ్య. సికిందరాబాద్‌లోని ఘాస్‌మండి ప్రాంతంలో ఓ యురోపియన్ కుటుంబానికి సేవచేసే తల్లిదండ్రులకు జన్మించారు. ఆయన దేహ దారుఢ్యం, లావుపాటి శరీరం వల్ల ఆయనకు 'దొబ్బ' అనే మారుపేరు వచ్చింది. ఆ తదనంతరకాలంలో ఆయన బి.ఎస్. వెంకటరావుగా ప్రసిద్ధులయ్యారు. నిజాం ప్రభుత్వ ప్రజాపనుల శాఖలో ఆయన ఉద్యోగం చేశారు. ఆ తరువాత నిజాంసాగర్‌లో అసిస్టెంట్ రిక్రూటింగ్ అధికారిగా నియమించబడ్డారు.

నేతలలో ఎవరూ కూడా ప్రజా ఉద్యమాన్ని నిర్మించలేకపోయారు.[74] హైదరాబాద్ రాష్ట్రంలోని ఆది హిందూ ఉద్యమం చాలావరకు గ్రామీణ ప్రాంతాలకు దూరంగా కేవలం నగరాలమీదనే దృష్టిని కేంద్రీకరించింది. హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలకు చెందిన గ్రామాల్లో క్రమేణా కమ్యూనిస్టులు తమ ప్రాబల్యాన్ని పెంచుకుంటే మరాఠీ మాట్లాడే ప్రాంతాలలో మాత్రం అంబేడ్కర్ ఉద్యమం నిలదొక్కుకోగలిగింది.

ఎన్నో నినాదాలు - ఎటు వెళ్లాలో తెలియని స్థితి:

1940లలో దళితోద్యమం

అనేక కారణాల వల్ల కోస్తా ఆంధ్రలో దళితోద్యమం 1940ల నాటికి క్రమంగా క్షీణదశకు చేరుకుంది. ఒక పక్క గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ హిందూమత సంస్కరణల పరిధిలోకి దళితులను చేరుస్తూ అనుసరించిన విధానం, మరో పక్క కమ్యూనిస్టు ఉద్యమం గ్రామగ్రామాన ఒక క్రమపద్ధతిలో భూమిలేని వ్యవసాయ కూలీలను సంఘటితం చేస్తూ పోవడం దళిత ఉద్యమ పునాదులను బలహీనపరిచాయి. 1920లలో, 1930లలో దళితోద్యమంలో ఎంతో చురుకుగా పనిచేసిన బి.ఎస్. మూర్తి, గెద్దాడ మహాలక్ష్మి, వేముల కూర్మయ్య, చుట్టుమల్ల వెంకటరత్నం, జాలా రంగస్వామి, వుంద్రు సుబ్బారావు, నరాలశెట్టి దేవేంద్రుడు వంటి నాయకులు ఒక్కరొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో కలిసిపోయారు. మరోపక్క దిగువ స్థాయి మిలిటెంట్ దళిత క్యాడర్ కమ్యూనిస్టుల వ్యవసాయ కూలీ సంఘాల్లో చేరిపోయారు. అదేవిధంగా దళితోద్యమంకోసం కృషిచేసిన గుంటూరు బాపయ్య, ప్రసాదరావు, యం. శ్రీరాములు, కోనేరు రంగారావు, ఆర్.ఎ. కోటయ్య, కె. నాగభూషణం, కె. మోహహనరావు, కోనాడసూర్యప్రకాశరావు మొదలైన యువ నేతలు 1940 దశకం ప్రారంభంలో వ్యవసాయ కూలీ సంఘాలకు అంకితమయ్యారు. ఆ రెండు ఉద్యమాలు దళితులను ఒక పథకం ప్రకారం తమ పార్టీలవైపునకు మలచుకున్నాయి.

అంతర్గతంగా ఎన్ని వైరుధ్యాలున్నప్పటికీ 1930లలో, 1940లలో మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడేవారి ప్రాంతాలన్నీ ఒక్కటిగానే పరిగణించబడేవి. ఒక ప్రాంతంలోని పరిణామాలు మరో ప్రాంతంపై ప్రభావం చూపేవి. మొత్తం తెలుగు ప్రాంతాలను ఒకే చోదక శక్తి ముందుకు తీసుకెళ్తున్నట్టుగా వుండేది. కొన్ని అఖిల భారత స్థాయి పరిణామాలకు కూడా ఈ ప్రాంతం వేదికగా మారింది. ఆంధ్రాలోని

---

74. ఇది కొంతవరకు హైదరాబాద్ నగర ప్రాంతం కావడం వల్ల, భాగ్యరెడ్డి వర్మ ఆరోగ్యం క్రమంగా క్షీణించడం వల్లనే జరిగిందని చెప్పవచ్చు. ఆయన 1939లో చనిపోయారు.

బలమైన రైతాంగ ఉద్యమం, ఆ పొరుగుననే వున్న హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చెలరేగిన ప్రతిఘటనా పోరాటం, దేశ వ్యాప్తంగా వెల్లువెత్తిన రాడికల్ రాజకీయ చైతన్యం అన్నీ కలిసి ఆంధ్రాలో విప్లవోద్యమానికి నాందిపలికాయి. దళితోద్యమం బలహీనపడేందుకు అదే మూలకారణమయింది.

ఇంతకు ముందే పేర్కొన్నట్టు నిర్వహణ స్థాయిలో దళితులకు స్వయం ప్రతిపత్తినిచ్చేందుకు కమ్యూనిస్టులు సిద్ధంగా లేరు.[75] మరోపక్క సాంస్కృతిక స్థాయిలో బ్రాహ్మణీయ హిందూత్వ కోణంలో రూపొందించిన భారత చరిత్రకు ప్రత్యామ్నాయాన్ని అందించడంలో కూడా కమ్యూనిస్టులు విఫలమయ్యారు.[76] ఇందుకు ముఖ్యకారణం 1930లలో, 1940లలో వచ్చిన కమ్యూనిస్టు నాయకులంతా బ్రాహ్మణ లేదా ఇతర అగ్రకులాలకు చెందివాళ్లు కావడమే. అప్పటికే దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం సుస్థిరమైపోయింది. హరిజన్ సేవక్ సంఘ్ పేరుతో దళితులను ఆకర్షించేందుకు 1932లో కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన ప్రయత్నాలు 1940లనాటికి బాగా ఊపందుకున్నాయి. హరిజన్ సేవక్ సంఘ్ శాఖలు జిల్లాల స్థాయికి గ్రామాల స్థాయికి విస్తరించాయి. అది కోస్తా ఆంధ్ర ప్రాంతంలో దళిత ఉద్యమాన్ని బాగా దెబ్బకొట్టింది.

అటు కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష కమ్యూనిస్టు పార్టీలు అంబేద్కర్ వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించి ఆంధ్ర దళితోద్యమాన్ని ముక్కలుగా చేసి దాని స్వయం ప్రతిపత్తిని నాశనం చేశాయి.[77] 1939లో భాగ్యరెడ్డి వర్మ చనిపోయిన తరువాత మళ్లీ అంతటి నాయకత్వం లభించకపోవడంతో కోస్తా ఆంధ్రలోనూ, హైదరాబాద్ రాష్ట్రంలోనూ దళితోద్యమం బలహీనపడింది. ఈ అవకాశాన్ని అదనుగా చేసుకుని ఆయా రాజకీయ పార్టీలు దళితులకు చిల్లరమల్లర రాయితీలను ఎరగావేసి తమలో

---

75. గుంటూరు జిల్లా దళిత కమ్యూనిస్టు నాయకులతో 'ఎదురీత' సంపాదకులు యు. సాంబశివరావు ఇంటర్వ్యూలు జరిపారు. 1994.

76. కొండా సూర్యప్రకాశరావుతో జరిపిన ఇంటర్వ్యూ. ఆయన కృష్ణా జిల్లా, గుడివాడ తాలూకా, పెదపాలాపర్రులో 15 ఫిబ్రవరి 1910లో దళిత ఒక శ్రామిక కుటుంబంలో జన్మించారు. 1930లో ఎస్ఎస్ఎల్‌సి ఉత్తీర్ణులయ్యారు. ఆ తరువాత పిఠాపురం రాజావారు కాకినాడలో నిర్మించిన కాలేజీలో ఇంటర్ చేశారు. ఆయన కమ్యూనిస్టు ఉద్యమ తొలి కార్యకర్త. కృష్ణా జిల్లా వ్యవసాయ కూలీ సంఘం అధ్యక్షులుగా (1941) వ్యవసాయ కూలీలను సంఘటితపరిచారు. ఆతదనంతరం షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్‌లో చేరారు.

77. రావూరి ఏకాంబరంతో జరిపిన ఇంటర్వ్యూ. ఆయన గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీలో చేరారు. హరిజన సేవక్ సంఘ్‌లో చాలా చురుకుగా పనిచేశారు. ఆ తరువాత గట్టి అంబేద్కర్ వాదిగా మారారు. ఆయన "నరుడో అంబేద్కరుడా" అనే కావ్యం రాశారు.

చేర్చుకుని వారిలో ముతాతత్వాన్ని పెంచాయి. ఈ పరిస్థితి గురించి దళిత నాయకులు కొందరు సైమన్ కమిషన్ ముందు అప్పుడే వ్యక్తం చేశారు.[78] ఉదాహరణకు ఆది ఆంధ్రస్థాయీ సంఘం అధ్యక్షులు కార్యనిర్వాహక సభ్యులు అయిన గొల్ల చంద్రయ్యకూ కుసుమ వీరస్వామికీ మధ్య తీవ్ర అభిప్రాయభేదాలు రాజుకున్నాయి. దాంతో కుసుమ వీరస్వామి ఆ సంస్థ నుంచి బయటకు వెళ్లి పండు లక్ష్మణ స్వామి, నక్క వెంకటరెడ్డితో కలిసి మరో సంస్థను ఎర్పాటు చేసుకున్నారు.[79]

ఈ విభేదాల ప్రభావం జిల్లా స్థాయి సంఘాల మీద కూడా ప్రసరించింది. గెద్దాడ బ్రహ్మయ్య, పాము రామ్మూర్తిల మధ్య ఏర్పడ్డ విభేదాలు కేవలం సంస్థ పనితీరుకు సంబంధించినవి. ప్రతి సందర్భంలో కుసుమ ధర్మన్న జోక్యం చేసుకుని సర్దిచెప్పేవారు. కానీ ఆ విభేదాలకు దీర్ఘకాలిక పరిష్కారం కనుగొనలేకపోవడంతో వారి మధ్య సఖ్యత ఎంతో కాలం కొనసాగలేదు.

ఆది ఆంధ్ర సదస్సుల నిర్వహణ మొదలైన నాటినుంచే దళిత నాయకులు ఏకగ్రీవ తీర్మానాల రూపంలో బ్రిటిష్ ప్రభుత్వం పట్ల తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తూ వచ్చారు. వాళ్లు జస్టిస్ పార్టీని కూడా సమర్థించారు. 1930లలో. 1940లలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దళిత ఉపాధ్యాయులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేసి ఉద్యమాన్ని దెబ్బతీసింది.

బి.ఆర్. అంబేడ్కర్ 1944 సెప్టెంబర్‌లో ఆంధ్రాలో జరిపిన పర్యటన దళిత యువకులకు నూతనోత్తేజాన్నిచ్చింది. అప్పుడు బుల్లాస్ స్వామి నాయకత్వంలో షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ శాఖను ఏర్పాటు చేశారు. ఆ సంస్థను అభివృద్ధిపరిచే లక్ష్యంతో అంబేడ్కర్‌ను ఆహ్వానించడంలో నందనార్ హరి, ఈలివాడపల్లి ముఖ్య పాత్రను పోషించారు. ఆ పర్యటన సందర్భంగా అంబేడ్కర్ అనేక సభల్లో ప్రసంగించారు.

---

78. అఖిల భారత ఆది ద్రావిడ మహాజన సభ, మద్రాస్‌వారు అరుంధతీయ మహాసభ వారు మద్రాస్‌లో 21 ఫిబ్రవరి 1929న మౌఖికంగా యిచ్చిన వివరాలు. ఇండియన్ స్టాట్యుటరీ కమిషన్, 1930 బి 27వ సంపుటి, రెండో భాగం కూడా చూడండి.

79. నక్కా వెంకట రెడ్డి అమలాపురం తాలూకా మమ్మిడివరం శివారుపల్లి గ్రామంలో 4 జనవరి 1892న జన్మించారు. ఆయన కొమూనపల్లిలో (1909) ఉపాధ్యాయ నిర్వాహకుడిగా పనిచేశారు. ఆ తరువాత ముమ్మడివరంలో ఆది ఆంధ్ర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియమించబడ్డారు. ఆయనకు జస్టిస్ పార్టీకి చెందిన బ్రాహ్మణేతర నాయకులతో, ఉద్యమంతో సన్నిహిత సంబంధాలుండేవి. అనేకమంది దళిత యువకులను ఉద్యమంలో చేరేట్టు ప్రోత్సహించారు. వారిలో పాము రామమూర్తి, ఈలివాడపల్లి వంటివారున్నారు. 1937 నుంచి 1942 వరకు ఆయన తూర్పు గోదావరి జిల్లా ఆది ఆంధ్ర మహాజనసభ కార్యనిర్వాహక మండలి సభ్యులుగా వున్నారు.

వాటిలో జాలా రంగస్వామి, ఈలివాడపల్లి, పాము రామ్మూర్తి అధ్యక్షతన రాజమండ్రి, రామచంద్రాపురం, కాకినాడల్లో జరిగిన సభలు ముఖ్యమైనవి. 1946లో జరిగిన ఎన్నికలలో వడపల్లి, గెద్దాడ బ్రహ్మయ్య, పిట్టా వెంకటేశ్వర్లు కాకినాడ, అమలాపురం, పెద్దాపురం నియోజకవర్గాలనుంచి పోటీ చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బి.ఎస్. మూర్తి, పండు లక్ష్మణస్వామి చేతుల్లో వారు ఓడిపోయారు. ఆ తదనంతరం ఫెడరేషన్ తన బలాన్ని పెంచుకోలేకపోయింది. అప్పటికే చెల్లా చెదరైపోయిన దళిత ప్రజానీకం కమ్యూనిస్టులతో, కాంగ్రెస్ పార్టీతో పోటీపడలేకపోయారు.

క్రమేణా దళిత నాయకులలలో చాలామంది హరిజనోద్ధరణ గుర్తింపును కలిగివుండి, హిందూ గుర్తింపును ప్రవచించే కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దానిని గట్టిగా వ్యతిరేకించేందుకు ప్రయత్నించిన కుసుమ ధర్మన్న వంటి నాయకులు వారి ముస్లింమత అనుకూల విధానం కారణంగా ప్రభావం చూపలేకపోయారు. అంబేద్కర్ వర్గీయుల సిద్ధాంత పత్రిక అయిన జయభేరిలో దళితులంతా ముస్లిం మతంలో చేరాలంటూ ఆయన పిలుపునిచ్చారు. హిందూమత సంస్కరణవాదం దళిత కాంగ్రెస్ నేత బోయి భీమన్న రచనల్లో అనేక రకాలుగా ప్రతిబింబించింది. చాలామంది కాంగ్రెస్ దళితులకు ఆ వాదన స్ఫూర్తినిచ్చింది. 1940వ దశకం మధ్యలో దళిత ఉద్యోగులు తమ సొంత సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు కానీ దళిత ప్రజానీకాన్ని సంఘటిత పరిచేందుకుగానీ ఉద్యమ నిర్మాణానికి గానీ ఎలాంటి ప్రయత్నమూ చేయలేకపోయారు.

హైదరాబాద్ రాష్ట్రంలో 1920లలో, 1930లలో విజృంభించిన తీవ్రవాదం చాలావరకు హిందూ ముస్లిం ఘర్షణలవైపు మళ్లింది. ఆంధ్ర మహాసభలో కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగి 1940ల నాటికి గ్రామీణ ప్రాంతాలలో పార్టీ నిర్మాణం పటిష్టపడింది. తెలంగాణా రైతాంగ పోరాటం, హిందూ ముస్లిం ఘర్షణలు మిగతా అన్ని ఉద్యమాలను వెనక్కినెట్టివేశాయి. అంతకంతకూ ఎక్కువైన హిందూ ముస్లిం ఘర్షణలు ఇటు జాతీయవాద హిందువుల మీద ఆర్యసమాజం పట్టును, అటు సామాన్య ముస్లింల మీద మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచి ఛాందస ముల్కీ దక్కనీ సిద్ధాంత విస్తృతికి దోహదపడింది.[80] నిజాం ప్రభుత్వ సంపూర్ణ మద్దతు వల్ల జీతంతీసుకుని పనిచేసే ప్రచారకుల ద్వారా మజ్లిస్ పెద్ద ఎత్తున దళితులను ముస్లిం మతంలోకి మార్చే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రభుత్వ మద్దతు, వెట్టివ్యతిరేక చట్టం

---

80. లియోన్‌డార్డ్, హైదరాబాద్: ది ముల్కీ నాన్ ముల్కీ కాన్‌ఫ్లిక్ట్, సంపాదకులు రాబిన్ జెఫ్రీ, పీపుల్ ప్రిన్సెస్ అండ్ పారమౌంట్ పవర్: సొసైటీ అండ్ పాలిటిక్స్ ఇన్ ఇండియన్ ప్రిన్స్‌లీ స్టేట్స్ ఆఫ్ ఇండియా, ఢిల్లీ 1978,

వల్ల మస్లింలతో చేతులుకలపడం అనేది దళితులకు లాభదాయకం అనిపించింది. అదే సమయంలో ముస్లింమతం స్వీకరించిన దళితులను తిరిగి హిందూ మతంలో చేర్చేందుకు ఆర్య సమాజం చేసిన ప్రయత్నాలు మత ఘర్షణలను సృష్టించాయి. అయితే 1940లలో అంబేడ్కర్ ప్రభావం పెరుగుతూ పోవడం వల్ల దళితులకు సంఘటితమయ్యే అవకాశం లభించింది. దళిత కార్యకర్తలకు మంచి గుర్తింపు వచ్చింది కానీ అది అంతగా విస్తరించలేదనే చెప్పాలి.

విద్యావంతులైన దళిత యువకులు కొత్త నాయకత్వం వెనక సమీకృతులయ్యారు. అలాంటి వారిలో బి.ఎస్. వెంకటరావు (1896–1953) మూడు దశాబ్దాలపాటు ఒక వెలుగు వెలిగారు. ఆయనకు హైదరాబాద్ అంబేడ్కర్ అన్న గుర్తింపు కూడా వచ్చింది. అంతకుముందు 1922లో ఆయన ఆది ద్రావిడ సంఘంను స్థాపించారు. యం. గోవిందరాజులు , యం. వెంకటస్వామిల సహకారంతో దేవదాసీ వ్యవస్థ నిర్మూలనకు, దళితులను సంఘటితపరిచేందుకు ఆయన కృషిచేశారు. 1927లో సి.ఎస్. ఎతిరాజన్, కె. రామస్వామి, అరిగే రామస్వామి తదితరులతో కలిసి ఆయన 1927లో ఆది హిందూ మహాసభను స్థాపించి దళితుల్లో నూతన చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. హైదరాబాద్ రాష్ట్రంలో ఆయన దళితులకోసం 18 దేవాలయాలను నిర్మించారు. ఘాస్‌మండి ప్రాంతంలో ఒక గ్రంథాలయాన్ని, దళిత ఆవాసాన్ని ఏర్పాటుచేశారు. ఆ తరువాత అది ఆదియ్యానగర్‌గా పేరుగాంచింది. 1936లో పూనాలో జరిగిన మహరాష్ట్ర అస్పృశ్య యువజన సదస్సులో రాష్ట్ర ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించారు. ఆ సదస్సులో అంబేడ్కర్ ప్రధానోపన్యాసం చేయగా ఎన్. శివరాజ్ అధ్యక్షత వహించారు.

మహారాష్ట్ర నేతల ఉపన్యాసాల ప్రభావంతో వారు హైదరాబాద్ రాష్ట్రంలో అంబేడ్కరీయ యువజన సంఘాన్ని ఏర్పాటు చేశారు. దానికి వెంకటరావు అధ్యక్షులుగా, వెంకటస్వామి కార్యదర్శిగా పనిచేశారు. సంఘం ప్రధాన లక్ష్యం అంటరానివాళ్లను హిందువుల గుప్పిటనుంచి బయటకు తీసుకువచ్చి చైతన్యవంతుల్నిచేసి అంబేడ్కర్‌కు అండగా నిలవడం, హిందూమత దురాచారాల పట్ల ప్రజల్లో అవగాహనను పెంచి సామాజిక ఆర్థిక అసమానతల నిర్మూలనకు పాటుపడటం.

అయితే అన్ని మతపరమైన గ్రూపుల కార్యకలాపాలను వివిధ దళిత సంఘాలు నిరసించాయి. ఆ కార్యకలాపాలలోని 'విముక్తిదాయకతను' గుర్తిస్తూనే అవి దళిత ఐక్యతను విచ్ఛిన్నం చేస్తాయని వారు భావించారు. ఏది సరైన మతం, ఆ మతంలో చేరేందుకు ఏది సరైన సమయం అనే రెండు కీలక అంశాలపై కచ్చితమైన నిర్ణయం

తీసుకునే శక్తి అమాయక దళిత ప్రజానీకానికి లేదనేది వారి వాదన. మరోపక్క కొందరు యువ దళిత కార్యకర్తలు అసలు మరో సరికొత్త ప్రజాస్వామిక మతాన్ని కనుగొనాలనీ, ఆ తరువాతే సామూహిక మతమార్పిడిని చేపట్టాలనే ఊహాజనిత వాదాన్ని ముందుకు తెచ్చారు.

బొంబాయిలో 30 మే 1936న ఏర్పాటు చేసిన బొంబాయి ప్రెసిడెన్సీ మహర్ మహాసభను అంబేద్కర్ కోరిక మేరకు వెంకటరావు నిర్వహించారు. 1937లో ఆయన హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 1943లో నిజాం రక్షణ మండలికి నామినేట్ అయ్యారు. 1946లో నిజాం శాసన సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత 1947లో మార్ లాయక్ అలీ నాయకత్వంలో ఆయన విద్యా శాఖ మంత్రి అయ్యారు . మంచి మేధాసంపత్తి సునిశిత వక్తిత్వం కలిగిన ఆయనకు అభిమానులు రావు సాహెబ్ అనే బిరుదును ప్రదానం చేశారు. ఆయన తన ఆస్తి పాస్తులనన్నింటినీ తన వర్గంవారి కోసం ధారపోసి చివరికి నిరుపేదగా మరణించారు. ఆ రోజుల్లో జె. హెచ్. సుబ్బయ్య అనే మరో అంబేద్కరీయ నేతకు హైదరాబాదలో మంచి పేరుండేది. ఆయన షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ (ఎస్‌సిఎఫ్)ను నిర్వహించారు.

1930 దశకం చివర్లో ముస్లిం అనుకూల దళితులకూ అంబేద్కరీయ దళితులకూ మధ్య హిందూమతాన్ని వదిలివేయాలన్న అశంపై పొరపొచ్చాలు వచ్చాయి. కాంగ్రెస్‌వాద హరిజన సేవక్ సమాజ్ 1932లోనే తన శాఖను హైదరాబాద్‌లో నెలకొల్పింది. కానీ మతం మార్చుకున్న దళితులను తిరిగి హిందూ మతంలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. దళితులంతా సామూహికంగా హిందూమతాన్ని విసర్జించాలంటూ అంబేద్కర్ చేసిన ప్రకటన బాంబులా పేలింది, మతమార్పిడిపై దేశవ్యాప్తంగా తీవ్రమైన చర్చను రేకెత్తించింది. ముస్లింలు అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకుని దళితులను పెద్ద ఎత్తున ఇస్లాంలోకి మతమార్పిడి చేసేందుకు ప్రయత్నించారు. వ్యంగ్య కవిత్వంతో సమాజంపై నిప్పులు చెరిగిన కోస్తా ఆంధ్రకు చెందిన కుసుమ ధర్మన్న కవితో సహా అనేకమంది దళిత నాయకులు ఆ ప్రచార కార్యక్రమంలో చురుకైన పాత్రను పోషించారు. 1935నాటి పర్యటన సందర్భంగా గాంధీతో వాదనకు దిగిన పి.వీరాని అనే దళిత నేత ఆ తరువాత పి.వి. సర్దార్ అలీగా మారి ప్రముఖ ఇస్లాం మత ప్రచారకుడయ్యారు. శ్యాం సుందర్ (1908–1973) అనే మరో దళిత నేత కూడా ఇస్లాం అనుకూల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. 1938–39లో హిందూ ముస్లిం ఘర్షణలు చెలరేగినప్పుడు బి.ఎస్. వెంకటరావు కూడా పైవారి మార్గాన్నే అనుసరించారు. హైదరాబాద్ రాష్ట్ర బడుగువర్గాల సంఘం ఏర్పడిన తరువాత

ఆయన అంతకు ముందు అనుసరించిన యువజన కార్యక్రమాలకు భిన్నంగా నిజాం పాలనకు సానుకూలుడిగా మారిపోయారు. ఆ సంఘానికి వెంకటరావు అధ్యక్షులుగా, కె. జగన్నాథం కార్యదర్శిగా వుండేవారు. 1939 మే 7న వారు హైదరాబాద్ ప్రధానమంత్రి అక్బర్ హైదరీకి జనాభా ప్రాతిపదికన తమకు పురపాలక సంఘాలలో, స్థానిక బోర్డులలో ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలంటూ విజ్ఞప్తులను సమర్పించారు. తత్ఫలితంగా 1939 జులైలో ప్రభుత్వం రాజ్యాంగపరమైన సంస్కరణలు తీసుకొచ్చింది. అది దళితుల ఐక్యతను దెబ్బతీసి వారి మధ్య విభేదాలకు కారణమయింది.

ఆ సంక్షోభం కొనసాగుతున్నప్పుడే హైదరాబాద్‌కు చెందిన అఖిలభారత స్థాయి దళిత నేత భాగ్యరెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న చనిపోయారు. ఆయన మరణం దళిత సమాజానికి, యావత్ దళిత ఉద్యమానికి తీరనిలోటు. భాగ్యరెడ్డి వర్మకు ప్రజా సమస్యల పట్ల వున్న సునిశిత అవగాహన, నిర్వహణా సామర్థ్యం, అగ్రవర్ణ హిందువులతోనూ ముస్లిం సంస్థలతోనూ ఆయనకున్న పరిచయాలు, రాష్ట్రేతర ప్రాంతాలలోని దళితోద్యమాలతో సాన్నిహిత్యం మొదలైనవి ఆయనకు ఎనలేని ప్రాధాన్యతను సంతరింపజేశాయి. ఆది హిందూ సామాజిక సేవా సంస్థ పలుకుబడి పెరిగేందుకు అవి ఎంతగానో దోహదం చేశాయి. ఆయన అనంతరం వచ్చిన నాయకత్వం ప్రత్యర్థి వర్గాలతో, ఇతర ఉద్యమాలతో పోటీ పడవలసి వచ్చింది. గతంలో కూడా సిద్ధాంతపరమైన, రాజకీయపరమైన బేధాభిప్రాయాలు వుండినప్పటికీ 1940లలో అవి మరింత పెరిగి తరచూ ఘర్షణలకు దారితీశాయి.

బడుగువర్గాల సంఘం (డిప్రెస్డ్ క్లాసెస్ అసోసియేషన్– డిసిఎ) కు చెందిన జె.హెచ్. సుబ్బయ్య, వెంకటరావు వంటి యువ అతివాద నాయకులు తరచూ ఘర్షణపడుతూ చివరికి ఆ సంస్థలో చీలిక వచ్చేందుకు కారకులయ్యారు. కుసుమ ధర్మన్న ప్రారంభించిన ఇస్లాం మతప్రచారానికి వెంకటరావు వంతపాడుతున్నారంటూ సుబ్బయ్య ఆరోపణలు చేశారు. ఆ తరువాత అరిగే రామస్వామితో చేతులు కలిపి ఆయన హైదరాబాద్ రాష్ట్ర ఆది హిందూ మహాసభను పునరుద్ధరించేందుకు పూనుకున్నారు. ఈ విభేదాలు 1942 వరకూ కొనసాగాయి. 1942 జులై 18–20 తేదీలలో నాగపూర్‌లో జరిగిన షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్ (ఎస్‌సిఎఫ్) సంస్థాపన సభలో ఈ రెండువర్గాలూ పాల్గొన్నాయి. వారు అంబేద్కర్‌కు తమ తమ వాదనలు చెప్పినప్పుడు ఆయన ఇరువర్గాలను అనునయించి రాజీ కుదిర్చారు. అయినప్పటికీ విబేధాలు మాత్రం పూర్తిగా సమసిపోలేదు. పునరుద్ధరించబడిన ఆది హిందూ

మహాసభ అఖిల భారత సంస్థతో అనుబంధం నెలకొల్పుకోకముందే షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్ లో విలీనమైపోయింది. సుబ్బయ్య అధ్యక్షులుగా, వెంకటస్వామి ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. వారు నాగపూర్ తీర్మానాలను అనుసరించారు. అయితే అప్పటికే నేతల మధ్య వ్యక్తిగత విభేదాలు కాస్తా సంఘాల మధ్య పోటీలుగా మారిపోయాయి. బడుగు వర్గాల సంఘం (డిసిఎ) షెడ్యూల్డ్ కులాల సమాఖ్య (ఎస్‌సిఎఫ్) రెండూ హైదరాబాద్ రాష్ట్రంలోని దళిత సమాజంపై ప్రభావం చూపాయి. గత దళిత ఉద్యమం మాదిరిగా పట్టణ ప్రాంతాలకే పరిమితమైపోకుండా ఈసారి అది క్రమంగా గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించింది. ఉదాహరణకు బుట్టి రాజారామ్ (1911–75) కరీంనగర్ జిల్లాలో గ్రామీణ ప్రజలను సంఘటితపరిస్తే, సుకుమ్ అచ్చాలు నల్గొండ జిల్లాలోని గ్రామీణ ప్రజలను సమీకరించారు. కరీంనగర్ జిల్లాలో జె. హెచ్. సుబ్బయ్య, కె.ఆర్. వీరాస్వామిల అధ్యక్షతన రాజారాం అనేక సభలు సమావేశారు నిర్వహించారు.

ఆ తదనంతర కాలంలో తెలంగాణా పోరాటం ఈ ప్రాంతమంతటిపై తీవ్రమైన ప్రభావాన్ని కలిగించింది. అంబేద్కర్ పేరు చెప్పుకుంటూనే బడుగు వర్గాల సంఘం, హెద్యూల్డ్ కులాల సమాఖ్య పరస్పరం కలహించుకుంటున్న తరుణంలో వెల్లువెత్తిన ఈ రాజకీయ సంక్షోభం నేపథ్యంలో దళిత ప్రజలు ఎటువెళ్లాలో తెలియని అయోమయానికి గురయ్యారు. బడుగువర్గాల సంఘం అనుసరించిన ముస్లిం అనుకూల వైఖరి, దళితులకు ప్రభుత్వం పోరంబోకు భూములను కేటాయించబోతుందన్న ప్రచారం కారణంగా ఆ సంఘం కొంతమేరకు లబ్ధిపొందింది. కమ్యూనిస్టులు మాత్రం నిజాం రజాకార్ల చేతుల్లో తీవ్ర నిర్బంధానికి గురయ్యారు. భారత సైన్యం రంగప్రవేశం చేసిన పిదప మొత్తం సంస్కరణోద్యమమే ఛిన్నాభిన్నమైపోయింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని దళితులకు ఏమీ చేయలేదు. పైగా అది మధ్యతరగతి రైతాంగానికి భూస్వాములకు చెందిన పార్టీగా హిందూమత పరిరక్షణ సంస్థగా ఆవిర్భవించింది.

హైదరాబాద్‌లోని దళిత సంస్థలు ఆరు గ్రూపులుగా విడిపోయాయి. అవి 1940 దశకం చివరి వరకూ పనిచేశాయి. అటు బ్రిటీష్ ప్రభుత్వం 1947 ఫిబ్రవరి లో అధికారాన్ని బదలాయించబోతున్నట్టు ప్రకటించడం, ఇటు హైదరాబాద్ రాష్ట్రం 1947 జూన్‌లో స్వతంత్రాన్ని ప్రకటించుకోవడంతో దళిత ప్రజానీకం మరింత గందరగోళానికి గురయ్యారు. ఆ పరిస్థితి దళితుల మధ్య వర్గవిభేదాలకు మరింతగా ఆజ్యం పోసింది. హైదరాబాద్ రాష్ట్రంలో అప్పటికి సుబ్బయ్య నేతృత్వంలోని షెడ్యూల్డ్ కులాల సమాఖ్య, వెంకటరావు నేతృత్వంలోని బడుగువర్గాల సంఘం – ఈ రెండే అతిపెద్ద దళిత

సంస్థలుగా వున్నాయి. బడుగువర్గాల సంఘం హైదరాబాద్ రాజ్యాంగ సంస్కరణలను ఆమోదిస్తే, షెడ్యూల్డ్ కులాల సమాఖ్య కాంగ్రెస్‌పార్టీ, కమ్యూనిస్టుపార్టీలతో కలిసి ఆ రాజ్యాంగ సంస్కరణలను పూర్తిగా వ్యతిరేకించింది. ఇదిలా వుండగా పి.ఆర్. వెంకటస్వామి, శ్యామ్ సుందర్‌లు మరో స్వతంత్ర షెడ్యూల్డ్ కులాల సమాఖ్యను ఏర్పాటు చేసి ఆ రాజ్యాంగ సంస్కరణలకు షరతులతో కూడిన మద్దతును ప్రకటించారు. దీనికి తోడు భాగ్యరెడ్డి వర్మ కుమారుడైన యం.బి. గౌతమ్ ఆది హిందూ సామాజిక సేవా సంస్థను పునరుద్ధరించారు. ఆ సంస్థ కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న అరిగే రామస్వామి వంటి దళిత నేతలతో కలిసి రాజ్యాంగ సంస్కరణలను తిరస్కరించింది. మాదిగ కులస్థులపైనే ఎక్కువగా ఆధారపడిన అరుంధతీయ మహాసభ ప్రత్యేక ఎలక్టోరేట్‌ను కోరుతూ షరతులతో కూడిన ఆమోదాన్ని తెలిపింది. అప్పటి ఎన్నికలలో వెంకటరావు, శ్యాంసుందర్‌లు మాత్రమే ఎన్నుకోబడ్డారు. మరో ఐదుగురు సభ్యులు నామినేట్ చేయబడ్డారు. ఎన్నుకోబడిన ఇద్దరు నేతలు తమ ముస్లిం అనుకూల వైఖరిని ప్రదర్శించారు. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు హైదరాబాద్‌లోని ముస్లింలకు మద్దతు పలకాలనీ, తద్వారా అగ్రవర్ణ హిందువులతో బహిరంగ పోరాటానికి సిద్ధంకావాలనీ వారు దళితులకు పిలుపునిచ్చారు. అయితే అప్పటికే హైదరాబాద్ రాష్ట్రంలో అంబేద్కర్‌వాదుల సంస్థలు నిర్వహణాపరంగా రాజకీయంగా బలహీనపడిపోయాయి. ఈ రాజకీయ, వర్గ సంక్షోభంలో దళిత ప్రజలు స్పష్టమైన లక్ష్యం అనేది లేకుండా ఎవరికి వారుగా చెల్లాచెదురైపోయారు. బ్రాహ్మణ ఆధిపత్యంలోని కాంగ్రెస్ పార్టీ బలంపుంజుకోవడంతో కోస్తా ఆంధ్రాలో దళితోద్యమం 1940లలో అంతరించి పోయింది. కాగా తెలంగాణా ఉద్యమంపై పోలీసు చర్య జరిగి హైదరాబాద్ రాష్ట్రాన్ని బలప్రయోగంద్వారా భారత యూనియన్‌లో విలీనం చేసిన తరువాత అంటే 1951లో హైదరాబాద్ దళితోద్యమనాయకత్వంలో పెద్ద ఎత్తున చీలికలు చోటుచేసుకుని ఉద్యమం కుంటుబడిపోయింది.

వలసవాద అనంతర కాలంలో నిజాంలో తీవ్రమైన నిర్బంధం, అణిచివేత అమలయ్యాయి. మాల మాదిగల మధ్య విభజన ఏర్పడింది. నాయకుల అసమర్థత, అహం, పక్షపాతవైఖరి, వారికి సరైన విధానాలు లేకపోవడం మూలంగా ఆ అఘాదం మరింత పెరిగిందే తప్ప తగ్గలేదు. తత్ఫలితంగా ఒక విశాల ప్రాతిపదికతతో కూడిన దళితోద్యమం అభివృద్ధిచెందకుండా ఆగిపోయింది.

కమ్యూనిస్టులతోసహా [81] అన్ని రాజకీయ పార్టీలవారూ తమ సిద్ధాంత బేధాలతో నిమిత్తంలేకుండా తమ తమ అవసరాలకు దళితులను కార్యకర్తలుగా వాడుకున్నారు.

కొన్ని పార్టీలు ఓట్లు దండుకునేందుకు ఏదో కొంత మేలు చేస్తే కమ్యూనిస్టులు ఎంతసేపూ తమ ఉద్యమాభివృద్ధిమీదనే దృష్టిని కేంద్రీకరించారు. తత్ఫలితంగా దళితులకు నామమాత్రమైన ప్రయోజనాలు మాత్రమే కలిగాయి. అతి కొద్దిమంది దళితులు నాయకులుగా, రచయితలుగా అవతరించగలిగారు. 1960లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీనుంచి దామోదరం సంజీవయ్య తొలి దళిత ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన తొలి దళిత ఎఐసిసి అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యారు. ఆయన కింద ఎంతోమంది ఎంపీలు, ఎంఎల్ఏలు, జిల్లా స్థాయి నాయకులు వుండేవారు కానీ వారెవరూ స్వతంత్రంగా స్థిరమైన సిద్ధాంత పరమైన, రాజకీపాత్రను పోషించే స్థాయికి ఎదగలేకపోయారు.

ఆంధ్ర దళితోద్యమాన్ని ఒక్కసారి స్థూలంగా సమీక్షిస్తే 1940 తదనంతరం అంబేద్కర్ ప్రభావంతో కాకుండా వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో వ్యవస్థాపరమైన పోరాటాలు, కార్యకలాపాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయని స్పష్టమవుతుంది. ఈ ఉద్యమం స్థానిక దళితోద్యమాలకు సంబంధించిన అనేక అంశాలతో మమేకమయింది. అవి ప్రధానంగా ఆ ప్రాంత అంటరానివాళ్లపైనే ఆధారపడివున్నాయి. అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తలు లేదా మానవీయ క్రైస్తవ మిషనరీల ప్రోద్బలంతో అవి ముందుకు వచ్చాయి. అవి ఆర్యేతర అంటే మూలవాసులు... భూమి పుత్రులు అనే సిద్ధాంతంనుంచే ఎక్కువగా రూపుదిద్దుకున్నాయి.

ఈ విశాల దృక్పథంతో గమనించినప్పుడు ప్రధానంగా రెండు ధోరణులు వున్నట్టు కనిపిస్తుంది. ఒకటి హిందూ మతం నుంచి, అగ్రవర్ణ హిందూ సామాజిక, రాజకీయ సంస్థల నుంచి పూర్తిగా దూరమై స్వతంత్ర గుర్తింపును కోరుకునే రాడికల్ భావజాలం, రెండవది సమైక్యతను కోరుకునే సంఘటిత ధోరణి. ఆది అనే సైద్ధాంతిక గుర్తింపు కొంతమేరకు హిందూమతానికి చేరువయ్యేట్టు చేసింది. బోయి భీమన్న వంటి తెలుగు రచయితలు అసలు హిందూ మత గ్రంథాలు రాసింది దళితులే అన్న వాదనను ముందుకు తెచ్చారు.[82] ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరిపోయి ఆ పార్టీ ప్రచారకుడిగా

---

81. ఆంధ్ర కమ్యూనిస్టుల ప్రత్యేకత ఏమిటంటే నాయకులంతా కమ్మ, రెడ్డి వంటి బ్రాహ్మణేతర అగ్రకులాల నుంచి వచ్చిన వాళ్లే. దేశం లోని ఇతర ప్రాంతాలలో కమ్యూనిస్టులు ప్రధానంగా బ్రాహ్మణ కులం నుంచి వచ్చారు. అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే వాళ్ళంతా బ్రాహ్మణబ్బాయిల సమూహం.

82. బోయి భీమన్న రచనల గురించి సవివరంగా తెలుసుకోవాలంటే చూడండి జ్ఞానేశ్వర్ పుస్తకం, 1983. అది దాదాపు 70 వ్యాసాల సంకలనం. అందులో సవివరమైన విశ్లేషణ వుంది.

మారారు. ఆ తరువాత అంటే 1940ల తదనంతరం "పాలేరు" అనే రచనతో తన దళిత గుర్తింపును నిలుపుకున్నారు. హిందూ మత గ్రంథాలన్నీ మన రచనలేననీ ఆర్యులు వాటిని అక్రమంగా సొంతం చేసుకున్నారనీ ఆయన వాదిస్తారు. హిందూ మతంతో పునస్సమాగాన్ని కోరుకునే ఈ ధోరణి భక్తి ఉద్యమంతో, చోకమేళ వంటి సన్యాసులతో మొదలై సంస్కరణవాద సంస్థలతో మమేకమైంది.

వలసవాద ఆంధ్రలో, హైదరాబాద్ రాష్ట్రంలో నిర్దిష్టమైన సామాజిక, రాజకీయ చైతన్యంతో దళితోద్యమం మమేకమవడం వెనక బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం వంటి అగ్రవర్ణ హిందువుల నాయకత్వంలోని బ్రాహ్మణేతర సంస్కరణవాద ఉద్యమ ప్రభావం వుంది. రాజకీయ స్థాయిలో రాజ్యాంగ సంస్కరణలు, మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు దళితులను రాజకీయంగా చైతన్యపరచి, వలసవాద ప్రాతినిధ్య సంస్థల్లో తమకు న్యాయమైన భాగాన్ని డిమాండ్ చేసేట్టు స్ఫూర్తినిచ్చాయి. 1917 నుంచీ మొదలైన ఆది ఆంధ్ర ఉద్యమం సంఘ సంస్కరణోద్యమాలపై, దళితోద్యమ నాయకులపై గణనీయమైన ప్రభావాన్ని కనబరచింది. ఇందుకు ఉదాహరణగా భాగ్యరెడ్డి వర్మ వంటి వారిని పేర్కొనవచ్చు. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో బ్రహ్మ సమాజం దళితులకు ఆధునిక విద్యను అందించేందుకు ప్రయత్నిస్తూ వారిలో చైతన్యాన్ని తీసుకువచ్చింది. మానవతా వాదులు ప్రత్యేకించి దళితులకోసం ఎన్నో పాఠశాలలు, వసతి గృహాలు స్థాపించారు. ఇందుకు ఉదాహరణగా పిఠాపురం రాజావార్ని పేర్కొనవచ్చు. తొలితరం దళిత మేధావులు, నాయకులు అలాంటి విద్యా సంస్థలలో చదువుకుని వచ్చినవారే.

దళితోద్యమంలో రెండు దశలు వున్నాయి. స్వయంప్రతిత్తిని, హిందూయేతర గుర్తింపును కోరుకునే తీవ్రవాద ధోరణి కారణంగా వారు అనేక సొంత సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. 1900 నుంచి 1930 వరకు వారు సామాజిక అణిచివేతకు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. అయితే అగ్రవర్ణ హిందువులల ఆధిపత్యంలోని రాజకీయ పార్టీల రాజ్యాధికార కాంక్షతో కూడిన బలమైన ఒత్తిళ్లను తట్టుకుని నిలదొక్కుకోలేకపోయారు. అందుకు ముఖ్యకారణం 1939లో భాగ్యరెడ్డి వర్మ మరణానంతరం దళితులకు శక్తివంతమైన, పటిష్టమైన నాయకత్వం కొరవడటమే. హిందూ మతంలో తిరిగి చేర్చుకోబడటం అనే ప్రక్రియ వారు హరిజన గుర్తింపుతో హిందూ నాయకత్వాన్ని ఆమోదించేట్టు చేసింది. హరిజనులను అనేకమంది ముందుకు నడిపించినట్టు, వారి పురోగతికి పాటుపడినట్టు చెప్పుకున్నారు కానీ వారెవరికీ సరైన దిశానిర్దేశం లేకుండాపోయింది. గాంధీ ప్రాబల్యంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామాలకు ప్రాముఖ్యతనిస్తూ "రామ రాజ్యం" అనే భావనను ప్రచారంలో పెట్టారు. కమ్యూనిస్టులు

పారిశ్రామికీకరణతో కూడిన కులరహిత సమసమాజాన్ని ప్రభోదించారు. దురదృష్టవశాత్తూ ఆ రెండు పార్టీలు కూడా దళితుల ప్రధాన సమస్యలను గాలికి వదిలేసి, దళితోద్యమంలో అనేక చీలికలు తీసుకొచ్చి చివరికి వారిని తమ పార్టీల జెండాలను మోసే కూలీలుగా మలచుకున్నాయి.

దళితోద్యమం పరిధిలో రాజకీయ పార్టీల ప్రభావం కారణంగా అంతకంతకూ గ్రూపులు, కక్షలు, అధికార కాంక్ష పెరిగి దళితోద్యమాన్ని దానంతటదే కుప్పకూలి పోయేట్టు చేశాయి. 1940లలో అంబేద్కర్ జాతీయ స్థాయి కార్యక్రమాలతో ఢిల్లీలో తలమున్కలై వుండటంతో ఆంధ్రలో ఆయన ప్రభావం కాంగ్రెస్, కమ్యూనిస్టు ఉద్యమాలతో ఎక్కువకాలం పోటీ పడలేకపోయింది. 1940ల నాటికే ఆంధ్రలోని స్వతంత్ర దళితోద్యమం బలహీనపడిపోయింది. అయితే అధికార రాజకీయాల ప్రభావానికి గురవడం వల్ల ఆంధ్ర దళితోద్యమం 1950లలో పూర్తిగా చితికిపోయిందని చెప్పవచ్చు. 1960లలో కె. రామస్వామి, నేరేడుమిల్లి నాగేంద్రుడు వంటివారు దళితోద్యమాన్ని పునరుద్ధరించేందుకు ఎంతగానో ప్రయత్నించారు కానీ విజయం సాధించలేకపోయారు. చివరికి వాళ్లు 1980లలో దళిత మహాసభ పేరిట ఆంధ్రలో మిలిటెంట్ దళితోద్యమాన్ని పునర్నిర్మించి, సుసంఘటితం చేశారు.

6

ప్రతిఘటనా సాహిత్యం

దళితుల ప్రతిఘటన రెండు విధాలుగా వ్యక్తమయ్యింది. ఒకటి: అగ్రవర్ణ హిందువుల మీద... ముఖ్యంగా రాజకీయ నియంత్రణ, వర్ణవ్యవస్థల ద్వారా ఈ దేశ మూలవాసులపై ఆర్థికంగా, సాంస్కృతికంగా పెత్తనం చెలాయించే బ్రాహ్మణుల మీద సైద్ధాంతిక పోరాటం సాగించడం. ఈ క్రమంలో దళతులు హిందూ మత దోపిడీ స్వభావానికి వ్యతిరేకంగా, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా సాహిత్యం ద్వారా పాటలు, పద్యాలు, నాటకాలు, నవలల రూపంలో తమ సైద్ధాంతిక ప్రతిఘటనను వ్యక్తపరిచారు. ఇక రెండు: తమ సాంప్రదాయిక విధులను నిర్వర్తించ నిరాకరించడం ద్వారా ప్రతిఘటించడం. ఈ ధిక్కారం, అవిధేయత రెండు రకాలుగా వుండేది. ఒకటి సంఘటిత, ప్రణాళికాబద్ధ, బాహాటమైన ప్రతిఘటనగా వుంటే మరొకటి ప్రణాళిక రహితంగా, అసంఘటితంగా, నిగూఢంగా వ్యక్తమయ్యేది.

ప్రత్యామ్నాయ సాహిత్య ఆవిర్భావానికి చారిత్రక మూలాలున్నాయి. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దం నాటి బౌద్ధ తిరుగుబాటును భారతదేశంలోనే ప్రప్రధమ ప్రతిఘటనా పోరాటంగా పేర్కొనవచ్చు. అయితే బ్రాహ్మణులలోని ప్రతీఘాతుక శక్తుల కుతంత్రాలవల్ల దశావతారాలలో అదొకటిగా వక్రీకరణకుగురై బౌద్ధం తన రాడికల్ దృక్పథాన్ని కోల్పోవడమనేది వేరేవిషయం.[1] మధ్యయుగాల నుంచి దక్షిణ భారత

1. *డా.బి.ఆర్. అంబేద్కర్ రచించిన 'రివల్యూషన్ అండ్ కౌంటర్ యాజ్ ఇన్ ఏన్షియంట్ ఇండియా' ప్రచురణ: మూన్, 1990–98, సంపుటి 3. చూడండి. రాముడికీ బుద్ధుడికీ మధ్య వున్న పోలికను విశ్లేషణాత్మకంగా, ఆలోచనాత్మకంగా వివరిస్తూ రామాయణం కల్పిత రచన అనీ, బుద్ధుడి ప్రభావాన్ని ఎదుర్కొనేందుకే అది సృష్టించబడిందనీ అంటారు సాంబమూర్తి ,1992. అలాగే చూ. ఐలయ్య, 1991,1996.*

దేశంలోని తెలుగు మాట్లాడేవారి ప్రాంతాలలోనూ దక్కన్‌లోనూ భక్తి ఉద్యమం తలెత్తింది. వర్ణవ్యవస్థ వల్ల కింది కులాల వాళ్లు, అంటరానివాళ్లు ఎలా అన్యాయానికి, అసమానతకు, కష్టాలకు గురవుతున్నారో భక్తి ఉద్యమ యోగులు తమకు తోచిన విధంగా వ్యక్తీకరించారు. మధ్యయుగాల భక్తి ఉద్యమం కులదొంతరలో అట్టడుగున వున్నవారి కష్టాలనీ, కన్నీళ్లనీ ప్రస్తావించింది.. వలసవాద కాలం నాటి దళిత సాహిత్యంలో ఈ భక్తి సంప్రదాయ రీతులు కనిపిస్తాయి. భక్తి ఉద్యమం బ్రాహ్మణేతర మేధావులలో సాహిత్య సాంప్రదాయ అభిరుచిని పెంపొందించింది. ఇందుకు ఉదాహరణగా వేమన[2]ను, పోతులూరి వీరబ్రహ్మం[3]ను పేర్కొనవచ్చు. కులం, మతం ముసుగులో జరిగే సామాజిక దోపిడీని తన సాంప్రదాయేతర తాత్వికతతో గళమెత్తి ప్రశ్నించిన ప్రప్రథమ కవి యోగి వేమన[4]

ఆధునిక తెలుగు సాహిత్యంలో కులానికి, కుల అణిచివేతకూ సంబంధించిన అంశాలను అగ్రవర్ణాలకు చెందిన జాతీయవాద ఉదారవాద మేధావులు విస్తృతంగా ప్రస్తావించారు.[5] సంఘ సంస్కరణోద్యమకాలంలో వచ్చిన సాహిత్యం ఆంధ్ర సమాజాన్ని పట్టి పీడిస్తున్న వివిధ దురాచారాలపై దృష్టిని సారించింది. బ్రాహ్మణ సంఘ సంస్కర్తలు ప్రత్యేకించి గురజాడ అప్పారావు (1862–1915), వీరేశలింగం పంతులు (1849–1919) సాహిత్య పరిధిని, దృక్పథాన్ని మరింత విస్తృతం చేశారు. దాంతో తెలుగు సాహిత్యం సాంప్రదాయిక స్వభావం నుంచి ఆధునిక సమాచార సాధనంగా రూపాంతరం చెందింది. పూర్వకాలపు ఛాందస ఉన్నత వర్గ సాహిత్య సంప్రదాయ పద్ధతిలో కాకుండా గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి వంటి ఆధునిక రచయితలు తమ రచనల్లో గ్రాంధిక భాషకు బదులు ప్రజలు నిత్యం మాట్లాడే వాడుక భాషను

---

2. *వేమన 17వ శతాబ్దపు కవి, యోగి. వివక్షను బోధించిన వేదాలు, పురాణాలు ధర్మ సూత్రాలను ఆయన తన పదునైన పద్యాల ద్వారా పరిహసించారు. చూడండి, చిన్నారావు, బ్రౌన్, గోపి రచనలు.*

3. *జాషువా–వీరబ్రహ్మంల మధ్య తులనాత్మక పోలికకోసం చూడండి ప్రభాకరశర్మ రచన 1989, పద్మారావు రచన 1994.*

4. *వివరాలకు చూ. పూర్ణయాచార్యులు,1913, ఆదినారాయణ శాస్త్రి 1917, అనంత కృష్ణ శర్మ 1947, క్యాంప్‌బెల్ 1898.*

5. *గాంధీకి ముందరి కాలంలో అంటరానివాళ్ల జీవన పరిస్థితులను, వారి కడగండ్లను చిత్రించిన నవలలు తల్లాప్రగడ సూర్యనారాయణ 'హేలావతి' (1913); వేంకటపార్వతీశ కవుల 'మాతృమందిరం' (1919); అలాగే ఆ కాలానికి చెందిన అనేక కవితా సంకలనాలను చూడవచ్చు. వివరాలకు చూ. విజయభారతి 1992, ప్రసాద్ 1993, భాను 1987.*

ఉపయోగించడం మొదలు పెట్టారు.[6] గురజాడ తన రచనల్లో అంటరాని తనాన్ని గట్టిగా నిరసించాడు.[7]

"మంచి చెడ్డలు మనుజులందున,
యెంచిచూడగ, రెండె కులములు
మంచియన్నది, మాలయైతే
మాలనే, అగుదున్!"

ఆధునిక తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. ఈ మార్పు అనివార్యమైనది. వాళ్లు ప్రధానంగా అప్పటి అగ్రవర్ణ మహిళలు ప్రత్యేకించి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న బాల్య వివాహాలు, కన్యాశుల్కం, వితంతు వివాహాలు వంటి సమస్యలపై తమ దృష్టిని కేంద్రీకరించారు. అయితే ఈ ఇద్దరిలో ఎవరూ కుల అణిచివేత, సామాజిక జన జీవన స్రవంతి నుంచి దళిత ప్రజలను దూరంగా నెట్టివేయడం వంటి మౌలిక సమస్యల జోలికి వెళ్లలేదు. బ్రాహ్మణీయ హిందూమతం, వర్ణవ్యవస్థ సృష్టిస్తున్న సైద్ధాంతిక సమస్యలతో వారు తలపడలేకపోయారు. వారు సాంప్రదాయ గ్రంథాలను, శాస్త్రాలను అధ్యయనం చేసింది ప్రధానంగా హిందూ సమాజంలోని కొన్ని దురాచారాలను నిర్మూలించడానికే తప్ప మొత్తం వర్ణ వ్యవస్థను ప్రశ్నించడానికో, దానిని ధిక్కరించడానికో కాదు.

భావకవితోద్యమంగా ముందుకొచ్చిన జాతీయవాద సాహిత్యం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వచనంలో కాకుండా ఎక్కువగా కవితా రూపంలో ప్రస్తావించింది.[8] ఈ సాహిత్యం సామాజిక, రాజకీయ లక్ష్యాలతో ముందుకొచ్చింది. గాంధేయ ఉద్యమం ఆంధ్రలో అనేకమంది రచయితలను ప్రభావితం చేసింది. అది ఆనాటి వలసవాద పాలనకు వ్యతికేకంగా జనాన్ని చైతన్యపరుస్తూ అంటరానితనాన్ని

---

6. గిడుగు రామ్మూర్తి (1863–1940) వ్యవహారిక భాషోద్యమం ద్వారా భాషా సంస్కరణకు శ్రీకారం చుట్టాడు. చూ. చిన్నారావు రచన 1992.

7. ఇది తొలుత ఆంధ్రభూమి(మే 1911లో) ప్రచురితమైంది.

8. చూ. కవితా సంకలనాలు 'మేలుకొలుపు' (1921) కొండపల్లి జగన్నాధరావు: 'అంబ భారతమాత', 'మాలలెవరు' (1923) కంభంపాటి లక్ష్మీనరసింహ సోమయానులు; 'హరిజనులు' (1928) నెల్లూరి సత్యనారాయణ; 'పంచములు' (1919) గరిమెళ్ల సత్యనారాయణ; 'హరిజనులు' (1993) అశోక్‌కుమార్ తదితరులు.

కూడా నిరసించింది. అంటరానితనం సమస్య గాంధేయ చట్రంలో ప్రధానంగా అంతర్గత సంస్కరణ, వ్యక్తిగత పవిత్రీకరణకు పరిమితమైంది. అది అగ్రవర్ణ హిందువుల హృదయాలను ఆకట్టుకుని ప్రజాభిప్రాయం ప్రకారం వారు హరిజనుల కోసం పాఠశాలలను తెరవాలని ఆశించింది.

ఆ కాలంలో ప్రచురితమైన తెలుగు సాహిత్యంలో అంటే పాటలు, కరపత్రాలు, కథలు, నవలల్లో హిందూత్వం, జాతీయవాద ధోరణులు బలంగా కనిపిస్తాయి. గురజాడ అప్పారావు రచించిన "మాలలు" అనే సుప్రసిద్ధ రచనలో అంతర్గత సంఘ సంస్కరణ కనిపిస్తుంది. మాలలది అపవిత్ర (మైల) శరీరాలైతే అగ్రవర్ణాల వారి శరీరాలు కూడా కలుషితమైనవి, వారి వర్ణాశ్రమ ధర్మం ఏవిధంగా న్యాయబద్ధమైనది? అంటూ ప్రశ్నిస్తాడు. మంచిని మీరు మాలలుగా పరిగణిస్తున్నట్టయితే నేను మాలవాడిననిపించుకోడానికి సిద్ధమే అని ప్రకటిస్తాడు.

ఆంధ్రలో గాంధీవాద సంస్కరణ విస్తరించడానికి ఎంతోకాలం ముందే ఒక అనామక రచయిత " మాలవాండ్ర పాట "(1909)[9] రాశాడు. అది ఈ ప్రాంతంలో సుప్రసిద్ధమైంది. దానిని రాసిన వాడు తప్పక దళిత కవే అయివుంటాడనిపిస్తుంది.[10] అందులో మారిన వలసవాద జీవన పరిస్థితుల నేపథ్యంలో కులాల హెచ్చుతగ్గులను, ఆత్మ వంచనను అపహాస్యం చేస్తాడు.

<u>మాల వాండ్ర పాట</u>

ఎట్టాగూ యెక్కూవ బ్యామ్మర్లు మాకంటె
ఎట్టాగూ యెక్కూవ యేరైన మాకంటె
వర్ణాల యెక్కూవ పుట్టంగ లేదయ్యె
మమ్మేల క్రిందీకి కుమ్మేరు మానోరు
వేదాలు మాన్యారు ఇంగ్లీషు చదివారు
ఎగబడు చున్నారు ఎట్టి వృత్తులకైన
మతముచ్చు కుంటేను మావోడ వంటారు
మతముచ్చు కోకుంటే మాలోడ వంటారు

---

9. మాలవాండ్ర పాట తొలుత ఆంధ్ర భారతి మాసపత్రికలో 1909లో ప్రచురితమైంది. అశోక్ కుమార్ 1993లో దానిని పునర్ముద్రించారు.

అందారు పుట్టిరి హిందమ్మ తల్లీకి
అందారు ఒక్కటై ఉందారి సక్కంగ...

1923లో వెలువడిన ఒక కరపత్రంలో కుల వ్యవస్థలోని అమానుష కోణాలను ఆవిష్కరిస్తూ అంటరానితనాన్ని ప్రశ్నించడం కనిపిస్తుంది. ఆరు కోట్ల సహమానవులను జంతువుల కంటే హీనంగా చూసే సమాజం, వారిని వీధుల్లో నడవనీయకుండా, దగ్గరకు రానీయకుండా నిషేధించి; దేవుడి ముందు అందరూ సమానమే అని నీతులు వల్లిస్తూనే వారిని దేవాలయాల్లో అడుగుపెట్టకుండా బహిష్కరించి, వారిపట్ల దారుణ వివక్ష చూపే ఈ సమాజాన్ని రాక్షస సమాజం అనకుండా మానవ సమాజం అని ఎలా అనగలం అంటూ ఆవేశాన్ని వెళ్లగక్కడం కనిపిస్తుంది. అనేకమంది సంస్కరణ వాద రచయితలు హిందూమతంలో అంతర్గత సంస్కరణల గురించి రచనలు చేశారు. సామాజిక హీన స్థితినుంచి హరిజనులను ఉద్ధరించేందుకు గాంధేయవాద కృషిని ప్రచారం చేసే లక్ష్యంతో అనేక పాటలు, పద్యాలు, కీర్తనలు వెలువరించారు. అవన్నీ కూడా మానవతావాద కోణంలో ఆంధ్ర దళితులకు కనీస పౌర హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ సాగాయి.

కోడేటి రంగాచార్యులు రాసిన " దరిద్రనారాయణీయం " అనే కావ్యం గాంధేయ హరిజనోద్ధరణను ప్రాచుర్యంలోకి తెచ్చింది. నూతన రాజకీయ దృక్పథంతో తరతరాలుగా సాగుతూ వస్తున్న సామాజిక వివక్ష నుంచీ, దారిద్ర్యం నుంచీ హరిజనులను విముక్తి చేయాలని భావించే కొందరు అగ్రవర్ణ హిందువుల ఆకాంక్షను ఈ కింది పద్యంలో గమనించవచ్చు:

<u>దరిద్రనారాయణీయము</u>

రామ రామ రామాభిరామా శ్రీరామా
లోకనాయకా పావననామా లోకైక రామా
    జయము జయము శ్రీగాంధిమహాత్ముని జయము దిగ్విజయము
    జయము జయము మా భారత జాతికి జయము దిగ్విజయము
పంచముడని మన సాటి మానవుని, బహిష్కరించెదరా
పంచమ సహకారము లేనిచో, బ్రతుకు గడుపగలరా
    కొట్టిన తిట్టిన మన సేమంబే కోరును పంచముడండి
    యెట్టులైన మన మేలు కోరి తా నిబ్బందులు పడునండి
    ఊరికి వెలుపల వూరికొంపలోనుండును కాపురమండి

దారిద్ర్యమునకు ముద్దు బిడ్డడై, తంటాల్పడతాడండి
నూతి నీరు తోడకూడదంటే, నోరు విప్పబోడండి
జాతిభేదమెంచి తొలగుమంటే, సర్దుకుపోతాడండి...
పంచమదర్శనమైతే ఒక్కడు, పళ్లుకొరుకుతాడండి
పంచమ స్పర్శకు పాము కరచినట్టు, బాధనొక పడునండి
ఇతర దేశముల కేగిన తెలియును, ఎవరో పంచములంటే
మతమున కింతటి విపత్తు దెచ్చిన, మనమే పంచములంటే...
గాంధి మహాత్ముని యుపవాసమునకు, కారణమేమో కనుడు
సందియముల విడనాడు డేకమై, సాటి నరుడు పంచముడు
....

గాంధేయ సంస్కరణ విధానాలతో, రాజకీయాలతో కొద్దిమంది దళిత విద్యావంతులు స్ఫూర్తిపొందారు. ప్రత్యేకించి దళిత గాంధేయ జాతీయవాద కవి గుర్రం జాషువా సామాజిక హీన స్థితికి, దారిద్ర్యానికి వ్యతిరేకంగా సాగుతున్న రాజకీయ సమరంలో దళితులు పాల్గొనేలా చైతన్యపరిచారు. "ప్రబోధం" అనే గేయంలో ఆయన ఈ విధంగా ప్రశ్నిస్తారు:

ప్రబోధము

పురుషుల్ నెత్తిని కొమ్ము నిక్కిన మహాత్ముల్ గారు, నీకన్న సుం
దరి స్వార్థాత్మకమైన సంఘము నినున్ శాసించి యాజన్మ దు
స్తర దాస్యంబున గట్టివైజినది విద్యాస్పర్శ లేకుండగా
పరదా దాటి, స్వతంత్ర వీధుల పదాబ్జంబూని క్రీడింపుమీ!

వీటికి తోడు కొన్ని సుప్రసిద్ధ నవలలు కూడా హిందూత్వ జాతీయవాద ధోరణులను చిత్రించాయి. గాంధేయ సంస్కరణవాది ఉన్నవ లక్ష్మీనారాయణ[10] రాసిన "మాలపల్లి" అలాంటి నవలల్లో ప్రముఖమైనది. ఆంధ్రాలో భూసంబంధాల విషయంలో అంటరాని వాళ్లు ఎదుర్కొంటున్న అణచివేత పరిస్థితులను కేంద్రంగా చేసుకుని ఆ నవల కొనసాగింది.

---

10. ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి 'తొలుత 1922లో ప్రచురించబడింది. ఈ నవలకు ఇందులోని పాత్ర వల్ల 'సంఘ విజయం' అనే మరో పేరు కూడా వుంది. రెండు పేర్లలో నవలకు ఏ పేరు సముచితంగా వుంటుందో తేల్చుకోలేక రచయిత ఈ నవలకు రెండు పేర్లను అలాగే వుంచేశారు. అయితే తెలుగు పాఠకులకు ఇది 'మాలపల్లి'గానే ఎక్కువగా తెలుసు. ఈ నవలను ప్రభుత్వం రెండుసార్లు నిషేధించింది. నవల సారాంశం కోసం నాగభూషణ శర్మ,1971, చిన్నారావు, 1992 రచనలు చదవవచ్చు.

అందులోని ప్రధాన కథ భూమిలేని మాల మాదిగ వ్యవసాయ కూలీలకు, కమ్మ కులస్తులైన భూస్వాములకు మధ్య వున్న వైరుధ్యాల చుట్టూ తిరుగుతుంది. ఆ నవలలో అంటరానివాళ్ల సామాజిక, ఆర్థిక హీనస్థితి, వారి బానిసత్వం సవివరంగా చిత్రించబడింది. వారి పరిస్థితిలో మార్పు రావాలంటే సామాజిక సంబంధాలను పూర్తిగా నిర్వచించాల్సి వుంటుందని చాటుతారు రచయిత. వ్యాపారీకరణ ధోరణులు సామాజికంగా, ఆర్థికంగా ఎలాంటి ప్రభావాలను కనబరుస్తున్నాయి, వాటిపై ప్రతిస్పందన ఎలావుంది, అసలు వేతనాలను నాశనం చేస్తున్న మోసపూరిత నూతన వేతన వ్యవస్థ పట్ల పెరుగుతున్న దళితుల చైతన్యం, వారిపై బలప్రయోగాలు, ప్రైవేటు భూముల్లో వారిని పశువులను మేపుకోనివ్వకపోవడం, దళితులను దండించడం, దాడులు చేయడం, పేద రైతులను వారి భూములనుంచి పారదోలడం వంటి అంశాలను ఆ నవలలో ప్రస్తావించారు. హిందూ ప్రాపంచిక దృక్పథపు ఆధిపత్య ధోరణి, పంచముల అవగాహనను నియంత్రించే విధానం కారణంగానే దళితులలో వర్గచైతన్యం లోపించి వారిని తిరగబడకుండా చేసిందని వివరించారు. రచయిత ఈ భావనను ఒక పాత్రచేత చెప్పిస్తారు. తమ పరిస్థితి దిగజారడానికి అనేక తాత్విక కారణాలను పేర్కొంటుంది ఆ పాత్ర. నవలలో రామదాసు చిన్న కొడుకు సంగదాసుకు అహింసా విధానం, గాంధేయ ప్రతిఘటనా పద్ధతి అంటే ఇష్టం. ఆయన దళితులు ప్రారంభించిన పంచముల ఉద్యమంలో చేరతాడు. తన కులం వాళ్లని సంఘటితపరుస్తాడు. కానీ కమ్మ కులస్థుడైన భూస్వామి చౌదరయ్య మాత్రం ఆ ఉద్యమం శక్తి ఎలా వుండబోతుందో ముందే పసిగట్టి సంగదాసును హతమారుస్తాడు. అట్టి చర్యను శాంతికాముకులైన సంగదాసు వర్గం వారు జీర్ణించుకోలేకపోతారు. పాలక వర్గాలు వారిని మరింత గందరగోళానికి గురిచేస్తాయి. పోలీసు అధికారులు జోక్యం చేసుకుని ఆ నేరాన్ని కప్పిపుచ్చుతారు. రెవెన్యూ అధికారులకు లంచమిచ్చి దళితులను వారి స్థలాల్లోంచి ఖాళీ చేయిస్తాడు భూస్వామి. ఆ సంఘటన నిరుపేద దళితులు నివసించే వ్యవస్థ స్థితిని వివరించడంతోపాటు వారు చైతన్యవంతులు కాకుండా, సంఘటితమవకుండా వారి చుట్టూ ఎలాంటి సాలెగూడు అల్లుకునివుందో సూచిస్తుంది.

రెండో నవల “హరిజన నాయకుడు”. కమ్మ కులానికి చెందిన రాజకీయవేత్త ఎన్.జి.రంగా రచించిన ఈ నవల రైతాంగ నాయకుడి సైద్ధాంతిక పరిస్థితిని చిత్రించింది. అందులో కథానాయకుడు ఒక హరిజన సంఘ సంస్కర్త. ఆతను వివిధ సమస్యలపై పోరాడుతుంటాడు. దళితుల మీద జరిగే హింసకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాడు. కులాంతర వివాహాలు జరిపిస్తుంటాడు. విద్యాలయాలను నెలకొల్పుతాడు.

అంటరానివాళ్ల దేవాలయ ప్రవేశ హక్కుకోసం, ప్రభుత్వ బావులను ఉపయోగించుకునే హక్కు కోసం పోరాడుతుంటాడు. ఈ నవల గాంధేయ విధానాల ద్వారా సమకాలీన జాతీయ రాజకీయ స్రవంతిలోకి హరిజనులను తీసుకొచ్చే ప్రయత్నాలను చిత్రిస్తుంది. ఆంధ్రాలో ఈ దిశలో జరిగిన కృషిని, దళితోద్యమాన్ని కొన్ని సంఘటనల ద్వారా వివరిస్తుంది. ఇందులో దళితులు కమ్మ రైతులతో కలిసి కమ్మ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడడం కనిపిస్తుంది.

ఇక గద్దె లింగయ్య రాసిన "మాల పిల్ల" అనే మరో నవల అంటరానివాళ్ల మధ్య, అంటరానివాళ్లకీ అగ్రవర్ణాలవారికీ మధ్య వున్న వైరుధ్యాలనూ, దళితులలో పెరుగుతున్న వామపక్ష, కార్మిక చైతన్యాన్నీ చిత్రించింది. అంతిమంగా ఆ నవల మతమార్పిడిని ప్రభోధిస్తుంది. మతమార్పిడి కులాంతర వివాహాలకు దోహదం చేస్తుందని వివరిస్తుంది.

అగ్రవర్ణ రచయితల పద్య, గద్య రచనలన్నీ సానుభూతి స్వభావాన్ని కలిగివుండడం విశేషమే. అయితే దళితేతర రచనల్లో ఎక్కడా అంటరానితనం, కులవివక్ష ప్రాథమిక సమస్యలుగా చిత్రించబడలేదు. ఆ సమస్యలకు ప్రస్తుత కులవ్యవస్థ పరిధిలోనే పరిష్కారమార్గాలను వెదికాయవి. సామాజిక సమానత్వం, దళితుల ఆత్మగౌరవం వంటి సమస్యలు ఆ రచనల్లో ప్రధానాంశాలుగా చోటుచేసుకోలేదు. తొలినాటి సాహిత్యం బ్రాహ్మణ మేధావులకూ అవధానాలకూ (అష్టావధానాలు, శతావధానాలు మొదలైనవాటికి) పరిమితమైతే – అభ్యుదయ రచయితల సంఘం (1943) ఆవిర్భవించిన తరువాత వచ్చిన మలితరం రచనలు మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద, కొన్ని సంఘ సంస్కరణ అంశాల మీద దృష్టిని కేంద్రీకరించాయి. ఇది రచయితల సంఘపు వర్గ, కుల దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. అభ్యుదయ రచయితల సంఘంలో మధ్యతరగతి నుంచి వచ్చినవారు, ముఖ్యంగా దళితేతరులే ఎక్కువగా వున్నారు. వారు అప్పటి కమ్యూనిస్టు ఉద్యమంతో ప్రభావితులయ్యారు. నాటి రచనల్లో త్రిపురనేని రామస్వామి రాసిన "శంభూక వధ" (1902) కొంత విలక్షణమైనది. ఆయన బ్రాహ్మణేతర, దళితేతర రచయిత. ఈ రచనలో మానవతావాదం విస్తృతంగా కనిపిస్తుంది. ఆనాటి రచయితలు కుల దృక్పథంతో కూడిన వ్యవస్థ సైద్ధాంతిక స్వరూపాన్ని, మత వ్యవస్థ దోపిడీ విధానాన్ని చిత్రించడంలో విఫలమయ్యారు.

వలసవాద వ్యతిరేక పోరాటాలు సాహిత్యరంగంలో – అటు అగ్రవర్ణాలవారి నుంచీ, ఇటు సంఘ బహిష్కృతుల నుంచీ అనేకమంది ప్రతిభావంతులైన రచయితల ఆవిర్భావానికి దోహదం చేశాయి. అలాంటి వారిలో ఒకవైపు చిలకమర్తి, దువ్వూరి, రాయప్రోలు, గురజాడ... మరోవైపు గుర్రం జాషువా (1895–1972),[11] బోయి

భీమన్న (1911–2006) మొదలైనవారు కనిపిస్తారు. జాషువా రచనలు ప్రత్యేకించి ఆయన కవిత్వం జాతీయవాద సమస్యలనూ నేతాజీ, గాంధీ మొదలైన వారి కార్యకలాపాలనీ చిత్రించాయి. అవి జనాన్ని ఎంతగానో చైతన్యపరిచాయి. గుర్రం జాషువా అటు గాంధీవాదాన్నీ ఇటు అంబేడ్కర్ భావలనూ రెంటినీ అనుసరించారు. బోయి భీమన్న అర్ధ గాంధీ, అర్ధ అంబేడ్కర్ భావాల సమ్మేళనం అనిచెప్పవచ్చు. ఆయన జాతీయ సమస్యలపై అనేక పాటలను రాశారు. 1940లలో బోయి భీమన్న కాంగ్రెస్ కార్యకర్తగా, ఆ పార్టీకి చురుకైన ప్రచారకుడిగా వున్నారు. ఆయన తన పూర్వ సైద్ధాంతిక ప్రభావానికి భిన్నంగా రచించిన సుప్రసిద్ధ నాటకం "పాలేరు" ద్వారా దళిత రచయితగా గుర్తింపును పొందారు.

దళిత సాహిత్యం

ఆంధ్రాలో దళితోద్యమం కుల ఆధిపత్యంనుంచీ, కుల వివక్ష నుంచీ దళితులను విముక్తి చేసేందుకు ఒక రాడికల్ పోరాటానికి శ్రీకారం చుట్టింది. ఆ క్రమంలో దళితులు అనేక రచనలు చేశారు. దళిత రచనల వెల్లువ వారి సైద్ధాంతిక ప్రతిఘటననే కాక, సాంస్కృతిక తిరుగుబాటును కూడా వ్యక్తీకరించింది. ఆ సాహిత్య ప్రధాన లక్ష్యం బ్రాహ్మణీయ హిందూమత సైద్ధాంతికతను చీల్చిచెండాడటం, అగ్రవర్ణాల సామాజిక సాంస్కృతిక ఆధిపత్యాన్ని ప్రతిఘటించడం. దళిత మేధావులు ముందుకు తెచ్చిన పోటీ సాంస్కృతికోద్యమం, సిద్ధాంతం 1930లలో, 1940లలో సాహిత్య సాంస్కృతిక రంగాలలో విస్తృతంగా ప్రతిబింబించింది. తొలితరం దళిత మేధావులు సాహిత్యంలో దళిత గుర్తింపును, దళిత దృక్పథాన్ని దళిత సాంస్కృతిక, సైద్ధాంతిక ప్రత్యేకతని చాటి చెప్పారు. ఇరవైయవ శతాబ్దారంభం నుంచీ దళితులలో పెరుగుతూ వచ్చిన చైతన్యమే ఈ తిరుగుబాటు ప్రతిఘటనా సాహిత్యానికి స్ఫూర్తినిచ్చింది. కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్న, జాలా రంగస్వామి వంటి దళిత మేధావులు

---

11. గుర్రం జాషువా ప్రతిభావంతుడైన దళిత కవి. తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పు తెచ్చారు. ఆయన రాసిన శక్తివంతమైన కవితల్లో అనివార్యంగా అంటరానివాళ్లు, ఆణచివేతలే ప్రధాన వస్తువుగా వుండేది. ఇంకా వివరాలకోసం సుధాకర్ 1992; గురుప్రసాదరావు 1959; సీతారామా రావు 1953; రామచంద్ర 1963 మొదలైనవారి రచనలు చదవండి.

12. బోయి భీమన్న విలక్షణమైన కవి. ఆయన శక్తివంతమైన, కుల రహిత హిందూ దేశం కోసం పలవరించారు. హిందువులూ, దళితులూ ఇరువురూ ఆర్యులే అని వాదించారు. చూడండి హైమావతి 1991.

అంటరానివాళ్లు ఏనాడూ అగ్ర వర్ణ హిందూ సమాజంలో[12]అంతర్భాగంగా లేనేలేరని పేర్కొన్నారు. నిజానికి అంటరానివాళ్లే ఈ దేశపు మూలవాసులని వాదించారు. ఆర్య దేవతలనీ, హిందూ ధర్మ శాస్త్రాలనీ విమర్శించారు. వాటి పేరిట దళితుల మీద జరిగిన దుర్మార్గాన్నీ, దోపిడీనీ వారు తీవ్రంగా ఖండించారు. దళిత వర్గాల కష్టాలు తీరాలంటే హిందూ సాంప్రదాయ సంకెళ్ల నుంచి, హిందూ మతం నుంచి బయటకు రావాలనీ, తమ ప్రత్యేక గుర్తింపును నిలుపుకునేందుకు దళితులంతా ఐక్యంగా కృషిచేయాలనీ చాటిచెప్పారు.[13] ఆ క్రమంలోనే భాగ్యరెడ్డి వర్మ "ఆది" సిద్ధాంతం ఆధారంగా 'ఆది-ఆర్య పదాన్ని సృష్టించారు. తద్వారా దళితులను ఐక్యం చేసేందుకు కృషి చేశారు. అగ్రవర్ణాలు ఉపయోగించే "పంచములు" వంటి అవమానకరమైన పదజాలాన్ని ఆయన గట్టిగా వ్యతిరేకించారు. మహాకవి గుర్రం జాషువా పంచమ వర్ణ సృష్టిని ఇలా ప్రశ్నించారు:[14]

" ముసలివాడైన బ్రహ్మకు బుట్టినారు
నలుగురు కుమారులనుట విన్నాము గాని
పసరముకన్న హీను డభాగ్యుడైన
యైదవ కులస్థు డెవ్వరమ్మా? సావిత్రి!

ఇంతకుముందే చెప్పినట్టు అతిపెద్ద దళిత వర్గాలైన మాల మాదిగల మధ్య ఐక్యతను పెంచేందుకు బోయి భీమన్న "మామాలు" అనే పదాన్ని ఎక్కువగా వాడేవారు.[15] ఈ ప్రధానమైన దళిత వర్గాల మధ్య ఎర్పడిన విరోధ భావం దళితోద్యమానికి హాని కలిగిస్తున్న నేపథ్యంలో వారిలో ఐకమత్యాన్ని నెలకొల్పేందుకు ఆయన ఆ పదాన్ని

---

13. అసలు ఇది 1936 అక్టోబర్‌లో విజయనగరంలో జరిగిన ఆది ఆంధ్ర సదస్సులో చేసిన ప్రారంభోపన్యాసం. హైదరాబాద్ నుంచి వెలువడే తొలి దళిత బహుజనుల పక్షపత్రిక 'నలుపు' లో పునర్ముద్రించబడింది. వివరాలకు చూడండి ధర్మన్న 1992-93.

14. నారాయణరెడ్డి రచనలో (1981)లో పేర్కొనబడింది. గుర్రం జాషువా అనేక అవార్డులను, సత్కారాలను అందుకున్నారు. ఆయనకు 1933లో "కవితా విశారద", 1936లో "కవి కోకిల", 1946లో "కవి దిగ్గజం", "నవ యుగ కవి చక్రవర్తి", 1952లో "మధుర శ్రీనాథ", 1970లో "కళా ప్రపూర్ణ", "పద్మ భూషణ్" వంటి బిరుదులు లభించాయి. ఇంకా వివరాలకు సుధాకర్ (1992) రచన చూడవచ్చు.

15. ఈ రెండు కులాల వారి సంఖ్యే మొత్తం అంటరానివాళ్లలో 80 శాతం వరకూ వుంటుంది. మిగతా కులాలన్నీ వీటికంటే తక్కువగా వుంటాయి. బోయి భీమన్నతో జరిపిన ఇంటర్వ్యూ ఆధారంగా.

ముందుకు తెచ్చారు. ఉపకులాల మధ్య ఏర్పడుతున్న అనైక్యత, విరోధాల పట్ల జాషువా ఎంతో ఆవేదన చెందారు. ఈ పరిస్థితికి అజ్ఞానమే ప్రధాన కారణమని ఆయన అన్నారు. దళిత వర్గాలన్నింటికీ ఒక విధమైన ఉమ్మడి గత చరిత్రను నిర్ధారించేందుకు దళిత మేధావి వర్గం ప్రయత్నించింది. ఈ క్రమంలో పురాణాలలోని దళిత వర్గానికి చెందిన చారిత్రక పురుషులను, పురాతన సాంప్రదాయాలను తమ కవితలద్వారా చాటిచెప్పారు.[16]

మము విడిచి స్వరాజ్య మందుట సాధ్యమా?

భారతీయులమె కదా
        అరయమీరును మేమును గలిసియు, భారతీయులమె కదా
ఘనుడు వష్టుండను మౌనీంద్రుడు,
        గనుగొన మా యల్లుండు గదా
ఇనవంశోత్తములగు రాజన్యుల
        కెల్ల బురోహితుడతడె కదా!
అన్నలార పల్నాటి వీరులలో,
        కన్నమనీడు మా వాడె కదా,
పన్నుగ వైష్ణవ శ్రేష్టుడైన తరు,
        ప్పాణియు మా సోదరుడె కదా!
పూర్వ విధమ్మున మము బ్రోచుటకును,
        బూనుట న్యాయము గాదా,
గర్విత మతులని గారవింపకను,
        కడకు ద్రోయ మర్యాదా   – తిరునగరి వెంకటసూరి

బోయి భీమన్న హిందూ ధర్మ శాస్త్రాలను ఉటంకిస్తూ బ్రాహ్మణుల వ్యాఖ్యానాలను ఖండిస్తూ దళితులకు గతంలో ఎంత ఉన్నత సామాజిక హోదా వుండేదో "రాఘవష్టం" అనే నాటకంలో వివరించారు. దళితులను పుట్టుకతోనే అంటరానివాళ్లుగా చూసే బ్రాహ్మణీయ దృక్పథాన్ని ఆయన చీల్చిచెండాడాడు.[17] దళితులు సంఘ బహిష్కృతులు

---

16. అశోక్ కుమార్ రచనలో (1993)లో పేర్కొన్న తిరునగరి వెంకట సూరి రచన "మము విడిచి స్వరాజ్య మందుట సాధ్యమా?"

17. రాఘవాష్టకం 1940లో రచించబడింది. ఉస్మానియా యునివర్సిటీలో గ్రాడ్యుయేషన్‌లో పాఠ్యాంశంగా వుంది. హైమావతి రచన (1982) చూడండి.

కారనీ, వారికి నాటి సమాజంలో ఉన్నత స్థానం వుండేదనీ ఆ నాటకం చాటి చెబుతుంది. బ్రాహ్మణ కులానికి చెందిన వశిష్టునికీ, మాతంగి అనే అంటరాని కులానికి చెందిన అరుంధతికీ మధ్య వున్న వైవాహిక సంబంధాన్ని ఎత్తిచూపుతూ ఆయన తన వాదనను రుజువుచేస్తారు. దళితులు మాతంగి కన్య సంతానం, అరుంధతికి వారసులు అని చాటి చెబుతారు.

జాలా రంగస్వామి అనే ఉపాధ్యాయ రచయిత కూడా ఇదే విధంగా హిందూ పురాణాలలో దళితుల స్థానాన్ని శోధించి ఇలా రాశారు:

<u>పూర్వోన్నత స్థితి</u>

ఆదిని మాగతి యెట్టులుండెనో ఆలోచించేరా
ఆర్యులకెల్ల అండగనుండిరి ఆదిమాంధ్రులండి
హిందూ శాస్త్రములన్నీ పైకియికనైననుతీసి
పఠించుడీ ఓ మాన్యులారా యో పరమ భక్తులార
పురాణాలలో నుండే వీర పురుషులు మావారు
అగ్రజాతులు వీరికి యింకా మ్రొక్కుచునున్నారు
వశిష్ట వాల్మీకాది కవులు మా వంశమువారండి
వేదవ్యాసుడు పరాశరుడు మావారే నమ్మండి
హనుమంతా సుగ్రీవులు మాకు అన్నదమ్ములండి
అంగద వాలి కన్నమనీడు అనీ వీరులండి
రోహిదాసుడు చోకామేళుడు తిరుప్పణాళ్వారు
కనకదివాకర నందుడు గుహుడు కలిగిరి మాలోన
అనేక మంది భక్తులు మాలో అవతరించినారె
అందరు మాలో గతించినారని అడుగునబెట్టెనా?
వీరమాతలు యెందరో మాలో ఉద్భవించలేదా?
వాసికెక్కి పాతివ్రత్యము పాటించగలేదా
అరుంధతి మా కులమునకెల్ల ఆడపడుచుకాదా
శబరి కన్యమాతంగులు వినుడీ మా కుల స్త్రీలండి
ఆది మురళి హేలావతి రేణుక అంజన గోసంగి
జరమాలెత సారంగి కర్కటక జాబాలిదేవి
ఇట్టి వీరమాతలు మాలోన యెక్కువగానుంట
ఆది పురాణము తీస్తే మీకు అంతా విశదంబు

కుల వివక్ష చూపుతున్న అగ్రవర్ణ హిందువుల మీద ఆయన విరుచుకుపడ్డారు. దళితుల హక్కుల కోసం నినదించారు. పంచములుగా హీనంగా చూడబడుతున్న వాళ్లే ఈ దేశ మూలవాసులని, దురాక్రమణదారులు వారిని ఓడించి వారికా దుస్థితిని కల్పించారనీ వాదించారు.

దళిత రచనల్లో ప్రధాన వస్తువు కుల అణచివేత, కుల వివక్షా వ్యతిరేక పోరాటమే. సామాజిక సమానత్వం గురించి దళిత సంఘాలు విస్తృతంగా ప్రచారం చేశాయి. ప్రభుత్వ బావులను, విద్యా సంస్థలను అంటరానివాళ్లు వినియోగించుకునేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సామాజిక సమానత్వం గురించిన దళిత ప్రజల ఆకాంక్షలను అగ్రవర్ణాలు గట్టిగా వ్యతిరేకించాయి. అంతేకాదు ప్రతిఘాత అగ్రవర్ణ హిందూ శక్తులు దళితుల మీద భౌతిక దాడులు జరపడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం వంటి పనులకు తెగించాయి. ఆంధ్రలోని గ్రామీణ ప్రాంతాలలో 1920లలో, 1930లలో దళితుల మీద అరాచక, అణచివేత, హింసాత్మక సంఘటనలు, అకృత్యాలు ఎన్నో జరిగాయి. అయితే ఆనాటి ఏ వార్తా పత్రికా, ఏ మ్యాగజైనూ ఆ సంఘటనలు ఎక్కడా ప్రస్తావించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దళితులు తమ హక్కుల కోసం నినదించినప్పుడల్లా వారి మీద హింసాత్మక సంఘటనలు జరిగేవి. దళితులలో పెరుగుతున్న చైతన్యానికీ, సమానత్వం కోసం, ఆత్మగౌరవం కోసం వారు చేస్తున్న పోరాటాలకూ మధ్య అవినాభావ సంబంధం వుందనే చెప్పాలి. ఆనాటి కొన్ని సంఘటనలు విశ్లేషిస్తే చాలు ఈ విషయం మనకు స్పష్టమవుతుంది. దళితుల పిల్లలు అగ్రవర్ణ హిందువుల పిల్లలతో కలిసి బోర్డు స్కూళ్లలో చదవుతుకునేందుకు ముందుకొస్తున్నందుకు ఆగ్రహించి అగ్రవర్ణాల వారు కవిటి అనే గ్రామంలోని దళితుల మీద పెద్ద ఎత్తున దాడులు చేశారు, వారి ఇళ్లను తగులబెట్టారు, దళితులకు చెందిన బావులలో నీళ్లు పనికిరాకుండా చేయడానికి కిరోసిన్ గుమ్మరించారు. సంప్రదాయానికి విరుద్ధంగా దళిత మహిళలు అగ్రవర్ణ మహిళల మాదిరిగా పైట వేసుకోవడాన్ని సహించక చెట్టినాడు ప్రాంతంలో వారి మీద భౌతిక దాడులు జరిపారు. అలాగే పొన్నమండలో దళిత యువకులు సైకిళ్లెక్కి ప్రధాన వీధుల్లో దర్జాగా తిరిగారని వారిని శిక్షించారు. చెల్లూరులో దళితులు ఒక పండుగనాడు మతపరమైన ఊరేగింపు నిర్వహించారని వారి మీద దాడిచేశారు. గాజులరేగ (విశాఖపట్నం జిల్లా)లో కొత్తగా పెళ్లయిన జంట గుర్రమెక్కి ఊరేగినందుకు అక్కసుతో కొట్టారు. మంగళగుంటలో దళితులు చెప్పులేసుకుని ప్రధాన వీధుల్లో తిరిగినందుకు దండించారు. తిరుపతిలో ఒక దళితుణ్ని అలివేలు మంగమ్మ గుడిలో అడుగుపెట్టాడన్న నెపంతో చితకబాదారు. అతని మీద కేసు కూడా పెట్టారు. అగ్రవర్ణ హిందువులు తమ ఆధిక్యతను

నిలుపుకునేందుకు, కొందరు అగ్రవర్ణ హిందూ నేతల్లో వస్తున్న పరివర్తన పట్ల తమ అసంతృప్తిని వ్యక్తం చేసేందుకు ఈ దాడులను ఉపయోగించేవారు.

ఈ దాడులే దళిత రచనలకు దిశా నిర్దేశం చేశాయి. ఆ రచనలు అగ్రవర్ణ హిందూ సంఘ సంస్కర్తలు వల్లించే ఆదర్శాలకు, వారి మోసపూరిత సానుభూతికి, నయ వంచనకు భిన్నంగా వుండేవి. దళితుల ఈ స్థిరచిత్తాన్ని కుసుమ ధర్మన్న రచనల్లో, ఉపన్యాసాల్లో బాగా కనిపిస్తుంది.[18] ఆయన హిందూమతంలోని, బ్రాహ్మణ సంఘ సంస్కర్తలలోని, కాంగ్రెస్‌లోని కపటత్వాన్ని, వంచనాస్వభావాన్ని ఎత్తిచూపారు. బ్రాహ్మణీయ ద్వంద్వ ప్రమాణాలను తన రచనల్లో ఎద్దేవా చేశారు. వారిని ఆయన గోముఖ వ్యాఘ్రాలుగా అభివర్ణించారు. హిందూ సామాజిక వ్యవస్థలోని అసమానత్వాన్ని అమానుషత్వాన్ని రుజువుచేసేందుకు ఆయన మధ్యయుగాలనాటి ఆధ్యాత్మిక మేధావుల, తాత్విక కవుల రచనలను విస్తృతంగా ఉదహరించేవారు. అగ్రవర్ణ హిందువుల ఆగడాలు వారి రోజువారి కార్యక్రమాలుగా మారాయని ఎత్తిపొడిచేవారు. ఆయన ఉపన్యాసాలలో గాంధీ అంబేద్కర్‌ల మధ్య జరిగిన చర్చలు ఎక్కువగా ప్రస్తానకు వచ్చేవి. కవిటి అనే ప్రాంతంలో అగ్రవర్ణ హిందువులు దళితులపై దాడులు జరిపిన అనంతరం గాంధీ గారు దళితులకు ఆ గ్రామాన్ని బహిష్కరించి వెళ్లిపొమ్మని సలహా యిస్తే అంబేద్కర్ అసలు హిందూ మతాన్నే వదిలేయండని సూచించారు. దళితులు స్వభావరీత్యా సమసమాజవాదులనీ, పుట్టుకరీత్యా ప్రజాస్వామికవాదులనీ ఆయన అభివర్ణించేవారు.

దళితులు సమైక్యంగా వుండి సమసమాజ స్థాపనకు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమసమాజంలోనే దళితులకు సామాజిక సమానత్వం, మంచి జీవితం, ఆత్మగౌరవం లభిస్తాయని చెప్పారు. సోషలిజం (సమతావాదం) అంటే వివక్షకు, అంతర్గత శతృత్వాలకు తావులేని సమాజమని ఆయన అభివర్ణించేవారు. బ్రాహ్మణీయ హిందూమతం మీద ఆయన ఘాటైన విమర్శలు చేసేవారు. "మాకొద్దీ నల్ల దొరతనము" అన్న సుదీర్ఘ కవితలో దళిత ప్రజల దయనీయ పరిస్థితులను ఎంతో హృద్యంగా చిత్రించారు. అగ్రవర్ణ హిందువులు దళితులను ఎంత నీచంగా చూస్తారో గుండెలు కరిగేరీతిలో అభివర్ణించారు.

---

18. విజయనగరంలో 1936లో జరిగిన ఆది ఆంధ్ర మహాసభలో ఆయన చేసిన ప్రారంభోపన్యాసం మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలకు చెందిన మేధావి వర్గాన్ని ఉద్రూత లూగించింది. ఇప్పటికీ అనేక మంది దళిత మేదావులు ఆయన నుంచి స్ఫూర్తిని పొందుతుంటారు.

<u>నల్లదొరతనము</u>

కుక్క నక్కలకంటె తక్కువగ జూచి,
నిక్కి, తక్కి నిగుడుతారు,
సాని ప్రక్క జేర సాగుతారు,
కుష్ఠరోగి సరస కూర్చుంటారు,
కుక్క, కోతిని కోరి పెంచేరు
పిల్లి, పిట్టాల ప్రేమించుతారు,
పందిగున్నాల బాధింపరారు,
కాకి నీటిని తాగనిస్తారు,
మమ్ము దరికి చేరనీరు, దడదడ తిట్టేరు.

కుసుమ ధర్మన్న కవి దళితులు తమ ప్రాథమిక హక్కులను గుర్తించేలా, తమను తాము హీనులుగా భావించుకునే మానసిక బానిసత్వంనుంచి బయటపడేలా చైతన్యపరిచేందుకు కృషిచేశారు. భూస్వామ్య దోపిడీ వ్యవస్థలో అంతర్భాగంగా వున్న కుల అణిచివేతపై ఆయన విమర్శలు సంధించారు. వలసవాద బాహ్య శతృవులకంటే ఈ అంతర్గత శతృవులే దళితులకు ఎక్కువ ప్రమాదకారులని చాటిచెప్పారు.

పన్నెండు మాసాలు పాలేరుతనమున్న –
పస్తూలబడి బ్రతుకలండి,
ఆలుమగలు కూలిజేయలండి,
పిల్లగాడు పెయ్యలగాయలండి,
పగలు, రేయి పాటు పడ్డనండి,
కుడువ, కట్ట కూడు, గుడ్డేదండి?
రోగమొస్తె నాగదప్పరండి,
అప్పుతీర దయ్యో చిత్రమండి,
యీ నిప్పుపై నిక మేము నిలువలేమో తండ్రి !

గౌరవప్రదంగా జీవించాలన్న కాంక్ష, ఆత్మ గౌరవం, సామాజిక సమానత్వం జాషువా రచనల్లో కూడా విస్తృతంగా చిత్రించబడ్డాయి. ఆయన హిందూమతంపై తిరుగుబాటు చేసిన ప్రతిభా సంపన్నుడైన, సృజనాత్మక కవి. అంటరాని వాళ్లు అంటే హిందూ సర్వద్రష్టులు అంటారాయన.

ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలి సోక
నాల్గు పడగల హైందవ నాగరాజు.

నాలుగు హిందూ వర్ణాలను ఆయన భారతీయ విషసర్పపు నాలుగు పడగలుగా అభివర్ణించారు.

జాషువా అటు గాంధీయిజం వైపు ఇటు అంబేడ్కరిజం వైపు మొగ్గు చూపారు. ఆయన తిరుగులేని, నికార్సయిన బ్రాహ్మణ వ్యతిరేక దళిత కవి. తను ఎదుర్కొన్న వ్యక్తిగత జీవితానుభవాల వల్లే ఆయనలో బ్రాహ్మణ వ్యతిరేకత ఏర్పడింది. అమానవీయ కుల వ్యవస్థ, అగ్రవర్ణ పండితుల అహంభావం కారణంగా ఆయన ఎంతో మానసిక వేదనకు గురయ్యారు. బ్రాహ్మణాధిపత్యపు మేధో ప్రపంచం ఆయనను సాహితీ బహిష్కృతిడిగా చూసింది. దళిత నేపథ్యం వల్లనే ఆయనలోని సృజనాత్మక ప్రతిభ, సాహితీ ప్రజ్ఞ, ప్రతిభా సంపత్తి సరైన గుర్తింపునకు నోచుకోలేకపోయాయి. జీవితం 'నాకు అనేక పాఠాలు నేర్పింది' అన్నారాయన. 'నాకు ఇద్దరు గురువులు– ఒక గురువు దారిద్ర్యం అయితే రెండో గురువు కులం' అని అభివర్ణించారు. 'ఒక గురువు సహనాన్ని నేర్పితే (తొలి రోజుల్లో నిస్సహాయత వల్ల) రెండో గురువు ప్రతిఘటనా పాటవాన్ని పెంచింది తప్ప నన్ను బానిసగా మాత్రం మార్చలేదు. కుల విధ్వంసకతను, బీదరికాన్ని ఛేదించి నన్ను నేనొక మానవుడిగా రుజువుచేసుకున్నాను. కవిత్వమనే ఆయుధాన్ని ధరించి పోరాడాను. నాకు సమాజంమీద ద్వేషం లేదు. నా పేచీ యల్లా దాని విధానాలతోనే' అన్నారు. ఆయన కవితల్లో దళిత ప్రజల ఆగ్రహం, ఆవేదన, నిరాశా నిస్పృహలు, చేదు అనుభవాలు, వివిధ రకాల దోపిడీ సమగ్రంగా వ్యక్తమయింది.

జాషువా రచించిన సుప్రసిద్ధ రచన "గబ్బిలం"లో[20] ఆయన లోని అర్థ గాంధీవాదం, అర్థ అంబేడ్కర్‌వాదం స్పష్టంగా కనిపిస్తుంది. అందులో ఆయన ప్రతీకాత్మకంగా అంటరానితనాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయనలో పెరుగుతున్న చైతన్యం, ప్రతిఘటన, ఉన్నత మానవ విలువలకోసం పడే ఆరాటం గబ్బిలంలో ప్రస్ఫుటమయ్యాయి. అంటరానివాళ్ల సృష్టికి, వారి దుస్థితికి కారణమైన హిందూ సమాజం, మతం, సంస్కృతిపై

---

20. గుర్రం జాషువా "గబ్బిలం" కావ్యాన్ని రెండు భాగాలుగా రచించారు. మొదటి భాగం 1947లో, రెండో భాగం 1950లో ప్రచురితమయ్యాయి.

ఆయన అందులో అనేక ప్రశ్నలు సంధించారు. దళితుల దుర్భర దుస్థితిని ఇలా అభివర్ణిస్తారాయన:

వాని రెక్కల కష్టంబు లేనినాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తిలేదు.

దళితులు ఎదుర్కొంటున్న దోపిడీమయ ఆర్థిక పరిస్థితుల గురించి అనాథ అన్న కవితలో ఎంతగానో ఆవేదన వెలిబుచ్చుతారు.[21]

జాషువా కవిత్వం కరుణ వీర రసాల సమాహారం అని అభివర్ణించారు డా.సి.నారాయణ రెడ్డి. ఆయన సామాజిక వాస్తవిక దృక్పథంలోంచే ఆయన రచనలు వెల్లువెత్తాయి. ఒకింత ఆవేశంతో జాషువా ఈ దేశాన్నే శపిస్తారు. దళితుల కన్నీళ్ల నుండే కారు మేఘాలు ఏర్పడ్డాయనీ అవి ఏదో ఒకరోజు పిడుగులు కురిపిస్తాయని అంటారు. వ్యవసాయ కూలీలుగా పని చేసే దళితుల దుర్భర దారిద్ర్యం, వారి కడగండ్లు ఆయన రాసిన అనేక కవితల్లో చిత్రించబడింది. జాషువా కవితలు స్వతంత్ర రాడికల్ దళితోద్యమం తీవ్రస్థాయిలో వున్నప్పుడు వెలువడ్డాయి.

బోయి భీమన్న తన "పాలేరు", "కూలి రాజు"[22] నాటికలలో దళితులు సాంఘిక, ఆర్తిక, రాజకీయన్యాయం కోసం చేస్తున్న పోరాటాన్ని గొప్పగా చిత్రించారు. 'పాలేరు' నాటకంలో ఆయన దళితులకు సామాజిక సమానత్వం కావాలంటే, వారు సమాజంలో ఉన్నతమైన, గౌరవప్రదమైన జీవనాన్ని సాగించాలంటే చదవు తప్పనిసరి అని చాటి చెప్పారు. విద్య, కులాంతర వివాహాలే సామాజిక చైతన్యానికి దోహదం చేస్తాయంటారాయన. దళిత ప్రజల నిజజీవిత అనుభవాలకు ఆ నాటిక అద్దం పట్టింది. కోస్తా ఆంధ్రాలో ఆ నాటిక అనేక గ్రామాల్లో ప్రదర్శించబడింది. ఆ నాటిక దళితులను చైతన్యవంతుల్ని చేస్తోందన్న అక్కసుతో అగ్రవర్ణ హిందువులు అనేక చోట్ల ఆ నాటికలో నటించిన నటులపై దాడులు చేశారు.[23] ఆ నాటిక ప్రభావంతో అనేక మంది దళితులు తమ సాంప్రదాయిక వృత్తులను వదిలేసి చదువు నేర్చుకోవడం మొదలుపెట్టారు.

---

21. గుర్రం జాషువా "అనాథ" కవితను 1934లో రచించారు.

22. బోయి భీమన్న "కూలిరాజు" నాటికను 1941లో రాశారు. ఇది 1947లో ప్రచురించబడింది.

23. బొజ్జా అప్పలస్వామితో జరిపిన ఇంటర్వ్యూ ఆధారంగా.

దళిత రాజకీయ దృక్పథం వివిధ రచనల్లో కనిపిస్తుంది. దక్షిణ భారతంలో వలసవాద పాలన నెలకొల్పబడ్డ తరువాత దళితులు వలసవాద ప్రభుత్వాన్ని ఎన్నడూ తమ శత్రువుగా చూడలేదు. ఎందుకంటే వారికి స్థానిక అగ్రవర్ణ భూస్వాములే ప్రత్యక్ష దోపిడీదార్లుగా వున్నారు. అందుకే దళితులకు భారత స్వాతంత్ర్యమనేది ఒక అర్థరహిత అంశంగానే వుండిపోయింది.

అంటరానితనం పోవడం, సామాజిక గౌరవాన్ని పొందడమే దళిత ప్రజల ప్రాథమిక లక్ష్యమని భాగ్యరెడ్డి వర్మ చెప్పేవారు. దళితులకు సముచితమైన వస్తుగత సౌకర్యాలు సమకూడిన తరువాతనే వాళ్లు ఉద్యమంలో పాలుపంచుకోగలుగుతారు. కాలే కడుపుతో కుంగిపోతున్న వ్యక్తి రాజకీయాలవైపు,[24] ప్రత్యేకించి కాంగ్రెస్ ఆధ్వర్యంలోని జాతీయోద్యమం వైపు కన్నెత్తి ఎలా చూడగలడు అని ప్రశ్నిస్తారాయన.

సామాజిక సమానత్వాన్ని సాదించేంత వరకూ రాజకీయ స్వాతంత్ర్యాన్ని వాయిదా వేయాలని దళిత నాయకత్వం కోరుకోక పోయినప్పటికీ సర్వమానవ సమానత్వంతో కూడిన సమాజాన్ని ఏర్పాటు చేసే విషయంలో అగ్రవర్ణ హిందూ జాతీయవాదుల నిజాయితీ మీద వారికి అపనమ్మకం వుండేది. మన సమాజంలోని అంటరానితనాన్ని ముందు నిర్మూలించకుండా సామాజిక సమానత్వం, గౌరవమర్యాదలు, సామాజిక న్యాయం ఊసులేని స్వాతంత్ర్యాన్ని సాధించాలనుకోవడం వాంఛనీయం కాదనేది వారి వాదన. కుసుమ ధర్మన్న అనే దళిత కవి "మాతో కలవడానికే జంకే సామాజిక పిరికిపందలు (అగ్రవర్ణ హిందువులు) జాతీయ విముక్తి ప్రదాతలు ఎలా కాగలరు?" అని ఆశ్యర్యం వ్యక్తం చేస్తారు.[25]

స్వారాజ్యమనుచు సర్కారుతో పోరాడి
స్వాతంత్రీయ మడుగుతారు
    మాకు స్వాతంత్రీయ మివ్వబోరు
    గుడిగోప్రాలకైన రానీరు
సత్రములందు మమ్ముండనీరు
నూతి నీళ్లన్న తోడుకోనీరు
మాలలంటె హక్కు లేదంటారు
మాకు హక్కు లెదంటె– స్వారాజ్య మెక్కడదక్కు!?

---

24. కృష్ణా పత్రిక, 10 నవంబర్ 1917.

25. కుసుమ ధర్మన్న కవి "అంటరాని తనానికి మంట"ను 1935లో రాశారు. ఆ తరువాత అశోక్ కుమార్ 1993లో దానిని పునర్ముద్రించారు.

రాజకీయ స్వాతంత్ర్యం, దాని ప్రభావాలకున్న పరిమితుల గురించి దళితులకు స్పష్టంగా తెలుసు. దళితుల ఆకాంక్షలను, అగ్రవర్ణ హిందువుల చేత నిత్య జీవితంలో దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక దోపిడీని దళిత సాహిత్యం ప్రతిబింబించింది.[26] దళిత మేధావులు సాహిత్యం ద్వారా సాటి సంఘ బహిష్కృతులలో చైతన్య తెచ్చేందుకు విశేషంగా కృషి చేశారు. వాస్తవిక, విమర్శనాత్మక, నిర్ద్వంద్వ రీతిలో వెల్లువెత్తిన దళిత సాహిత్యం అగ్రవర్ణ హిందువుల భాష, ప్రతీకలు, ప్రయోజనపరమైన సాహిత్యానికి ప్రత్యామ్నాయమైనదిగా ముందుకొచ్చింది. దళిత కవిత్వం దళితుల కష్టాలనూ, కన్నీళ్లనూ, వారి దుస్థితిని ప్రతిబింబించడమే కాదు, అగ్రవర్ణ హిందూ మేధావులు రూపొందించిన జాతీయవాద సిద్ధాంతం ముందు అనేక మౌలిక ప్రశ్నలను కూడా లేవనెత్తింది. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సర్వమానవ సమానత్వంతో కూడిన సామాజిక వ్యవస్థ కోసం దళితుల ప్రతిఘటనా సిద్ధాంతం కులం, జాతి మొదలైన వాటిపై తీవ్రమైన ప్రభావాన్నే చూపింది.

వలసవాద విధానాల వల్ల అంధ్రలోని వ్యవసాయిక వ్యవస్థ ఒకవిధమైన మార్పునకు గురైంది. బ్రాహ్మణ భూస్వాముల స్థానంలో రైత్వారీ, జమీందారీ వంటి విలక్షణమైన భూసంబంధ వ్యవస్థలు చోటు చేసుకున్నాయి. బ్రాహ్మణేతరులతో కూడిన ఒక కొత్త అగ్రవర్ణాల వర్గం ఏర్పడింది. అందులో ప్రధానంగా వెలమ, కాపు, కమ్మ, రెడ్డి కులస్థులే వున్నారు. వారు అపారమైన ధన సంపద, విశేషమైన పలుకుబడి (పటేల్, ముస్సిఫ్, కరణం మొదలైన గ్రామాధికారుల మీద) కలిగివుండేవారు. అయితే గ్రామీణ ప్రాంతాలలో బ్రాహ్మణుల ప్రాబల్యం పోయి బ్రాహ్మణేతర అగ్రవర్ణాల ప్రాబల్యం ఏర్పడి వారు గ్రామీణ రాజకీయాలు, సామాజిక ఆర్థిక రంగాలు మొదలైనవాటిమీద పట్టు సాధించినప్పటికీ అంటరాని వాళ్ల జీవితంలో మాత్రం ఎలాంటి మార్పూ చోటుచేసుకోలేదు. దళితులు తమ ప్రత్యక్ష శత్రువు మీదనే దృష్టిని కేంద్రీకరించి తమ తల పద్ధతుల్లో ఆక్రోశాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వారు తమ ప్రతిఘటనను పొలాల్లో పనిచేస్తున్నప్పుడు పాటల రూపంలో [27] వ్యక్తం చేసేవారు. (ఈ పద్ధతి ఇప్పటికీ కనిపిస్తుంది).[28]

---

26. నవజీవన్ పత్రిక దళితులపై అగ్రవర్ణ హిందువులు జరిపిన దాడుల గురించి అనేక వార్తలు ప్రచురించింది. జాతీయవాద కార్యక్రమంలో 'హరిజనోద్ధరణ' విషయంలో కొనసాగుతున్న లోపాలను వాటిలో వేలెత్తి చూపింది. చూడండి నవజీవన్ పత్రిక సంచికలు 18 మే 1947, 25 మే 1947, 8 జూన్ 1947, 26 అక్టోబర్ 1947.

ఈ అధ్యాయంలో చర్చించినట్టు దళిత ప్రతిఘటన ప్రధానంగా కుల ఆధిపత్య, అధికార సిద్ధాంతాలు వాటి ఆచరణమీదనే. ఆ ప్రతిఘటన కొంతమేరకు అగ్రవర్ణ సమాజానికి భిన్నమైన రీతిలో, అగోచరంగా సాగింది. ఒక బ్రాహ్మణేతరుడు లేదా దళితుడు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా గళం విప్పినా దానిని సమాజం కావలనే పట్టించుకోలేదు. [29] అయితే ఈ వైఖరి ఎంతోకాలం కొనసాగలేకపోయింది. ఇరవైయవ శతాబ్దం వచ్చే సరికే ముఖ్యంగా 1920లలో వర్ణాశ్రమ ధర్మానికి కొమ్ముకాసేవారిని నిలదీసే స్థితికి దళితులు చేరుకున్నారు. కొనసాగుతున్న అగ్రవర్ణాల శత్రువైఖరేదళితులను ఐక్యం చేసేందుకు, వారి ప్రతిఘటన పెరిగేందుకు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యంగా దోపిడీ, అణిచివేత, బీదరికం, అంటరానితనం మొదలైన వాటిని సమగ్రంగా విశ్లేషించుకునేందుకు దోహదం చేశాయి. పెత్తందారీ అగ్రవర్ణ సమాజంలో దళితుల హోదాలో మార్పుతెచ్చేందుకు ఇటు అంతర్గత చైతన్యంనుంచీ అటు కులప్రాతిపదికతతో కూడిన తిరుగుబాటుల నుంచి ఈ ప్రతిఘటనోద్యమం రూపుదిద్దుకుంది. దళితులు తమ ఆత్మగౌరవంకోసం, హక్కుల కోసం పోరాడేందుకు కావలసిన సైద్ధాంతికతనూ, స్ఫూర్తినీ దళిత మేధావులు, దళిత రచయితలూ అందిస్తూనేవుంటారు.

---

27. *ప్రతి పాట వెనుక ఒక నేపథ్య కథనం వుంటుంది. అందులో వారు తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కుతుంటారు.*

28. *కొండా సూర్యప్రకాశ్‌రావు, బొజ్జా అప్పలస్వామి తో జరిపిన ఇంటర్వ్యూలు.*

29. *చూడండి : నాగార్జున నాయుడు, 1994, కుమార్ 1975, విప్లవ రచయితల సంఘం 1988*

7
ముగింపు

ఇరవైయ్యవ శతాబ్దపు తొలి దశాబ్దాలలో దక్షిణ భారతదేశంలో దళితోద్యమం తలెత్తడం, విస్తరించడం, దళిత చైతన్యం పెరగడం వంటి అంశాలకు తగినంత మేధోపరమైన గుర్తింపు లభించలేదు. డా.బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వాన్ని ప్రతిబింబించే వర్తమాన దళిత ఉద్యమం గురించి తెలిసినంతగా గతకాలపు విలక్షణమైన దళిత గుర్తింపు గురించి గానీ, దళిత చైతన్యం గురించి గానీ చాలామందికి తెలియదు.

దక్షిణ భారత దళిత జీవనానికి సంబంధించిన వివిధ అంశాలు, దళితుల సామాజిక, రాజకీయ స్థితిగతులు, సంస్కృతి గురించిన ఈ చర్చ దళితులు సామాజికంగా ఎంతగా వేరుచేయబడి వున్నారో, వారు ఆర్థిక దోపిడికీ, రాజకీయ నిరాదరణకీ ఎంతగా గురైవున్నారో స్పష్టం చేస్తుంది. అంటరానితనమనే సాంఘిక దురాచారానికి మూలం ఎక్కడుందన్న విషయంలో అనేక సూత్రీకరణలున్నాయి. సామాజికవేత్తలు, సామాజిక చరిత్రకారులు తరచుగా దళితులను హిందూ సామాజిక వ్యవస్థలో అంతర్భాగంగా చేర్చి మాట్లాడుతుంటారు. కానీ దళిత సంస్కృతిలోని అంతర్గత వాస్తవికతని, సంక్లిష్టమైన వారి జీవన విధానాన్ని గుర్తించడంలో విఫలమవుతుంటారు. పందొమ్మిదో శతాబ్దపు సంఘ సంస్కరణోద్యమం విద్య ద్వారానే వికాసం సాధ్యమవుతుందని గుర్తించింది. కానీ ఆ వికాసమూ, ప్రగతీ ద్విజులకే (బ్రాహ్మణులకే) పరిమితమైపోయింది. అంటరానివాళ్లకు విద్యను విస్తరింపచేసేందుకు అరకొర ప్రయత్నాలు జరిగినప్పటికీ వాటివల్ల ఆశించిన ఫలితాలు సిద్ధించలేదు.

1909 లో (మింటో–మోర్లే) సంస్కరణలు, 1919 లో (మాంటేగ్–చెమ్స్ ఫర్డ్) సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. 1919నాటి సంస్కరణల సందర్భంగా ముస్లింలకు ప్రత్యేక ఎలక్టొరేట్‌లను కూడా ప్రవేశపెట్టారు. ఆ సంస్కరణలు ప్రభుత్వ కార్యనిర్వహణా

మండళ్లలో భారతీయులకు ఎంతో కొంత ప్రాతినిధ్యాన్ని కల్పించాయి. అది దళితులకు గుడ్డిలో మెల్లగా మేలు చేసింది. భారత రాజకీయరంగంలో ప్రత్యేక ఎలక్టొరేట్లను ప్రవేశపెట్టాలన్న కీలకమైన నిర్ణయంతో దళితుల సంఖ్యకు ప్రాధాన్యత ఒక్కసారిగా పెరిగింది. దళితులపై ప్రత్యేక శ్రద్ధను చూపేలా వివిధ సంస్కర్తలను ప్రేరేపించింది. దాంతో దళితులకు అణగారిన హిందూ సోదరులన్న హోదా లభించింది. క్రైస్తవులు దళితులను విముక్తి చేస్తూ క్రైస్తవమతంలో చేర్చుకుంటున్న చర్యకు ప్రతిక్రియగా కూడా రాజకీయ ప్రేరేపిత అగ్రవర్ణ హిందువులు దళితులను హిందువీకరించడానికి పూనుకున్నారు. వలసవాద ప్రభుత్వ ఏజెన్సీలు నిర్వహించే పాఠశాలలు – బడుగువర్గాల పరిస్థితిని, దళితుల హోదాలను సమీక్షించే మరో వ్యవస్థీకృత విధానంగా తోడ్పడ్డాయి.

క్రైస్తవ మిషనరీల లక్ష్యం క్రైస్తవీకరణే అయినప్పటికీ అంటరానివారి పట్ల వారు ప్రదర్శించిన మానవీయత, దుర్భర పరిస్థితుల నుంచి వారిని విముక్తిచేయాలన్న కాంక్ష అంటరానివాళ్ల తక్షణావసరాలు తీరేందుకు దోహదం చేశాయి. అయితే హిందూ సంస్కరణవాదుల ప్రయత్నాల్లో మాత్రం అలాంటి మానవీయ వైఖరి మచ్చుకు కూడా కనిపించదు. క్రైస్తవ మిషనరీల కృషి కారణంగా దళితుల జీవితాల్లో మూడు ప్రధాన మార్పులు చోటు చేసుకున్నాయి. మొదటిది క్రైస్తవ మతం పుచ్చుకున్న వారి స్థితి హిందూమతంలో వున్నప్పటికంటే కచ్చితంగా మెరుగైంది. రెండవది హిందూ మతంలోనే వుండిపోయిన దళితులకు తరతరాలుగా తమ జీవితాలను దుర్భరంచేస్తూ కొనసాగుతున్న అంటరానితనమనే దురాచారం ఎంత బూటకమైనదో తేటతెల్లమయింది. క్రైస్తవ మిషనరీలు అంటరానితనాన్ని ఏమాత్రం పాటించకపోవడాన్ని వారు గమనించారు. మూడోది మరింత ముఖ్యమైనది అయిన మార్పు ఏమిటంటే క్రైస్తవ మిషనరీల చర్యలు హిందూ సంఘ, మత సంస్కరణవాదులలో ఒకవిధమైన చురుకును పుట్టించాయి. వారు దళితులకు సామాజిక విద్యను అందుబాటులోకి తెచ్చి, తద్వారా దళితులు క్రైస్తవ మతాన్నో, ముస్లిం మతాన్నో స్వీకరించకుండా హిందూ మతాన్ని సంస్కరించేందుకు నడుంబిగించేట్టు చేసింది. క్రైస్తవ మిషనరీల కార్యకలాపాల కారణంగానే ఆంధ్రాలోని దళితుల్లో తమ సామాజిక హక్కులపట్ల చైతన్యం పెరిగింది. అసమానతను హిందూమతమే పెంచిపోషిస్తోందని వారికి తెలిసివచ్చింది.

దళిత వర్గాన్ని చైతన్యోన్ముఖుల్ని చేసేందుకు దళిత మేధావులు చేసిన కృషి అసాధారణమైనది. వాళ్లు దళితులు చదువుకునేలా విశేష కృషి చేశారు. దళిత విద్యార్థుల కోసం ఎన్నో విద్యాసంస్థలను, వసతి గృహాలను నెలకొల్పారు. వసతి గృహాలలో వుండే విద్యార్థుల తిండికోసం వారు బిక్షాటన చేసేందుకు కూడా వెనుకాడలేదు. ఈ

విధంగా విద్యావంతులైన మొదటితరం దళితులే ఆ తదనంతరపు దళితోద్యమంలో సిద్ధాంత కర్తలుగా, కార్యకర్తలుగా మారారు. కుల ఆధిపత్య సంకెళ్లను తెంచుకుని బయటపడేందుకు చదువును మించిన సాధనం లేదని గుర్తించి తోటి దళితులను విద్యావంతుల్ని చేసేందుకు వారు ఎంతగానో శ్రమించారు. పత్రికలు, కరపత్రాలు, కవితలు, నవలలు మొదలైన వాటి ద్వారా అగ్రవర్ణ హిందూ సంస్కర్తల సంఘసంస్కరణ కార్యక్రమంలోని డొల్లతనాన్ని ఎత్తిచూపారు. మరోపక్క దళితులు చదువు విలువను తెలుసుకునేట్టు కృషి చేశారు.

కులం, జాతి, లింగ భేదాలతో నిమిత్తంలేకుండా పాఠశాలలను, శిక్షణా కళాశాలలను నెలకొల్పుతూ క్రైస్తవ మిషనరీలు చేసిన సేవ, సమాజంలో దళితుల హోదా మారేందుకు ఎంతగానో తోడ్పడింది. దళితుల అభ్యున్నతికోసం మిషనరీలు చేస్తున్న ప్రయత్నాలతో బ్రిటిష్ ప్రభుత్వం కూడా బడుగు వర్గాల ప్రజలకు చదువు చాలా అవసరమని గుర్తించగలిగింది. దళిత విముక్తికి ప్రత్యేక చర్యలు చేపడితే ఎదురయ్యే ప్రతికూలతలు, సాధకబాధకాలు, అగ్రవర్ణ హిందువుల నుంచి సహకారం లభించకుండాపోయే ప్రమాదం వంటి అంశాలను కూడా వలసవాద ప్రభుత్వం గుర్తించింది. మరోపక్క అటు బ్రిటిష్ న్యాయం తాలూకు ఆదర్శ సూత్రాలకూ, సమానత్వానికీ– ఇటు హిందూ పక్షపాత వైఖరి, న్యాయవిరుద్ధ విలువలకీ మధ్యవున్న తేడాని ప్రజలకు చాటి చెప్పాలని ప్రభుత్వం ఆశించింది. ఆ క్రమంలో ఇరవైయ్యవ శతాబ్ది ప్రారంభంలో ప్రభుత్వం సాహసించి ఒక విధాన నిర్ణయాన్ని తీసుకోగలిగింది. మద్రాసు ప్రభుత్వం 1895లో తెచ్చిన విద్యా బిల్లుకు దళితుల విద్యలో ఎంతో చారిత్రక ప్రాధాన్యత వుంది. ప్రభుత్వం ఆ బిల్లుద్వారా కులం పేరిట ఎవరికీ చదువును నిరాకరించేందుకు వీలులేదని స్పష్టం చేసింది. అయితే దానిపై అగ్రవర్ణ హిందువులనుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో దళిత పిల్లలను చేర్చుకోకుండా వారు ప్రతిఘటించారు. ఏది ఏమైనా దళిత విద్యకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న ఆ చర్య క్రైస్తవ మిషనరీలకు, మానవతావాదులకు గొప్ప స్ఫూర్తి నిచ్చింది.

మద్రాస్ ప్రెసిడెన్సీలో అంటరానివాళ్ల అభ్యున్నతికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా లేబర్ డిపార్ట్‌మెంట్‌ని ఏర్పాటు చేసింది. అది ఆంధ్ర సమాజంలో అద్భుత మార్పులకు నాందిపలికింది. చదువుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ దళితుల పరిస్థితిని మెరుగు పరిచేందుకు ప్రభుత్వపరంగా ఒక సక్రమ పద్ధతిలో తీసుకున్న ప్రప్రథమ చర్య అది. దక్షిణ భారత దేశంలో అనేక ప్రాంతాలలో ప్రభుత్వ లేబర్ డిపార్ట్‌మెంట్ స్కూళ్లు

స్థాపించబడ్డాయి. తత్ఫలితంగా బడుగు వర్గాలలో అక్షరాస్యతా శాతం గణనీయంగా పెరిగింది.

అయితే ఇన్ని ప్రత్యేక చర్యలు తీసుకున్నప్పటికీ సాధారణ ప్రజలలో పెరిగిన అక్షరాస్యతా శాతంతో పోలిస్తే దళితులలో పెరిగిన అక్షరాస్యతా శాతం నామమాత్రమనే చెప్పాలి. అగ్రవర్ణ హిందువుల పక్షపాత ధోరణి, వలసవాద ప్రభుత్వం తీసుకున్న చర్యలకు వారు సహకరించకపోవడం, దళితుల సామాజిక ఆర్థిక పరిస్థితులు, అగ్రవర్ణ హిందువుల దాడుల భయం మొదలైన కారణాల వల్ల దళితులలో విద్యాపరంగా ఆశించిన అభివృద్ధి చోటుచేసుకోలేదు. మధ్యలో బడి మానేసే పిల్లల సంఖ్యను బట్టి చూస్తే దళితుల చదువుకు అన్నింటికంటే పెద్ద అడ్డంకి దారిద్ర్యం అని స్పష్టమవుతుంది. వ్యవసాయ పనుల సమయంలో దళితులు తమ పిల్లల్ని బడి మానేయించి పనులకు పంపించేవారు. దుర్భరమైన వివక్షను పక్కనపెడితే అసలు చాలామంది దళితులకు కనీస ట్యూషన్ ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేనేలేదు. వారి చుట్టూ చదువుకు తగిన వాతావరణమూ లేదు. ఆర్థిక వెనుకబాటుతనం, సామాజిక అసౌకర్యాలు, అగ్రవర్ణ హిందువులు అణచివేస్తారన్న భయం మొదలైనవి ఆంధ్ర ప్రాంతంలోని దళితుల ప్రగతికి ప్రధాన అవరోధాలు.

అగ్రవర్ణ హిందులలోని మేధో వర్గం దళితుల విద్యకోసం ఎలాంటి సంఘటిత సామాజిక ఉద్యమాన్నీ చేపట్టలేదు. దళితేతర వర్గాల నుంచి దళితులకు ఎలాంటి సహాయమూ లభించలేదు. అగ్రవర్ణ స్త్రీల అస్తిత్వంకోసం వారిని సంస్కరించాలనీ, విద్యావంతులను చేయాలనీ పందొమ్మిదో శతాబ్దం చివరిలో, 20వ శతాబ్ధం ప్రారంభంలో వివిధ ప్రయత్నాలు జరిగాయి. తత్ఫలితంగా అనేకమంది అగ్రవర్ణ మహిళలు రాజకీయ, విద్య, వృత్తిపరమైన రంగాలలో ఉన్నత స్థాయిని అందుకోగలిగారు. కానీ, అదే సమయంలో అత్యధిక సంఖ్యలో వున్న దళిత మహిళలను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దళిత మహిళలు విద్యా వ్యవస్థకు దూరంగా నిరక్షరాస్యులుగానే వుండిపోయారు.

అందుబాటులో వున్న సమాచారం రీత్యా దళితుల ఆర్థిక పరిస్థితిని విద్య పెద్దగా మెరుగుపరచలేదని స్పష్టమవుతోంది. జనాభా లెక్కల నివేదికలను బట్టి పరిశీలించినా దళితుల సాంప్రదాయిక వృత్తుల్లో కూడా పెద్దగా మర్పు చోటుచేసుకోలేదని తేలింది. కాకపోతే దళితులలో కొద్ది మంది మేధావులు, సంఘసంస్కర్తలు, రాజకీయ నాయకులు, రచయితలు ఏర్పడేందుకు చదువు దోహదం చేసింది. వాళ్లే ఆ తదనంతరకాలంలో దళితుల హక్కుల కోసం పోరాడారు. దళితులలో చైతన్యం పెరగడం, వారు తమకు

తాముగా తమ గుర్తింపు కోసం ఉద్యమించడం అనేవి విద్యవల్ల దళితులకు ఒనగూడిన ముఖ్యమైన లాభాలు. సుదీర్ఘ చారిత్రక పరిణామక్రమం, సంఘటిత చైతన్యం పెరగడం ద్వారానే దళితులకు ఒక సమగ్ర గుర్తింపు ఏర్పడింది.

సాంప్రదాయిక సామాజిక వ్యవస్థలో దళితులకు రాజకీయాలు ఎప్పుడూ ఒక అభ్యుదయ మార్గంగా అందుబాటులో లేవు. సామాజికంగా, మతపరంగానే కాదు రాజకీయంగా కూడా దళితులు అంటరానివాళ్లుగానే పరిగణింపబడ్డారు. బ్రిటీషు ప్రభుత్వం రావడం, నిలదొక్కుకోవడం వల్ల భారతదేశ పాలనా వాతావరణం, సామాజిక, రాజకీయ రంగాలు ఎన్నో మార్పులకు గురయ్యాయి. మారుతున్న రాజకీయ వ్యవస్థల్లో దళితులకు క్రమేణా నూతన అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. దరిమిలా సంఖ్యా బలానికి రాజకీయ ప్రాధాన్యత పెరిగింది. దాంతో అగ్రవర్ణ హిందువులు తమ ప్రత్యర్థులైన ముస్లింల కంటే హిందువుల సంఖ్య ఎక్కువ అని చాటుకుని అధిక రాజకీయ లబ్దిని పొందేందుకు దళితులను తమలో భాగంగా పేర్కొనడం మొదలుపెట్టారు. అంతరాలతో కూడిన హిందూ సామాజిక వ్యవస్థలో దళితులకు చోటు లభించడాన్ని, 1931 జనాభా లెక్కల్లో వ్యూహాత్మక చర్యల ఫలితంగా (దళితుల చేరిక వల్ల) హిందూ జనాభా విపరీతంగా పెరగడం గమనించవచ్చు.

దళితుల సంఖ్యకు రాజకీయ ప్రాధాన్యత పెరగడం వల్ల దళితులు రాజకీయంగా చైతన్యవంతులవుతూ వచ్చారు. వివిధ వలసవాద వ్యతిరేక స్వయం సహాయక ఉద్యమాలలో అంతకంతకూ ఎక్కువగా పాల్గొనసాగారు. 1930లలో, 1940లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో అనేక మంది దళితులు పాల్గొన్నారు. అలాగే గ్రామీణ పేదలను, భూమిలేని వ్యవసాయ కూలీలను సంఘటితం చేస్తూ సాగిన కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా ఎందరో భాగస్వాములయ్యారు. మార్క్సిజం పట్ల ఆకర్షితులైన అనేక మంది దళితులు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని కూలి రక్షణ సమితుల్లో చురుకుగా పనిచేశారు. 1935-37 సంవత్సరాలలో కమ్యూనిస్టు నాయకత్వం కింద సాగిన వ్యవసాయ కూలీల సమ్మెల్లో కోస్తా ఆంధ్ర ప్రాంత దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమ్యూనిస్టులు నిర్వహించిన ఎన్నో కార్యక్రమాల్లో, ఉద్యమాల్లో దళితులు అధిక సంఖ్యలో పాల్గొన్నప్పటికీ... ఆ ఉద్యమాలలో మిగతా వారికంటే దళితులు ఎక్కువ త్యాగాలు చేసినప్పటికీ... దళితులకు నాయకత్వ పాత్ర యిచ్చేందుకు మాత్రం కమ్యూనిస్టులు ససేమిరా అన్నారు.

బ్రాహ్మణేతర జస్టిస్ పార్టీ నాయకులు దళితుల మద్దతు పొందేందుకు, తద్వారా బ్రాహ్మణులకు వ్యతిరేకంగా కూటమికట్టి వారిపై పోరాడేందుకు దక్షిణ భారత

బ్రాహ్మణేతరులందరికీ తామే ఏకైక ప్రతినిధులమని చాటుకున్నారు. దళితులను కాంగ్రెస్ పార్టీకి దూరం చేసేందుకు వారిపై ఎంతో ప్రేమ ఒలకబోశారు. అయితే 1921లో వారు అధికారంలోకి రాగానే సదరు బ్రాహ్మణేతర నాయకుల అసలు రంగు బయటపడింది. చివరికి ఆ పరిస్థితి జస్టిస్ పార్టీ తమకు న్యాయం చేయడంలేదని దళితులు మద్రాస్ గవర్నర్‌కు ఫిర్యాదు చేసేందుకు దారితీసింది.

ఈ అధ్యయనానికి సంబంధించిన కాలంలో దళితులు జాతీయ ఉద్యమాలలో, ఇతర అనుబంధ ఉద్యమాలలో పాల్గొన్నప్పటికీ ఆ ఉద్యమాలేవీ దళితుల కృషిని గుర్తించినట్టు గానీ, వారి భాగస్వామ్యాన్ని విశ్లేషించినట్టు గానీ ఎక్కడా కనిపించదు. కాంగ్రెస్, కమ్యూనిస్ట్, బ్రాహ్మణేతర పార్టీలన్నీ కూడా దళితులను రాజకీయంగా వాడుకుని వదిలేశాయి. చివరకు దళితులు తమ సంఖ్యా బలాన్ని, దాని శక్తిని గుర్తించి, సంఘటితమై తమ ప్రయోజనాల కోసం తామే పోరాడాలని నిర్ణయించుకున్నారు. దళితుల రాజకీయ సమీకరణలు, భాగస్వామ్యం దళిత ప్రజల్లో చైతన్యం పెరిగేందుకు దోహదం చేశాయి. అయితే అగ్రవర్ణ హిందూ రాజకీయ పార్టీలు దళితులను అనేక భ్రమలకు గురిచేశాయి. చివరకు దళితులు ఏ అగ్రవర్ణ హిందూసంఘంలోనూ చేరకుండా తమకు తాము ఒక ప్రత్యేక రాజకీయ గుర్తింపును సాధించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అది ఆంధ్రలో స్వతంత్ర దళితోద్యమానికి బాటలు వేసింది.

ఆంధ్రలోని దళిత నాయకులు మొదట్లో దళిత ప్రజల్లో చైతన్యం పెంచేందుకు, వారిని సంఘటితం చేసేందుకు ప్రభుత్వానికి మహజర్లు సమర్పించడం, బహిరంగ సభలు నిర్వహించడం వంటి వివిధ పద్ధతులు అనుసరించారు. దళిత చైతన్యాన్ని, వారి భాగస్వామ్య గుర్తింపును, చారిత్రక ప్రక్రియను పరిశీలించినప్పుడు గత సంస్కరణోద్యమాల ప్రభావం దళితులమీద గణనీయంగా వున్నట్టు స్పష్టమవుతుంది. ఆది ఆంధ్ర మహాసభ వంటి ప్రాథమిక స్థాయి దళిత సంఘాలు ఏర్పాటు కావడం, క్రమేణా అవి అభివృద్ధిచెందడంతో బ్రాహ్మణేతర, బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమ సూత్రాలు, వాటి సామాజిక తీవ్రత మరింత విస్తృతమయ్యాయి. కులదొంతర, ఆధిపత్యం మీద దళితోద్యమం తీవ్రస్థాయిలో పోరాడింది. జాతీయవాదం, మానవతావాదం, ప్రాతిపదికగా సమగ్ర ప్రజా ఐక్యతను నెలకొల్పాలని దళితోద్యమం ఆశించింది.

ఆంధ్రలో, హైదరాబాద్‌లో సాగిన దళితోద్యమం కింది స్థాయి కులాల్లో ఒక సరికొత్త సంఘీభావాన్ని తీసుకొచ్చింది. తమకు ఆపాదించబడిన వారసత్వ కుల వృత్తులనుంచి బయటపడేందుకు, సరైన నూతన అధికార వ్యవస్థల ఏర్పాటుకు దృఢంగా పోరాడాలన్న సంకల్పాన్ని వారిలో కలిగించింది. దళితులు సమాజంలో వ్యవస్థాపరమైన

మార్పులు తీసుకొచ్చేందుకోసం సైద్ధాంతిక పోరాటం చేశారు. పారదర్శక విలువలతో కూడిన వారి ఉద్యమం వేళ్లూనికుని వున్న పెత్తందారీ సామాజిక వ్యవస్థను, ఆధిపత్య పద్ధతులను, విలువలను సవాలు చేసింది. ఆంధ్ర దళిత మేధావులు రూపొందించిన విముక్తి సిద్ధాంతం ప్రధానంగా కుల దొంతరను, వివక్షను, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ఉద్దేశించబడింది. బ్రాహ్మణీయ హిందూమతాన్ని విమర్శించడం, అగ్రవర్ణాల సాంఘిక సాంస్కృతిక ఆధిపత్యాన్ని సవాలు చేయడం దళితోద్యమ ముఖ్య లక్ష్యాలు. భారత దేశ దళితోద్యమంలో పందొమ్మిదో శతాబ్దపు చివరి దశాబ్దాలు, ఇరవైయవ శతాబ్దపు తొలి దశాబ్దాలలో సాగిన దళితోద్యమాన్ని అంబేద్కర్ పూర్వ దళితోద్యమంగా పరిగణించవచ్చు. ఆ దశాబ్దాలలో అసమ్మతికీ, ప్రతిఘటనకూ బలమైన పునాదులు పడ్డాయి. అవి అనేక మంది దళిత మేధావులను సృష్టించాయి. తొలితరం మార్గనిర్దేశకులు వలసవాద ప్రభుత్వ చర్యల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రత్యేకించి విద్యను వినియోగించుకుంటూ దళితులను సంఘటితపరిచేందుకు కృషిచేశారు. వారి కృషిని– సంఘ సంస్కరణోద్యమానికి సమాంతరంగా సాగిన కృషిగా పరిగణించవచ్చు. ఆ సమాంతర బ్రాహ్మణేతర ఉద్యమాన్ని మహాత్మా జ్యోతిరావు పూలే అత్యధికంగా ప్రభావితం చేశారు. దక్షిణ భారత దేశమంతటా విద్యావంతులు, చైతన్యవంతులైన దళిత నేతలు స్థానికంగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు. ఆంధ్రలో భాగ్యరెడ్డి వర్మ ఆది ఆంధ్ర ఉద్యమాన్ని నడిపితే, కర్ణాటకలోని ఉత్తర ప్రాంతంలో (అప్పుడా ప్రాంతం బొంబాయి ప్రెసిడెన్సీ కింద వుండేది) దేవరాయ ఇంగ్లే స్థానిక దళితోద్యమాన్ని నిర్వహించారు. అలాగే తమిళనాడు ప్రాంతంలో అయోతీ దాస్ తదితరులు స్థానిక దళితోద్యమాలకు నేతృత్వం వహించారు. వారంతా దళిత ప్రజానీకంలో తిరుగుబాటు తత్వాన్ని, చైతన్యాన్ని రగిలించారు. అంబేద్కర్ కాలంలో అఖిల భారత స్థాయిలో దళితులను భారీ స్థాయిలో కూడగట్టేందుకు కావలసిన ప్రాతిపదికతను వారు ఏర్పరిచారు.

ఇరవైయ్యవ శతాబ్దపు తొలి అర్ధ భాగంలో దళితోద్యమం ఒక సంఘటితమైన, స్థిర సంకల్పంతో కూడిన ఉద్యమంగా రూపుదిద్దుకుంది. దళితుల సామాజిక రాజకీయ అభివృద్ధికి అది విశేషంగా కృషి చేసింది. అయితే బలమైన ఉద్యమంగా నిర్థిష్ట కాలం కొనసాగలేకపోవడం వంటి పరిమితులు దానికి వున్నాయి. తరచుగా అగ్రవర్ణ హిందూ రాజకీయ పార్టీలమీద ఆధారపడుతున్నప్పటికీ దళిత ఉద్యమం తన సొంత గుర్తింపును కొనసాగిస్తూ, దళిత ప్రజలకు ఏకైక ప్రతినిధిగా వుంటూ వచ్చింది. హైదరాబాద్, ఆంధ్ర ప్రాంతాల దళిత సంస్థలు ఒక దానినుంచి మరొకటి స్ఫూర్తిని పొందాయి.

'ఆది' సిద్ధాంతం హైదరాబాద్ రాష్ట్రంలో రూపొందినప్పటికీ కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 1917లో జరిగిన తొలి కోస్తా ప్రాంత ఆది ఆంధ్ర సదస్సు నాటికి బలమైన శక్తిగా ఆవిర్భవించింది. దళితుల కష్టాలనీ, కడగండ్లనీ భారత స్వాతంత్ర్యోద్యమంలో, వలసవాద వ్యతిరేక పోరాటాలలో అంతర్భాగంగా తీర్చేందుకు ప్రయత్నించిన గాంధేయ హరిజనోద్ధరణ కార్యక్రమంలోని లొసుగుని ఆది ఆంధ్ర ఉద్యమం ఎత్తి చూపింది. దళిత విముక్తికోసం చేపట్టాల్సిన కార్యక్రమాల విషయంలో సలహాలివ్వడం, దళిత చైతన్యం కోసం మానవీయ సాహిత్యం ద్వారా ప్రయత్నించడం వంటి చర్యల ద్వారా అగ్రవర్ణ హిందూ జాతీయవాద మేధావులు దళిత ప్రజానీకం పట్ల సానుభూతిని ప్రదర్శించినప్పటికీ రాడికల్ విముక్తి సిద్ధాంతాన్ని దళితులే స్వయంగా స్వతంత్రంగా రూపొందించుకున్నారు. దళిత మేధావులు గాంధేయ దళిత విముక్తి ప్రయత్నాలలోని లొసుగులను, దాని పరిమితులను బట్టబయలు చేయడంలో సఫలీకృతులయ్యారు. దళితోద్యమం అగ్రవర్ణ మేధావులు రూపొందించిన ఆధిపత్య జాతీయవాద సిద్ధాంతాన్ని బలంగా ఎదుర్కోవడంలో కూడా విజయం సాధించింది. ఆంధ్ర ప్రాంతంలో వలసవాద కాలంలో పురుడుపోసుకున్న దళితోద్యమం దళితులకు సంబంధించిన కొన్ని ప్రాథమిక సమస్యలను జాతీయవాద సిద్ధాంత రూపకర్తల ముందుంచి వారు వాస్తవాన్ని గ్రహించేట్టు చేయగలిగింది. మరోవిధంగా చెప్పాలంటే ఇరవైయ్యవ శతాబ్దపు తొలి అర్ధ భాగంలో జాతీయవాద విముక్తి ఎజెండాలో దళిత సమస్య చాలా ముఖ్యమైన అంశంగా మారింది.

దళిత మేధోవర్గం మానవ దోపిడీకి బాటలు వేసిన వ్యవస్థను, పరిస్థితులను విశ్లేషిస్తూ ఏమీ తెలియని అమాయకులను సైతం చైతన్యవంతుల్ని చేయగలిగింది. దళిత ప్రజానీకాన్ని విద్యావంతుల్నీ, చైతన్యవంతుల్నీ చేసేందుకు వారిని సంఘటితపరిచేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. సంఘాలను, సదస్సులను నిర్వహించారు. దళిత విద్యార్థుల కోసం పాఠశాలలను, వసతి గృహాలను స్థాపించారు. తమకు సమాజంలో నీచమైన స్థాయిని ఆపాదించిన ఆధిపత్య సిద్ధాంతాన్ని సవాలు చేయగలిగేలా దళితులను తీర్చిదిద్దారు. దళితుల మీద అగ్రవర్ణ హిందువులు జరిపే అన్యాయాలను, అక్రమాలను బహిర్గతం చేయడంలో, వారి సమస్యల పరిష్కారానికి ఒక వేదికను ఏర్పరచడంలో, వారిలో అవగాహనను పెంచడంలో దళిత జర్నలిజం కీలకమైన పాత్రను పోషించింది.

దళిత మేధావులు రూపొందించిన ప్రత్యామ్నాయ సిద్ధాంతం, సాంస్కృతికోద్యమం బ్రాహ్మణీయ హిందూమతాన్ని బలంగా ఎదుర్కొంది, అగ్రవర్ణ హిందువుల దుర్మార్గపు సాంస్కృతిక సాంప్రదాయాలను ఎద్దేవా చేసింది. ఇలాంటి అంశాలన్నీ బోయి భీమన్న,

కుసుమ ధర్మన్న, జాలా రంగస్వామి, నక్కా చినవెంకయ్య, గుర్రం జాషువా, భాగ్యరెడ్డి వర్మ వంటి దళిత రచయితల రచనల్లో ప్రతిబింబించాయి.

ఆయా ప్రాంతాలలో దళితులలో చైతన్య పెరగడంతోపాటు కుల వ్యతిరేక రాడికల్ భావజాలం కూడా తోడయి 1920లలో, 1930లలో 'ఆది' అనే సిద్ధాంతపరమైన గుర్తింపు ప్రధానాంశంగా మారింది. అయితే ఆంధ్రాలో బలమైన వ్యవసాయోద్యమం, హైదరాబాద్‌లో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రతిఘటనోద్యమం ఈ రెండింటి మధ్య ఆంధ్ర దళితోద్యమం బలహీనపడుతూ వచ్చింది. 1932లో గాంధేయ హరిజన సేవక్ సంఘ్ ఏర్పడి దళితులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం మొదలు పెట్టింది. క్రమేణా దాని ప్రభావం పెరిగి కోస్తా ఆంధ్రలో దళితోద్యమాన్ని మరింతగా బలహీనపరిచింది. 1940ల నాటికి కాంగ్రెస్, కమ్యూనిస్టు ప్రతిపక్షాలు స్వతంత్ర దళితోద్యమంలో అంబేద్కర్ వ్యతిరేక వాతావరణం, ముఠాతత్వం ఏర్పడేందుకు దోహదం చేశాయి. 1939లో భాగ్యరెడ్డి వర్మ చనిపోవడంతో సరైన నాయకత్వం లేక హైదరాబాద్, ఆంధ్ర రెండు ప్రాంతల్లోనూ దళితోద్యమం కుంటుబడింది. అగ్రవర్ణ హిందువులు దళితులను నామ మాత్రపు రాయితీలతో ఆకర్షించి తమ తమ పార్టీలలో చేర్చుకునేందుకు ఈ వాతావరణం వీలుకల్పించింది. అగ్రవర్ణాల వారు దళితులలో విభేదాలు, వర్గాలు సృష్టించడంలో కూడా విజయం సాధించారు. "హరిజనులు" అనే కొత్త గుర్తింపుతో దళితులంతా అగ్రవర్ణ హిందూ నేతల కింద తిరిగి హిందూమతంలో చేరడంతో ఆంధ్రలోని రాడికల్ దళితోద్యమం నైతికంగా దెబ్బతిని బలహీనపడిపోయింది.

ఆత్మగౌరవం కోసం, సమానత్వం కోసం విస్తృతమవుతూవచ్చిన దళిత ఉద్యమం సానుకూల స్వీయ గుర్తింపును ఏర్పరచుకుని ఈ ప్రాంతంలోని కుల సమస్య మీద, ఇతర సామాజిక రాజకీయ ఉద్యమాల మీద ఎనలేని ప్రభావాన్ని చూపింది. దళితులు స్వీయ గుర్తింపును నిర్మించుకునే క్రమంలో అగ్రవర్ణ హిందువులు తమపై వేసిన ముద్రలను తొలగించుకోవడమేకాక తమకు తాముగా ఒక విలువను ఏర్పరచుకున్నారు. విముక్తి కోసం ఉద్దేశించిన వారి పోరాటం, గుర్తింపు కోసం వారు పడే తపన ఇప్పటికీ ఇంకా కొనసాగుతూనే వున్నాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత గత యాభై ఏళ్ల సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ దళితుల జీవితాలలో... ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత దళితుల జీవితాలలో మాత్రం ఇంకా పెద్దగా మార్పు రాలేదు.

అనుబంధాలు

పట్టిక : 1
వర్ణాంతర వివాహాలూ వాటి ఉత్పత్తులూ

అ) ప్రాథమిక అనులోమ పిల్లలు/సంతానం

అధికారికం/ ధర్మ శాస్త్రం	తల్లిదండ్రులు తండ్రి	తల్లి	సంతానం/ పిల్లలు	సూచిక
బౌద్ధయాన	బ్రాహ్మణ	క్షత్రియ	సవర్ణ	1.9.1-5
ధర్మసూత్ర	బ్రాహ్మణ	వైశ్య	అంబస్త	
	బ్రాహ్మణ	శూద్ర	పరసవ/ నైషాద	
	క్షత్రియ	వైశ్య	సవర్ణ	
	క్షత్రియ	శూద్ర	ఉగ్ర	
	వైశ్య	శూద్ర	రథకర	
గౌతమ ధర్మసూత్ర	బ్రాహ్మణ	క్షత్రియ	సవర్ణ/ ముర్ధవాసిక	మిత్ర 195:158
	బ్రాహ్మణ	వైశ్య	నిషాద/భుజ్య కనక	
	బ్రాహ్మణ	శూద్ర	పరసవ	
	క్షత్రియ	వైశ్య	అంబస్థ/మహిస్య	
	క్షత్రియ	శూద్ర	దౌస్యంత/యవన	
	వైశ్య	శూద్ర	ఉగ్ర/కరన	
వైఖనస	బ్రాహ్మణ	క్షత్రియ	సవర్ణ/నృప	మిత్ర
స్మార్తసూత్ర	బ్రాహ్మణ	వైశ్య	అంబస్థ	1965:158
	బ్రాహ్మణ	శూద్ర	పరసవ	
	క్షత్రియ	వైశ్య	మద్గు/మహనరమ	
	క్షత్రియ	శూద్ర	ఉగ్ర	
	వైశ్య	శూద్ర	చుకాక	

అధికారికం/	తల్లిదండ్రులు		సంతానం/	సూచిక
ధర్మ శాస్త్రం	తండ్రి	తల్లి	పిల్లలు	
కౌటిల్యుని	బ్రాహ్మణ	క్షత్రియ	సవర్ణ	ఎఎస్. 3.7
అర్థశాస్త్రం	బ్రాహ్మణ	వైశ్య	అంబస్థ	అదే గ్రంథం
	బ్రాహ్మణ	శూద్ర	నిషాద/పరసవ	
	క్షత్రియ	వైశ్య	సవర్ణ	
	క్షత్రియ	శూద్ర	ఉగ్ర	
	వైశ్య	శూద్ర	శూద్ర	
శాశ్వతకోశ	బ్రాహ్మణ	క్షత్రియ	–	
	బ్రాహ్మణ	వైశ్య	–	
	బ్రాహ్మణ	శూద్ర	–	
	క్షత్రియ	వైశ్య	–	
	క్షత్రియ	శూద్ర	–	
	వైశ్య	శూద్ర	ఉగ్ర	
మనుస్మృతి	బ్రాహ్మణ	క్షత్రియ	మూర్ధవాసిక	ఎస్కె 1984
	బ్రాహ్మణ	వైశ్య	అంబస్థ	ఎంఎస్ 10–8
	బ్రాహ్మణ	శూద్ర	పరసవ/నిషాద	అదేగ్రంథం
	క్షత్రియ	వైశ్య	మహిశ్య	
	క్షత్రియ	శూద్ర	ఉగ్ర	ఎంఎస్ 10–9
	వైశ్య	శూద్ర	కరన	
అమరకోశం	బ్రాహ్మణ	క్షత్రియ	–	
	బ్రాహ్మణ	వైశ్య	–	ఎకె. 2–102
	బ్రాహ్మణ	శూద్ర	అంబస్థ	
	క్షత్రియ	వైశ్య	–	
	క్షత్రియ	శూద్ర	–	
	వైశ్య	శూద్ర	–	
వశిష్టస్మృతి	బ్రాహ్మణ	క్షత్రియ	–	వశిష్ట 13–8
	బ్రాహ్మణ	వైశ్య	అంబస్థ	వశిష్ట 13–9
	బ్రాహ్మణ	శూద్ర	నిషాద	
	క్షత్రియ	వైశ్య	–	
	క్షత్రియ	శూద్ర	–	
	వైశ్య	శూద్ర	–	

అధికారికం/ ధర్మ శాస్త్రం	తల్లిదండ్రులు తండ్రి	తల్లి	సంతానం/ పిల్లలు	సూచిక

ఆ. ప్రాథమిక విలోమ సంబంధాల సంతానం

బౌద్ధయాన–	శూద్ర	బ్రాహ్మణ	ఛండాల	1.9.1–5
ధర్మసూత్ర	శూద్ర	క్షత్రియ	సత్త	
	శూద్ర	వైశ్య	మగథ	
	క్షత్రియ	బ్రాహ్మణ	సూత	
	క్షత్రియ	వైశ్య	ఆయోగమ	
	క్షత్రియ	శూద్ర	–	
గౌతమ ధర్మ సూత్ర	శూద్ర	బ్రాహ్మణ	వైదేహక/ పుల్కస	మిత్ర 1965:160
	శూద్ర	క్షత్రియ	వైదేహక/ ఆయోగవ	
	శూద్ర	వైశ్య	కృత్రి/మగథ	
	వైశ్య	బ్రాహ్మణ	మగథ/ధవిర	
	వైశ్య	క్షత్రియ	సూత	
	క్షత్రియ	బ్రాహ్మణ		
వైఖనస	శూద్ర	బ్రాహ్మణ	ఛండాల	మిత్ర 1965:161
స్మార్తసూత్ర	శూద్ర	క్షత్రియ	పుల్కస	
	శూద్ర	వైశ్య	వైదేహక	
	వైశ్య	బ్రాహ్మణ	మగథ	
	వైశ్య	క్షత్రియ	ఆయోగవ	
	క్షత్రియ	బ్రాహ్మణ	సూత	
కౌటిల్యుని	శూద్ర	బ్రాహ్మణ	ఛండాల	ఎఎస్ 1–7
అర్థశాస్త్రం	శూద్ర	క్షత్రియ	క్సత్త	అదే గ్రంథం
	శూద్ర	వైశ్య	ఆయోగవ	
	వైశ్య	బ్రాహ్మణ	వైదేహిక	
	వైశ్య	క్షత్రియ	మగథ	
	క్షత్రియ	బ్రాహ్మణ	సూత	
	ఉగ్ర	క్షత్రియ	స్వపాక	
శాశ్వత కోశం	శూద్ర	బ్రాహ్మణ	ఛండాల	ఎస్కె 345
	శూద్ర	క్షత్రియ	కృత్రి	
	శూద్ర	వైశ్య	–	
	వైశ్య	బ్రాహ్మణ	వైదేహక	

అధికారికం/ ధర్మ శాస్త్రం	తల్లిదండ్రులు తండ్రి	తల్లి	సంతానం/ పిల్లలు	సూచిక
	వైశ్య	క్షత్రియ	మగథ	
	క్షత్రియ	బ్రాహ్మణ	సూత	
			ఛండాల	
				క్సత్త
			ఆయోగవ	
			వైదేహ	
			మగథ	
			సూత	
మనుస్మృతి	శూద్ర	బ్రాహ్మణ	ఛండాల	ఎస్కె. 276
	శూద్ర	క్షత్రియ	క్సత్త	ఎంఎస్ఎక్స్ 12
	శూద్ర	వైశ్య	ఆయోగవ	పైదే
	వైశ్య	బ్రాహ్మణ	వైదేహ	పైదే
	వైశ్య	క్షత్రియ	మగథ	ఎంఎస్ఎక్స్ 11.
	క్షత్రియ	బ్రాహ్మణ	సూత	పైదే
అమరకోశ	శూద్ర	బ్రాహ్మణ	ఛండాల	ఎకె. 11. 10. 4
	శూద్ర	క్షత్రియ	క్సత్త	
	శూద్ర	వైశ్య	–	ఎకె. 11. 10. 3
	వైశ్య	బ్రాహ్మణ	వైదేహక	ఎకె. 11. 10. 2
	వైశ్య	క్షత్రియ	వైదేహక	ఎకె. 11. 10. 2
	క్షత్రియ	బ్రాహ్మణ	సూత	
వశిష్టస్మృతి	శూద్ర	బ్రాహ్మణ	ఛండాల	వశిష్ట 18–1
	శూద్ర	క్షత్రియ	వైన	వశిష్ట 12–2
	శూద్ర	వైశ్య	అంత్యవాసిని	వశిష్ట 13–3
	వైశ్య	బ్రాహ్మణ	రామక	వశిష్ట 13–4
	వైశ్య	క్షత్రియ	పుల్కస	వశిష్ట 13–5
	క్షత్రియ	బ్రాహ్మణ	సూత	

సి. ఇతర మిశ్రమ వర్ణాల సంతానం

బౌద్ధయాన	ఉగ్ర	క్సత్రి	స్వపాచ	
ధర్మసూత్ర	వైశ్య	శూద్ర	(అంబస్థ+బ్రాహ్మణ)	
			రథకార	
వైఖానస	బ్రాహ్మణ	బ్రాహ్మణ	నపిత	మిత్ర1965:158,

అధికారికం/ ధర్మ శాస్త్రం	తల్లిదండ్రులు తండ్రి	తల్లి	సంతానం/ పిల్లలు	సూచిక
స్మార్త సూత్ర	ఛండాల	బ్రాహ్మణ	(సంకరం) స్వపాచ	162
కౌటిల్యుని				
అర్థశాస్త్రం	అంబష్ఠ	వైదేహక	రహకార వేన	
మనుస్మృతి	కృత్త	ఉగ్ర	స్వపాచ	మిత్ర 1965: 158–60.162

ఆధారం: ఈ దిగువ పేర్కొన్న బ్రాహ్మణీయ గ్రంథాల ఆధారంగా పై సమాచారం పొందుపరచడం జరిగింది:
బౌద్ధయాన ధర్మ సూత్ర, కాశీ సంస్కృత్ సిరీస్ నెం. 104, బనారస్, 1934.
మనుస్మృతి, గంగానాథ్ ఝా, రెండు సంపుటులు, కలకత్తా, 1939.
సర్వకోశ – అనేకార్థ సముచ్ఛయ ఆఫ్ శాశ్వత, నారాయణ్ నాథ్ జీ కులకర్ణి, పూనె.
ఇండియా ఆఫ్ ధర్మ సూత్రాస్, వేద మిత్ర, 1965.
ది అర్థ శాస్త్ర ఆఫ్ కౌటిల్య, టి.గణపతి శాస్త్రి, 3 సంపుటులు, త్రివేండ్రమ్, 1925.
అమరకోశం, పండిట్ విష్ణు దత్త శర్మ, బాంబే, 1929.
వశిష్ట స్మృతి, వి.జి. ఆప్టే రచన స్మతినామ్ సముచ్ఛయ, ఆనంద శర్మ సంస్కృత సిరీస్ నెం. 48లో చూడండి.

పట్టిక : 2 ఎ
1881లో మద్రాస్‌లో ప్రభుత్వోద్యోగాలలో కులాలవారిగా దామాషా

కులం/మతం	మొత్తం జనాభాలో వీరి శాతం	రూ10లకంటే ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాలలో వీరి శాతం	రూ. 10 ల లోపు జీతం వచ్చే ఉద్యోగాలలో వీరి శాతం	మొత్తం ప్రభుత్వ ఉద్యోగాలలో వీరి శాతం
బ్రాహ్మణులు	3.6	42.2	4.4	19.2
బ్రాహ్మణేతర హిందువులు	87.9	36.5	67.7	55.4
ముస్లింలు	6.2	5.5	24.1	16.8
భారత క్రైస్తవులు	2.2	4.9	3.5	4.1
యురేసియన్లు	0.1	10.9	0.3	4.5
	100.0	100.0	100.0	100.0

ఆధారం: మద్రాస్ రికార్డ్ ఆఫీస్: (తమిళనాడు స్టేట్ ఆర్కైవ్స్), ఎడ్యుకేషన్ జి.ఒ. 386, 27 జులై 1887.

పట్టిక : 2 బి
1917లో కులంవారిగా, శాఖల వారిగా ప్రభుత్వ సిబ్బంది

జనాభా	బ్రాహ్మణులు	బ్రాహ్మణేతరులు	ముస్లింలు	భారత క్రైస్తవులు యురేసియన్లు, ఆంగ్లేయులు	మొత్తం
	1,166,695	36,06,339	2,764,477	1,208,515	41,203,026
మద్రాస్ ప్రొవిన్షియల్ సివిల్ సర్వీసెస్ (ఎంపిసిఎస్)					
ఎంపిసిఎస్ ఎగ్జిక్యూ-టివ్ బ్రాంచ్	100	29	22	20	171
సబ్ సివిల్ సర్వీస్	165	89	12	7	273
శాఖలు:					
రెవెన్యూ సెటిల్‌మెంట్ సర్వే	39	7	2	40	88
అటవి	16	4	5	50	75
కస్టమ్స్	35	6	–	20	61
ఉప్పు, ఆబ్కారి, అ.రెవెన్యూ	35	10	2	40	88
పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్	25	16	7	56	104
ఫిషరీస్ (మత్స్య)	1	–	–	2	3
ఫైనాన్స్	123	–	–	6	18
జ్యుడిషియల్	190	35	6	46	277
జైళ్లు	1	–	–	2	3
రిజిస్ట్రేషన్	16	1	4	3	24
కంటోన్మెంట్ మెజిస్ట్రేట్స్	1	–	–	2	3
పోలీస్	28	16	9	90	143
మెరైన్ (నావిక)	–	–	–	14	14
విద్య	396	18	28	73	515
క్రైస్తవ ధార్మిక	–	–	–	43	43
వైద్య	134	51	10	133	328
పొలిటికల్ (రాజకీయ)	–	–	2	30	32
స్టేషనరీ & ప్రింటింగ్	–	–	–	5	5
ప్రజా పనులు	65	14	–	108	187
లోకల్ ఫండ్	67	16	–	16	99
మిస్‌లేనియస్	11	4	1	57	73
లే ట్రస్టీస్	1	–	–	90	91
మేరేజ్ రిజిస్ట్రార్స్	4	6	–	20	30

ఆధారం : *జస్టిస్, 15 నవంబర్ 1917. 1 జులై 1916 వరకు సవరించబడి మద్రాస్ రికార్డ్స్ ఆఫీస్, పబ్లిక్ జి.ఒ.136, 17 మార్చి 1919 లో పేర్కొనబడిన త్రైమాసిక సివిల్ జాబితా ముసాయిదా.*

పట్టిక : 3

ఆంధ్రప్రదేశ్‌లోని మొత్త షెడ్యూల్డ్ కులాల జాబితా, 1976

1. ఆది ఆంధ్ర
2. ఆది ద్రావిడ
3. అనామక్
4. ఆరె మాల
5. అరుంధతీయ
6. అరవ మాల
7. బారిక
8. బావురి
9. బేడ జంగం, బుడగ జంగం
10. బిండ్ల
11. బ్యాగర
12. చాచటి
13. చలవడి
14. చమర్
15. చంబర్
16. ఛండాల
17. డక్కల, డొక్కలవారు
18. దండాసి
19. ధోర్
20. డోమ్, దొమ్మర, పైడి, పానొ
21. ఎల్లమాలవారు, ఎల్లమ్మాలవాండ్లు
22. ఘాసి, హడ్డి, రెల్లి, చాచండి
23. గొడగలి
24. గొడారి
25. గోసంగి
26. హోలేయ
27. హోలేయ దాసరి
28. జగ్గలి
29. జాంబవులు
30. కొలుపులవాండ్లు
31. మాదాసి కురువ, మాడారి కురువ
32. మాదిగ
33. మాదిగ దాసు, మష్టీన్
34. మహర్
35. మాల
36. మాల దాసరి
37. మాల దాసు
38. మాల హన్నాయి
39. మాలజంగం
40. మాల మస్తి
41. మాల సాలె నెట్కాని
42. మాల సన్యాసి
43. మంగ్
44. మంగ్ గరోడి
45. మన్నె
46. మస్తి
47. మాతంగి
48. మెహతర్
49. మిత అయ్యల్వార్
50. ముండల
51. పాకీ, మోతి, తోటి
52. పంబద, పంబండ
53. పామిడి
54. పంచమ, పరయ
55. రెల్లి
56. సమాగర
57. సాంబన్
58. సప్రు
59. సిందోళ్లు, చిందోళ్లు

ఆధారం: 1976 ది షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ యాక్ట్ (నెం. 108 ఆఫ్ 1976) తేది 18 సెప్టెంబర్ 1976. చూ. భారత జనాభా లెక్కలు 1981, సిరీస్ 1, పార్ట్ 9.

పట్టిక : 4 ఎ

1931లో మద్రాస్ ప్రెసిడెన్సీ షెడ్యూల్డ్ కులాల జనాభా, కులాల వారిగా బాహ్య కులాలు: 1931లో జనాభా (మద్రాస్ ప్రెసిడెన్సీ)

ఆది ఆంధ్ర	664,844	జాంబవులు	6,701
ఆది ద్రావిడ	1,619,227	మాదారి	6,617
అరుంధతీయ(వి)	–	మాడిగెన్	612,411
బారికి	3.695	మైల	1,431
బావూరి	42,810	మాలదాసు	2,399
బ్యాగారి	8,459	మాతంగి	623
చక్కటి	5,130	ముచ్చి	1,842
చాచియార్లు	606,775	ముండల	6,250
చలవేది	3,442	పైడి	39,437
చమర్	140	పంబడ	335
చౌడల	2,113	పామిడి	424
దర్జాసి	44,248	పంచమ	75,574
ఘాసి	6,081	పరియన్	1,117,197
గొడగోలి	969	రెల్లి	24,239
గొడారి	419	సమర	2,018
గోసాంగి	244	సాంబన్	557
హడ్డి	17,433	తోటి	1,639
హోలేయ	49.567	వాల్మీకి	4,289
జగ్గలి	3,020		

ఆధారం: భారత జనాభా 1931. మద్రాస్ ప్రెసిడెన్సీలోని కొన్ని ప్రధానమైన తెలుగు కులాలు ఇ., అయితే ఇందులో తెలుగేతర కులాలు కూడా వున్నాయి. మద్రాసు కుల పట్టిక నుంచి మొత్తం 7,299,488 మందిని తీసుకోవడం జరిగింది. 65,296 మంది మద్రాస్ రాష్ట్రాలలో – కొచ్చిన్, ట్రావెన్‌కోర్‌లు అంటే పూడుక్కొట్టాయ్ మినహాయించి వున్నారు. మిగతా7,234,104 మంది బ్రిటీష్ పరిపాలనా ప్రాంతంలో వున్నారు.

పట్టిక : 4 బి
1961లో ఆంధ్రప్రదేశ్‌లో కులాలవారిగా షెడ్యూల్డ్ కులాల జనాభా
(పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య తేడా)

కులం పేరు	పట్టణ ప్రాంతం		గ్రామీణ ప్రాంతం	
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు
అన్ని షెడ్యూల్డ్ కులాలు (యావద్దేశంలో)	3,647,319	3,222,378	29,270,115	28,277,554
అన్ని షెడ్యూల్డ్ కులాలు (ఆంధ్రప్రదేశ్‌లో)	279,101	272,987	2,233,224	2,188,304
ఆది ఆంధ్ర	23,346	23,022	275.446	273,,194
ఆది ద్రావిడ	1,399	1,326	17,460	17,274
అనామక్	2	2	1,553	1,514
ఆరె (మాల)	765	786	753	847
అరుంధతీయ	2,413	2,518	40,928	39,361
అర్వ మాల	2,016	1,905	135	162
బారికి	117	120	4,782	4,886
బవురి	2	–	394	491
బేడ (బుడగ) జంగం	49	56	966	769
బిండ్ల	39	34	2,573	2,465
బ్యాగర	47	137	2,872	2,847
చాచటి	745	986	2,581	2,517
చలవడి	59	34	721	727
చమర్ (మోచి/ముచ్చి)	2,941	2,706	829	828
చంభర్	580	496	956	801
ఛండాల	–	–	16	18
డక్కల (డొక్కవార్)	30	9	554	516
దండాసి	134	130	2,445	2862
ధోర్	585	554	393	394
డోమ్, డోంబ్ పైడి లేదా పనో ఎల్లమల్వార్	547	651	6,403	7,442
ఎల్లమ్మాలవాండ్లు	71	74	263	191
ఘాసి, హాడ్డి లేదా రెల్లి చచండి	399	472	405	449
గొడగలి	288	287	548	567
గొడారి	324	251	64	63
గోసంగి	4	3	31	27
హోలేయ	15	19	198	139
హోలేయ దాసరి	69	62	14	9

కులం పేరు	పట్టణ ప్రాంతం		గ్రామీణ ప్రాంతం	
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు
జగ్గ	19	22	1,199	1,249
జాంబవులు	110	128	4,792	4,519
కొలుపువాండ్లు	1	10	353	311
మాదాసి కురువ/మాదారి కురువ	43	21	184	168
మాదిగ	115,031	110,724	979,151	942,973
మాదిగ దాసు/ మస్తీన్	330	482	1,622	1,789
మహర్	420	370	5,362	5,589
మాల	101,040	97,663	773,715	773,048
మాల దాసరి	496	442	3,353	3,202
మాలదాసు	1,294	1,773	11,947	11,820
మాల హన్నాయ్	15	5	41	40
మాల జంగం	617	641	2,059	1,979
మాల మస్తి	43	31	256	235
మాల సోల (నెట్కని)	1,212	971	27,082	25,225
మాల సన్యాసి	14	8	19	11
మంగు	560	652	5,020	5,224
మంగు గవోడి	48	57	4	14
మన్నె	2,819	3,243	20,866	19,416
మష్టి	51	21	390	362
మాతంగి	5	2	387	248
మెహతర్	1,468	1,243	205	210
మిట్ట అయ్యల్వార్	52	17	1,278	1,195
ముండల	12	26	252	225
	1,307	1,527	467	525
పంబడ / పంబంద	26	47	425	454
పమిడి	5	–	2,812	1,776
పంచవ / పరయ	2,764	2,477	6,312	6,329
రెల్లి	8,373	9,484	10,541	10,447
సమాగర	302	258	99	120
సంబన్	–	–	2	2
సప్రు	1	2	215	200
సిందోళ్లు (చిందోళ్లు)	31	16	1,108	1,065
తోటి	973	935	809	806
వర్గీకృత	2,833	3,049	6,598	6,168

పట్టిక : 5
1971 జనాభా లెక్కల ప్రకారం ప్రాంతాల వారిగా షెడ్యూల్డ్ కులాల తాలూకు జనాభా వివరాలు

కులం పేరు	జనాభా	
చలవడి	1,541	రాష్ట్రమంతటా
చమర్, మోచి / ముచ్చి	7304	ఉన్నారు
మాదిగ	21,47,879	
మాల	17,45,466	
ఆది ఆంధ్ర	5,95,008	ఈ కులాల వారుహైదరాబాద్,
ఆది ద్రావిడ	37,459	మహబూబ్‌నగర్, ఆదిలాబాద్,
అరుంధతీయ	85,220	నిజామాబాద్, మెదక్, కరీంనగర్,
బారికి	9,905	వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలు
బావురి	887	మినహా మిగతా రాష్ట్రమంతటా
చాచోటి	6,829	ఉన్నారు.
చోడెల	34	
దండాసి	5,581	
డోమ్, దొమ్మర, పైడి/ పను	15,043	
ఘాసి, మడ్డి / రెల్లి, చాచండి	1,725	
గోడెగలి	1,690	
గొడారి	702	
గోసంగి	65	
జగ్గలి	2,489	
జాంబవులు	9,549	
మాదాసి కురువ / మాదారి కురువ	416	
మాల దాసు	26,834	
మాదిగ దాసు, మష్తి	4,223	
మాతంగి	642	
ముండల	515	
పాకి / మోతి	3,826	
పంబడ / పంబంద	952	
పమిడి	4,593	
పంచమ / పరయ	17,887	

154
675
11,741
7,493
101
5,296
565
54,290
52
11,456
123
46,344
824
3,126
2,542
779
2,220
5,774,548

పట్టిక : (

ఆంధ్రాలో 1991లో జిల్లాల వారిగా (గ్రామీణ, ప

	పట్టణ			
జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం	పురుషులు
శ్రీకాకుళం	64.04	36.77	50.15	39.79
విజయనగరం	59.26	34.46	46.65	39.19
విశాఖపట్నం	74.49	50.85	62.89	39.34
తూర్పు గోదావరి	62.26	47.11	54.67	44.03
పశ్చిమ గోదావరి	63.08	48.39	55.78	45.31
కృష్ణా	72.46	52.69	62.59	43.10
గుంటూరు	64.32	41.93	53.80	44.87
ప్రకాశం	66.82	43.72	55.34	41.74
నెల్లూరు	66.97	48.13	57.51	41.65
చిత్తూరు	68.94	45.22	57.35	44.76
కడప	32.38	36.54	49.39	43.62
అనంతపూర్	63.50	37.84	50.94	21.14
కర్నూలు	58.65	33.86	34.44	35.97
మహబూబ్‌నగర్	56.95	30.81	44.32	21.24
రంగారెడ్డి	62.99	28.99	51.24	30.20
హైదరాబాద్	68.89	48.64	58.91	----
మెదక్	56.13	30.17	43.34	23.92
నిజామాబాద్	50.61	25.65	37.98	27.26
అదిలాబాద్	53.03	32.05	42.76	30.56
కరీంనగర్	59.83	34.13	47.14	32.39
వరంగల్	67.42	42.45	55.23	32.96
ఖమ్మం	68.45	47.58	58.07	36.44
నల్గొండ	66.82	46.52	57.56	33.82
ఆంధ్రప్రదేశ్	**64.87**	**43.03**	**54.09**	**37.02**

	జనాభా	
	38,845	
	4	
	418	
	3,523	
	1,541	
	7,304	
	4,218	
) జంగం	1,840	
	5,111	ఈ కులాలవారు హైదరాబాద్,
	5,903	మహబూబ్‌నగర్, నిజామాబాద్,
	2,833	మెదక్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం,
్కవర్)	1,109	నల్గొండ జిల్లాల్లో మాత్రమే ఉన్నారు.
	1,926	
(ఎల్లమ్మలవాండ్లు)	599	
	371	
ొసరి	154	
[illegible]	[illegible]	

క : 6

ు, పట్టణ (ప్రాంత) దళితుల అక్షరాస్యతా రేటు

గ్రామీణ			మొత్తం జనాభా		
ుషులు	స్త్రీలు	మొత్తం	పురుషులు	స్త్రీలు	మొత్తం
.79	16.63	28.32	42.61	19.17	31.01
.19	13.22	24.43	39.50	17.26	28.54
.34	13.22	29.16	55.50	33.45	44.72
.03	29.94	37.01	46.98	32.75	39.89
.31	31.89	38.67	47.45	33.89	40.74
.10	26.19	34.87	48.58	31.35	40.16
.87	21.94	33.74	48.46	24.51	37.48
.74	15.86	29.08	43.91	18.35	31.39
.65	21.38	31.63	44.95	24.97	35.06
.76	20.54	32.86	47.15	22.96	35.27
.62	14.71	29.61	46.12	17.79	21.35
.14	9.52	21.20	36.84	13.82	25.67
.97	10.09	23.43	40.51	14.94	28.10
.24	3.93	12.73	23.27	5.42	14.51
.20	8.63	19.69	40.94	18.64	30.06
---	-----	----	68.89	48.64	58.91
.92	5.66	14.93	26.57	7.66	17.27
.26	7.96	17.32	29.80	9.83	19.53
.56	8.93	19.86	34.94	13.33	24.26
.39	10.68	21.67	35.83	13.65	24.26
.96	11.01	2235	38.06	15.74	24.26
.44	15.21	26.20	41.74	20.84	31.61
.82	9.74	22.03	36.35	12.24	24.60
.02	**16.18**	**26.79**	**41.88**	**20.91**	**31.58**

Bibliography

గ్రంథ సూచిక

Abbasayalu, Y.B.,1978, *Scheduled Caste Elite: A Study of Scheduled Caste Elite in Andhra Pradesh*, Hyderabad, Osmania Uni versity.

Abbasayalu, Y.B., 1979, *Sociology of Depressed Groups*, Hyderabad, Osmania University.

Anantakrishna Sarma, Rallapalli, 1947, 'Vemana', *Sir Raghupati Venkataratnam Endowment Lecture*, Waltair, Andhra Uni versity.

Andhra Pradesh Civil Liberties Committee, 1991, *The Chundur Carnage*, Vijayawada, APCLC.

Bhagawat, M.E., 1980, 'Vidarbha Hatil Dalit Vicharanci Netrutva' in P.L. Joshi., *Political Ideas and Leadership in Vidarbha*, Nagpur.

Brown, C.P., 1967, *The Versus of Vemana* (Telugu original with English rendering), Hyderabad.

Chandraiah, K., 1992, 'The Awakening of Adi-Hindus of Hyderabad as Part of the National Movement For Free dom', *Souvenir*, Hyderabad, Dr. Ambedkar People's Edu cational Society.

Chinna Rao, Yagati, 2002, 'Education and Identity Formation Among Dalits in Colonial Andhra', in S. Bhattacharya (ed), *Education and the Disprevileged: Nineteenth and twentieth Century India*, New Delhi, Orient Longman.

Gangawane, Kamalakar, 1994, 'Social Awareness in Dalit Lit erature' in Bojja Tharakam, (ed). *The First All India Dalit Writers Conference*, Hyderabad, Dr. B.R. Ambedkar Memorial Trust.

Gautam, M.B., 1953, The Scheduled Castes and Backward peoples' Movement in Hyderabad', 30 November, (mimeo).

Gautam, M.B., 1976, 'The Untouchables Movement in Andhra Pradesh', *Souvenir*, A.P. State Harijan Conference, (10-12 April).

Gautam, M.B., 1991, *Bhagyodayam: Maadari Bhagya Reddy Varma, Life sketch and Mission*, Hyderabad, Adi -Hindu Social Service League.

Gledstone, F.F., 1941, The C.M.S. Telugu Mission: Being A short Account of the Hundred Years, 1841-1941, Mysore.

Ilaiah, Kancha, 1991, *Gautama Buddha as Political Philosopher*, Ph.D. Thesis, Osmania University. *(In Telugu: HBT).

Ilaiah, Kancha, 1995b, *Why I am Not a Hindu*: A Shudra Critique of Political Economy and Culture, Calcutta, Saamya Publica tions. *(In Telugu: HBT).

Kesavanarayana, B., 1976, *Political and Social Factors in Andhra 1900-1950*, Vijayawada, Navodaya Publishers.

Krishna Rao, Y.V., 1984, *Growth of Capitalism in Indian Agri culture: A Case Study of Andhra Pradesh*, Vijayawada, Navodaya Publishers.

Kshira Sagar, R.K., 1994, *Dalit Movement and Its Leaders (1857-1956)*, New Delhi, M.D. Publishers.

Lakshmanna, C., 1973, *Caste Dynamics in Village India*, Bombay, Nachiketa Publications.

Mangamma, J., 1971, *The Rate Schools of Godavari*, Hyderabad, The Government of Andhra Pradesh.

Manor, J.G., 1971, 'Testing the Barrier Between Caste nd Outcaste: The Andhra Evangelical Luthern Church in Guntur District, 1920-1940', *Indian Church History Review*, Vol V, No. 1.

Nagaraju Naidu, A., 1994, 'Caste and Land in Colonial South India' in K.L. Sharma (ed.), *Caste and Class in India*, New Delhi, Rawat.

Nagireddy, Tarimela, 1972, *India Mortgaged*, Hyderabad.

Naik, D. Ramulu, 1992, *M.V. Bhagya Reddy Varma's Life and Mission*: A study, Unpublished M.Phil. Dissertation, Osmania University.

Narayana Rao, K.V., 1973, *The Emergence of Andhra Pradesh*, Bombay, Popular Prakashan.

Oddie, G.A., 1991, 'Christian Conversion Among Non-Brahmins in Andhra Pradesh: With Special Reference to Anglican Mis sions and The Dornakal Diocese, C. 1900-1936' in Oddie, G.A., (ed.), *Religion in South Asia: Religion Conversion and Revivalist Movements in South Asia in Medieval And Modern Times*, New Delhi, Manohar.

Omvedt, Gail, 1976, *Cultural Revolt in Colonial India: The Non-Brahmin Movement in Western India 1873-1930*, Pune, Scientific Socialist Educational Trust.

Omvedt, Gail, 1995, *Dalit Visions: The Anti-Caste Movements and The Construction of An Indian Identity*, Hyderabad, Orient Longman.

Padma Rao, Katti, 1995, *Caste and Alternative Culture*, Madras, The Gurukul Luthern Theological College and Research In stitute and Centre for Research on New International Eco nomic Order.

Pavier Barry, 1974, *'The Telangana Armed Struggle', Economic and Political Weekly*, (Special Number), Vol. IX,

Pavier Barry, 1981, *The Telangana Movement*, 1944-51, Delhi.

Phule, Mahatma Jothirao, 1980, *Samagra Vangmaya*, Bombay.

Phule, Savitri, 1988, *Samagra Vangmaya*, M.G. Mali (ed.). Bombay.

Private Papers and Collections of *M. Bhagyareddy Varma* (Unpublished and in possession of his son M.B.Gautam, Hyderabad).

Private Papers of *M.C. Rajaiah*, NMML, New Delhi.

Private Papers of *R. Venkataratnam Naidu*, NMML., New Delhi.

Priyadarsini Vijayasri, K., 1997, *Patterns of sacred Prostitution in Colonial Andhra*, Unpublished M.Phil Dissertation, Jawaharlal Nehru University.

Priyadarsini Vijayasri, K., 2002, *Patterns of sacred Prostitution in Colonial South India: A Comparative Study of Andhra and Karnataka*, Unpublished Doctoral Dissertation, Jawaharlal Nehru University.

Rajgopal, Indu, 1985, TheTyranny of Caste: *The Non Brahmin Movement and Political Development in South India*, New Delhi, Vikas.

Rajaiah, M.C., 1925, *The Oppressed Hindus*, Madras, The Huxley Press.

Ramakrishna, V., 1983, *Social Reform in Andhra*, New Delhi.

Ramakrishna, V., 1993, 'A Background Study To the Emergence of Caste Consciousness in Coastal Andhra Pradesh', in Suranjan Das and Sekhar Bandopadhyay (eds;), *Caste and Commu nal Politics in South Asia*, Calcutta, K.P. Bagchi and Co.

Rouschenburschu-Clough, Emma, 1889, *While Sewing Sandals*: Tales of Telugu Pariah Tribe, London, Hodder and Stoughton.

Sathianadhan, S.,1894, *History of Education in Madras Presi dency*, Madras.

Satyanarayana, A., 1979, *Kisan Movement in Madras Presidency: A Study of the Anti-Zamindari Agitation in Andhra, 1928-42,* Unpublished M.Phil, Dissertation, Jawaharlal Nehru Uni versity.

Satyanarayana, A., 1986, 'Rise and Growth of Left Movement in Andhra, 1934-39', *Social Scientist*, Vol XIX, No.1.

Satyanarayana, A., 1990, *Andhra Peasants Under British Rule: Agrarian Relations and the Rural Economy, 190040*, New Delhi, Manohar.

Satyanarayana, A., 1994, 'Caste and Class in Rural Andhra: A His torical Perspective", in K.L. Sharma (ed.), *Caste and Class in India*, Delhi, Rawat.

Satyanarayana, A., 2002, 'Growth of Education Among the Dalit Bahujan Communities in Modern Andhra, 1893-1947', in S. Bhattacharya (ed.), *Education and the Disprivileged: Nineteenth and Twentieth Century India*, New Delhi, Ori ent Longman.

Satyanarayana, K., 1975, A Study of the History and Culture of the Andhras, 2 Vols., New Delhi.

Sundarayya, P. 1972, Telangana Peoples Struggle and its Lessons, Calcutta, Desraj Chandha on behalf of CPM.

Tirumala Rao, Jayadheer, 1995, 'Hidden Culture of Depressed Castes: A Case Study of Dakkali- A dalit Community", in R. Soma Reddy, M. Radhakrishna Sharma and A. Satyanarayana (eds.) *Castes, Community and Culture in Andhra Desa: 17th and 18th Century*, Hyderabad, Osmania University.

Venkata Rangaiah, M., 1965, *Freedom Movement in Andhra Pradesh*, 4 Vols., Hyderabad, Government of A.P.

Venkataswamy, P.R., 1955, *Our Struggle For Emancipation*, 2 Vols;, Secunderabad, Printed at the Universal Art Printers.

Vijaya Bharati, B., 1992, 'Dalit Sahityam' in the *Souvenir*, Hyderabad, Dr. Ambedkar People's Education Trust.

ఆదినారాయణ శాస్త్రి, పంచాగ్నుల., 1917, *శ్రీ వేమన యోగి జీవితం*, మద్రాస్.

ఆంజనేయులు, సిరిపి, 1928-1929, *'అనంతపురం మండలమందలి ఆదిమాంధ్రులు'*, *ఆంధ్రపత్రిక ఉగాది సంచిక*.

ఆంథొని ఎఫ్.ఆర్., రాజ్ ఎస్.జె., 1990 *'మానవ హక్కుల ఉద్యమమే దళితోద్యమం'*, విద్యార్థి విశ్లేషణ, సంపుటి 1, నెం. 7.

అప్పారావు, గురజాడ, 1965, *కన్యాశుల్కం*, మద్రాస్, (ప్రథమ ముద్రణ 1897).

అప్పారావు, యం.ఆర్., 1972, *బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు*, కాకినాడ.

అప్పలస్వామి, పురిపండ, 1925, *'పంచమ విలాపం'*, ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక.

అశోక్ కుమార్, కె.పి., 1993, *'దళిత గీతాలు'*, హైదరాబాద్, సాహితీ సర్కిల్.

భాను, జి., 1987, *తెలుగు నవలా సాహిత్యం - హరిజనాభ్యుదయం*, అముద్రిత పిహెచ్‌డి థీసిస్, నాగార్జున యునివర్సిటీ.

భాస్కర చౌదరి, బి., 1981, *జాషువా జీవిత కవితా ప్రస్థానం*, ద్వితీయ ముద్రణ, చిత్తూరు.

భావయ్య చౌదరి, కె., 1988, *కమ్మవారి సంక్షిప్త చరిత్ర*, సంగం జాగర్లమూడి.

భీమన్న, బోయి, 1988, *పాలేరు*, హైదరాబాద్, 19వ ముద్రణ, (ప్రథమ ముద్రణ 1940లో జరిగింది).

చౌదరి, ఎం.ఎం., 1923, *యువకులు - దేశము*, కాకినాడ, శ్రీ సాధన కమిటి.

చిన వెంకటయ్య, నక్కా, 1953, *హరిజన కీర్తనలు*, వంగాయ గూడెం, ఎలూరు, రచయిత.

ధర్మారావు, తాపీ, 1994, *దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు?*, హైదరాబాద్, విశాలాంధ్ర, (ప్రథమ ముద్రణ 1936).

ధర్మన్న, కుసుమ, 1933, *హరిజన శతకము*, రాజమహేంద్రవరం, పతితపావన మూర్తి, జగన్‌మోహన్ దాస్.

ధర్మన్న, కుసుమ, 1933, *నల్ల దొరతనము*, రాజమండ్రి, లక్ష్మీనారాయణమ్మ.

ధర్మన్న, కుసుమ, 1992-93, *సామ్యవాదాన్ని సహించదీ హిందూయిజం*, మూడు భాగాలు, నలుపు పత్రిక.

గౌతం, యం.బి., 1977, *దళిత జాతులను సముద్ధరించిన మహనీయులు - భాగ్యరెడ్డి వర్మ, హరిజన సంక్షేమ సమాచారము*, సంపుటి 1, నెం. 2, ఏప్రిల్.

జ్ఞానేశ్వర్, గనుమాల, 1983, *బోయి భీమన్న సాహితీ షష్టిపూర్తి సంచిక*, హైదరాబాద్, సాహితీ షష్టిపూర్తి ప్రచురణ.

గోపి, ఎన్., 1980, *ప్రజాకవి వేమన*, హైదరాబాద్, చైతన్య ప్రచురణలు.

గురుప్రసాదరావు, నాగళ్ల, 1959, జాషువా, భారతి, ఏప్రిల్.

హైమవతి, 1982, *పాలేరు నుంచి పద్మశ్రీ వరకు: బోయి భీమన్న*, హైదరాబాద్, సన్మాన సంఘం, (ప్రథమ ముద్రణ 1978).

జాషువా, గుర్రం, 1930, *ప్రభోధము*, భారతి, సంపుటి 7, నెం.4.

జాషువా, గుర్రం, 1991, *గబ్బిలం*, విజయవాడ, హేమలతా లవణం, (ప్రథమ ముద్రణ 1945).

జాషువా, గుర్రం, 1976, *నా కథ*, విజయవాడ, హేమలతా లవణం,

కేశవరావు, అయ్యదేవర, 1959, *నా జీవిత కథ - నవ్యాంధ్రము*, విజయవాడ.

కూర్మయ్య, వేముల, 1947, *మాతృ దేశ దాస్య విముక్తికై ఆంధ్ర హరిజనుల శక్త్యానుసార కృషి, ఆంధ్ర పత్రిక, ఆగస్ట్ 15.*

లక్ష్మీకాంతం, పి., 1961, *పల్నాటి వీర చరిత్ర*, విజయవాడ.

లక్ష్మీనరసింహం, చిలకమర్తి, 1957, స్వీయ చరిత్రము, విజయనగరం.

లక్ష్మీనారాయణ, ఉన్నవ, 1964, మాలపల్లి (సంఘ విజయం), మచిలీపట్నం, త్రివేణి పబ్లిషర్స్, (ప్రథమ ముద్రణ 1922).

లక్ష్మీకాంతమ్మ, భువనగిరి, 1934, అస్పృశ్యత, *ప్రభుద్ధాంధ్ర*, సంపుటి5,సంఖ్య 6.

లింగయ్య, గద్దె, 1938, మాలపిల్ల, ఎలమర్రు, ఆదర్శ గ్రంథ మండలి.

నాగభూషణ శర్మ, మొదలి, 1971, *తెలుగు నవలా వికాసము*, హైదరాబాద్.

నారగోయిని, వి.జి.ఆర్., 1972, *బ్రాహ్మణిస్టు భ్రమలనుండి బయటపడని* కమ్యూనిస్టు పార్టీలు, సికిందరాబాద్, గీతా పబ్లికేషన్స్.

నారాయణ రెడ్డి, సి. 1981, సమీక్షణం, హైదరాబాద్.

పద్మారావు, కత్తి, 1983, *సాంఘిక విప్లవ రచయితలు*, నిడుబ్రోలు, లోకాయత.

పద్మారావు, కత్తి, 1988, కులం పునాదులు, పొన్నూరు, లోకాయత, (ప్రథమ ముద్రణ 1980).

పద్మారావు, కత్తి, 1991-94, *దళితుల చరిత్ర, (రెండు భాగాలు)*, పొన్నూరు, లోకాయత.

పద్మారావు, కత్తి, 1994, *దళిత సాహిత్య వాదం - జాషువా*, పొన్నూరు, లోకాయత.

పట్టాభి శర్మ, బ్రాహ్మభట్ల, 1920-21, మాలలు, *ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక.*

పూర్ణయాచార్యులు, ఆర్., 1913, వేమన సూక్తి రత్నాకరము, మచిలీపట్నం.

ప్రభాకర శర్మ, ఫణిదపు, 1989, *శ్రీ వీరబ్రహ్మేంద్ర గురు భారతం*, విజయవాడ, రామా బుక్ డిపో.

ప్రసాద్, చలసాని, 1992, *ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర*, విజయవాడ, విరసం.

ప్రసాద్, కలేకూరి, (యువక), 1993, దళిత సాహిత్యం, విజయవాడ.

రాఘవ శర్మ, గురజాడ, 1973, *జాతీయ గీతాలు*, హైదరాబాద్,

రామచంద్ర, తిరుమల, 1963, మరపురాని మనిషి, *ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రిక, 13* మార్చి.

రామకృష్ణ శాస్త్రి, ఎస్., 1976, *ఆంధ్ర వాంగ్మయ చరిత్ర సర్వస్వము*, మద్రాస్, (ప్రథమ ముద్రణ 1951).

రామ్మూర్తి, పాము, 1976, *రాష్ట్ర హరిజన నాయకుల జీవిత చరిత్ర*, కాకినాడ.

రంగా, ఎన్.జి., 1933, *హరిజన నాయకుడు*, గుంటూరు, కిసాన్ పబ్లికేషన్స్.

రంగస్వామి, జాలా, 1930, *అంటరాని వారెవ్వరు?*, రాజమహేంద్రవరం, ఈశ్వర ముద్రాక్షర శాల తరపున దువ్వూరి సాంబమూర్తి.

రంగస్వామి, జాలా, 1930, మాలశుద్ధి, రాజమహేంద్రవరం, శ్రీ ఆంజనేయ ముద్రాక్షర శాల.

రావు, సి.వి.కె., 1954, *రాష్ట్ర* కమ్యూనిస్టు నాయకత్వపు *బండారం*, మచిలీపట్నం.

రమణా రెడ్డి, కె.వి., 1969, *మహోదయం*, విజయవాడ.

రమణా రెడ్డి, కె.వి., 1984, *అభ్యుదయ సాహిత్యోద్యమం*, విజయవాడ.

సాంబమూర్తి, వజ్రపు, 1992, *వాల్మీకి చేత రామాయణం ఎందుకు రాయించారు?*, హైదరాబాద్, జానపద విజ్ఞాన కేంద్రం.

సాంబశివరావు, గుమ్మా, 1991, జాషువా కవిత్వంలో జాతీయత, తెలుగు, సెప్టెంబర్.

సాంబశివరావు, మల్యాల, 1920-21, పంచముల ప్రాచీనత, *ఆంధ్ర* పత్రిక *ఉగాది సంచిక*.

శాస్త్రి, ఎన్., 1923, అస్పృశ్యులా?, ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక, 1922-23.

సద్గోపాచార్యులు, కొమాండూరి,1934, *హరిజనులు జాతి,ప్రబుద్ధాంధ్ర*,సంపుటి 5.

సద్గోపాచార్యులు, కొమాండూరి, 1934, *హరిజనోద్యమ* ఆవశ్యకం, *ప్రబుద్ధాంధ్ర*, సంపుటి 5, నెం. 6.

సత్యనారాయణ, గరిమెళ్ల, 1933, *హరిజనుల పాటలు*, మైలాపూర్.

సత్యనారాయణ, కంభంపాటి, 1984, *ఆంధ్ర ప్రదేశ్‌లో* కమ్యూనిస్టు *ఉద్యమ చరిత్ర, సంపుటి 1*, విజయవాడ, విశాలాంధ్ర, రెండవ ముద్రణ.

సత్యనారాయణ, ఎస్.వి., 1993, *దళిత సాహిత్య నేపథ్యం*, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం.

సీతారామారావు, పొట్టపల్లి, 1953, జాషువా కవి, కిన్నెర, జులై.

సీతారామ స్వామి, జనమంచి, 1923, ఎక్కువ వారు – తక్కువ వారు, మొదటి భాగం, రెడ్డి రాణి, సంపుటి 1, నెం.8, మే 1923, 2వ భాగం, సంపుటి 1, నెం10 జులై.

సోమ సుందర శర్మ, 1924, అస్పృశ్యాలాపము, రెడ్డి రాణి, సంపుటి 2, సంఖ్య 2.

సుబ్బారాయ గుప్త, వి., 1922, *ఆత్మకూరి లక్ష్మీ నరసింహం సోమయాజి జీవిత* చరిత్ర, ఉపనయ సమితి, విజయవాడ.

సుధాకర్, యెండ్లూరి, 1992, *జాషువా కథ*, రాజమండ్రి, మానస ప్రచురణలు.

సుధాకర్, యెండ్లూరి, 1994, 'దళిత సాహిత్యం – సామాజిక, తాత్విక భూమిక' డా. చంద్రశేఖర రెడ్డి *సంపాదకత్వంలోని తెలుగు సాహిత్యం చారిత్రిక నేపథ్యం*, హైదరాబాద్, ఆంధ్ర సారస్వత పరిషత్ ఓరియంటల్ కాలేజి.

సుందరయ్య, పుచ్చలపల్లి, 1990, విశాలాంధ్రలో ప్రజారాజ్యం, విజయవాడ (ప్రథమ ముద్రణ: 1946)

సుశీల, యం., 1913, 'ఆంధ్ర దేశమున క్రైస్తవ మిషనుల భావి పరిణామాలు', ఆంధ్రపత్రిక ఉగాది సంచిక.

వెంకటకృష్ణమాచార్యులు, నండూరి, 1935, *హరిజన సమస్య*, కాకినాడ. కాకినాడ.

వెంకట రావు, దాసరి, 1926, 'ఆదిమాంధ్ర సభ', *సమదర్శిని*, 26 అక్టోబర్.

వెంకటరావు, నిడదవోలు, 1954, *దక్షిణ దేశీయాంధ్ర వాంగ్మయము*, మద్రాస్.

వెంకట శర్మ, మంగిపూడి 1933, *నిర్మూద్ధ భారతము (అస్పృశ్యతా ఖండనము)*, కాశీనాథుని నాగేశ్వరరావు, మూడవ ముద్రణ.

వెంకటాద్రి, రావిపూడి, 1987, *కవిరాజు త్రిపురనేని శతజయంతి సంచిక*, చీరాల.

వెంకటేశ్వర రావు, ఆకుండి, 1939, 'ఆంధ్ర దేశము – హరిజన సమస్య', *భారతి*, సంపుటి 16.

వెంకటేశ్వర రావు, దేవులపల్లి, 1988, *తెలంగాణ ప్రజల పోరాట చరిత్ర*.

వీరేశలింగం, కందుకూరి, 1874, *రాజశేఖర చరిత్రము*, రాజమండ్రి.

వీరేశలింగం, కందుకూరి,1954, స్వీయ చరిత్రము,రాజమండ్రి,తొలిముద్రణ: 1911.

విశ్వనాథ శర్మ, వేమూరి, 1916, 'ఆంధ్రుల విద్యా వాపకము', *ఆంధ్ర పత్రిక*, (వార్షిక సంచిక).

* ఐలయ్య, కంచె, 2000, నేను హిందువు నెట్లయిత, హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

* ఐలయ్య, కంచె, 2003, దేవుడి రాజకీయతత్వం, బ్రాహ్మణత్వంపై బుద్ధుని తిరుగుబాటు, హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

ఇంటర్వ్యూలు:

- బి.హెచ్. తిరుపతి, హైదరాబాద్ తో (18 డిసెంబర్ 1993, 13 ఫిబ్రవరి 1994).
- బొజ్జా అప్పలస్వామి, బొజ్జావారిపేట, తూర్పు గోదావరి జిల్లా తో (29-30 డిసెంబర్ 1993)
- బోయి భీమన్న, హైదరాబాద్ తో (17, 21 డిసెంబర్ 1993).
- డా. బి. విజయ భారతి, హైదరాబాద్ తో (16 డిసెంబర్ 1993, 13 మార్చి 1994).
- కొండా సూర్య ప్రకాశరావు, విజయవాడ తో (24, 25 డిసెంబర్ 1993).
- యం.బి. గౌతమ్, హైదరాబాద్ తో (4-8 జనవరి 1994, 18-20 జనవరి 1994).
- రావూరి ఏకాంబరం, విజయవాడ, (27-28 డిసెంబర్ 1993).
- వజ్రపు సాంబమూర్తి, బొజ్జావారిపేట, తూర్పు గోదావరి జిల్లా తో (28-29 నవంబర్ 1993).
- వై. రాములు, అరసబాలగ, విజయనగరం జిల్లా తో (16-18 నవంబర్ 1993).
- సాపాటి శాంసన్, దున్న శేషయ్య, కర్రు శ్రీరాములు లతో, ఎదురీత అనుబంధ సంచిక (ఆగస్ట్ 1994) (ఇంటర్వ్యూ చేసిన వారు ఉ. సాంబశివరావు, సంపాదకులు).

గమనిక:

మూలగ్రంథంలోని గ్రంథ సూచికలో పేర్కొన్న అన్ని పుస్తకాలు, పత్రికలు, వ్యాసాల వివరాలను స్థలాభావం వల్ల ఇక్కడ పొందుపరచలేకపోయాము. - ప్రచురణ కర్తలు

అర్ధ శతాబ్దపు (1900-1950) ఆంధ్ర దళితఉద్యమాల చరిత్రను లోతుగా, విమర్శనాత్మకంగా విశ్లేషించిన పుస్తకమిది. ఆంధ్ర చరిత్రలో మరుగున పడి కనిపించని అనేక సామాజిక, సాంస్కృతిక అంశాలను యాగాటి చిన్నారావు నూతన ఆధారాలతో వెలికితీసి ఇందులో పొందుపరిచారు.

అంటరానితనం పేరిట హిందూ సమాజం దళితులపై ప్రదర్శించిన హేయమైన వివక్షనూ, క్రౌర్యాన్నీ, వాటి మూలాలనూ దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అభివృద్ధికి దోహదం చేసిన దళిత విద్య, రాజకీయాలలో దళితుల భాగస్వామ్యం గుర్తింపుకోసం, ఆత్మగౌరవం కోసం దళితులు చేసిన పోరాటాలు, దళితుల ప్రతిఘటనా సాహిత్యం వంటి అనేక అంశాలను ఇందులో లోతుగా పరిశీలించారు.

1932 నాటి గాంధీ "హరిజనోద్ధరణ" కార్యక్రమానికంటే ఎంతో ముందే మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆంధ్ర ప్రాంతంలోనూ, హైదరాబాద్ రాష్ట్రంలోనూ పెల్లుబికిన స్వతంత్ర దళితోద్యమాలను ఇందులో సవివరంగా పేర్కొన్నారు. జాతీయ దళితోద్యమ చరిత్రలో అటుంచి, స్థానికంగా కూడా సరైన గుర్తింపునకు నోచుకోని ఎందరో తెలుగు దళిత మేధావులు, రచయితలు, నేతల విశిష్ట కృషిని ఇందులో కళ్లకు కట్టినట్టు వివరించారు.

"దళిత్స్ స్ట్రగుల్ ఫర్ ఐడెంటిటీ" పేరిట ఆంగ్లంలో వెలువడి ఇప్పటికే దేశవ్యాప్తంగా విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ పుస్తకాన్ని ప్రతి దళితుడూ విధిగా చదవాల్సిన అవసరం వుంది.

డా॥ యాగాటి చిన్నారావుది విజయనగరం జిల్లా తెర్లాం మండలంలోని 'అరసబలగ' అనే మారుమూల పల్లెటూరు. ప్రభుత్వ ఎస్.సి.బాలుర వసతి గృహంలో ఉంటూ తెర్లాం పంచాయితీ ఎలిమెంటరీ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్ (1974-82) లో చదివిన తర్వాత ఎ.వి.యన్ కళాశాల, విశాఖపట్నం (1985-88) లో బి.ఎ. పూర్తి చేసుకొని పై చదువుల కోసం ఢిల్లీ, జె.ఎన్.యు.లో చేరి ఎమ్.ఎ., ఎమ్.ఫిల్ పి.హెచ్.డి పూర్తి చేశారు.

అనంతరం స్కాట్‌లాంట్‌లోని యూనివర్సిటీ ఆప్ ఎడిన్‌బర్గ్ లో విజిటింగ్ ఫెలోగా, న్యూ ఢిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సీటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొంతకాలం పనిచేశారు. ప్రస్తుతం జె.ఎన్.యులో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చిన్నారావు అనేక రచనలు చేశారు. వాటిలో Dalit Studies: A Bibliographical Handbook (2003), Writing Dalit History and other Essays (2007) ముఖ్యమైనవి.